మంగళవారం 21-3-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 185



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'



క్వార్టర్స్‌లో సాక్షి, లవ్లీనా

ప్రపంచ మహిళల బాక్సింగ్ టోర్నీలో సత్తా చాటిన భారత బాక్సర్లు - 12లో



సూచీలకు బ్యాంకింగ్ భయాలు

సెన్సెక్స్ నష్టం 361 పాయింట్లు 17 వేల దిగువకు నిఫ్టీ - 13లో


SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ద్వైపాక్షిక బంధం బలోపేతం

ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింత విస్తృతం చేసేందుకు భారత ప్రధాని మోదీ, జపాన్ ప్రధాని కిషిదాలు ఢిల్లీలో చర్చలు జరిపారు.

వివరాలు 6లో ▶



'సహజీవనం' పిల్ కొట్టివేత

సహజీవన బంధాన్ని గుర్తించేలా కేంద్రాన్ని ఆదేశించాలంటూ దాఖలైన పిల్‌ను తెలివితక్కువ వ్యాజ్యంగా సుప్రీంకోర్టు పేర్కొంది.

వివరాలు 6లో ▶



రష్యాలో జిన్‌పింగ్‌కు ఘన స్వాగతం

అధికార పర్యటన నిమిత్తం రష్యా రాజధాని మాస్కోకు చేరుకున్న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ఘన స్వాగతం లభించింది.

వివరాలు 6లో ▶



జీవజాలానికి ఉరితాళ్లు!

పెరుగుతున్న భూతాపంతో సముద్రాల అంతర్భాగాల్లోని జీవావరణ వ్యవస్థ దెబ్బతింటోందని ఎన్‌ఓఏఏ అధ్యయనంలో వెల్లడయ్యింది.

వివరాలు 6లో ▶



'స్కిల్డ్' క్రిమినల్ బాబే

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- గత సర్కారు అక్రమాలు ఆధారాలతో సభ సాక్షిగా బహిర్గతం
- యువత, ఉద్యోగులకు స్కిల్ ట్రైనింగ్ పేరిట ప్రజాధనం దోపిడీ
- ఓ ప్రైవేట్ కంపెనీ ఎక్కడైనా రూ.3 వేల కోట్ల గ్రాంట్ ఇస్తుందా?
- అసలు గ్రాంట్ ఇన్ ఎయిడ్ కార్యక్రమాలను తాము చేపట్టడం లేదన్న సీమెన్స్
- ఆ జీవో, ఎంఓయూలతో తమకు సంబంధం లేదని కోర్టుకు వెల్లడి
- సీమెన్స్ కంపెనీకి తెలియకుండానే ఒప్పందం.. కేబినెట్ తీర్మానానికి, జీవోలకు విరుద్ధంగా ఎంవోయూ
- కనీసం డీపీఆర్ లేదు... రూల్స్ బేఖాతర్
- షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకు చేరిన రూ.371 కోట్లు
- ఇదీ ఆయన అవినీతి విజన్..
- దీనిపై ఎల్లో మీడియా రాయదు.. దత్తపుత్రుడూ ప్రశ్నించడు



శాసనసభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: 'స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో ప్రధాన ముద్దాయి చంద్రబాబే. స్కిల్డ్ క్రిమినల్ చంద్రబాబు చేసిన స్కామ్ ఇది. ఉద్యోగులు, విద్యార్థులకు స్కిల్ ట్రైనింగ్ పేరుతో టీడీపీ ప్రభుత్వం అతిపెద్ద స్కామ్‌కు పాల్పడింది' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాసనసభ వేదికగా ప్రజలకు వాస్తవాలను బహిర్గతం చేశారు. చంద్రబాబు, ఆయన మనుషులు ఓ దొంగల ముఠాగా ఏర్పడి లోపాయికారీ ఒప్పందంతో రూ.371 కోట్లను షెల్ కంపెనీల ద్వారా కాజేశారని ఆధారాలతో సహా వెల్లడించారు. ఈ స్కామ్‌పై ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 ఎందుకు నోరు మెదపలేదు..? దత్తపుత్రుడు ఎందుకు ప్రశ్నించలేదని

మిగతా 2వ పేజీలో ▶

బటన్ నొక్కితే...

నేను బటన్ నొక్కితే డీబీటీ ద్వారా నా అక్కచెల్లెమ్మలు, ప్రజల ఖాతాల్లోకి డబ్బులు వెళ్తున్నాయి. టీడీపీ హయాంలో చంద్రబాబు బటన్ నొక్కగానే ప్రభుత్వ ఖాతా నుంచి అటూ ఇటు తిరిగి ఆయన ఖాతాలోకి డబ్బులు వచ్చాయి.

ఇంతకంటే ఇంకేం కావాలి?

స్కిల్ స్కామ్‌లో నిధుల విడుదలపై కొందరు ఆర్థిక శాఖ అధికారులు కొర్రీలు వేసినా వెంటనే డబ్బులివ్వాలని అప్పటి ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీని ఆదేశిస్తూ చంద్రబాబు నోట్ ఫైల్‌లో పేర్కొన్నారు. ఇంకో నోట్ ఫైల్‌లో సీఎం చంద్రబాబు చెప్పారు కాబట్టి నిధులు నేరుగా విడుదల చేశామని చీఫ్ ఫైనాన్స్ సెక్రటరీ రాశారు. ఈ స్కామ్‌లో ఇన్ని సాక్ష్యాధారాలను నేను చూపిస్తున్నా ఈ కుంభకోణంలో చంద్రబాబే ప్రధాన ముద్దాయి అనడానికి ఇంతకన్నా ఏం కావాలి...?

- శాసనసభలో సీఎం జగన్



శాసనసభలో స్పీకర్ తమ్మినేని సీతారాంపై పేపర్లు విసురుతూ.. దాడి చేస్తున్న టీడీపీ సభ్యులు



స్పీకర్‌పై వికృత చేష్టలు.. దాడి

అసెంబ్లీకి బ్లాక్ డే

శాసనసభలో పరాకాష్టకు చేరిన టీడీపీ ఎమ్మెల్యేల అరాచకం

- అడ్డుకోబోయిన వైఎస్సార్‌సీపీ ఎస్సీ ఎమ్మెల్యేలు సుధాకర్‌బాబు, ఎలిజాపైనా దాడి.. సుధాకర్ బాబుకు గాయాలు
- దాడిని అడ్డుకునేందుకు వెళ్లిన మంత్రులు, అధికార పార్టీ సభ్యులపైనా దౌర్జన్యం
- డిప్యూటీ సీఎం నారాయణ స్వామిపై అసభ్య పదాలతో టీడీపీ ఎమ్మెల్యే 'డోల' అనుచిత వ్యాఖ్యలు
- తనపై టీడీపీ సభ్యుల దాడి, వికృత చేష్టలపై స్పీకర్ మనస్తాపం



టీడీపీ సభ్యుల దాడిలో గాయపడిన దళిత ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

- సభ నుంచి తన చాంబర్లోకి వెళ్లిపోయిన తమ్మినేని
- తిరిగి సభ ప్రారంభం కాగానే టీడీపీ ఎమ్మెల్యేలపై ఒకరోజు సస్పెన్షన్ వేటు
- అయినా సభలో 'పచ్చ' బ్యాచ్ రచ్చ.. మార్షల్స్‌పైనా పిడిగుద్దులు

10లో

టీడీపీ 'సామాజిక' చిచ్చు

సామాజికవర్గాల మధ్య చిచ్చుపెట్టేలా టీడీపీ సభ్యులు సభలో ప్రవర్తిస్తున్నారు. సభాపతి స్థానంపై టీడీపీకి గౌరవం లేదు. వేళ్లు చూపిస్తూ.. సభ కనిపించకుండా ముఖానికి ప్లకార్డులు అడ్డుపెడతారా? ఆ ప్లకార్డు తొలగిస్తే స్పీకర్ కొట్టేశారంటూ గోల చేస్తారా? ప్రశ్నోత్తరాల తర్వాతే వాయిదా తీర్మానం ఇవ్వాలని తెలీదా? సభలో గందరగోళం చేయడానికే వస్తున్నారు. మిమ్మల్ని ఇలా చేయమని ఎవరు చెబుతున్నారు? ఇన్నాళ్లు వారి ప్రవర్తన, అసభ్య కామెంట్లను మౌనంగా భరించా. ఇకపై సభ్యులు కారణం లేకుండా వెల్‌లోకి వస్తే సస్పెండ్ అయ్యేలా రూలింగ్ ఇస్తున్నాం.

- స్పీకర్ తమ్మినేని సీతారాం

10లో

పాపం పసివాళ్లు..

- పోర్న్ వీడియోలతో పైశాచికానందం
- పోలీసులకు పట్టుబడ్డ ప్రబుద్ధులు
- నిందితుల్లో విద్యావంతులే ఎక్కువ
- కేంద్ర హోంశాఖ ప్రాథమిక సమాచారం
- ఉమ్మడి తూర్పులో 367 మందిపై కేసులు
- 150 మందికి 41ఎ నోటీసులు
- ఆరు నెలల విచారణలో నిగ్గు తేలిన నిజాలు



సాక్షి ప్రతినిధి, కాకినాడ: మొబైల్ ఫోన్ నిత్యావసరమైపోయింది. ఇది చేతిలో లేకుండా గుమ్మం దాట లేని పరిస్థితి. నిద్ర లేచిన దగ్గర నుంచి సెల్ ఫోన్ లేకుండా క్షణం గడవదు. మూడేళ్ల చిన్నారి నుంచి పండు ముదుసలి వరకు ఎవరి చేతిలో చూసినా సెల్ లేకుండా ఉండదు. కొందరు వీటిని వీక్షిస్తూ పక్కదారి పడుతున్నవైనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. కొందరు విద్యావంతులు, నడి వయస్సు వారు కూడా మొబైల్‌లో పిల్లల పోర్న్(నీలి) చిత్రాల నీడలో కొట్టుకుపోతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొబైల్ ఫోన్‌లలో విచ్చలవిడిగా చూస్తోన్న చిన్నారుల నీలిచిత్రాలపై పోలీసుశాఖ లోతైన విచారణ చేపట్టింది. ఇందులో ఆందోళన కలిగించే అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి.

స్వచ్ఛంద సంస్థతో కలిసి జాయింట్ ఆపరేషన్

పిల్లల పోర్న్ వీడియోలు చూస్తూ పైశాచికానందం పొందుతున్న ప్రబుద్ధుల నిర్వాకం సాంకేతికత సాయంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పోలీసులు ఛేదించారు. చిన్న పిల్లలతో పాడు పనులు చేస్తూ పైశాచికానందం పొందడం, అది చాలదన్నట్లు షూట్ చేయడం, చూస్తూ ఆనందం పొందుతూ మరికొందరికి షేర్ చేస్తోన్న ప్రబుద్ధుల భరతం పడుతున్నారు. ఇటువంటి వారి ఆటకట్టించేందుకు స్వచ్ఛంద సంస్థ నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్(ఎన్‌సీఎంఈసీ)తో పోలీస్ శాఖ చేపట్టిన జాయింట్ ఆపరేషన్ ఫలితాన్నిచ్చింది. దీంతో పలు కేసులు నమోదుచేశారు. ఈ వీడియోలు చూస్తోన్న, సర్క్యులేట్ చేస్తోన్న వారి మొబైల్ నంబర్లు, అడ్రస్‌లు కేంద్ర హోంశాఖ నుంచి పోలీసు ఉన్నతాధికారులకు వచ్చాయి. ఆ సమాచారం జిల్లాకు వచ్చాక కాకినాడ దిశ డీఎస్పీ సుంకర మురళీమోహన్ పర్యవేక్షణలో ఆరు నెలల పాటు పోలీసులు పలు రాష్ట్రాలలో పర్యటించి నిందితుల కూపీ లాగారు.

అరెస్టుల పర్వం

కాకినాడ పోర్టులో పనిచేసే ఒక ఉద్యోగి మొబైల్, అతని పేరుతో కేంద్ర హోంశాఖ నుంచి వర్తమానం వచ్చింది. చైల్డ్ పోర్న్ వీడియోలు అతని మొబైల్ నుంచి సర్క్యులేట్ అయినట్టుగా తేలింది. ఆరా తీసేందుకు పోర్టుకు వెళ్లేసరికి నిందితుడు అప్పటికే సొంత రాష్ట్రం రాజస్తాన్ వెళ్లిపోయాడు. ఇక్కడి పోలీసు బృందం రాజస్తాన్ వెళ్లి కేసు నమోదు చేసి తీసుకువచ్చింది. మరో నిందితుడు సామర్లకోట రైల్వేస్టేషన్ ప్రాంతం నుంచి ఈ పోర్న్ వీడియోలు షేర్ చేసినట్టు తేల్చారు. సామర్లకోట వెళ్లే సరికి నిందితుడు అక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లినట్టుగా గుర్తించారు. అక్కడకు వెళ్లి కేసు నమోదు చేశారు. గడచిన ఆరు నెలల్లో 367 మందిపై కేసులు నమోదయ్యాయి. మరో 150 మందికి 41ఏ నోటీసులు జారీ చేశారు. పట్టుబడ్డ నిందితుల్లో ఉన్నత విద్యావంతులే ఎక్కువగా ఉన్నారు. ఎంటెక్, మెడిసిన్ చేస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతో పాటు వయసు మళ్లిన విశ్రాంత ఉద్యోగులు, చివరకు మైనర్లూ ఈ నిర్వాకంలో ఉన్నారని విచారణలో నిగ్గు తేలింది.

'టిప్‌లైన్'తో పట్టేస్తున్నారు...


- చైల్డ్ పోర్నోగ్రఫీకి అలవాటు పడిన ప్రబుద్ధుల బండారం పోలీసులు 'టిప్ లైన్' యాప్ సాంకేతికతతో బయటపడింది.
- మొబైల్ లేదా గ్యాడ్జెట్‌లో వీక్షించి షేర్ చేసినా, మొబైల్‌లో అప్‌లోడ్ చేసినా ఆ విషయం నేరుగా కేంద్ర హోంశాఖకు చేరుతుంది.
- టిప్‌లైన్ ద్వారా ఆ వీడియోలో ఎనిమిది రకాల వివరాలు సేకరిస్తున్నారు.
- వీడియో పంపినా, అప్‌లోడ్ చేసిన ఎలక్ట్రానిక్ పరికరంతో పాటు ఇంటర్నెట్ ప్రోటోకాల్ వివరం, వీడియో ఏ ప్రాంతం నుంచి ఏ సమయంలో పంపించారు, వీడియో నిడివి, పంపిన వీడియో ఎవరికి లేదా ఏ గ్రూప్‌కి చేరింది, వీడియో పంపిన వ్యక్తి చిరునామాతో సహా పూర్తి వివరాలు టిప్‌లైన్ సాంకేతికత వెలుగులోకి తేవడంలో క్రియాశీలకమైంది.
- నిందితుల ప్రాథమిక సమాచారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి పోలీసు హెడ్‌క్వార్టర్స్, అక్కడి నుంచి జిల్లా పోలీసు యంత్రాంగానికి వచ్చింది.
- దిశ పోలీస్ విభాగం ఆ వివరాలపై పరిశీలించి వల పన్ని కేసులు నమోదుచేసింది.దిశ డీఎస్పి సుంకర మురళీమోహన్ పర్యవేక్షణలో సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఈ చైల్డ్ పోర్న్ కేసుల విచారణ సాగుతోంది.
- నిందితులను పట్టుకునేందుకు రాజశేఖర్ బృందం ఇప్పటికే దేశంలోని పలు రాష్ట్రాలకు వెళ్లొచ్చింది.
- వివిధ ప్రాంతాల్లో ఉన్న నిందితులను జిల్లాకు తీసుకొచ్చి కేసులు నమోదు చేస్తున్నారు.

'ఎక్స్‌ప్లాయిటేషన్' పై ఉక్కుపాదం

పెద్దల చిన్ననాటి నగ్న, అర్ధనగ్న చిత్రాలు సేకరించడమే కాకుండా షేర్ చేస్తున్న నిందితుల బండారం బట్టబయలైంది. ఈ తరహా వ్యవహారాలు మూడు జిల్లాల్లోని మారుమూల గ్రామాల్లో కూడా గుర్తించడం విశేషం. రాజమహేంద్రవరం, కాకినాడ నగరాలతో పాటు ఒక మోస్తరు పట్టణ ప్రాంతాల్లో కూడా విచ్చలవిడిగా చిన్నారుల పోర్న్ వీడియోలు ప్రసార మాధ్యమాల ద్వారా పంపిణీ అవుతున్నట్టు గుర్తించారు.

'మగ పిల్లలకు ప్రమాదమే'

చిన్నపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడేవారి మనస్తత్వాన్ని చాలా నిశితంగా పరిశీలించాం. కామవాంఛ తీర్చుకోవాలనుకునే వారికి పసిపిల్లల లింగబేధంతో పనిలేదు. ఏ పిల్లల్ని చూసినా వారికి ఈ తరహా ఆలోచనలే వస్తాయి. ఈ స్థితిని మానసిక వైద్య పరిభాషలో పీడియో ఫిలియాగా పిలుస్తారు. ఇటువంటి లైంగిక వాంఛలకు బలయ్యే చిన్నారులకు బయటి వారి నుంచి కంటే సొంత వారు, తెలిసిన వారి నుంచే ప్రమాదం పొంచి ఉంటుంది. – డాక్టర్ పాశం రవిశంకర్, ప్రొఫెసర్ ఆఫ్ సైకియాట్రీ, కాకినాడ



అన్నవరం బీచ్

విశాఖ పర్యాటక వైభవం

జీఐఎస్‌లో రూ.8,806.44 కోట్లతో ప్రాజెక్టులకు ఎంవోయూలు

- 18,205 మందికి ఉపాధి అవకాశాలు
- మన్యం జిల్లాలోనూ పర్యాటకం పరుగులు
- 64 ప్రాజెక్టుల గ్రౌండింగ్‌పై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం

ప్రకృతి అందాలతో అలరారే విశాఖ పర్యాటకాన్ని కొత్త పుంతలు తొక్కేందుకు సరికొత్త ఆలోచనలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. ప్రపంచ పర్యాటక పటంలో టూరిజం రాజధానిగా భాసిల్లే విధంగా పలు ప్రాజెక్టులకు సంబంధించి ఇటీవల నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. దేశీ, విదేశీ పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్న విశాఖలో ఉన్న టూరిజం స్థలాలను వినియోగంలోకి తీసుకువస్తూ.. జలక్రీడలు, సాహస పర్యాటకం, బీచ్ టూరిజం, టెంపుల్ టూరిజం, ఎకోటూరిజం, టెంపుల్ టూరిజం.. ఇలా భిన్నమైన సెగ్మెంట్లలో అభివృద్ధికి అడుగులు వేస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 64 ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. మొత్తం రూ.8,800 కోట్లకుపైగా ప్రాజెక్టుల ద్వారా 18 వేల మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఈ ప్రాజెక్టుల గ్రౌండింగ్ చేసే విషయంలోనూ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోంది. - సాక్షి, విశాఖపట్నం



అనంతగిరిలో రిసార్టులు

రూ.8,800 కోట్లు.. 18 వేల మందికి ఉపాధి

ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యాటక అవకాశాలు పుష్కలంగా ఉన్న ప్రతి ప్రాంతంలోనూ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు వివిధ సంస్థలు ముందుకొచ్చాయి. మొత్తంగా పర్యాటక రంగానికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా రూ.21,941 కోట్లతో 129 ప్రాజెక్టులకు ఎంవోయూలు జరగ్గా.. ఇందులో సగంవరకు అంటే 64 ప్రాజెక్టులు ఉమ్మడి విశాఖకు సంబంధించినవి కావడం విశేషం. మొత్తం రూ.8,806. 44 కోట్లతో విభిన్న రకాల ప్రాజెక్టులు రానున్నాయి. దీని ద్వారా ప్రత్యక్షంగా 18,205 మందికి ఉపాధి అవకాశాలు రానుండగా.. మరో 20 వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలగనున్నాయి.

అల్లూరి జిల్లాకూ అద్భుత అవకాశాలు

అరకు, పాడేరు ప్రాంతాల్లోనూ భారీ ప్రాజెక్టులు రానున్నాయి. మారేడుమిల్లిలో రూ.1000 కోట్లతో తులి హోటల్స్ ప్రై.లిమిటెడ్ సంస్థ సఫారీ టూరిజం ప్రాజెక్టుని ఏర్పాటు చేసి 1000 మందికి ఉపాధి కల్పించనుంది. విశాఖ–అరకు రోడ్‌లో మైస్టిక్స్ పామ్స్ సంస్థ రూ.50 కోట్ల పెట్టుబడితో గోల్ఫ్ రిసార్ట్ అండ్ డెస్టినేషన్ వెడ్డింగ్ ఫెసిలిటీ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా 250 మందికి ఉపాధి కలగనుంది. రూ.243 కోట్లతో 1000 మందికి ఉపాధి కల్పించేలా అనంతగిరి హిల్స్‌లో ఎకో–ఐఎస్ఎల్ఈ రిసార్ట్స్ సంస్థ రిసార్ట్స్, కన్వెన్షన్ సెంటర్, ఎమ్యూజ్‌మెంట్‌థీమ్ పార్క్ ఏర్పాటు చేయనుంది. రూ.150 కోట్లతో అరకులో ది రిప్పిల్స్ సంస్థ రిసార్టులు, విల్లాలు ఏర్పాటు చేసి 150 మందికి పైగా ఉపాధి కల్పించాలని నిర్ణయించింది. వీటితో పాటు కాంపింగ్, కారావాన్ పార్క్, అడ్వెంచర్ స్పోర్ట్స్ కూడా రాబోతున్నాయి.

విశాఖలో రాబోతున్న ముఖ్యమైన ప్రాజెక్టులివీ..

- సుమారు రూ.300 కోట్లతో 300 మందికి ఉపాధి కల్పించేలా ఒబెరాయ్ హోటల్స్ సంస్థ అన్నవరం సమీపంలో ఒబెరాయ్ హోటల్‌ని నిర్మించనుంది.
- రూ.208 కోట్లతో డెహ్రాడూన్‌కు చెందిన దేవ్‌భూమి రోప్‌వేస్ సంస్థ వివిధ పర్యాటక ప్రాంతాల్లో రోప్‌వే ప్రాజెక్టులు ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా 50 మందికి ఉపాధి కలగనుంది.
- రూ.1000 కోట్లతో 6,500 మందికి ఉపాధి కల్పించేలా డ్రీమ్‌వ్యాలీ గ్రూప్ సంస్థ గోల్ఫ్‌గేటెడ్ కమ్యూనిటీ విత్ 5 స్టార్ రిసార్ట్స్‌ని కట్టనుంది.
- రూ.300 కోట్లతో 750 మందికి ఉపాధి కల్పించేలా ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్ అండ్ ఇండస్ట్రీస్ కంపెనీ 7 స్టార్ హోటల్‌ని నిర్మించనుంది.
- రూ.500 కోట్లతో 250 మందికి ఉపాధినిస్తూ మంజీరా హోటల్స్ సంస్థ హోటల్, రిసార్టు నిర్మించేలా ఒప్పందం కుదుర్చుకుంది.
- మురుగవాణి సంస్థ రూ.150 కోట్లతో 500 మందికి ఉపాధితో ఎకో టూరిజం రిసార్టులు ఏర్పాటు చేయనుంది.
- అకొంటిపై అంతర్జాతీయ సంస్థ రూ.243 కోట్లతో 100 మందికి ఉపాధి కల్పించేలా మెగావీల్ ఏర్పాటు చేయనుంది.
- జలవిహార్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రూ.250 కోట్లతో 500 మందికి ఉపాధి కల్పిస్తూ అన్నవరం ప్రాంతంలో జలవిహార్ టూరిజం హార్బర్‌ని నిర్మించనుంది.
- రూ.122 కోట్లతో 255 మందికి ఉపాధి కల్పించేలా గారిసన్ సంస్థ కన్వెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది.
- టర్కీకి చెందిన పోలిన్ అక్వేరియమ్స్ సంస్థ రూ.120 కోట్లతో 110 మందికి ఉపాధినందిస్తూ టన్నెల్ అక్వేరియంని నిర్మించనుంది.
- రూ.115.5 కోట్లతో 150 మందికి ఉపాధి కల్పించేలా ఎండాడలో భవానీ బీచ్ రిసార్టులు రానున్నాయి.
- రూ.100 కోట్లతో 50 మందికి ఉపాధి అందించేలా అకొంటిపై అంతర్జాతీయ సంస్థ స్కైటవర్‌ని ఏర్పాటు చేయనుంది.
- రూ.85 కోట్లతో 200 మందికి ఉపాధినందించేలా ఫ్రాన్స్‌కు చెందిన ఎరోఫైల్‌సంస్థ స్కై రెస్టారెంట్, స్కై డైవింగ్, సర్ఫింగ్, మినీ వాటర్‌పార్క్‌ని నిర్మించనుంది.
- రూ.25 కోట్లతో 30 మందికి ఉపాధి కల్పిస్తూ జపాన్‌కు చెందిన సంస్థ స్నో వరల్డ్ ఏర్పాటు చేయనుంది.
- రూ.500 కోట్లతో 500 మందికి ఉపాధినందించేలా స్వామి నారాయణ్ ట్రస్ట్ డివైన్ డెస్టినేషన్ ఫర్ స్పిరుచ్యువల్ టూరిజం ప్రాజెక్టుని ఏర్పాటు చేయనుంది.

కొత్త ప్రాజెక్టులతో కొత్త కళ

జీఐఎస్‌లో కుదుర్చుకున్న ఎంవోయూలు గ్రౌండ్ అయ్యేలా ప్రభుత్వం పకడ్బందీగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా పర్యాటక ప్రాజెక్టుల కోసం టూరిజం ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసింది. త్వరగా ప్రాజెక్టు పట్టాలెక్కేలా చర్యలు తీసుకోనున్నాం. ప్రతి పర్యాటక స్థలంలోనూ ఒక విభిన్న ప్రాజెక్టు వచ్చి.. సందర్శకుల్ని ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలన్న ఆలోచనలు త్వరలోనే అమలు కానున్నాయి.

– శ్రీనివాస్ పాణి, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్

గుడ్ మార్నింగ్..

ఇదొక్క అందమైన మార్నింగ్!

ఈ శుభోదయపు పలకరింపుతోనే సరిగ్గా పదిహేనేళ్ల క్రితం.. రంగుల హరివిల్లులా.. 'సాక్షి' దిన పత్రిక ఆవిర్భవించింది. 'సత్యమేవ జయతే..' అంటూ నిఖార్సైన జర్నలిజానికి శంఖం పూరించింది. నాటి నుంచీ అంచెలంచెలుగా ఎదుగుతూ విలువలకు కట్టుబడిన పాత్రికేయ ధర్మాన్ని నిబద్ధతతో కొనసాగిస్తూ వస్తోంది. ఈ మహాయజ్ఞం ఇప్పుడు పదహారవ యేటలోకి ప్రవేశిస్తున్న సందర్భంలో 'సాక్షి' తన పాఠకులకు చిన్న క్విజ్ పెట్టి, కానుకలను ఇవ్వదలచింది. వివరాల కోసం ఇప్పుడే sakshi.com ఓపెన్ చేయండి, జవాబు చెప్పండి.. బహుమతి గెలుచుకోండి అన్న లింకును క్లిక్ చేయండి.

ఈరోజు ప్రశ్న

సాక్షి ఒక నవశకానికి సంకేతం అని ఆవిర్భావ సందేశం పంపిన క్రికెట్ దిగ్గజం ఎవరు?

ఎ) వీవీఎస్ లక్ష్మణ్ బి) రాహుల్ ద్రావిడ్
సి) సచిన్ టెండూల్కర్ డి) ఎం.ఎస్.ధోనీ

సీఎం జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ దళిత ఎమ్మెల్యేలు

ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై టీడీపీ ఎమ్మెల్యే దాడిని వివరించిన శాసనసభ్యులు



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శాసనసభలోని ఆయన కార్యాలయంలో సోమవారం వైఎస్సార్‌సీపీ దళిత ఎమ్మెల్యేలు కలిశారు. శాసనసభలో పార్టీ ఎమ్మెల్యే టి.జె.ఆర్.సుధాకర్‌బాబుపై తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే దాడిచేసిన ఘటనను ముఖ్యమంత్రికి వివరించారు. టీడీపీ ఎమ్మెల్యే దాడిలో సుధాకర్‌బాబు మోచేతికి అయిన గాయం చూపించారు. సీఎంను కలిసిన వారిలో ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, హోంశాఖ మంత్రి తానేటి వనిత, రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యేలు మేకతోటి సుచరిత, అలజంగి జోగారావు, కిలివేటి సంజీవయ్య, వి.ఆర్.ఎలీజ, తిప్పేస్వామి, కంబాల జోగులు, వరప్రసాద్, కొండేటి చిట్టిబాబు, ఆర్థర్, తలారి వెంకట్రావు, రక్షణనిధి తదితరులున్నారు.

అసెంబ్లీ మీడియా పాయింట్

పంట నష్టం జరిగిన రైతులను ఆదుకుంటాం

సాక్షి, అమరావతి: అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు నష్ట నివారణ చర్యలతో పాటు, పంటల నష్టంపై అంచనాలను సిద్ధం చేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యాన, వాణిజ్య పంటలకు జరిగిన నష్టంపై పారదర్శకంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు వాతావరణ, దిగుబడి ఆధారిత బీమా ద్వారా పరిహారాన్ని రైతులకు అందిస్తాం. పంట నష్టం జరిగితే గత ప్రభుత్వం రెండు మూడేళ్ల తర్వాతే అరకొర సాయం అందించేది. కానీ సీఎం జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పంట నష్టం జరిగిన సీజన్లోనే పరిహారం అందిస్తున్నారు. అసెంబ్లీలో టీడీపీ సభ్యులు స్పీకర్‌పై అనుచితంగా ప్రవర్తిస్తూ సభను స్తంభింపజేయాలన్న ధ్యేయంతో ఉన్నారు. కొంత మంది మాత్రమే ఓట్లేసే పట్టభద్రుల ఎన్నికల్లో మూడు స్థానాలు గెలవగానే చంద్రబాబు సాధారణ ఎన్నికల్లో విజయం సాధించినట్టు పగటి కలలు కంటున్నారు. 2024లో జరిగే ఎన్నికలే చంద్రబాబుకు చివరివి.

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి

ఎమ్మెల్సీ ఎన్నికపై కోర్టుకు వెళతాం

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల కౌంటింగ్‌లో లోపాలపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా రిటర్నింగ్ అధికారి పట్టించుకోకపోవటంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని నిర్ణయించాం. మండలి ఎన్నికల నిబంధనల ప్రకారం పోటీలో ఉన్న అభ్యర్థి కౌంటింగ్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తే వెంటనే రీ కౌంటింగ్‌కు రిటర్నింగ్ అధికారి ఆదేశాలు ఇవ్వవచ్చు. అభ్యర్థులు సంతృప్తి చెందే వరకు ఎన్నిసార్లయినా రీ కౌంటింగ్ చేయాలి. ఇది అభ్యర్థికి ఉన్న హక్కు. కానీ చంద్రబాబు ఇక్కడ ఏదో జరుగుతుందని రిటర్నింగ్ అధికారికి నేరుగా ఫోన్ చేసి మాట్లాడారు. ధర్నాలు చేసి హంగామా చేశారు. – కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే

డీఎస్సీపై పొంతన లేని లెక్కలు..

రాష్ట్రంలో 53 వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయని కేంద్ర విద్యా శాఖ మంత్రి ప్రకటిస్తే, రాష్ట్ర విద్యా శాఖ మాత్రం 771 ఖాళీలు అని చెప్పడం దగా. సింగిల్ టీచర్ల స్కూల్ అంకెలపై కేంద్రం లెక్కలకు, రాష్ట్ర లెక్కలకు పొంతన లేదు. విద్యాశాఖలో సంస్కరణల వల్ల పాఠశాలలు, తరగతుల విలీనంతో పెద్ద ఎత్తున ఉపాధ్యాయ పోస్టులు ప్రభుత్వం రద్దు చేసింది. డీఎస్సీపై ఎటువంటి హామీ ఇవ్వకుండా ఉన్న పోస్టులన్నీ రద్దు చేసి, ఉన్న టీచర్లకు పని భారం పెంచి విద్యా శాఖను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. – బాలసుబ్రహ్మణ్యం, ఐ.వెంకటేశ్వరరావు, షేక్ షాబ్జీ, పీడీఎఫ్ ఎమ్మెల్సీలు

జనసేన చంద్రబాబు పెట్టించిన పార్టీనే

జనసేన చంద్రబాబు పెట్టించిన పార్టీ. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో వందల కోట్లు దోచుకున్న చంద్రబాబు పేరు బయటికి వస్తుందనే దానిని దారిమళ్లించడానికి శాసన సభలో గొడవ చేశారు. ప్రజల మెప్పు పొంది అధికారంలోకి రావాలే తప్ప రౌడీయిజం చేస్తే టీడీపీకి ప్రజలే బుద్ధి చెబుతారు. – నందిగం సురేష్, ఎంపీ

ఆలయ భూములపై నష్టం లేకుండా..

విశాఖపట్నంలోని సింహాచలం వరాహ నరసింహస్వామి భూములను ఆక్రమించుకొని నివాసం ఉంటున్న ప్రజల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కమిటీ ఏర్పాటు చేశాం. ఈ భూముల్లో నివాసముంటున్న వారికి, దేవస్థానానికి నష్టం జరగకుండా సమస్య పరిష్కారంపై చర్చించాం. న్యాయస్థానాల ఆదేశాల మేరకు ఆ భూముల విలువకు సమానమైన భూమిని దేవస్థానానికి బదలాయించేందుకు చర్యలు తీసుకుంటాం. కమిటీ చర్చించిన అంశాలపై త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తాం.

– కొట్టు సత్యనారాయణ, దేవాదాయశాఖ మంత్రి

పవన్ వాస్తవాలు తెలుసుకోవాలి

సభలో ప్రజోపయోగకరమైన చర్చలో పాల్గొనకుండా టీడీపీ దారుణంగా వ్యవహరిస్తోంది. స్కిల్ డెవలప్‌మెంట్‌లో చంద్రబాబు చేసిన నేరం బయటపడుతుందనే సభలో రాద్ధాంతం చేశారు. చంద్రబాబు చేస్తున్న మారణకాండ నుంచి ప్రజల ప్రాణాలను రక్షించాలనే జీవో నంబర్ 1 జారీ చేశాం. దీనిపై పవన్ కళ్యాణ్ వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి.

– చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి

ప్రజాస్వామ్యంలో ఇదో దుర్దినం

బీసీ వర్గానికి చెందిన సభాపతి తమ్మినేని సీతారాంపైన, దళిత ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబుపైన టీడీపీ ఎమ్మెల్యేలు సభలో దాడి చేయటం ప్రజాస్వామ్య చరిత్రలో ఓ దుర్దినం. దళితవర్గానికి చెందిన వీరాంజనేయులు ద్వారా బీసీ వర్గానికి చెందిన స్పీకర్‌పై దాడి చేయించడం ఎస్సీల భుజాలపై తుపాకులు పెట్టి బీసీలను కాల్చాలని చంద్రబాబు చేస్తున్న కుట్ర. – కైలే అనిల్ కుమార్, ఎమ్మెల్యే

'స్కిల్డ్' క్రిమినల్ బాబే

▶ మొదటి పేజీ తరువాయి

నిలదీశారు. 'సీమెన్స్ కంపెనీకే తెలియకుండా ఆ సంస్థ పేరుతో చంద్రబాబు ప్రభుత్వం ఈ ప్రాజెక్టును సృష్టించింది. కేబినెట్ తీర్మానానికి, జీవోలకు విరుద్ధంగా ఒప్పందం చేసుకుంది. చంద్రబాబు అవినీతి స్కిల్ ఇదీ' అని మండిపడ్డారు. 'కనీసం డీపీఆర్ లేదు. రూల్స్ బేఖాతర్.. ప్రొసీజర్స్ బేఖాతర్.. పద్ధతులు, సంప్రదాయాలు అన్నీ బేఖాతర్. చంద్రబాబు చెప్పిందే వేదం' అని దుయ్యబట్టారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పేరుతో టీడీపీ హయాంలో జరిగిన కుంభకోణంపై శాసనసభలో సోమవారం చర్చలో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడారు. ఈ స్కామ్ జరిగిన తీరును వివరిస్తూ జీవోలు, ఎంవోయూలను సభలో స్లైడ్స్ ద్వారా ప్రదర్శిస్తూ మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ ప్రసంగం వివరాలు ఇవీ..



సూట్‌కేస్ కంపెనీలు.. స్కిల్ స్కామ్

'షెల్' డబ్బులు బాబు ఇంటికి

రాష్ట్ర చరిత్రలోనే కాకుండా, దేశ చరిత్రలోనే నిరుద్యోగులు, విద్యార్థుల పేరిట జరిగిన అతిపెద్ద స్కామ్ ఇది. స్కిల్లింగ్ పేరుతో డబ్బులు దోచేయడం చంద్రబాబుకు మాత్రమే తెలిసిన గొప్ప స్కిల్. వంద రూపాయల పని చేస్తామని చెప్పి రూ.10 అడ్వాన్స్‌గా తీసుకుని ఆ పది కూడా దోచుకున్న మాదిరిగా ఈ వ్యవహారం ఉంది. అమెరికా, యూరప్‌లో లాటరీ తగిలింది.. 10 మిలియన్ డాలర్లు మీ పేరు మీద వచ్చాయి. అర్జెంట్‌గా రూ.10 లక్షలు కట్టండి.. ఆ తరువాత 10 వేల మిలియన్ డాలర్లు వస్తాయని చెబుతుంటారు. అదే మాదిరిగా సీమెన్స్ పేరుతో స్కామ్ జరిగింది. ఇలాంటి గొప్ప స్కామ్‌ను నడిపిన వ్యక్తి నారా చంద్రబాబే. అక్షరాలా రూ.371 కోట్ల ప్రజాధనాన్ని మాయం చేశారు. ఈ డబ్బును షెల్ కంపెనీల ద్వారా రకరకాల రూటింగ్ చేసి మళ్లీ చంద్రబాబు నివాసం ఉంటున్న హైదరాబాద్‌కు తరలించారు. స్కిల్డ్ క్రిమినల్ చేసిన స్కామ్ ఇది. న్యాయ పరిభాషలో పార్టనర్స్ ఆఫ్ క్రైమ్ ప్రొసీజర్స్ లాంటిదీ ఈ స్కామ్.

కేబినెట్ తీర్మానానికి, జీవోలకు విరుద్ధంగా ఒప్పందం

కేబినెట్లో ఒకటి చెప్పి ఆ ప్రకారం జీవో జారీ చేశారు. వాటికి విరుద్ధంగా ఒప్పందం చేసుకున్నారు. ఆ తరువాత మరో ఒప్పందం చేసుకుని డబ్బులు కొట్టేశారు. ప్రజాధనాన్ని దోచేయడంలో చంద్రబాబు చాతుర్యం చూడాలంటే స్కిల్ స్కామ్‌ను ఉదాహరణగా చెప్పవచ్చు. విదేశాల్లోని షెల్ కంపెనీలకు ఈ స్కామ్ నిధులు చేరాయి. ఆ తరువాత మళ్లీ వివిధ రూపాల్లో మన దేశానికి వచ్చాయి. ఈ స్కామ్‌పై జీఎస్టీ, ఇంటెలిజెన్స్, ఈడీ, సీఐడీ.. అన్నీ దర్యాప్తు చేస్తున్నాయి.

ముందుగానే ఊహించి..

చేయని స్కిల్ డెవలప్‌మెంట్ ఎలా చూపించాలి..? దోచేసిన డబ్బును ఎలా జేబులోకి తెచ్చుకోవాలి..? చట్టానికి దొరక్కుండా ఏ ఫైల్స్‌ను ముందుగానే మాయం చేయాలి..? దర్యాప్తు జరిగితే తప్పించుకోవడానికి ఏం చేయాలి..? అసలు విచారణ జరగకుండా ఏం చేయాలి..? ఇవన్నీ ముందుగానే ఊహించుకుని రూపకల్పన చేశారు. ఒక క్రిమినల్ మాత్రమే ఇలా చేయగలుగుతాడు. అవినీతికి నిజంగానే విజన్ ఆయన. 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే ఈ స్కిల్ స్కామ్ ఊపిరి పోసుకుంది. ఇందుకోసం తనకు కావాల్సిన మనుషులను చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లోకి తీసుకొచ్చారు.

దొరికిపోవడంతో..

ఇంత దారుణంగా స్కామ్ చేసి దొరికిపోయారు కాబట్టి చంద్రబాబులో ఇంత భయం. ఈ గజదొంగల ముఠా ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 తట్టుకోలేక ఉక్రోషంతో బాధపడుతున్నాయి. ఇన్ని దారుణాలు చేసిన ఈ గజదొంగల ముఠా చట్టం నుంచి తప్పించుకునేందుకు వేస్తున్న ఎత్తులు అన్నీఇన్నీ కావు. నేరగాళ్లకు సరైన సమయంలో దేవుడు మొట్టికాయలు వేస్తాడు. ప్రజలు ఇప్పటికే మొట్టికాయలు వేశారు. వీళ్లను మళ్లీ ఏ రోజూ రాజ్యాధికారంలో చూడకుండా ఇంకా గట్టిగా మొట్టికాయలు వేసే రోజులు కూడా దగ్గర్లోనే ఉన్నాయి.

ఓ ప్రైవేట్ కంపెనీ రూ.3 వేల కోట్ల గ్రాంట్ ఇస్తుందా?



సీమెన్స్ కంపెనీలో ఓ ఉన్నతోద్యోగితో లోపాయికారీగా వీళ్ల లాలూచీ పడ్డారు. అతడి ద్వారా దోపిడీకి పాల్పడ్డారు. ఈ ప్రాజెక్టు ఖర్చు రూ.3,356 కోట్లు. ఇందులో ప్రభుత్వ వాటా 10 శాతం, సీమెన్స్ కంపెనీ 90 శాతం భరిస్తుందన్నారు. ప్రపంచంలో ఎక్కడైనా ఓ ప్రైవేట్ కంపెనీ రూ.3 వేల కోట్ల గ్రాంట్ ఇస్తుందా..? పోనీ చంద్రబాబు ముఖాన్ని చూసి ఇస్తారా...? రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా ప్రాజెక్టు తీసుకోవాలంటే ఒక పద్ధతి ఉంటుంది. ప్రాజెక్టు ఎలా అమలు చేస్తారు...? ప్రభుత్వం వాటా ఎంత? మిగిలిన వారి వాటా ఎంత..? ప్రభుత్వం ఏ రూపంలో ఈ డబ్బులు ఖర్చు చేస్తుంది..? మిగిలిన వారు తమ వాటా డబ్బును ఏ రూపంలో ఇస్తారు..? ప్రతి స్థాయిలో ఖర్చు ఎంత ఉంటుంది..? ఏ రకంగా నిధులు వస్తాయి..? టార్గెట్ ఎప్పటికి పూర్తవుతుంది..? ఏ స్థాయిలో ఎవరి బాధ్యత ఎంత ఉంటుంది..? ఇలా అన్ని కోణాల్లోనూ అధ్యయనం చేసి అందుబాటులో ఉన్న ఉత్తమ విధానాలను డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టులోకి తేవాలి. ఇవన్నీ పూర్తయిన తర్వాత డీపీఆర్‌ను సర్టిఫైడ్ చేయాలి. ఇవేవీ ఇక్కడ జరగలేదు. డీపీఆర్ కూడా తయారు చేయలేదు. ముందస్తుగానే ఆ కంపెనీలో లాలూచీ పడ్డ ఇద్దరు వ్యక్తులు రూపొందించిన డీపీఆర్‌ను స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఒక నోట్ పెట్టించారు. కనీసం టెండర్ లాంటి ప్రక్రియ కూడా ఈ ప్రాజెక్టులో లేదు. చంద్రబాబుకు మాత్రమే ఇటువంటిది సాధ్యం.

గ్రాంట్ అనే పదమే లేకుండా ఒప్పందం

రాష్ట్రంలో 6 క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని, ఒక్కో క్లస్టరులో ఒక్కో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అని, 5 టెక్నికల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్స్ కూడా ఏర్పాటు చేస్తామని జీవోలో చెప్పారు. ఒక్కో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు రూ.546 కోట్లు ఖర్చు చేస్తామని, ఇందులో 90 శాతం ఖర్చును సీమెన్స్, డిజైన్‌టెక్ గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద అందిస్తుందని, మిగిలిన 10 శాతం అంటే ఒక్కో సెంటర్‌కు రూ.50 కోట్లు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం భరించాలని చెప్పారు. ప్రాజెక్టు వ్యయంలో పది శాతం, పన్నులతో కలిపి రూ.371 కోట్లను ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. మిగిలిన రూ.3 వేల కోట్లను సీమెన్స్ సంస్థ గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా ఉదారంగా ఇస్తుందంటూ కేబినెట్‌లో చెప్పారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద వచ్చిందంటే ఆ డబ్బును మనం తిరిగి ఇవ్వాల్సిన అవసరం లేదు. అయితే ఒప్పందం దగ్గరకు వచ్చేసరికి 90 శాతం గ్రాంట్ ఇన్ ఎయిడ్ ప్రస్తావన పూర్తిగా ఎగిరిపోయింది. ఆ పదమే ఎక్కడా కనిపించలేదు. ప్రభుత్వం ఇవ్వాల్సిన 10 శాతం వాటా కాస్తా రూ.330 కోట్లు ఫైనాన్సియల్ అసిస్టెన్స్‌గా మారిపోయింది. కుంభకోణానికి ఇక్కడే బీజం పడింది. ఒప్పంద పత్రంలో వివరాలు నింపాల్సిన చోట ఖాళీగా విడిచిపెట్టారు. ఏ తేదీన ఒప్పందం కుదిరిందన్న విషయాన్ని కూడా రాయలేదు. జీవోలో ఉన్నది ఒప్పందంలో లేనప్పుడు ఎలా సంతకాలు చేశారు? చంద్రబాబు స్క్రిప్ట్, డైరెక్షన్ లేకుండానే ఇంత పెద్ద ప్రాజెక్టుపై ఈ రకంగా ఒప్పందాలు జరుగుతాయా? ఇన్ని వందల కోట్ల రూపాయలను ప్రభుత్వం నుంచి ఇవ్వగలుగుతారా?

సీమెన్స్ నుంచి పైసా రాలేదు

గత ప్రభుత్వం 10 శాతం నిధులను విడుదల చేసినప్పుడు సీమెన్స్ కంపెనీ నుంచి రావాల్సిన గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఒక్క పైసా కూడా రాలేదు. అసలు ఆ ప్రాజెక్టు గురించే ఆ కంపెనీకి తెలియదు. గత ప్రభుత్వం ఐదు దఫాల్లో రూ.371 కోట్లు విడుదల చేసింది. ఆ మొత్తం షెల్ కంపెనీల నుంచి చంద్రబాబుకు చేరిన వెంటనే దఫాల వారీగా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేశారు.

నోట్ ఫైల్స్ మాయం.. క్లీనింగ్ ఆపరేషన్

స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ గురించి ఒక విజిల్ బ్లోయర్ టీడీపీ హయాంలోనే 2018లో ఏసీబీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఏసీబీ విచారణ మొదలు పెట్టినా ఆ తరువాత అందిన ఆదేశాలతో ఆ ఫైలును పక్కనపెట్టేసింది. ఏసీబీ దర్యాప్తు చేయకుండా ఎవరు అడ్డుకున్నారు? ఏసీబీ ముఖ్యమంత్రికి రిపోర్టు చేస్తుంది. ఈ వ్యవహారం గురించి బయటకు పొక్కడంతో ప్రాజెక్టుకు సంబంధించిన నోట్ ఫైల్స్‌ను మాయం చేశారు. క్లీనింగ్ ఆపరేషన్ మొదలుపెట్టారు. ఎంత తెలివైన నేరస్థుడైనా ఎక్కడో ఒక చోట ఏదో ఒక పొరపాటు చేస్తాడు. వివిధ శాఖల్లో ఉన్న షాడో ఫైల్స్ ద్వారా ఈ మొత్తం వ్యవహారం బయటపడింది. అన్నీ బయటకొస్తున్నాయి. ఈ స్కిల్ స్కాంలో ప్రధాన పాత్ర పోషించిన పీవీఎస్పీ– స్కిల్లర్, డిజైన్ టెక్ ఈ రెండు కంపెనీలు సర్వీసు టాక్స్ కట్టకుండా బోగస్ ఇన్‌వాయిస్‌లతో 'సెన్ వ్యాట్' కోసం క్లెయిమ్ చేశాయి. కోట్ల రూపాయల మేర క్లెయిమ్ చేయడంతో జీఎస్టీ అధికారులకు అనుమానం వచ్చింది. ఆ కంపెనీల లావాదేవీలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టారు. 2017లోనే ఇది బయటపడింది. వాళ్లు బయటపెట్టినా చంద్రబాబు ప్రభుత్వం స్పందించలేదు. ఎందుకంటే సాక్షాత్తూ చంద్రబాబే ఈస్కామ్‌లో అడుగులు వేయించారు కాబట్టి!

అలాంటి స్కీమ్‌లే లేవన్న సీమెన్స్

మన అధికారులే కాకుండా ఈ వ్యవహారంపై సీమెన్స్ కంపెనీ కూడా అంతర్గతంగా విచారించింది. సీఆర్పీసీ 164 కింద వాంగ్మూలం ఇచ్చారు. గత ప్రభుత్వం జారీ చేసిన జీవో, ఎంఓయూలతో తమకు ఎలాంటి సంబంధం లేదని సీమెన్స్ కంపెనీ కోర్టుకు చెప్పింది. ఇది సీమెన్స్ అంతర్గతంగా విచారణ జరిపి ఇచ్చిన రిపోర్టు. తమ కంపెనీలో పనిచేసే సుమన్ బోస్ మేనేజ్‌మెంట్‌నుగానీ లీగల్ టీమ్‌నుగానీ సంప్రదించలేదని కూడా కోర్టుకు వెల్లడించింది. గ్రాంట్ ఇన్ ఎయిడ్, ఆర్థిక సహాయంతో కూడిన కార్యక్రమాలను సీమెన్స్ ఎప్పుడూ నిర్వహించలేదని, అసలు అలాంటి స్కీమ్‌లు ఏవీ తమ సంస్థలో లేవని కూడా స్పష్టం చేసింది. వారి అంతర్గత విచారణ రిపోర్టులు మనకు అందజేశారు కూడా. అంటే రూ.371 కోట్లు తమకు రాలేదని సీమెన్స్ వాళ్లు చెబుతున్నారు. మరి ఆ డబ్బులు ఎవరికి చేరాయి? అటు తిరిగి ఇటు తిరిగి షెల్ కంపెనీల ద్వారా వీళ్లు హైదరాబాద్‌కి తెప్పించుకున్నారు. రూ.371 కోట్లను చంద్రబాబు, ఆయన మనుషులు తినేశారు. అనేక షెల్ కంపెనీల ద్వారా ఆ డబ్బు చేతులు మారి మనీల్యాండరింగ్‌తో వీళ్ల చేతుల్లోకి వచ్చింది.

ఆధారాలతో రుజువైనా ఎల్లో మీడియా గగ్గోలు

ఈ స్కామ్‌పై ఇప్పుడు సీఐడీ దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేస్తుంటే ఇదంతా రాజకీయ కక్ష సాధింపంటూ ఎల్లో మీడియా గగ్గోలు పెడుతోంది. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5 బాధ వర్ణనాతీతం. ఇన్ని ఆధారాలతో రుజువై అరెస్టులు జరుగుతుంటే రాజకీయ కక్ష సాధింపు అంటున్నాయి. ఈ కేసులో కేంద్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా నలుగురిని అరెస్టు చేసింది. సీమెన్స్ మాజీ ఎండీ సౌమ్యాద్రిశేఖర్ బోస్ అలియాస్ సుమన్ బోస్, డిజైన్ టెక్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ వికాస్ వినాయక్ కన్వేల్కర్, ఎక్స్ ఫైనాన్షియల్ అడ్వైజర్ ముకుల్ చంద్ర అగర్వాల్, ఆథరైజ్డ్ సిగ్నటరీ ఆఫ్ స్కిల్లార్ ఎంటర్‌ప్రైజెస్ ఇండియా లిమిటెడ్ సురేష్ గోయల్‌ను అరెస్టు చేసి పీఎంఎల్‌ఏ కోర్టులో ప్రవేశపెట్టి 7 రోజుల పాటు ఈడీ కస్టడీకి తీసుకుంది.

సభ సాక్షిగా ప్రజలకు వాస్తవాలు..

ఈ విషయంపై చర్చ జరుగుతుంటే వక్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారు. వాళ్ల దగ్గర మీడియా సంస్థలు ఎక్కువ ఉన్నాయి. వాళ్లు ఒక నిజాన్ని అబద్ధం చేయగలరు. ఒక అబద్ధాన్ని నిజం చేయగలరు. అంతటి స్కిల్డ్ మ్యాన్ పవర్, స్కిల్డ్ ఎస్టాబ్లిష్‌మెంట్ వాళ్ల దగ్గర ఉంది. ఈ సభ ద్వారా వాస్తవాలు ఏమిటో ప్రజలకు తెలియజేయాలనే సాక్ష్యాలు, ఆధారాలను చూపిస్తున్నాం.

నిబంధనలకు పూర్తి విరుద్ధంగా..



గత ప్రభుత్వంలో సెక్రటరీ స్థాయి, ఆపై స్థాయిలో చూసీ చూడనట్లు వదిలేశారు. ఏకంగా స్పెషల్ ఐటెమ్‌గా కేబినెట్‌లోకి ఈ నోట్‌ని తీసుకొచ్చారు. కేబినెట్‌లోకి రావడం, వెంటనే ఓకే చెప్పడం, ఆ తర్వాత జీవో విడుదల కావడం అన్నీ ఆగమేఘాల మీద జరిగిపోయాయి. అధ్యయనం చేయని, ఎవరో ఇచ్చిన డీపీఆర్‌ను ఇలా కేబినెట్‌కు నోట్ పెట్టడం నిబంధనలకు పూర్తి విరుద్ధం. చంద్రబాబు పాలనలో రూల్స్ బేఖాతర్, ప్రొసీజర్స్ బేఖాతర్, ఆయన చెప్పిందే వేదం అన్నట్లు నడిపించారు.

ఎల్లో మీడియా రాయదు.. దత్తపుత్రుడు ప్రశ్నించడు



ఈ స్కామ్.. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత తవ్వింది కాదు. చంద్రబాబు హయాంలోనే ఇది బయటకు పొక్కింది. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, ఎల్లో మీడియా ఏ ఒక్కరూ మాట్లాడలేదు. చివరకు దత్తపుత్రుడు కూడా అడగలేదు. ఇంత మొత్తంలో ప్రజల డబ్బు యధేచ్ఛగా కాజేస్తుంటే వీళ్లంతా ఎందుకు మౌనంగా ఉన్నారు? దోచుకో, పంచుకో, తినుకో (డీపీటీ).. ఇదే వీళ్ల విధానం. ఎవరూ అడగరు, ఎవరూ రాయరు, ఎవరూ చూపరు, ప్రశ్నిస్తానన్నవాడు ప్రశ్నించడు.

ఏలేరు స్కామ్ నుంచి హైటెక్ సిటీ దాకా..



పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా యువత నైపుణ్యాలను పెంపొందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేలా చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటున్నాం. మానవ వనరులను సద్వినియోగం చేసుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 192 స్కిల్ హబ్‌లు, 21 స్కిల్ కాలేజీలు ఏర్పాటు చేశాం. తద్వారా ఏటా 50 వేల మందికి శిక్షణ ఇస్తున్నాం. స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నాం. హబ్స్, కాలేజీలను నెలకొల్పేందుకు మేం రూ.25 కోట్లు వెచ్చిస్తే యువతకు శిక్షణ పేరిట టీడీపీ సర్కారు రూ.371 కోట్ల కుంభకోణానికి పాల్పడింది. రెండు ఎకరాలతో జీవితాన్ని ప్రారంభించిన చంద్రబాబు నేడు ఎనలేని ఆస్తులు సంపాదించారు. ఏలేరు కుంభకోణానికి పాల్పడ్డారు. భూసేకరణ సమయంలో ఎకరానికి వెయ్యి కొబ్బరి చెట్లు ఉన్నట్లు చూపించి ప్రజాధనాన్ని దోచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలో ఉండగా స్టాంపు పేపర్లు, హైటెక్ సిటీ విషయంలోనూ కుంభకోణాలు చేశారు.

– గుడివాడ అమర్‌నాథ్, పరిశ్రమలశాఖ మంత్రి

చోరకళలో ఆరితేరిన చంద్రబాబు



చోర కళలో ఆరితేరిన చంద్రబాబు ఏలేరు స్కామ్ నుంచి అమరావతి వరకు పలు కుంభకోణాలకు పాల్పడ్డారు. 'స్కిల్ స్కామ్' మన రాష్ట్రంలో మొదలై విదేశాలకు పాకింది. దోచిన ప్రజాధనాన్ని విదేశాలకు తరలించి హవాలా మార్గంలో రప్పించారు. అన్ని వ్యవస్థలను మేనేజ్ చేసే సామర్థ్యం చంద్రబాబు సొంతం. 2014 ఎన్నికలకు ముందు ఇంటింటికి ఒక జాబ్ ఇస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు ఇవ్వకపోగా యువత నైపుణ్యాలు పెంపొందిస్తామంటూ భారీ స్కామ్‌కు పాల్పడ్డారు. ఆధారాలు లేకుండా చేయడంలో భాగంగా నోట్ ఫైళ్లను మాయం చేశారు. స్కిల్ స్కామ్ సూత్రధారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.

– కురసాల కన్నబాబు, మాజీ మంత్రి

దోపిడీ చేసినవారు తప్పించుకోలేరు

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంపై సీఎం జగన్ ట్వీట్

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వ హయాంలో జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంపై అసెంబ్లీలో సోమవారం వాడీవేడి చర్చ జరిగింది. ఈ స్కామ్‌ను చంద్రబాబు అండ్ కో ఎంత చాకచక్యంగా చేశారో అసెంబ్లీలో చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివరించారు. కాగా ఈ కుంభకోణంపై అసెంబ్లీలో ప్రస్తావించిన కొన్ని అంశాలను సీఎం వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. 'అర్హులైన వారికి నేరుగా నగదు జమ చేసే డీబీటీని ఈ ప్రభుత్వం చేస్తుంటే.. గత ప్రభుత్వం దాచుకో, పంచుకో, తినుకో (డీపీటీ) కార్యక్రమం చేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ.371 కోట్ల ప్రజాధనం దోపిడీ జరిగింది. దోపిడీ చేసిన వారు చట్టం, ప్రజల నుంచి తప్పించుకోలేరు' అంటూ సీఎం జగన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలి

- అలా చర్యలు తీసుకునేలా నేను ఏనాడూ యత్నించలేదు
- డిప్యూటీ సీఎంగా ఉన్న నన్ను దారుణంగా తిడితే నాకు రక్షణ ఎక్కడ?
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



సాక్షి, అమరావతి: శాసనసభలో తనను అసభ్య పదజాలంతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి స్పీకర్ తమ్మినేని సీతారాంను డిమాండ్ చేశారు. తాను ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తినే అయినా ఏనాడు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు పెట్టించే ప్రయత్నం చేయలేదని.. కానీ, ఈరోజు తనను ఇష్టానుసారంగా టీడీపీ సభ్యులు దూషించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయులతో పాటు ఇతర ఎమ్మెల్యేలు ఏడుగురు తనను అసభ్యంగా తిట్టారని.. వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని, డిప్యూటీ సీఎంగా ఉన్న తనకు సభలోనే రక్షణ లేకపోతే ఎలా అని ఆవేదనతో ప్రశ్నించారు. దీనంతటికీ కారణం చంద్రబాబునాయుడేనని నారాయణస్వామి ఆరోపించారు. ఇక 'చంద్రబాబుకు ఎస్సీలన్నా, ఎస్టీలన్నా బీసీలన్నా అసలు నచ్చదు. ఆయన ఇంట్లో పనివారిని కూడా తన సామాజికవర్గం వారినే పెట్టుకుంటాడు. ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర సామాజికవర్గాలను అంటరానివారిగా చూస్తాడు. అందుకే ఎస్సీ, ఎస్టీ, బీసీలంతా ఆయన్ను వీడి వైఎస్సార్‌సీపీ వైపు ఉన్నారు. దీన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నాడు. అందుకే ఆ పార్టీ నుంచి ఒకేఒక్క ఎస్సీ అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలిస్తే ఆయన్ను పావుగా వాడుకుని అసెంబ్లీలో అరాచకాలకు తెగబడుతున్నారు. అసలు ఎస్సీల్లో పుట్టాలని ఎవరు కోరుకుంటారంటూ చంద్రబాబు ఎస్సీ సామాజికవర్గం మొత్తాన్ని అవమానించినప్పుడే ఆ ఎమ్మెల్యే టీడీపీని వీడి బయటకు రావాల్సింది. కానీ, రాలేదు. ఇప్పుడు అదే ఎస్సీ ఎమ్మెల్యేతో బీసీ వర్గానికి చెందిన స్పీకర్‌పై చంద్రబాబు దాడి చేయించాడు. ఇలా దాడులు చేయించి కులాల మధ్య చిచ్చుపెట్టాలన్నది చంద్రబాబు దుర్మార్గపు ఆలోచన. బీసీ వర్గానికి చెందిన స్పీకర్‌పై ఎస్సీ ఎమ్మెల్యే దాడిచేస్తే మా కులానికి చెడ్డపేరు వస్తుందని సుధాకర్‌బాబు ఆయన్ను పక్కకు తీయబోయారు. ఆయనపైనా మరో ఎమ్మెల్యే ఎలీజాపైనా దాడిచేశారు. అరాచకాలకు కారణమైన చంద్రబాబు ఇక జన్మలో ఈ అసెంబ్లీలో అడుగుపెట్టే పరిస్థితి లేదు. కుట్రలు, కుతంత్రాలు చేసి అల్లకల్లోలం సృష్టించాలని చంద్రబాబు చూస్తున్నారు. డిప్యూటీ సీఎంగా ఉన్న నన్ను చాలా దారుణంగా తిట్టారు. వీరాంజనేయులే కాదు.. మరో ఏడుగురు టీడీపీ ఎమ్మెల్యేలూ తిట్టారు. వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలి' అని నారాయణస్వామి డిమాండ్ చేశారు.

బాధ్యతను ఒత్తిడిగా భావించవద్దు

- విద్యా ప్రగతి దిశగా టీచర్లు ముందుకెళ్లండి
- విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

సాక్షి, అమరావతి: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. ఉపాధ్యాయులు తమ బాధ్యతను మానసిక ఒత్తిడిగా భావించవద్దన్నారు. సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. విద్యా శాఖ చేపడుతున్న కార్యక్రమాలను ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడిగా భావిస్తే.. వాటి పరిష్కారాల కోసం సూచనలు, సలహాలను ఉపాధ్యాయ సంఘ నాయకులు ఏకాభిప్రాయంతో ఇవ్వాలని కోరారు. వాటిని పరిశీలించి ఆచరణ దిశగా అమలు చేస్తామని అన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి వారి అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకునే బదిలీల ప్రక్రియ చేపట్టామన్నారు. ఆ సంఘాలు కోర్టులో పిటిషన్ వేయడంతో ఆ ప్రక్రియ మధ్యంతరంగా ఉండిపోయిందని, న్యాయస్థానం తీర్పు ఇచ్చిన వెంటనే బదిలీ, పదోన్నతుల ప్రక్రియకు ఆదేశాలు ఇస్తామని పేర్కొన్నారు. సమావేశంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్, సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు ఎస్.సురేష్ కుమార్, పాఠశాల విద్య డైరెక్టర్ పి.పార్వతి, జాయింట్ డైరెక్టర్ (సర్వీసులు) మువ్వా రామలింగం, జాయింట్ డైరెక్టర్ టెట్ మేరీ చంద్రిక పాల్గొన్నారు.

చర్చించిన ముఖ్యాంశాలివీ..

- ఎయిడెడ్ గ్రంథాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది 60 నుంచి 62 సంవత్సరాల సర్వీస్ అమలుకు చర్యలు.
- గురుకుల పాఠశాలల్లో సర్వీస్ మ్యాటర్లకు సంబంధించి కోర్టు తీర్పు రాగానే ఆదేశాలు జారీ.
- బదిలీలు ఎప్పుడూ ఒకే సమయంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశం. బదిలీల విషయంలో ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే నిబంధనలే ఉపాధ్యాయులకు కూడా వర్తింపచేయడానికి నిర్ణయం
- రంజాన్ సందర్భంగా ముస్లింలకు పని గంటలు, సెలవులకు సంబంధించిన నిర్ణయాలను చర్చించి తెలియజేస్తాం.
- ప్రతి విద్యార్థికి ఇవ్వనున్న రాగిజావ ఉదయం 8.30కి కాకుండా మొదటి పీరియడ్ తర్వాత విరామ సమయంలో ఇవ్వాలన్న ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తిపై త్వరలోనే నిర్ణయం.
- విద్యార్థులకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి గ్లాసులు, ప్లేట్లు సరఫరా చేయాలనే యోచనలో ఉన్నట్టు వెల్లడి. గ్యాస్ పొయ్యి, వంట పాత్రలు కూడా కొత్తవి ఇస్తామని వెల్లడి.
- ప్రతి ఉన్నత పాఠశాలకు వాచ్‌మెన్ నియామకం. డేటా ఆపరేటర్ నియామకంపైనా చర్యలు.
- పాఠశాలలకు నేరుగా జగనన్న విద్యాకానుక కిట్లు ఎంఈవో కార్యాలయం నుంచి అందేలా చర్యలు.
- కోర్టు అనుమతి వచ్చిన 10 రోజుల్లోనే ఎంఈవో–2 పదోన్నతుల ప్రక్రియ.
- విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇచ్చే ట్యాబులు, బైజూస్ కంటెంట్, ఇతర కంటెంట్, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్ల వినియోగంపై ఉపాధ్యాయులకు శిక్షణ.
- మునిసిపల్ సర్వీస్ రూల్స్‌కు సంబంధించి మంగళవారం ఆన్‌లైన్‌లో డ్రాఫ్ట్. ఈ నెల 30లోపు సంఘాల నుంచి అభ్యంతరాల స్వీకరణ.

అప్రూవర్‌గా ప్రకటించడం చట్టవిరుద్ధం

వివేకా హత్య కేసులో దస్తగిరి బెయిల్ రద్దు చేయాలి

- వాచ్‌మెన్ రంగన్న వాంగ్మూలాన్ని సీబీఐ పరిగణలోకి తీసుకోవట్లేదు
- తమకు కావాల్సిన విధంగా ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు
- తెలంగాణ హైకోర్టులో వైఎస్ భాస్కర్‌రెడ్డి పిటిషన్



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ ఆదేశించినట్లుగా ఏ-4 దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడని, దాని ఆధారంగా కేసుతో ఎలాంటి సంబంధంలేని వారిని ఇరికించాలని దర్యాప్తు సంస్థ ప్రయత్నిస్తోందని వైఎస్ భాస్కర్‌రెడ్డి తెలంగాణ హైకోర్టుకు నివేదించారు. దస్తగిరిని అప్రూవర్‌గా ప్రకటించడం చట్టవిరుద్ధమని, అతడికి బెయిల్ ఇచ్చే సమయంలో కిందికోర్టు అన్ని అంశాలను పరిగణలోకి తీసుకోలేదని తెలిపారు. దస్తగిరి చెప్పిన వివరాల ఆధారంగా తనతోపాటు మరి కొందరిని నిందితులుగా చేర్చే అవకాశం ఉందన్నారు. 'దస్తగిరిని అప్రూవర్‌గా ప్రకటించడాన్ని, బెయిల్ ఇస్తూ కిందికోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలి. నన్ను, మరికొందరిని నిందితులుగా చేర్చవద్దని ఆదేశాలు ఇవ్వాలి' అని అభ్యర్థిస్తూ వైఎస్ భాస్కర్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా ఈ పిటిషన్‌లోనూ వైఎస్ వివేకా కుమార్తె సునీత ఇంప్లీడ్ అయ్యారు. 'దస్తగిరి వాంగ్మూలం ఆధారంగా మమ్మల్ని నేరంలోకి నెట్టడం సమంజసం కాదు. వివేకా హత్య కేసులో దస్తగిరి కీలక పాత్ర పోషించాడు. హత్యకు ఆయుధాన్ని కొనుగోలు చేసింది అతడే. దస్తగిరికి బెయిల్ ఇచ్చేందుకు సీబీఐ పూర్తిగా సహకరించింది. దస్తగిరిపై వాచ్‌మెన్ రంగన్న చెప్పిన అంశాలను కిందికోర్టు పట్టించుకోలేదు' అని వైఎస్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్ భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌లో మరికొన్ని అంశాలివీ..

అన్ని ప్రశ్నలకూ సమాధానమిచ్చా...

నా వయసు సుమారు 73 ఏళ్లు. దీర్ఘకాలిక వెన్నునొప్పి. ఛాతీలో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నా. ఇప్పటికే సీబీఐ విచారణకు హాజరయ్యా. వాంగ్మూలం కూడా రికార్డు చేశారు. దర్యాప్తు అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చా. ఆ తర్వాత ఫిబ్రవరి 16న మరో నోటీసిచ్చారు. 23న విచారణకు హాజరుకావాలని చెప్పారు. కొన్ని అత్యవసర పరిస్థితుల కారణంగా ఫిబ్రవరి 24 తర్వాత ఎప్పుడైనా విచారణకు అందుబాటులో ఉంటానని దర్యాప్తు అధికారులకు తెలియజేశా. మార్చి 12న మళ్లీ రావాలని చెప్పడంతో కడపలోని సీబీఐ కార్యాలయానికి వెళ్లా. అక్కడ విచారణాధికారులు ఎవరూ లేకపోవడంతో తిరిగి వెళ్లిపోయా. మరో తేదీని తెలియజేస్తామని అక్కడి వారు చెప్పారు.

రంగన్న స్టేట్‌మెంట్‌ను తొక్కిపెట్టారు..

సీఆర్‌పీసీ సెక్షన్ 161, 164 కింద వివేకా వాచ్‌మెన్ రంగన్న స్టేట్‌మెంట్‌ను దర్యాప్తు సంస్థ రికార్డ్ చేసింది. దాని ప్రకారం.. హత్య జరిగిన రోజు రంగన్న నిద్రలో ఉండగా అకస్మాత్తుగా పాత్రలు, ఇనుప రాడ్ పడిపోవడం వంటి శబ్దాలు వినపడటంతో లేచి ప్రధాన ద్వారం వద్దకు వెళ్లాడు. లోపలి నుంచి ఏడుపు లాంటి శబ్దం వినిపించడంతో పార్క్ వైపు ఉన్న ద్వారం వద్దకు వెళ్లి పక్కనే ఉన్న కిటికీ లోంచి లోపలికి చూశాడు. ఇంట్లో నలుగురు వ్యక్తులు కనిపించారు. వాళ్లు హాల్‌లో ఏదో వెతుకుతూ కనిపించారు. వారిలో ముగ్గురిని ఎర్ర గంగిరెడ్డి, షేక్ దస్తగిరి, సునీల్ యాదవ్‌గా గుర్తించాడు. నాలుగో వ్యక్తి పొడవుగా, సన్నగా ఉన్నట్లు చెప్పాడు. గంగిరెడ్డి, దస్తగిరి, సునీల్ తరచూ వివేకా ఇంటికి వచ్చేవారు. ఆ తర్వాత రంగన్న చీకటిగా ఉన్న తోటలోని చెట్టు దగ్గర దాక్కున్నాడు. దాదాపు 20 నిమిషాల తర్వాత పార్క్ వైపు ద్వారం తెరిచి సన్నగా, పొడవుగా ఉన్న వ్యక్తితోపాటు దస్తగిరి, సునీల్ హడావుడిగా వచ్చి కాంపౌండ్ వాల్ దూకి పారిపోయారు. వారిని స్పష్టంగా చూసినట్లు రంగన్న చెప్పాడు. చీకట్లో ఉండటంతో వారు రంగన్నను గుర్తించలేదని చెప్పాడు. రంగన్న స్టేట్‌మెంట్ విచారణ స్థలంలో దొరికిన ఆధారాలతో సరిపోలడంతో పాటు బలాన్ని చేకూర్చింది. అక్కడ దొరికిన ఆధారాల మేరకే పోలీసులు నలుగురిని నిందితులుగా పేర్కొన్నారు.

మమ్మల్ని ఇరికించే ప్రయత్నం..

ఆ నలుగురే ఈ హత్య చేసినట్లు రంగన్న స్టేట్‌మెంట్ చాలా స్పష్టంగా చెబుతున్నా ఈ కేసుతో ఎలాంటి సంబంధం లేని నాతోపాటు మరికొందరిపై ఆరోపణలు చేస్తూ ఇరికించేందుకు దర్యాప్తు సంస్థ అక్రమ పద్ధతులను అనుసరిస్తోంది. వివేకా కుమార్తె సునీత, దర్యాప్తు అధికారులు వారికి తోచిన చట్టవిరుద్ధ ప్రక్రియలను ఆశ్రయిస్తున్నారు. ఇందులో భాగంగానే దస్తగిరికి కొన్ని సూచనలు చేసి వారికి కావాల్సిన విధంగా వాంగ్మూలం తీసుకున్నారు. దీంతో దస్తగిరి.. ఏ-5(శివశంకర్‌రెడ్డి)తో పాటు నాపై, మరో ఇద్దరిపై నిరాధార ఆరోపణలు చేశాడు. వీరి ఒప్పందంలో భాగంగానే దస్తగిరి బెయిల్ పిటిషన్‌కు సీబీఐ సహకరించింది. హత్యకు సంబంధించిన పూర్తి వివరాలను మేజిస్ట్రేట్ ముందు ఉంచలేదు. దీంతో నాతోపాటు ఏ-5, మరో ఇద్దరు తమ వెనుక ఉన్నారని గంగిరెడ్డి తనకు తెలియజేసినట్లు దస్తగిరి చెప్పాడు. గంగిరెడ్డి మాత్రం తాను ఎవరి పేర్లు చెప్పలేదని వాంగ్మూలంలో పేర్కొన్నాడు. దీన్ని కూడా సీబీఐ తొక్కిపెట్టింది. ఇప్పటికే నాతో పాటు నా కుమారుడు వైఎస్ అవినాశ్ రెడ్డి స్టేట్‌మెంట్‌ను కూడా సీబీఐ రికార్డు చేసింది.

సుప్రీం ఉత్తర్వులను పట్టించుకోకుండా...

దస్తగిరి గూగుల్ టేక్ అవుట్ డేటా ఆధారంగా చేసుకుని సీబీఐ నాపై ఆరోపణలు మోపుతోంది. నాకు వ్యతిరేకంగా దర్యాప్తు చేస్తోంది. సీబీఐ అనుసరించిన విధానం పూర్తిగా చట్టవిరుద్ధం. హత్య కేసులో నిందితుడైన కిరాయి హంతకుడికి ముందస్తు బెయిల్ ఇవ్వకూడదని సుప్రీంకోర్టు పలుమార్లు తీర్పులిచ్చింది. అప్రూవర్‌గా మారిన దస్తగిరి వాంగ్మూలం ఆమోదయోగ్యం కాదు. దస్తగిరి చెప్పిన దానికి ఎలాంటి సాక్ష్యం లేదు. ఎలాంటి సాక్ష్యం లేకుండా.. ఒకరు చెప్పారంటూ వ్యక్తులను నేరంలోకి నెట్టడం చట్ట వ్యతిరేకం. నేరంలో నలుగురు పాలుపంచుకున్నారు. వీరిలో తక్కువ నేరం చేసిన వారు జైలులో ఉండగా కీలక పాత్ర పోషించిన దస్తగిరికి మాత్రం బెయిల్ ఇవ్వడం సరికాదు. గంగిరెడ్డి ఆదేశాల మేరకు హత్యలో దస్తగిరి కీలక పాత్ర పోషించాడు. దీని కోసం భారీ మొత్తంలో నగదు కూడా తీసుకున్నాడు. ఆయుధాన్ని తెచ్చానని, హత్యలో ప్రధాన పాత్ర పోషించానని కూడా ఒప్పుకున్నాడు. ఈ అంశాన్ని కిందికోర్టు మేజిస్ట్రేట్ పరిగణలోకి తీసుకోలేదు. నిందితులందరిపై నమోదైన కేసు వివరాలను, మెటీరియల్, చార్జీషీట్‌ను మేజిస్ట్రేట్ పరిశీలించలేదు. బెయిల్ ఇచ్చేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా వివరణ తీసుకోవాల్సి ఉండగా అలా చేయలేదు. వాచ్‌మెన్ రంగన్న తాను ముగ్గురు నిందితులను స్పష్టంగా చూశానని చెప్పాడు. ప్రాసిక్యూషన్ కూడా 241 మంది సాక్షులను విచారించింది. ఘటనా స్థలంలోనూ పూర్తి ఆధారాలు సేకరించింది. ఇవేవి పరిగణలోకి తీసుకోకుండా దస్తగిరికి బెయిల్ ఇచ్చారు. అప్రూవర్‌గా మారడం, బెయిల్ ఇవ్వడం అంతా చట్టవిరుద్ధంగానే జరిగింది. బెయిల్ మంజూరు చేస్తూ కిందికోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలి. దస్తగిరి వాంగ్మూలం ఆధారంగా నన్ను నిందితుడిగా చేర్చవద్దని సీబీఐని ఆదేశించాలి.

క్లుప్తంగా...


ఇలాగైతే దర్యాప్తు అధికారిని మార్చండి

- వివేకా హత్యకేసులో సుప్రీంకోర్టు
- దర్యాప్తు తాజా పరిస్థితిపై వివరాలు అందజేయాలి

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగి నాలుగేళ్లు పూర్తయినా దర్యాప్తులో పురోగతి లేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. హత్యకేసు దర్యాప్తు ఎందుకు ఆలస్యం అవుతోందంటూ ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. దర్యాప్తు త్వరగా పూర్తి చేయలేకపోతుంటే అధికారిని మార్చాలని సూచించింది. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు అధికారిని మార్చాలంటూ నిందితుడు శివశంకర్‌రెడ్డి భార్య తులసమ్మ దాఖలు చేసిన పిటిషన్ సోమవారం జస్టిస్ ఎం.ఆర్.షా, జస్టిస్ సి.టి.రవికుమార్‌తో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. కేసు దర్యాప్తు తాజా పరిస్థితి ఏంటని జస్టిస్ ఎం.ఆర్.షా ప్రశ్నించారు. దర్యాప్తు సక్రమంగానే సాగుతోందని దర్యాప్తు సంస్థ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ నటరాజన్ తెలిపారు. సక్రమంగా సాగుతుంటే ఇన్నేళ్లు పడుతుందా? జాప్యం చేస్తుంటే దర్యాప్తు అధికారిని మార్చండి.. లేదంటే డైరెక్టర్‌కు సూచించండి అని ధర్మాసనం పేర్కొంది. దర్యాప్తు తాజా పరిస్థితిపై సీల్డు కవర్‌లో వివరాలు అందజేయాలని సీబీఐని ఆదేశించింది. దర్యాప్తు అధికారి స్థానంలో మరొకరిని నియమించవచ్చా అనే దానిపై సీబీఐ డైరెక్టర్ వైఖరి తెలుసుకుని తదుపరి విచారణలో తెలపాలని నటరాజన్‌కు సూచించింది. విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

చైల్డ్ కేర్ లీవ్‌ను సర్వీస్‌లో ఎప్పుడైనా వాడుకోవచ్చు

- ప్రైవేట్ స్కూళ్ల రెన్యువల్ మూడేళ్ల నుంచి 8 ఏళ్లకు పెంపు
- టీచర్ కోటాలో ఎన్నికైన ఎమ్మెల్సీల వినతికి సానుకూలంగా స్పందించిన సీఎం



సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన టీచర్ ఎమ్మెల్సీలు చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ మహిళా ఉద్యోగులు 180 రోజుల చైల్డ్ కేర్ లీవ్‌ను తమ సర్వీస్ కాలంలో ఎప్పుడైనా ఉపయోగించుకునే వెసులుబాటు కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్ ఆమోదం తెలిపారు. ప్రస్తుతం ఈ చైల్డ్ కేర్ లీవ్‌ను పిల్లలకు 18 సంవత్సరాల వయసు వచ్చే వరకు మాత్రమే ఉపయోగించుకోవాలని నిబంధన ఉంది. దీనిని సవరించి.. మహిళా ఉద్యోగులకు వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని అధికారులను సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. ఉపాధ్యాయ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన ఎంవీ రామచంద్రారెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్పలత సోమవారం అసెంబ్లీలోని సీఎం కార్యాలయంలో సీఎం జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు ఉపాధ్యాయుల సమస్యలపై సీఎంకు విజ్ఞాపన పత్రం అందజేశారు. మహిళా ఉద్యోగుల చైల్డ్ కేర్ లీవ్ సమస్యను సీఎం దృష్టికి తీసుకురాగా.. ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే ప్రైవేటు స్కూళ్ల రెన్యువల్ ఆఫ్ రికగ్నైజేషన్‌ను 3 సంవత్సరాల నుంచి 8 సంవత్సరాలకు పెంచాలని కోరగా.. దీనిపైనా సానుకూలంగా స్పందించిన సీఎం ఆ మేరకు ఉత్తర్వులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. తాము కోరిన వెంటనే సీఎం జగన్ మహిళా ఉద్యోగులకు మేలు చేస్తూ నిర్ణయం తీసుకున్నారంటూ సంతోషం వ్యక్తం చేశారు.

శాసనసభ గౌరవం కాపాడాలి: సోము వీర్రాజు

సాక్షి, అమరావతి: శాసనసభను రణసభగా మార్చొద్దని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు హితవు పలికారు. చట్టసభల్లో చర్చలు మాత్రమే జరిగినపుడు హుందాగా ఉంటుందన్నారు. అయితే అందుకు భిన్నంగా ఒకరిపై మరొకరు ఘర్షణలకు దిగుతూ.. ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. శాసనసభలో జరిగిన ఘటనలు ప్రజాస్వామ్య వాదులను ఆవేదనకు గురి చేశాయని తెలిపారు. సభ గౌరవం కాపాడాలని కోరారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఇక కార్గో డోర్ పికప్, డెలివరీ సర్వీసులు

రవాణా శాఖ మంత్రి పినిపె విశ్వరూప్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆర్టీసీ డోర్ టు డోర్ కార్గో పికప్, డెలివరీ సేవలను ఈ నెల 22 నుంచి ప్రారంభించనున్నట్లు రవాణా శాఖ మంత్రి పినిపె విశ్వరూప్ తెలిపారు. విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ డోర్ టు డోర్ కార్గో సేవల కోసం 'షిప్‌మంత్ర' ఆన్‌లైన్ బుకింగ్ పోర్టల్‌తో ఆర్టీసీ ఒప్పందం చేసుకుందని తెలిపారు. కార్గో పార్సిళ్లు/ కొరియర్లను ఇళ్ల వద్దే పికప్ .. ఇంటి వద్దకే డెలివరీ సేవలను ఈ పోర్టల్ ద్వారా అందుబాటులోకి తెస్తామన్నారు. ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమల రావు మాట్లాడుతూ విజయవాడ నుంచి విశాఖపట్నానికి, విశాఖపట్నం నుంచి విజయవాడకు 50 కిలోల పార్సిళ్ల వరకు ప్రయోగాత్మకంగా ఈ నెల 22న ప్రారంభిస్తామని తెలిపారు. ప్రారంభకానుకగా వినియోగదారులకు ఈ నెల 31 వరకు మొదటి మూడు పార్సిల్ బుకింగ్‌లకు ఉచితంగా సేవలు అందిస్తామన్నారు.

స్పెషలిస్ట్ వైద్య పోస్టుల భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూ

445 పోస్టులకు ఈ నెల 23 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్న ఏపీవీవీపీ

సాక్షి, అమరావతి: గిరిజన, గ్రామీణ ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ డాక్టర్లను నియమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మరోసారి వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించబోతోంది. ఏపీ వైద్య విధాన పరిషత్(ఏపీవీవీపీ)లో ఖాళీగా ఉన్న(319), ప్రమోషన్ల వల్ల ఖాళీ అయ్యే (126) సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టుల భర్తీకి ఈ నెల 23 నుంచి 27 వరకు వాక్-ఇన్ ఇంటర్వ్యూలు చేపడుతోంది. శాశ్వత, కాంట్రాక్ట్ విధానంలో ఈ పోస్టులను భర్తీ చేయనుంది. ప్రభుత్వాస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండకుండా వైఎస్ జగన్ ప్రభుత్వం చర్యలు చేపడుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పటికే 48 వేలకు పైగా పోస్టులను భర్తీ చేసింది. ఇదే క్రమంలో ఏపీవీవీపీ స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి ఇప్పటి వరకు రెండుసార్లు వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఇప్పుడు మరోసారి వాక్-ఇన్ ఇంటర్వ్యూలు చేపడుతోంది. విజయవాడలోని పాత జీజీహెచ్ ప్రాంగణంలో ఉన్న డీఎంఈ కార్యాలయంలో ఈ ఇంటర్వ్యూలు నిర్వహించనుంది. 23వ తేదీన జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, డెర్మటాలజీకి సంబంధించి, 25వ తేదీన గైనకాలజీ, ఈఎన్‌టీ, అనస్తీషియా, పాథాలజీకి సంబంధించి, 27న పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, రేడియాలజీ, సైకియాట్రీ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయి. గిరిజన ఆస్పత్రుల్లో రూ.2.50 లక్షలు, గ్రామీణ ఆస్పత్రుల్లో రూ.2 లక్షలు, పట్టణ ప్రాంత ఆస్పత్రుల్లో రూ.1.30 లక్షల చొప్పున వైద్యులకు వేతనాలు ఇవ్వనున్నారు. గిరిజన, గ్రామీణ ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించే ఉద్దేశంతో ప్రభుత్వం అధిక వేతనాలు ఇస్తోంది. మరిన్ని వివరాల కోసం www.hmfw.ap.gov.inను సందర్శించాలని, 6301138782 ఫోన్ నంబర్‌ను కూడా సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

భర్తీ చేసే వైద్యుల పోస్టులు

స్పెషాలిటీ	పోస్టులు
గైనకాలజీ	68
అనస్తీషియా	52
పీడియాట్రిక్స్	40
జనరల్ మెడిసిన్	94
జనరల్ సర్జరీ	70
ఆర్థోపెడిక్స్	5
ఆప్తమాలజీ	12
రేడియాలజీ	44
పాథాలజీ	19
ఈఎన్‌టీ	24
డెర్మటాలజీ	8
మైక్రోబయాలజీ	2
ఫోరెన్సిక్ మెడిసిన్	6
సైకియాట్రీ	1
మొత్తం	445

అసెంబ్లీ ఘటన.. టీడీపీకే పవన్ మద్దతు

- టీడీపీ ఎమ్మెల్యేలపై అధికార పక్షం దాడి సరికాదు
- ప్రజాస్వామ్యవాదులంతా ముక్తకంఠంతో దీన్ని ఖండించాలి
- జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్

సాక్షి, అమరావతి: శాసనసభలో సోమవారం చోటు చేసుకున్న పరిణామాలపై జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ స్పందించారు. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలను ఆయన వెనకేసుకొచ్చారు. టీడీపీ ఎమ్మెల్యేలపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు దాడి చేయడాన్ని ఖండిస్తున్నానని తెలిపారు. దీనిపై ఆయన సోమవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఈ పరిణామాలు దురదృష్టకరమైనవి. చట్ట సభల్లో అర్థవంతమైన చర్చలు జరిపి ప్రజలకు మేలు చేస్తారని అందరం ఆశిస్తాం. పరిపాలన విధానాల్లో ప్రజాప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నవాటిపై చర్చించాలి. చర్చ కోసం పట్టుపడితే దాడి చేయడం భావ్యం కాదు. ఇదే పరిస్థితి కొనసాగితే ఈ విధమైన దాడులు చట్టసభల నుంచి వీధుల్లోకి వస్తాయి. ఇటువంటి పరిణామాలు ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తాయి. ముందుగా చట్టసభల గౌరవాన్ని, హుందాతనాన్ని కాపాడాల్సిన బాధ్యత సభా నాయకుడిగా ముఖ్యమంత్రిపైనా, సభ ప్రిసైడింగ్ అఫీషియల్స్ మీద ఉంది' అని పవన్ కళ్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

16 జిల్లాల్లో వర్షాల ప్రభావం

- 951 గొర్రెల మృత్యువాత
- 20 వేల హెక్టార్లలో పంట నష్టం
- మరో మూడు రోజులు వానలు

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు రాష్ట్రంలోని 16 జిల్లాలపై ప్రభావాన్ని చూపాయి. నంద్యాల, కర్నూలు, అన్నమయ్య, విజయనగరం, వైఎస్సార్, ఎన్టీఆర్, పల్నాడు, తిరుపతి, గుంటూరు, చిత్తూరు, పార్వతీపురం మన్యం, కృష్ణా, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ఏలూరు, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లోని 119 మండలాల పరిధిలో 372 గ్రామాల్లో భారీ వర్షాల వల్ల ఇబ్బందులు ఏర్పడ్డాయి. కాగా వర్షాలు, పిడుగులకు 951 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం.. సుమారు 20 వేల హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు అధికార యంత్రాంగం తేల్చింది. పలుచోట్ల విద్యుత్ లైన్లు, రోడ్లు దెబ్బతిన్నాయి.

పిడుగులు పడే అవకాశం

కాగా మరో మూడు రోజులు రాష్ట్రంలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. అంతర్గత తమిళనాడు నుంచి మధ్య ఛత్తీస్‌గఢ్ వరకు కర్ణాటక, రాయలసీమ, తెలంగాణల మీదుగా సముద్రమట్టానికి 0.9 కి.మీ.ల ఎత్తులో ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఫలితంగా రానున్న మూడు రోజులు ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తాల్లో కొన్నిచోట్ల, రాయలసీమలో ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సోమవారం రాత్రి నివేదికలో తెలిపింది. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులకు ఆస్కారం ఉందని పేర్కొంది. కాగా సోమవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా ఓ మోస్తరు వర్షాలు కురిశాయి.

'స్వప్నిక'కు ఘనమైన గుర్తింపు

- ఇండియన్ వరల్డ్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో హైదరాబాదీ డాక్యుమెంటరీకి అవార్డు

సాక్షి, హైదరాబాద్: 'స్వప్నిక' అనే డాక్యుమెంటరీకి ఘనమైన గుర్తింపు లభించింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ యువతి ప్రమాదవశాత్తూ చిన్నతనంలోనే రెండు చేతులు పోగొట్టుకున్నప్పటికీ మొక్కవోని ధైర్యంతో తన జీవితంలో ఎదురొడ్డి పోరాడిన తీరును వివరిస్తూ తీసిన హైదరాబాద్‌కు చెందిన చిలుకూరి సుశీల్‌రావు ఈ డాక్యుమెంటరీని తీశారు. హైదరాబాద్ వేదికగా జరిగిన 7వ ఇండియన్ వరల్డ్ ఫిల్మ్ ఫెస్టివల్-23లో ఈ డాక్యుమెంటరీ అవార్డు దక్కించుకుంది. ఫెస్టివల్ డైరెక్టర్ రాంభుల్ సింగ్, చీఫ్ అడ్వైజర్ డి.సి.సింగ్ చేతుల మీదుగా సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్-స్పెషల్ ఫెస్టివల్ మెన్షన్‌ను ఈ డాక్యుమెంటరీకి అందజేశారు. ప్రపంచ వ్యాప్తంగా 200కు పైగా ఎంట్రీలు రాగా స్వప్నికకు ప్రత్యేక అవార్డు రావడం గమనార్హం. భారత్‌తో పాటు స్పెయిన్, అర్జెంటీనా, స్వీడన్, అమెరికా, యూకే, స్విట్జర్లాండ్, బ్రెజిల్, బెల్జియం, చిలీ, దక్షిణ కొరియా, డెన్మార్క్, జర్మనీలకు చెందిన పలు డాక్యుమెంటరీలు, షార్ట్‌ఫిల్మ్‌లకు కూడా ఈ ఫెస్టివల్‌లో పలు కేటగిరీల్లో అవార్డులు ప్రదానం చేశారు. చిలుకూరి సుశీల్‌రావు రూపొందించిన 'నోస్టాల్జియా' అనే మరో లఘు డాక్యుమెంటరీకి కూడా సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు లభించడం గమనార్హం.

శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో ఊరట

సాక్షి, న్యూఢిల్లీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దాల్మియా సిమెంట్స్‌కు సున్నపురాయి గనుల కేటాయింపుల వ్యవహారంలో ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి ఊరట లభించింది. తనపై సీబీఐ నమోదు చేసిన అవినీతి ఆరోపణల కేసును, తన కుట్ర లేదని ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సీబీఐ సవాల్ చేసిన పిటిషన్‌ను కొట్టేయాలని కోరుతూ శ్రీలక్ష్మి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వీటిని సోమవారం న్యాయమూర్తులు జస్టిస్ రవీంద్ర భట్, జస్టిస్ సీటీ రవికుమార్‌ల ధర్మాసనం విచారించింది. దాల్మియా సిమెంట్స్‌కు సున్నపురాయి గనుల కేటాయింపులో కుట్ర దాగి ఉందన్న సీబీఐ ఆరోపణలను కొట్టివేస్తూ గతంలో ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు ధర్మాసనం సమర్థించింది. ఈ నేపథ్యంలో ఆ పిటిషన్‌ను శ్రీలక్ష్మి ఉపసంహరించుకున్నారు. అయితే అవినీతికి సంబంధించిన కేసులో విచారణ ఎదుర్కోవాలని ఆమెను కోర్టు ఆదేశించింది.

వైఎస్సార్‌సీపీ నాయకుల బట్టలిప్పిస్తా

- టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు

సాక్షి, అమరావతి: 'మా పార్టీ ఎమ్మెల్యే బాల వీరాంజనేయస్వామిపై దాడి చేశారు. అసెంబ్లీ చరిత్రలోనే ఇది చీకటి రోజు. దౌర్జన్యం చేసిన వారిని మళ్లీ అసెంబ్లీలో అడుగు పెట్టనీయను. పోలీసులు కూడా వైఎస్సార్‌సీపీ నాయకులను కాపాడలేరు. వాళ్ల బట్టలిప్పిస్తా..' అంటూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన పార్టీ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అసెంబ్లీ గౌరవ సభ కాదు.. కౌరవ సభ అని తాను ఎప్పుడో చెప్పానన్నారు. ఎమ్మెల్యే వీరాంజనేయస్వామిపై దాడి చేసి మళ్లీ తమనే అంటున్నారని ఆరోపించారు. స్పీకర్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. సీఎం ప్రోద్బలంతోనే దాడి జరిగిందని ఆరోపించారు. జీవో నెంబర్ ఒకటి రద్దయ్యే వరకు టీడీపీ పోరాడుతుందని చెప్పారు. ఈ ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామన్నారు.

26న జీఎస్ఎల్‌వీ మార్క్3-ఎం3 ప్రయోగం

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(షార్)లోని రెండో ప్రయోగవేదిక నుంచి ఈ నెల 26వ తేదీ ఉదయం 9 గంటలకు జీఎస్ఎల్‌వీ మార్క్3-ఎం3 (ఎల్‌వీఎం3-ఎం3) రాకెట్ ప్రయోగాన్ని నిర్వహించనున్నట్లు ఇస్రో సోమవారం వెల్లడించింది. ఈ ప్రయోగంలో నెట్‌వర్క్ యాక్సెస్ అసోసియేటెడ్ లిమిటెడ్, యునైటెడ్ కింగ్‌డమ్ (వన్ వెబ్ గ్రూప్ కంపెనీ) వన్ వెబ్ ఇండియా-2 పేరుతో 5,805 టన్నుల బరువు కలిగిన 36 కమ్యూనికేషన్ ఉపగ్రహాలను రోదసిలోకి పంపనున్నారు. ఈ ప్రయోగానికి సంబంధించి రాకెట్ అనుసంధానం పనులను పూర్తిచేశారు. వాణిజ్యపరంగా ఇస్రోలో అంతర్భాగంగా ఉన్న న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్‌తో ఒప్పందం ప్రకారం ఈ ప్రయోగాన్ని నిర్వహిస్తున్నారు. గత ఏడాది అక్టోబర్‌లో వన్ వెబ్ ఇండియా-1 పేరుతో 36 ఉపగ్రహాలు రోదసిలోకి పంపగా, ఈ నెల 26న వన్‌వెబ్ ఇండియా-2 పేరుతో మరో 36 ఉపగ్రహాలను వాణిజ్యపరంగా పంపేందుకు సర్వం సిద్ధంచేశారు.

5వ ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటు చేశాం



- హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం
- విచారణను ముగించిన ధర్మాసనం

సాక్షి, అమరావతి: రాష్ట్ర 5వ స్టేట్ ఫైనాన్స్ కమిషన్‌ను (ఎస్ఎఫ్‌సీ)ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం హైకోర్టుకు నివేదించింది. ఇందుకు సంబంధించిన మెమోను రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది శ్రేయాస్ రెడ్డి హైకోర్టు ముందుంచారు. ఈ మెమోను పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం, ఆ వివరాలను పరిగణనలోకి తీసుకుంటూ, ఈ వ్యాజ్యాన్ని మూసివేస్తున్నట్లు తెలిపింది. ఆ మేర ఉత్తర్వులు జారీ చేసింది. నాల్గవ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ పదవీ కాలం 2020లో ముగిసిందని, ఇప్పటి వరకు కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని, కమిషన్ ఏర్పాటునకు తగిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ తెలుగుదేశం పార్టీకి చెందిన గొలమారు వెంకటరెడ్డి రెడ్డి ఇటీవల హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే.

5వ ఆర్థిక కమిషన్ చైర్‌పర్సన్‌గా ప్రొఫెసర్ రత్నకుమారి

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రత్నకుమారి చైర్‌పర్సన్‌గా మరో నలుగురు సభ్యులతో ఐదో రాష్ట్ర ఆర్థిక కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆంధ్రా యూనివర్సిటీ రిటైర్డ్ రెక్టార్ ప్రొఫెసర్ ఎం.ప్రసాదరావు, పి.బి. సిద్ధార్థ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.వి.ఎస్.పద్మారావు, మెప్మా ప్రాజెక్టు మాజీ డైరెక్టర్ (ప్రకాశం) కె.కృపారావు కమిషన్ సభ్యులుగా నియమించారు. శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్, సెర్ప్ ప్రస్తుత డైరెక్టర్ (అనంతపురం) డా.కె.వి.రమణారెడ్డిని కమిషన్ సభ్య కార్యదర్శిగా నియమించారు. కమిషన్ చైర్‌పర్సన్‌తో పాటు సభ్యులు, సభ్య కార్యదర్శి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి మూడేళ్ల పాటు కొనసాగుతారని గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

ఉద్యాన రైతుకు దన్ను..

పంటల గ్రేడింగ్, క్లీనింగ్, ప్యాకింగ్, నిల్వ, క్రయ విక్రయాలకు ప్రోత్సాహం

- 28 కలెక్షన్ సెంటర్ల ఏర్పాటుకు ప్రణాళికలు
- ఒక్కో కేంద్రానికి రూ.15 లక్షల వెచ్చింపు
- ఇప్పటికే 14 కేంద్రాల నిర్మాణం పూర్తి
- రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు ప్రయోజనం



రంగంపేట మండలం ఈలకొలను గ్రామంలో నిర్మాణం పూర్తి చేసుకున్న కలెక్షన్ సెంటర్‌లో ఉద్యాన అధికారులు, రైతులు

సాక్షి, రాజమహేంద్రవరం: ఉద్యాన పంటలకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ప్రభుత్వం బృహత్తర ఘట్టానికి నాంది పలికింది. ఈ పంటలకు మరింత ప్రోత్సాహం అందించేందుకు కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తోంది. గిట్టుబాటు ధర కల్పించేందుకు రంగం సిద్ధం చేసింది. ఇందుకోసం ఎఫ్‌పీఓల(ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్), రైతు ఉత్పత్తి సంఘాల కోసం కలెక్షన్ సెంటర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

జిల్లాలో ఇలా..

జిల్లాలో ఏటా 1,49,332 ఎకరాల్లో ఆయిల్ పామ్, జీడిపప్పు, కొబ్బరి, మామిడి, అరటి తదితర పంటలు సాగవుతుంటాయి. 69,195 మంది రైతులు ఉద్యాన పంటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గతంలో పంట ఉత్పత్తుల క్రయ విక్రయం, నిల్వ చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. సంత, మార్కెట్‌కు తరలించే క్రమంలో అవస్థలు పడేవారు. వీటిని శాశ్వతంగా దూరం చేసేందుకు, రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 28 ప్రాంతాల్లో 'రైతు కలెక్షన్ సెంటర్ల' నిర్మాణాలకు అడుగులు వేసింది. ఒక్కో కేంద్రానికి రూ.15 లక్షలు ఖర్చవుతుందని అంచనా రూపొందించింది. ఈ మొత్తంలో ప్రభుత్వం 75 శాతం రాయితీ అంటే రూ.11.25 లక్షలు అందిస్తుంది. మిగిలిన 25 శాతం రూ.3.75 లక్షలు మండలాల వారీగా రూపుదిద్దుకున్న రైతు ఉత్పత్తి సంఘాలు సమకూర్చాల్సి ఉంటుంది.

జిల్లా వ్యాప్తంగా 25 రైతు ఉత్పత్తి సంఘాలు రూపుదిద్దుకున్నాయి. సంఘంలో 20 నుంచి 100 మంది రైతులు సభ్యులుగా ఉంటారు. వీరు కేంద్రాలను వినియోగించుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆదేశాలతో నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన ప్రారంభమయ్యాయి. ఇప్పటికే 14 కేంద్రాల నిర్మాణం పూర్తయింది. మిగిలిన 14 సెంటర్లు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి. కేంద్రాలు అందుబాటులోకి వస్తే రైతులకు అనేక ఉపయోగాలున్నాయి. పండించిన పంటలు కేంద్రానికి తీసుకువచ్చి నిల్వ చేసుకోవచ్చు. అక్కడే శుభ్రం చేసుకోవడం, గ్రేడింగ్ చేసి పంట నాణ్యతకు అనుగుణంగా ప్యాకింగ్‌కు అవకాశం ఉంటుంది. సరుకు రవాణాకు అత్యంత అనుకూలం. వాహనాల్లో ఎక్కించి మార్కెట్‌కు తలరించేలా ఏర్పాట్లు ఉంటాయి. అన్నికంటే పంట రక్షణకు భరోసా ఉంటుంది.

జిల్లాలో ఉద్యాన పంటలు.. దిగుబడి వివరాలు..

పంట	విస్తీర్ణం(ఎకరాల్లో..)	రైతులు	దిగుబడి (మెట్రిక్ టన్నుల్లో)
ఆయిల్ పామ్	43,190.19	11,293	3,45,521
జీడిపప్పు	27,895.24	12,469	13,389
కొబ్బరి	20,383.50	7,182	2.45(మిలియన్ నట్స్)
మామిడి	14,753.18	5,926	1,03,272
అరటి	14,680.74	9,677	1,61,488
ఇతర	28,429.07	22,648	1,12,716.28

రైతులకు ఉపయుక్తం

ఉద్యాన రైతుల శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం కలెక్షన్ సెంటర్లను అందుబాటులోకి తీసుకువస్తోంది. జిల్లా వ్యాప్తంగా 28 నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అన్ని కేంద్రాలు పూర్తయితే ఉత్పత్తి దారుల సంఘాలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. పంటలు నిల్వ, గ్రేడింగ్, క్రయ విక్రయాలకు వెసులుబాటు కలుగుతుంది.

వి.రాధాకృష్ణ,
జిల్లా ఉద్యానవన శాఖ అధికారి



ఒక దేశ సంస్కృతి అనేది దాని జనాల హృదయాలు, ఆత్మల్లో ఉంటుంది.
– మహాత్మా గాంధీ

సాక్షి

మంగళవారం, మార్చి, 21

ఖలిస్తాన్ 2.0

శనివారం నుంచి మూడు రోజులుగా నిరంతర గాలింపు. అయినా దొరకలేదు. ఇప్పటికి వందమం దికిపైగా అతని సహచరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం పొద్దుగూకాక కూడా నిందితుడు పోలీసుల గస్తీ కళ్ళ నుంచి తప్పించుకొని, తిరుగుతూనే ఉన్నాడు. 'వారిస్ పంజాబ్ దే' సంస్థ అధినేత అమృత్‌పాల్ సింగ్ పరారీ, అందుకు దారి తీసిన పరిస్థితులు చూస్తే, నలభై ఏళ్ళ నాటి తీవ్రవాద సంక్షుభిత పంజాబ్ పరిస్థితులు పునరావృతమవుతున్నాయన్న ఆందోళన కలుగుతోంది. సిక్కులకు సార్వభౌమాధికార దేశం కావాలన్న ఖలిస్తానీ జెండాను భుజానికెత్తుకున్న యువనేత అమృత్‌పాల్ ముఠా బలప్రదర్శన చేసి,అమృత్‌సర్‌లో పోలీస్‌స్టేషన్‌పై ఫిబ్రవరి 23న దాడి చేసి నెలవుతున్నా, నిన్నటి దాకా కళ్ళు తెరవని 'ఆప్' సర్కార్ వైఫల్యం వెక్కిరిస్తోంది.

గాలివార్తలు సుడిగాలిలా వైరల్ అవుతున్న వేళ శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇంటర్నెట్ సేవల్ని మంగళవారం మధ్యాహ్నం దాకా పాలకులు నిలిపివేయాల్సి వచ్చిందంటే పరిస్థితిని ఊహించుకోవచ్చు. రూపం మార్చుకున్న సరికొత్త ఖలిస్తాన్ 2.0 విజృంభిస్తోందా? 1980–90ల్లోలా పంజాబ్ మళ్ళీ అగ్నిగుండం కానుందా? హత్యానేరం, పోలీసులపై దాడి సహా కనీసం 7 క్రిమినల్ నేరారోపణలున్న అమృత్‌పాల్ ఇప్పుడు పంజాబ్‌లో మళ్ళీ పుంజుకుంటున్న వేర్పాటువాదానికి కేంద్రబిందువయ్యాడు. మాదక ద్రవ్యాల అలవాటును మాన్పించడానికి పనిచేసే డీ-ఎడిక్షన్ కేంద్రాలనూ, అలాగే ఓ గురుద్వారానూ అమృత్‌పాల్ తన అడ్డాగా చేసుకున్నాడట. ఆ స్థావరాల్లో కత్తులు, తుపాకీలు, తూటాలు... పోగేసి, ఆత్మాహుతి దాడులకు యువతరాన్ని సిద్ధం చేస్తున్నాడని గూఢచారి వర్గాల సమాచారం. ఆయుధాలు – బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు దొరకడం, సాయుధ పోరాటం ఇష్టం లేదంటూనే 'ఆనంద్‌పూర్ ఖల్సా ఫోర్స్' (ఏకెఎఫ్) పేరును ప్రాచుర్యంలో పెట్టడం లాంటి అమృత్‌పాల్ సమాచారంతో భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి.

బంధువుల సాయంతో 20 ఏళ్ళ వయసులో దుబాయ్ వెళ్ళి, భారీ వాహనాల డ్రైవర్‌గా పని చేసి, నిరుడు భారత్‌కు తిరిగొచ్చిన ఓ యువకుడు అనూహ్యంగా ఈ స్థాయికి చేరడం చిత్రమే. నిన్నటి దాకా ఆధునిక వేషభాషల్లో ఉన్న 30 ఏళ్ళ అమృత్‌పాల్ ఇవాళ సాంప్రదాయిక సిక్కు వస్త్రధారణలో, చేతిలో కృపాణంతో, ఖలిస్తానీ ఉద్యమానికి వేగుచుక్క కావడం సహజ పరిణామం అనుకోలేం. ఈ ఖలిస్తాన్ అనుకూల ఉద్యమం వెనుక పాకిస్తానీ గూఢచారి సంస్థ ఐఎస్ఐ ప్రమేయం ఉందన్న అనుమానం బలపడుతున్నది అందుకే. అతనికి నిధులెక్కడివన్నదీ ఆరా తీయాల్సిందే! ఇక, పలాయితుడిపై జాతీయ భద్రతా చట్టం విధిస్తారన్న వార్త పరిస్థితి తీవ్రతకు ఉదాహరణ.

1980లు, 90లలో అకాలీలు తీవ్రవాద ఆరోపణలతో అరెస్టయిన తమ అనుయాయుల విడుదల కోసం వీధికెక్కినట్టే, ఈ 2023లో అమృత్‌పాల్, ఆయన తోటి ఖలిస్తానీ మద్దతుదారులు తమ సహచరుడి విడుదల కోసం గత నెలలో వీధికెక్కారు. ఏడేళ్ళ వయసు నుంచే సాంప్రదాయిక సిక్కు ధార్మిక శిక్షణ పొందిన ఒకప్పటి ఖలిస్తానీ నేత జర్నైల్ సింగ్ భింద్రన్‌వాలేకు భిన్నంగా, అలాంటి శిక్షణేమీ లేకుండా ఉన్నట్టుండి అలాగే వేషం కట్టి, మాట్లాడుతున్నాడు అమృత్‌పాల్. స్వీయ ప్రచారం మాటెలా ఉన్నా అతనిని 'భింద్రన్‌వాలే 2.0' అనలేం. సాయుధ అంగరక్షకుల నడుమ ఊరూరా తిరుగుతూ, రెచ్చగొడుతున్నాడు. 1984లో అమృత్‌సర్ స్వర్ణాలయంలో ఆపరేషన్ బ్లూస్టార్‌లో భింద్రన్‌వాలేను హతమార్చిన తర్వాత నాటి ప్రధాని ఇందిర, పంజాబ్ సీఎం బియాంత్ సింగ్‌లకు పట్టిన గతి నేటి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, పంజాబ్ సీఎం మాన్‌లకు పడుతుందని తొడకొడుతున్నాడు. మానిన పాత గాయాల్ని మళ్ళీ కెలుకుతున్నాడు.

భారత్ పట్ల ఖలిస్తానీల విద్వేషం బ్రిటన్, ఆస్ట్రేలియా సహా వివిధ దేశాల్లో ఉన్నట్టుండి వెల్లువెత్తడం మరింత ఆందోళనకరం. బరి తెగించిన ఖలిస్తానీ దుండగులు లండన్ తదితర ప్రాంతాల్లో భారత రాయబార కార్యాలయాలపై దాడి చేయడం, జాతీయ జెండాను తొలగించడం దుస్సహం. రాయబార కార్యాలయానికి కాపుండాల్సిన ఆయా దేశాల ఉదాసీన వైఖరీ ముమ్మాటికీ తప్పే. అసలు మన బంగారం మంచిదైతేగా! పంజాబ్ సంపన్న రాష్ట్రమే కానీ, గత పదిహేనేళ్ళలో తీవ్రనిరుద్యోగంతో యువత తప్పుదోవ పడుతోంది. రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 2020 – 21లో పంజాబీ సోదరులు పోరాటం సాగిస్తున్నప్పుడు దాన్ని సుదీర్ఘంగా సాగదీసిన కేంద్ర ప్రభుత్వ ఉదాసీనత సైతం అసంతృప్తి ప్రబలడానికి ఓ కారణం. హిందూ రాష్ట్రమనే భావనను పైకి తెస్తున్న పిడి వాదులూ, పరోక్షంగా ఖలిస్తానీల సిక్కురాజ్య వాదనకు ప్రేరేపకులే!

నిరుద్యోగ యువత అసంతృప్తి, రైతుల ఆగ్రహం, 'ఉడ్తా పంజాబ్'గా మారిన రాష్ట్రంలో ఇట్టే దొరుకుతున్న మాదక ద్రవ్యాలు, పాక్ సరిహద్దుల నుంచి ఆయుధ ప్రవాహం, పాలకుల నిస్తేజం... అన్నీ కలసిన పంచకూట కషాయమే – పంజాబ్‌లో ప్రబలుతున్న దేశవ్యతిరేక కార్యకలాపాలు. జనబాహుళ్య అసంతృప్తిని తెలివిగా వాడుకుంటూ తన పునాదిని విస్తరించుకుంటున్న అమృత్‌పాల్‌కు పాక్ అండతో సాగుతున్న విదేశీ ఖలిస్తానీ మద్దతుదారులు తోడవడం అగ్నికి ఆజ్యమే. తనను తాను అతిగా ఊహించుకుంటున్న ఈ వేర్పాటువాదిని ఆదిలోనే అడ్డుకోవాలి. మొగ్గలోనే తుంచకపోతే విభజనవాదం బ్రహ్మరాక్షసిగా మారి మింగేస్తుంది. కదం తొక్కాల్సిన పాలకులు కాలహరణం చేస్తే పంజాబ్‌లో మళ్ళీ పాత చీకటి రోజులు ముందుకొస్తాయి. పారా హుషార్!

ప్రజాస్వామ్యం పతనం కాకుండా...



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

భారతదేశంలో ప్రజాస్వామ్య విలువలు దారుణంగా పతనమయ్యాయని స్వీడన్ యూనివర్సిటీ అనుబంధ సంస్థ 'వి-డెమ్' వెల్లడించింది. పాత్రికేయుల మీద వేధింపుల సంఖ్య పెరిగిందని కూడా నమోదు చేసింది. పారిశుద్ధ్య కార్మికులకు సరైన రక్షణ కవచాలు లేక వారు ప్రాణాలు విడుస్తున్న ఉదాహరణలను చూస్తూనే వున్నాం. విష వాయు మాళిగల్లోకి వారిని 'తోసి' ప్రాణాలు తీసే పరిస్థితి ప్రపంచంలో ఎక్కడా చూడం. ఇలాంటి పరిస్థితుల్లో పండుగలు, పబ్బాలు కూడా పేద వర్గాల జీవితాల్లో నామమాత్రం అయిపోయాయి. ఇన్ని సమస్యలు దేశంలో ఉండగా, పాలక వ్యవస్థను ప్రజావసరాలు తీర్చడానికి వినియోగించేందుకు నడుం బిగించడం మానేసి న్యాయ వ్యవస్థను తటస్థం చేసేందుకు పాలక పక్షం యత్నిస్తోంది.

"2014 తర్వాత భారతదేశంలో ప్రజాస్వామ్య విలువలు దారుణంగా పతనమైనాయి. ఈ పతన దశ 1975 నాటి ఎమర్జెన్సీ కాలం పరిస్థితుల స్థాయికి 2022లో చేరుకుంది. 2014–2022 మధ్య కాలంలో ఇండియాలో ప్రజాస్వామ్య విలువల పతనం గ్రీస్, బ్రెజిల్, పోలెండ్, ఫిలిప్పీన్స్‌లలో పతన దశకు సమాన స్థాయిలో నమోదయింది."

– అమలులో ఉన్న వివిధ రకాల ప్రజాస్వామ్యాల గురించి గోథెన్‌బర్గ్ నగరంలోని స్వీడన్ యూనివర్సిటీ అనుబంధ సంస్థ 'వెరైటీస్ ఆఫ్ డెమోక్రసీ' (క్లుప్తంగా వి-డెమ్) పరిశోధనలో ఈ సత్యాలు వెల్లడయ్యాయి. 'హిందూ' పత్రిక 'డేటా పాయింట్' విశ్లేషకుడు విఘ్నేశ్ రాధాకృష్ణన్ ఈ వివరాలను పొందుపరిచారు. (20 మార్చ్ 2023)

ఈ వెల్లడి ఇలా ఉన్న సమయంలోనే బీజేపీ ప్రభుత్వ న్యాయశాఖా మంత్రి కిరణ్ రిజిజు ఒక ప్రకటన చేస్తూ (19 మార్చ్ 2023)– భారతదేశంలో కొందరు రిటైర్డ్ (విశ్రాంత) న్యాయమూర్తులు భారత వ్యతిరేక ముఠాతో చేతులు కలిపి పనిచేస్తున్నారనీ, వీరు భారత న్యాయ వ్యవస్థ ప్రతిపక్ష పార్టీ పాత్ర వహించాలని చూస్తున్నారనీ ఆరోపించారు. ఇది చెల్లుబాటు కాదని కూడా అన్నారు. 'ఇది మంత్రి బెదిరింపు' అని కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేశ్ ఖండించారు!

అట్టే చూస్తుంటే ఈ పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణల తంతు ఎలా ఉందంటే, 'అభిరుచి భేదాల' గురించి రష్యన్ మహాకవి మయకోవస్కీ చెప్పిన వ్యంగ్య రచన గుర్తుకొస్తోంది: వెనకటికొక –

"గుర్రం ఒంటి వైపు చూపు సారించి అరిచింది,
ఛీ! ఇది సంకర జాతికి చెందిన గుర్రం' అని.
ఒంటె (తాను మాత్రం తక్కువ తిన్నానా అనుకుని)
అన్నది కదా
'నువ్వు గుర్రానివి కావు
చిన్న సైజు ఒంటెవి
అంతే అనుకో' అని! కానీ
అసలు సంగతి
ఆ దేవునికే తెలుసు!
విశాల నక్షత్ర వీధుల్లో
ఆ విశ్వ ప్రభువుకి, ఈ
రెండూ రెండు విభిన్న జాతులకి
చెందిన మృగాలని తెలుసు"!

భారత లౌకిక రాజ్యాంగం గుర్తించి రూపొందించిన వాక్, సభా స్వాతంత్ర్యం లాంటి ప్రాథమిక హక్కులను నర్మగర్భంగా అణచివేసే పద్ధతుల్ని ఏ పాలకులు అనుసరిస్తున్నా, కనీస ప్రజాస్వామ్య విలువల్ని రకరకాల 'మిష' చాటు చేసుకుని గౌరవించని దశలోనే ఇలా 'అభిరుచిలో భేదాలు' బాహాటంగా చోటు చేసుకుంటాయని మరచిపోరాదు! అంతేగాదు, 2014–2022 మధ్య కాలంలో దేశంలో పెక్కుమంది పాత్రికేయుల మీద వేధింపుల సంఖ్య కూడా పెరిగిందని 'వి-డెమ్' సంస్థ నమోదు చేసింది. పశువులకు మేత లేక తిండి కరవుతో చస్తున్నా, 'మతం' పేరిట ముస్లిం యువకుల్నీ, వారి కుటుంబాలనూ వేధిస్తున్న ఘటనలకు అసాధారణ చొరవ చూపారు ఉత్తర ప్రదేశ్ పాలకులు. 'గోరక్షణ' పేరిట పలుచోట్ల జరిగిన దారుణమైన దాడులు సామాజిక అశాంతికి దారి తీశాయి. ఇలాంటి ఎన్నో ఘటనలను 'హిందూ' పత్రిక అనుబంధ విశిష్ట పక్ష పత్రిక 'ఫ్రంట్‌లైన్' (మార్చి 10, 2023) నమోదు చేసింది.

ఇదిలా ఉండగా– చివరికి పారిశుద్ధ్య కార్మికులకు సరైన రక్షణ కవచాలు లేక అనేక సీవేజ్ గుంటల్లో ప్రాణాలు విడుస్తున్న ఉదాహరణలను పేర్కొంటూ సుప్రీంకోర్టు చలించిపోయింది. దుర్గంధపూరిత విష వాయువుల మధ్య చనిపోతున్న పారిశుద్ధ్య కార్మికుల పరిస్థితులను ప్రస్తావించి, ఇలా 'విష వాయు మాళిగ (గ్యాస్ ఛాంబర్స్)ల్లోకి తోసి ప్రాణాలు తీసే పరిస్థితి ప్రపంచంలో ఎక్కడా చూడ బోమని' (2019లో) వ్యాఖ్యానించింది! పారిశుద్ధ్య కార్మికుల ఉద్యమ నాయకుడు బెజవాడ విల్సన్ దేశంలో వీరి పరిస్థితి ఎందుకు మెరుగవటం లేదో కారణాలు వివరంగా పేర్కొన్నారు: "కుల వ్యవస్థ దేశంలో బలంగా ఉన్నందున, ఈ కార్మికుల ఆరోగ్య పరిస్థితుల్ని పట్టించుకోవడం లేదు. పాలకులు రాజ్యాంగ విధుల్ని పాటించడం మానేశారు. దేశంలో ప్రతి మూడవ రోజున ఒక పారిశుద్ధ్య కార్మికుడు చనిపోతున్నాడు. అయినా వారి రక్షణ గురించిన పల్లెత్తు హామీ లేదు.' (ఫ్రంట్‌లైన్, 10 మార్చ్ 2023)

రెండో మాట



ఇలాంటి పరిస్థితుల్లో చివరికి పండుగలు, పబ్బాలు కూడా పేద వర్గాల జీవితాల్లో నామ మాత్రం అయిపోయాయి. దేవులపల్లి కృష్ణశాస్త్రి ఇలాంటి దీన పరిస్థితుల్ని తలచుకున్నప్పుడల్లా 'మాకు గాదులు లేవు, ఉగాదులు లేవ'ని పలుమార్లు ఎత్తిపొడుస్తూ వచ్చాడు. చివరికి 'ఎంత పెద్ద పండుగ' వచ్చినా పేదసాదలు యథాలాపంగా జరుపుకోవడమేగానీ, వారి బతుకుల్లో నిజమైన వెలుగులు చూడలేక పోతున్నాం! అందుకే శ్రీశ్రీ కూడా 'పండుగెవరికి? పబ్బమెవరికి?' అన్న పాటలో సమాధానాలు లేని ప్రశ్నల వర్షం కురిపించాల్సి వచ్చింది:

"పెద్ద పండుగ, పెద్ద పండుగ, పేరు దండగ!
పండుగెవరికి, పబ్బమెవరికి?
తిండి లేక, దిక్కు లేక
దేవులాడే దీన జనులకు
పండుగెక్కడ! పబ్బమెక్కడ?
ఎండు డొక్కల పుండు రెక్కల
బండ బతుకుల బానిసీంద్రకు
పండుగేమిటి? పబ్బమేమిటి?
ఉండటానికి గూడు లేకా
ఎండవానల దేబిరించే
హీన జనులకు పేద నరులకు
పండుగొకటా? పబ్బమొకటా?"

ఇన్ని ఈతిబాధలు పేద వర్గాలను నిత్యం వెంటాడుతుండగా– పాలక వ్యవస్థను ప్రజావసరాలు తీర్చడానికి వినియోగించేందుకు నడుం బిగించడం మానేసి న్యాయ వ్యవస్థను తటస్థం చేసేందుకు పాలక పక్షం యత్నిస్తోంది. అఖిల పక్ష– పాలక వర్గ, ప్రతిపక్ష, న్యాయ వ్యవస్థ ప్రతినిధులతో సమాన స్థాయిలో ఏర్పడే క్రియాశీల సంస్థ ఉంటేనే వివక్షకు తావుండదని న్యాయ వ్యవస్థ భావించింది. ఇది ఆచరణలోకి వస్తే పాలక వర్గ ఏకపక్ష నిర్ణయాలూ, ఆటలూ సాగవు. అలాంటి పరిణామానికి ప్రస్తుత క్రియాశీల అత్యున్నత ధర్మాసనం సానుకూలం. కేంద్రం ప్రతికూలం. ఈ వైరుధ్యం, రాజ్యాంగం ఉభయ శాఖలకు నిర్దేశించిన పరిధుల్ని గౌరవించి వ్యవహరించినంత కాలం తలెత్తదు. ఇప్పుడా పరిధిని పాలకులు అతిక్రమించడానికి ఘడియలు లెక్కపెడుతూ కూర్చున్నందుననే ప్రజలకు సమస్యలు ఎదురవుతున్నాయి! ప్రస్తుత పాలకవర్గానికి అసలు భయమంతా – 2024 జనరల్ ఎన్నికల వరకే గాక ఆ తరువాత కూడా ప్రస్తుత క్రియాశీల ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ మరికొంత కాలం పదవిలో ఉండబోవడమే! ప్రస్తుతం కిరణ్ రిజిజు మనోవేదనంతా సుప్రీం చుట్టూనే తిరుగుతోంది!

abkprasad2006@yahoo.co.in

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎందుకు వద్దంటారు?



ప్రపంచ నంబర్‌వన్ టెన్నిస్ క్రీడాకారుడు నోవాక్ జొకోవిచ్ కోవిడ్ టీకా వేసుకోని కారణంగా మయామి ఓపెన్‌లో పాల్గొనలేకపోతున్నాడని వార్త. ప్రపంచంలో అత్యంత ఆరోగ్యంగా ఉన్న ఆటగాడు వీళ్లకు ఆరోగ్య ప్రమాదంగా మారుతాడని కాబోలు పాల్గొననివ్వడం లేదు. ఇదీ ఇప్పటి సైన్సు!

– ఎలీ డేవిడ్, పరిశోధకుడు

ఏమీ జరగదు



భారత గణతంత్ర దినోత్సవాన జాతీయ పతాకాన్ని అగౌరవ పరిచినప్పుడు మీరు ఏమీచేయలేదు. అలాంటప్పుడు ఇప్పుడు తదుపరి ఏం జరుగుతుందని మీరు అంచనా వేస్తున్నారు? (లండన్‌లోని భారత రాయబార కార్యాలయంలో ఖలిస్తానీ వేర్పాటువాదుల వల్ల జాతీయ పతాకానికి జరిగిన అవమానం నేపథ్యంలో.)

– అభినవ్ అగర్వాల్, రచయిత

పెద్ద కుట్ర



దేవాలయాలు, దౌత్య కార్యాలయాల మీద ఖలిస్తానీయుల అన్ని దాడులు వెనుకా ఉన్నది ఒకటే ఎజెండా – ఏదో రకంగా భారత్‌లో ప్రతిస్పందనను రెచ్చగొట్టాలి; ఆ స్పందనను బాధిత కార్డుగా వాడుకోవాలి. ఇది సరిగ్గా ఖలిస్తాన్, 'ఫైరస్ పంజాబ్ దె'లకు అక్రమ తండ్రి అయిన ఐఎస్ఐ(పాకిస్తాన్ గూఢచర్య సంస్థ) ప్లేబుక్ ప్రకారం సాగుతోంది.

– గౌరవ్ ఆర్యా, ఆర్మీ మేజర్ (రిటైర్డ్)

అతి స్పందన



పంజాబ్‌లో కొంతమంది జర్నలిస్టుల ట్విట్టర్ అకౌంట్లను నిలిపివేశారు. ఏమీలేని చోట ఏదో అతిగా జరుగుతున్నదని చూపించే ప్రయత్నం మొదలైపోయింది.

– హర్తోష్ సింగ్ బాల్, సంపాదకుడు

మేలుకుంటేనే మేలు



ఇది భారత ఎన్నికల తర్వాత అంతం కాదు. వాటి కోసమే మొదలు కాలేదు. ఇది దీర్ఘకాలంగా భారత దేశాన్ని అస్తవ్యస్తం చేయడం కోసం ఒక 'ప్లేబుక్' ప్రకారం సాగుతోంది. ముందే మేల్కొంటే మేలు జరుగుతుంది. (ఖలిస్తానీ ఉద్యమాన్ని దృష్టిలో పెట్టుకొని.)

– సారా ఎల్. గేట్స్, పరిశోధక విద్యార్థి

నిత్య వసంతాన్ని

నేను కవిని
కల్పన, వర్ణన నా నైజం.

గడవని చీకటి రాత్రుల్లో
కన్నీరు సంద్రమై పొంగుతోంటే
మదిలోతుల భావాలకు
శిల్ప రమణీయత నద్ది,
వర్ణశోభిత అక్షర ప్రతిమనై
ఒదిగిపోతాను.

ఒత్తిడికి గురైన వేళ
రాలిన ఆత్మవిశ్వాస శిశిరాన్ని
కిసలయాక్షరాలతో
వసంతంగా మారుస్తాను.

విశ్వాంతరాళాలలోని
అణువణువు స్పందనల గాథను
ఆర్ద్రంగా స్పృశించి,
అద్భుత అక్షరమాలికగా కూర్చుతాను.

అణగారిన చరితల బతుకు సీమను
అనునిత్యం సృజియిస్తూ,
చేతనా ఉషస్సులు పూయిస్తూ,
తిరుగుబాటు గొంతుకల్లో
విప్లవశంఖం పూరించే కంఠాన్నౌతాను.

కోయిలకు ఏడాదికి
ఒక్క వసంతం మాత్రమే...
కానీ, నేను మాత్రం
కాలచక్రపు కదలికలకు
స్పందిస్తూ, ప్రతిస్పందిస్తూ
భూత భవిష్యత్ వర్తమానాలలో
పరిభ్రమిస్తూ,
కవితాలాపన చేస్తూనే ఉంటాను.
కవిత్వమంటే నాకు చాలా ఇష్టం
నేను కవిని!

– వేమూరి శ్రీనివాస్ । 99121 28967
(నేడు ప్రపంచ కవితా దినోత్సవం)

పరీక్షల రద్దు వద్దు! ప్రత్యామ్నాయం ఉంది!

అభిప్రాయం



వంశీకృష్ణ జోషి

గత శుక్రవారం టీఎస్‌పీఎస్సీ... పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో గ్రూప్-1, ఏఈఈ, డీఏఓ పరీక్షలు రద్దుచేస్తూ నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని ప్రభుత్వ సంస్థలు నిర్వహించే పరీక్షల ప్రశ్నా పత్రాలు లీక్ అవ్వడం, పరీక్షలు రద్దు చేయడం పరిపాటి అయింది. వివిధ తరగతులు చదివే విద్యార్థుల కోసం నిర్వహించే పరీక్షలకూ, ఉద్యోగార్థుల కోసం నిర్వహించే పోటీ పరీక్షలకూ తేడా ఉంది. ప్రభుత్వాలు మాత్రం అన్ని పరీక్షలకూ ఒకే విధానం పాటిస్తున్నాయి. పరీక్షల(రాసేవారూ, నిర్వహించేవారు)తో ఎటువంటి సంబంధం లేని వారికి ప్రభుత్వం పరీక్షలను రద్దు చేయడం సబబుగా తోచినప్పటికీ.. విజ్ఞతతో ఆలోచించినప్పుడు అతి క్రూరమైన చర్య ఇది.

ఒక జాబ్ క్యాలెండర్ అంటూ లేకపోవడం, సంవత్సరాల కొద్దీ పరీక్షల నిర్వహణ, ప్రతి ఉదారవాద గ్రూపు ఒత్తిడులకు తలొగ్గి దరఖాస్తు మొదలుకుని నిర్వహణ దాకా తేదీల పొడిగింపులు, వాయిదాలు, తరుచుగా లీకులు జరగడం, పరీక్షలు రద్దు చేయడం; కోర్టు కేసుల స్టేల నుండి తుది తీర్పుల వరకూ నియామక ప్రక్రియ పూర్తి అవ్వడానికి ఏళ్ల సమయం పట్టడం, అప్పటి వరకు అభ్యర్థులు ఇతర ఉద్యోగ అవకాశాలు అందు కోవడమా, లేక కోర్ట్ తీర్పు వచ్చేవరకు పరీక్షలకై ఎదురుచూడమా అని ఆలోచిస్తూ... త్రిశంకు స్వర్గంలో జీవించడం... ఇదీ నిరుద్యోగ పర్వంలో ఉన్నవారి దీన గాథ. జీవితంలో అతి ముఖ్యమైన 20–35 ఏళ్ల మధ్య ఉన్న 5 నుంచి 10 సంవత్సరాల విలువైన యౌవన కాలాన్నీ, కెరీర్‌నూ, ఉత్పాదకతా సామర్థ్యాన్నీ ప్రభుత్వ యంత్రాంగాల తీరుతో లక్షలాదిమంది యువత నాశనం చేసుకుంటున్నారు.

పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో పరీక్షలో పాస్ కాలేకపోయిన అభ్యర్థి ఊహాజనిత నష్టం కన్నా... అప్పటికే పాస్ అయిన అభ్యర్థికి జరిగే నిజమైన నష్టం గురించి ఎవ్వరూ మాట్లాడటం లేదు. ఇంతటి అన్యాయాన్ని నిలదీయాల్సిన ప్రతిపక్షాలు భావ దారిద్ర్యంతో పరీక్షల రద్దు కోరుతున్నాయి.

'వంద మంది అపరాధులు తప్పించుకున్నా పర్వాలేదు కానీ ఒక్క నిరపరాధికీ అన్యాయం జరగవద్దు' అనేది మన న్యాయ వ్యవస్థ ముఖ్య భావన. మోసపూరితంగా పరీక్ష రాసి ఉత్తీర్ణులు అయిన కొద్ది మందిని శిక్షించడం కోసం నిజాయితీగా పరీక్షలు రాసిన వాడి హక్కులు, అవకాశాలు కాలరాయడం ఎంతవరకు న్యాయం? నిజానికి లక్షల మంది రాసే పరీక్షలకు లీకేజీల వల్ల లబ్ధి పొందే వారు చాలా పరిమితంగా ఉంటారు. నిజాయితీగా రాసి విజేతలుగా నిలిచిన నిరుద్యోగులకు నోటికాడి అన్నం లాక్కోవడం క్షంతవ్యం కాని నేరం. సహజ న్యాయానికి విరుద్ధం.

ఇప్పుడు జరిగిన సంఘటనలో రేణుక అనే ఆవిడ ఇద్దరికి పేపర్ అమ్మితేనే ఇంత రచ్చ జరిగింది. నిజంగా విస్తృత స్థాయిలో లీకేజీ జరిగితే నేటి సోషల్ మీడియా కాలంలో ఎప్పుడో వైరల్ అయ్యేది. ఏదైనా పేపర్ లీకైనప్పుడు అసలు పేపర్ ఎంతవరకు లీక్ అయ్యింది? పరీక్షార్థులలో ఎంత శాతం మందికి పరీక్షకు ముందే ప్రశ్నాపత్రం తెలుసు? అందులో ఎంత మంది ఉత్తీర్ణులయ్యారు?



అన్న కనీస విచారణ లేకుండా మన వ్యవస్థలు తమ తప్పులు కప్పిపుచ్చుకోవడానికి ఇంగితం లేకుండా చేసే మొదటి పని పరీక్షలు రద్దు చేయడం.

టీఎస్‌పీఎస్సీ లీకేజీ వ్యవహారంలో హ్యాక్ అన్న పదం ఉపయోగించి సమస్యను తప్పుదారి పట్టిస్తున్నారు. ఒక మామూలు ఫోన్‌లో ఫోన్ తెరవడానికి ఫింగర్ సెన్సార్, వ్యక్తిగత ఫైల్‌కు ప్రత్యేక లాక్‌లు, పాస్‌వర్డ్‌లు అందరూ పెట్టుకుంటున్న ఈ కాలంలో... రాష్ట్ర స్థాయి పరీక్షలు నిర్వహిస్తున్న ఒక ప్రొఫెషనల్ సంస్థ ప్రశ్న పత్రాన్ని ఎంత కట్టుదిట్టంగా భద్రపరచాలి!?

పత్రికల్లో వచ్చిన సమాచారం ప్రకారం కస్టోడియన్ ఛాంబర్‌లో ఇతరులకు ప్రవేశం లేకుండా ప్రవేశ ద్వారం దగ్గర డిజిటల్ అథెంటికేషన్ వ్యవస్థ లేదు. కంప్యూటర్ లాగిన్‌కు కనీసం ఫింగర్ ప్రింట్ అథెంటికేషన్ అయినా అనుసంధానించబడలేదు. సర్వర్ కంప్యూటర్‌లో ప్రశ్నాపత్రాల ఫోల్డర్‌కు ప్రత్యేక పాస్ వర్డ్ లాక్ ఉండి ఉంటే వాళ్లు ప్రశ్నాపత్రాలు తస్కరించినప్పటికీ ఫైల్ ఓపెన్ అయ్యే అవకాశం లేదు. అసలు ఏదైనా కాన్ఫిడెన్షియల్ ఫైల్ కీ ఎన్‌స్క్రిప్షన్ రూపంలో భద్రపరిచి దాని ఎన్‌స్క్రిప్షన్ కీని ముఖ్యమైన అధికారి వద్ద అంటే టీఎస్‌పీఎస్సీ చైర్మన్ స్థాయి అధికారి వద్ద మాత్రమే ఉంచుతారు. ఒకవేళ వాళ్ళు పాస్‌వర్డ్ హ్యాక్ చేసినప్పటికీ సమాచారం ఎన్‌క్రిప్షన్ రూపంలో... అంటే క్రోడీకరించబడిన భాషలో ఉండటం వల్ల దానిని వారు చదవలేరు. ఈ పని టీఎస్‌పీఎస్సీ చేయలేదు. అలాగే ఏదైనా కాన్ఫిడెన్షియల్ సిస్టమ్‌లో పెన్ డ్రైవ్ లేదా సీడీ డ్రైవ్ లాంటి అవుట్ పుట్, ఇన్‌పుట్ డివైస్ డ్రైవర్స్ డిసేబుల్ చేసి ఉంచడం కనీస భద్రతా విధి. చిత్తుకాగితాలతో సహా ధ్వంసం చేయడానికి పేపర్ ట్రాషెర్ పయోగించాలి. కానీ ఇక్కడ ఉపయోగించలేదు. ఇటువంటి ఎన్నో తప్పులు చేసిన టీఎస్‌పీఎస్సీ... ఒక ముఖ్యమైన పరీక్షా పేపర్ భద్రతను గాలికొదిలేసి అదేదో సైబర్ నేరగాళ్లు సిస్టం సెక్యూరిటీ ఫైర్‌వాల్‌ను బ్రేక్ చేసి హ్యాకింగ్ చేసినట్టు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నది.

లీకేజీ జరిగేది అతి స్వల్ప మొత్తంలో కాబట్టి అందులో లీకేజీ వల్ల కటాఫ్ స్కోర్ పెరిగి నష్టపోయిన పై కేటగిరీకి చెందిన విద్యార్థుల సంఖ్య... మొత్తం మీద చూస్తే చాలా చాలా స్వల్పంగా ఉంటుంది. ఇందులో సంఖ్యతో సంబంధం లేకుండా ఒక్కడున్నా న్యాయం చేయవలసిందే. వాస్తవానికి నిజా యితీగా రాసి ఉత్తీర్ణులైన వారి సంఖ్య లీకేజీ వల్ల లబ్ధి పొందిన వారికంటే చాలా రెట్లు ఎక్కువగా ఉంటుంది. ఇంతకు ముందు చెప్పి నట్టుగా సంఖ్యతో సంబంధం లేకుండా కనీసం ఒక్కడు నిజాయితీగా రాసి క్వాలిఫై అయినవాడు ఉన్నా ఆ అభ్యర్థికీ న్యాయం చేయవలసిందే. కాబట్టి టీఎస్‌పీఎస్సీ కానీ, ఇతర సంస్థలు కానీ పేపర్ లీకేజీ ఆరోపణలు వచ్చినప్పుడు క్వాలిఫై కానివాళ్ల కోసం ప్రత్యేకంగా ఇంకొకసారి ప్రిలిమ్స్ రాసే అవకాశం ఇవ్వాలి. అందులో క్వాలిఫై అయినవారికీ, అంతకు ముందు క్వాలిఫై అయిన వారికీ కలిపి మెయిన్ పరీక్షలు నిర్వహించాలి. మెయిన్ పరీక్ష పటిష్టంగా నిర్వహిస్తే... ఎటూ లీకేజీ వల్ల ప్రిలిమ్స్ పాసైనవారు మెయిన్స్‌లో పాస్‌కాలేరు కాబట్టి... ఈ విధానం వల్ల అందరికీ న్యాయం చేకూరినట్లవుతుంది. కాబట్టి ప్రభుత్వం ఈ సంగతి గట్టిగా ఆలోచించి ఎవరూ నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాలి.

వ్యాసకర్త పోటీ పరీక్షలు రాసే ఓ ఉద్యోగార్థి

ప్రియ భాషణం

సమయానికి తగుమాటలాడి ఆపదల నుండి గట్టెక్కే ప్రియ భాషణం జీవితంలో ఎంతో అవసరం. భారతంలో 'దానధర్మాలు చేయడం, ప్రియంగా మాట్లాడడంలో ఏది గొప్పదని' ధర్మరాజు ప్రశ్నించగా భీష్ముడు చెప్పిన కథ ఇందుకు మంచి ఉదాహరణ.

ఒక బ్రాహ్మణుడు అడవి మార్గంలో వెళుతుండగా భయంకరమైన రాక్షసుడు అతడిని చంపి తినాలనే ఉద్దేశంతో పట్టుకున్నాడు. కానీ బ్రాహ్మణుడు అధైర్య పడలేదు. అతడి ధైర్యానికి ఆశ్చర్యపోయిన రాక్షసుడు 'నా ప్రశ్నలకు జవాబు చెబితే నిన్ను వదిలేస్తా, లేదంటే తినేస్తా' అన్నాడు. బ్రాహ్మణుడు సరేనన్నాడు.

'నా శరీరము డస్సిపోయింది. బాగా అలసిపోయింది. కారణమేమిటి' అని అడిగాడు రాక్షసుడు. అందుకు బ్రాహ్మణుడు 'మహాత్మా! అందుకు ఎన్నో కారణాలు ఉంటాయి. చెడ్డవాడివని తెలిసి బంధువులంతా వదిలి వెళ్ళడం, దరిద్రంతో బాధపడుతూ లభించని ధనము గురించి చింతించడం, మొహమాటానికి పోయి ఇతరుల చేతిలో ఓడిపోగా ప్రత్యర్థులు దాన్ని తమ ప్రతాపమని పొంగిపోవడం చూసి ఓర్వలేక పోవడం, దుర్మార్గులు నిన్ను పొగడుతుంటే పండితులు కూడ పొగడలేదని మనసులో బాధపడడం, నీవు చేసిన పాడుపనులకు భార్య బాధపడుతుంటే ఆమెను అనునయించలేని దుఃస్థితిలో ఉండడం, సొమ్మును ఇతరులు ఎత్తుకు పోతున్నారని తెలిసీ రక్షించుకోలేకపోవడం, చాటు మాటుగా నీ గురించి చెప్పే మాటలను బంధువులు నిజమని నమ్మడం వలన కలిగే దుఃఖాన్ని మనసులో దాచుకోలేక, బయటకు చెప్పలేక కుమిలిపోవడం... ఇవన్నీ క్షీణతకు కారణాలు కావచ్చు. ఇంకా భార్యాబిడ్డల దుష్ప్రవర్తనతో ఇబ్బంది కలగడం, తల్లితండ్రులు, సోదరులు రోగములతో బాధపడడం, దేవుడి సొమ్మును అపహరించడం, బంధువులు చనిపోవడం వంటివీ కుంగి కృశించడానికి కారణమవుతాయ'ని చెప్పాడు.



ఆ మాటలతో ఊరట పొందిన ఆనందంలో బ్రాహ్మణుడిని వదిలిపెట్టాడు రాక్షసుడు.

– అమ్మాజీ ఉమామహేశ్వర్

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: అమావాస్య రా.11.38 వరకు, తదుపరి శోభకృత్ నామ చైత్ర శు.పాడ్యమి, నక్షత్రం:పూర్వాభాద్ర సా.6.04 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: రా.3.14 నుండి 4.46 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.32 నుండి 9.20 వరకు, తదుపరి రా.10.56 నుండి 11.44 వరకు, అమృతఘడియలు: లేవు; రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు, యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం: 6.08, సూర్యాస్తమయం: 6.07.

క్లుప్తంగా...

నేడు తిరుమలలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం


ఆలయం వెలుపల భక్తుల రద్దీ

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 22న ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. సాధారణంగా సంవత్సరంలో నాలుగు సార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 81,700 మంది స్వామివారిని దర్శించుకున్నారు. రూ. 4.20 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మహాదుర్గగా శ్రీశైల భ్రమరాంబ దర్శనం



శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాల్లో రెండో రోజు సోమవారం శ్రీభ్రమరాంబదేవి మహాదుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయ దేవాలయాల ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో కైలాస వాహనాన్ని అధిష్టించిన స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మహాదుర్గగా అలంకృతులైన భ్రమరాంబదేవిని, కైలాస వాహనాధీశులైన స్వామి అమ్మవార్లను రాజగోపురం గుండా క్షేత్ర ప్రధాన వీధుల్లోకి తోడ్కొనివచ్చి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఉగాది మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం సాయంత్రం ప్రభోత్సవం, స్వామి అమ్మవార్లకు నందివాహన సేవ, శ్రీభ్రమరాంబదేవికి మహాసరస్వతి అలంకార సేవ నిర్వహిస్తారు. రాత్రి 10 గంటలకు వీరశైవుల వీరాచార విన్యాసాలు, అగ్నిగుండ ప్రవేశం జరుగనుంది.

పంచ గ్రామాల సమస్య పరిష్కారానికి చర్యలు

- రెండు రోజుల్లో కమిటీ నిర్ణయం
- డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ వెల్లడి

సాక్షి, అమరావతి: విశాఖపట్నంలో 22 సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న పంచ గ్రామాల సమస్యను పరిష్కరించేందుకు త్వరలో తగిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం (దేవదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. పంచ గ్రామాల సమస్యపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ సభ్యులు సోమవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమై చర్చించారు. అనంతరం డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడుతూ.. సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి భూములను పరిరక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటూనే పంచ గ్రామాల సమస్య పరిష్కారానికి సంబంధించి దేవస్థానం భూమికి, అక్కడ చాలాకాలంగా నివాసం ఉంటున్న ప్రజలకు ఇబ్బంది కలగని రీతిలో సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఆ జిల్లా మంత్రులు, ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయకల్లం, సీసీఎల్‌ఏ, జిల్లా కలెక్టర్ తదితర సభ్యులతో కమిటీ ఏర్పాటైందని వివరించారు. ఈ కమిటీ రెండు రోజుల్లో సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకునే విధంగా నిర్ణయాన్ని వెలువరించనుందని చెప్పారు.అంతకు ముందు జరిగిన సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయకల్లం, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు అదీప్ రాజు, సీసీఎల్‌ఏ జి.సాయిప్రసాద్, విశాఖ కలెక్టర్ మల్లికార్జున పాల్గొన్నారు.

ఏపీ లాసెట్ కన్వీనర్‌గా ఆచార్య సత్యనారాయణ

ఏఎన్‌యూ: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లా కళాశాలల్లో బీఎల్, ఎల్‌ఎల్‌బీ కోర్సుల్లో ప్రవేశం కోసం ఏపీ లాసెట్–2023 నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఈ ఏడాది ఆచార్య నాగార్జున యూనివర్సిటీ(ఏఎన్‌యూ)కి అప్పగించింది. దీంతో ఏపీ లాసెట్–2023 కన్వీనర్‌గా ఏఎన్‌యూ మ్యాథమాటిక్స్ విభాగానికి చెందిన ఆచార్య బీహెచ్ సత్యనారాయణను వీసీ ఆచార్య పి.రాజశేఖర్ నియమించారు. ఈ మేరకు ఆచార్య సత్యనారాయణకు నియామక ఉత్తర్వులను సోమవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ అందజేశారు. వీసీ మాట్లాడుతూ లా సెట్‌ను పగడ్బందీగా నిర్వహించి ఏఎన్‌యూకు, రాష్ట్ర ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. లాసెట్ నిర్వహణకు ఏఎన్‌యూ నుంచి పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీజీ పరీక్షల కో–ఆర్డినేటర్ ఆచార్య ఎల్.ఉదయకుమార్, ఓఎస్‌డీ ఆచార్య కె.సునీత, సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, దూర విద్యాకేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గోరుముద్దలో మరో పౌష్టికాహారం



నేటి నుంచి బడి పిల్లలకు ఉదయం పూట రాగి జావ

- వారానికి 3 రోజులు.. మిగతా మూడు రోజులు ఇప్పటికే చిక్కీ
- నేడు లాంఛనంగా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: జగనన్న గోరుముద్ద ద్వారా బడి పిల్లలకు వారానికి మూడు రోజులు ఉదయం పూట రాగి జావ అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి లాంఛనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 44,392 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 37,63,698 మంది విద్యార్థులకు దీని ద్వారా ప్రయోజనం చేకూరనుంది. ఏటా రూ.86 కోట్ల అదనపు వ్యయంతో రాగి జావ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

బలవర్ధకమైన ఆహారానికి ఏటా రూ.1,910 కోట్లు

మధ్యాహ్న భోజన పథకానికి గత సర్కారు సగటున రూ.450 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా ఇప్పుడు జగనన్న గోరుముద్ద ద్వారా దాదాపు నాలుగు రెట్లు అధికంగా ఏటా రూ.1,824 కోట్లు వ్యయం చేస్తున్నారు. తాజాగా రాగి జావ కోసం ఏటా మరో రూ.86 కోట్లు కలిపి మొత్తం రూ.1,910 కోట్లు వెచ్చిస్తూ పిల్లలకు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం సరఫరా చేస్తోంది. మధ్యాహ్న భోజన పథకంలో ఇప్పటికే సమూల మార్పులు చేపట్టి జగనన్న గోరుముద్ద ద్వారా ప్రతి రోజూ రుచికరమైన మెనూతో బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందచేస్తోంది. ఐరన్, కాల్షియం లాంటి పోషకాలు అందించి విద్యార్థుల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు వారానికి మూడు రోజులు (మంగళ, గురు, శని) బెల్లంతో కూడిన రాగిజావను అందించనున్నారు. ఇక మిగిలిన 3 రోజులు గోరుముద్దలో బలవర్ధకమైన చిక్కీని పిల్లలకు ఇస్తున్నారు. జగనన్న గోరుముద్దలో వారానికి 15 వెరైటీలు ఉండగా ఐదు రోజుల పాటు కోడిగుడ్డు, 3 రోజులు చిక్కీ ఇస్తున్నారు. ఇకపై మూడు రోజులు రాగిజావ కూడా అందనుంది. ఈ ఏడాది అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం కావడం, చిరుధాన్యాలను పండించే రైతులను ప్రోత్సహించే లక్ష్యంతో పథక నిర్వహణలో భాగంగా శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టుతో ఎంవోయూ కుదుర్చుకున్నారు.



నాడు నాసిరకం తిండి..

నాడు నాసిరకం ఆహారం, ఉడికీ ఉడకని అన్నం, రుచిపచీ లేని కూరలతో మధ్యాహ్న భోజన పథకాన్ని టీడీపీ సర్కారు నీరుగార్చింది. పిల్లలకు ఏమాత్రం రుచించని విధంగా ప్రతి రోజూ సాంబారు అన్నంతో కూడిన ఒకే రకమైన మధ్యాహ్న భోజనం సరఫరా చేయడంతో తినలేక అవస్థలు పడ్డారు. ఇక వంట సహాయకులకు గౌరవ భృతి నెలకు కేవలం రూ.1,000 మాత్రమే చెల్లించగా ఆయాల జీతాలు, సరుకుల బిల్లులు సైతం 8–9 నెలలు పెండింగ్‌లోనే ఉన్న దుస్థితి. గత సర్కారు హయాంతో పోలిస్తే ఇప్పుడు మూడు రెట్లు అధికంగా వంట సహాయకులకు నెలకు రూ. 3,000 చొప్పున గౌరవ భృతితోపాటు క్రమం తప్పకుండా గోరుముద్ద బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తోంది.

మిర్చి @ రూ.50,618

- కర్నూలు ఏఎంసీలో రికార్డు స్థాయిలో పలికిన క్వింటా ధర
- మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి



కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మిర్చి ధర బంగారంతో పోటీగా పెరుగుతోంది. ఈ నెల 18న గరిష్టంగా క్వింటా మిర్చి ధర రూ.48,699లు పలకగా, దానిని అధిగమిస్తూ సోమవారం రికార్డు స్థాయిలో రూ.50,618లకు చేరింది. వెల్దుర్తి మండలం గుంటుపల్లి గ్రామానికి చెందిన మోహన్ అనే రైతు క్వింటా మిర్చిని మార్కెట్‌కు తెచ్చారు. మార్కెట్‌లో 309 లాట్‌లు ఉండగా.. మోహన్‌కు చెందిన లాట్‌కు రూ.50,618 ధర లభించింది. మద్దూరుకు చెందిన ప్రవీణ్ అనే రైతు తీసుకొచ్చిన మిర్చి క్వింటా రూ.49,699లు పలికింది. కర్నూలు మార్కెట్ యార్డులో సోమవారం క్వింటాకు కనిష్టంగా రూ.3,519, గరిష్టంగా రూ.50,618, మోడల్ ధర రూ.20,589లు చొప్పున నమోదైంది. రోజురోజుకూ ధర అనూహ్యంగా పెరుగుతుండటంతో గోడౌన్‌లలో నిల్వ చేసిన మిర్చిని రైతులు పెద్దఎత్తున మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. మిర్చి ధరలు 2021–22 నుంచి ఆశాజనకంగా ఉండటంతో 2022–23లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1.28 లక్షల ఎకరాల్లో మిర్చి సాగుచేశారు. బ్యాడిగ రకం మిర్చికి అత్యధిక ధర లభిస్తోంది.


జిల్లాలో పండించిన బ్యాడిగ రకం మిర్చి

వికేంద్రీకరణతోనే నిజమైన అభివృద్ధి

- 904వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: ఎవరెన్ని కుయుక్తులు పన్నినా రాష్ట్రంలో వికేంద్రీకరణ ద్వారానే నిజమైన అభివృద్ధి జరుగుతుందని నమ్మిన జగనన్న ఆ దిశగా అడుగులు వేసి ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తాడనే ఆశాభావాన్ని బహుజన పరిరక్షణ సమితి నాయకులు వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై చంద్రబాబు చేస్తున్న వాదన బోడిగుండుకు మోకాలుకు ముడి పెట్టినట్లు ఉందని అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 904వ రోజుకు చేరుకున్నాయి. పలువురు మాట్లాడుతూ.. సీపీఐ, సీపీఎం మద్దతుతో కులవాదులంతా తెరవెనుక ఏకమై ఎమ్మెల్సీ ఎన్నికల్లో కుయుక్తులతో విజయం సాధించినట్లుందే తప్ప.. అది నిజమైన విజయం కాదన్నారు. రాష్ట్రంలో పేదలకు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యను అందజేస్తున్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కేసులు వేసిన బాబు.. తాను అధికారంలో ఉండగా ప్రభుత్వ పాఠశాలలను మూసివేత దిశగా తీసుకెళ్లి ప్రైవేటు విద్యాసంస్థలను ప్రోత్సహించి పేదలకు చదువును దూరం చేశాడని మండిపడ్డారు. రాజధాని భూముల స్కాములకు సంబంధించి సీబీఐ,ఈడీతో విచారణ జరిపించి బాబు అండ్ కోను అరెస్టు చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఇందుపల్లి సుభాషిణి, పెరికే వరప్రసాద్, పులి దాసు, ఈపూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఏఎస్‌తో ఆక్వా రైతులకు అధిక లాభం

- ఐసీఏఆర్–సీఎంఎఫ్‌ఆర్‌ఐ డైరెక్టర్ గోపాలకృష్ణన్

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): సముద్ర చేపల పెంపకం చేసే రైతులు రీసర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టమ్(ఆర్‌ఏఎస్) ద్వారా అధిక లాభం పొందవచ్చని ఐసీఏఆర్–సీఎంఎఫ్ఆర్ఐ డైరెక్టర్ ఎ.గోపాలకృష్ణన్ చెప్పారు. సోమవారం విశాఖలోని ఐసీఏఆర్–సీఎంఎఫ్‌ఆర్‌ఐ కేంద్రంలో అభివృద్ధి చేసిన ఆర్‌ఏఎస్‌ను ఆయన జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రూడ్ స్టాక్ డెవలప్‌మెంట్, బ్రీడింగ్ కోసం ఈ వ్యవస్థను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. 12 గ్రాముల చేపల సీడ్‌కు ఆర్‌ఏఎస్ ద్వారా రూ.11.20 మాత్రమే ఖర్చవుతుందన్నారు. సముద్ర తీర పరిశోధనలో ఇది కీలక పురోగతి అని తెలిపారు. ఆర్‌ఏఎస్ పద్ధతిపై ఆక్వా రైతులు, విద్యార్థులు, పారిశ్రామికవేత్తలకు విశాఖపట్నంలో శిక్షణ ఇస్తామని చెప్పారు. శిక్షణ కోసం వచ్చే వారి కోసం 'ఇండియన్ పాంపనో' పేరుతో నిర్మించిన శిక్షణ హాస్టల్‌ను కూడా గోపాలకృష్ణన్ సోమవారం ప్రారంభించారు. అలాగే ఎంఎస్‌ఆర్ ఆక్వా ప్రైవేటు లిమిటెడ్, రేవతీ బండారు, మోల్ నాలెడ్జ్ సంస్థలతో ఐసీఏఆర్–సీఎంఎఫ్ఆర్ఐ మూడు ఒప్పందాలు కుదుర్చుకుంది. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ జె.చార్లెస్ జీవా, డాక్టర్ శుభదీప్ ఘోష్ తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ హాస్టల్‌ను ప్రారంభిస్తున్న గోపాలకృష్ణన్

ఏపీలో షూటింగులకు నిర్మాతలు ముందుకు రావాలి

- మా–ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా

తెనాలి: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నిర్మాతలు ఇదే రాష్ట్రంలో సినిమా షూటింగ్‌లకు ముందుకు రావాలని మా–ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా కోరారు. స్థానిక మా–ఏపీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఏపీలోని ఉమ్మడి 13 జిల్లాల్లోని లొకేషన్లలో ఉచితంగా సినిమాల చిత్రీకరణకు ప్రభుత్వం జీవో జారీ చేసిందని గుర్తు చేశారు. సొంత రాష్ట్రంపై గౌరవంతో రాష్ట్రానికి చెందిన నిర్మాతలు, దర్శకులు తాము తీసే సినిమాల్లో కొంతయినా ఏపీలో చిత్రీకరించేలా షెడ్యూలు రూపొందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తెలుగు సినీపరిశ్రమలో 80 శాతంపైగా ఆంధ్ర నిర్మాతలు, దర్శకులున్నారని, ఆంధ్రకు సినీపరిశ్రమ తరలి రావాలంటే వారంతా ముందడుగు వేయాలని అభిప్రాయపడ్డారు. ఏపీలో ఎన్నో అందమైన లొకేషన్లు ఉన్నాయని వివరించారు. ఉత్తమ చిత్రాలకు ప్రభుత్వం సబ్సిడీని ప్రకటించిన నేపథ్యంలో ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నెల్లూరు-మనుబోలు మూడో రైల్వేలైన్ పూర్తి

- విజయవాడ–గూడూరు మూడోలైన్‌లో కీలక పురోగతి

సాక్షి, అమరావతి/రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): విజయవాడ–గూడూరు మూడో రైల్వేలైన్ పనుల్లో దక్షిణ మధ్య రైల్వే కీలక పురోగతి సాధించింది. నెల్లూరు–మనుబోలు సెక్షన్ల మధ్య మూడోలైన్ నిర్వహణలోకి వచ్చింది. 29.30 కిలోమీటర్ల మేర ఈ లైన్‌లో విద్యుదీకరణ, ట్రిప్లింగ్ పనులు పూర్తిచేసింది. దీంతో ఈ మార్గంలో సోమవారం నుంచి రైళ్ల రాకపోకలకు మార్గం సుగమమైంది. ఉత్తర, దక్షిణ భారతాలను కలుపుతూ ప్రయాణికులకు సేవలతో పాటు సరుకు రవాణాలో విజయవాడ–గూడూరు లైన్ కీలకపాత్ర పోషిస్తోంది. అత్యంత రద్దీ అయిన 288 కిలోమీటర్ల విజయవాడ–గూడూరు మూడో రైల్వేలైన్ కోసం దక్షిణ మధ్య రైల్వే రూ.3,246 కోట్లతో ప్రాజెక్టును చేపట్టింది. ఇప్పటివరకు ఉలవపాడు–కావలి మధ్య 29 కిలోమీటర్లు, తలమంచి–బిట్రగుంట–వెంకటేశ్వరపాలెం మధ్య 24.8, వెంకటేశ్వరపాలెం–కావలి మధ్య 12.2, తలమంచి–నెల్లూరు మధ్య 17, కరవది–చినగంజాం మధ్య 23.5 కిలోమీటర్ల మేర మూడోలైన్ పనులు పూర్తిచేశారు. తాజాగా నెల్లూరు–మనుబోలు మధ్య 29.30 కిలోమీటర్ల మేర మూడోలైన్ పూర్తయింది. మిగిలిన సెక్షన్లలో కూడా ఏకకాలంలో పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో విజయవాడ–గూడూరు మధ్య మూడో రైల్వేలైన్ పనులు పూర్తిచేయాలని దక్షిణ మధ్య రైల్వే లక్ష్యంగా పెట్టుకుంది.


మనుబోలు–నెల్లూరు సెక్షన్ మధ్య పూర్తయిన విద్యుదీకరణ, ట్రిప్లింగ్ పనులు

24, 25 తేదీల్లో పాలిటెక్నిక్ విద్యార్థులకు జాబ్ మేళా

- ఒంగోలులోని డీఏ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహణ
- సాంకేతిక విద్యాశాఖ సంచాలకురాలు చదలవాడ నాగరాణి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పాలిటెక్నిక్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల కోసం ఈ నెల 24, 25 తేదీల్లో మరో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. హెచ్‌ఎల్ మండో సంస్థ మానవవనరుల విభాగం డీజీఎం రాజశేఖర్, మేనేజర్ రాగిణిలతో కమిషనర్ చదలవాడ నాగరాణి సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఉద్యోగ మేళా ద్వారా 200 మంది టెక్నీషియన్ అప్రెంటీస్‌లుగా ఉపాధి పొందనున్నారని తెలిపారు. హ్యుందాయ్, జనరల్ మోటార్స్, ఫోర్డ్, వోక్స్‌వ్యాగన్, ఆడి, చేవ్రొలెట్, కియా, సుజుకి తదితర ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీలతో ఈ సంస్థ వ్యాపార భాగస్వామ్యం కలిగి ఉందన్నారు. ఒంగోలులోని డీఏ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తామని చెప్పారు. 2020, 2021, 2022 సంవత్సరాల్లో డిప్లొమా ఉత్తీర్ణులైన విద్యార్థులు రాత పరీక్ష, ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని తెలిపారు. 60 శాతం మార్కులతో మెకానికల్, ఆటోమొబైల్, ఎలక్ట్రికల్ విభాగాలలో ఉత్తీర్ణులైన బాల బాలికలు, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, కంప్యూటర్ విభాగాలలో ఉత్తీర్ణత సాధించిన బాలికలు అర్హులని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు నెలవారీ స్టైఫండ్‌గా రూ.14,050, సబ్సిడీపై ఇతర సౌకర్యాలు అందుతాయన్నారు. సంవత్సరం తర్వాత వారి పనితీరు ఆధారంగా శాశ్వత ప్రాతిపదికన సంస్థ అవకాశం కల్పిస్తుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 88709 85062, 89858 72905 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. డిప్యూటీ డైరెక్టర్ (శిక్షణ, ప్లేస్‌మెంట్) డాక్టర్ ఎం.ఎ.వి.రామకృష్ణ, సాంకేతిక విద్యాశాఖకు చెందిన అధికారుల బృందం జాబ్ మేళా కార్యక్రమాలను సమన్వయం చేస్తారని వివరించారు.

భూమి కబ్జాచేసి చంపేస్తామంటున్నారు

- పరిటాల శ్రీరామ్ నుంచి రక్షణ కల్పించండి
- 'స్పందన'లో ఎస్పీకి ఫిర్యాదు చేసిన ధర్మవరం వాసి

సాక్షి, పుట్టపర్తి: తెలుగుదేశం నాయకుడు పరిటాల శ్రీరామ్ నుంచి తనకు ప్రాణహాని ఉందని శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన చెరుకూరి వెంకటరాముడు సోమవారం ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్‌కు ఫిర్యాదు చేశారు. తన భూమిని కబ్జా చేయడమేగాక దాన్ని రాసి ఇవ్వమంటున్నారని, లేకపోతే చంపేస్తామని ఆయన అనుచరులు బెదిరిస్తున్నారని తెలిపారు. పరిటాల సునీత కబ్జాచేసిన తన భూమిని తనకు ఇప్పించాలని, తనకు రక్షణ కల్పించాలని కోరారు. 'నా ఆస్తిని కబ్జా చేశారు. నన్ను కిడ్నాప్ చేశారు. ఆ ఆస్తి రాసిస్తానని అనడంతో వదిలేశారు. కానీ తర్వాత నేను నా ఆస్తి ఇచ్చేది లేదని స్పష్టం చేయడంతో నన్ను హత్యచేసేందుకు కుట్ర పన్నినట్లు తెలిసింది. టీడీపీ నేత పరిటాల శ్రీరామ్ అండతోనే ఆయన అనుచరులు ఇలా చేస్తున్నారు. వారి నుంచి రక్షణ కల్పించాలి..' అని పేర్కొన్నారు. జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన'లో ఆయన ఎస్పీకి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు.. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి రెవెన్యూ లో 141–2 సర్వే నంబరులో 9.81 ఎకరాల భూమి ఉంది. ఆ భూమి 1930 సంవత్సరం ముందు నుంచి వెంకటరాముడు పూర్వీకుల పేరిట ఉంది. తర్వాత మూడు భాగాలుగా పంచుకున్నారు. అందులో మూడోవంతు.. అంటే 3.27 ఎకరాలు చెరుకూరి వెంకటరాముడుకు దక్కింది. అందులో 1.63 ఎకరాలను ఆయన ఇతరులకు విక్రయించారు. మిగిలిన 1.64 ఎకరాల భూమిని తమకు రాసివ్వాలంటూ పరిటాల సునీత మంత్రిగా ఉన్నప్పటి నుంచి వేధిస్తున్నారు. అంతేకాకుండా మొత్తం 9.81 ఎకరాల భూమి ఇంకా సబ్ డివిజన్లు కాకపోవడంతో మొత్తం భూమిపై పరిటాల కుటుంబం కన్నేసింది.. అని వెంకటరాముడు పేర్కొన్నారు.


స్పందనలో ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్‌కు ఫిర్యాదు చేస్తున్న వెంకటరాముడు

గత నెల 17న కిడ్నాప్

భూమి విషయమై గత నెల 17వ తేదీన ధర్మవరంలో ఉన్న వెంకటరాముడును కిడ్నాప్ చేశారు. పరిటాల అనుచరులు దాదా ఖలందర్, చింతలపల్లి మహేశ్‌నాయుడు, ఎల్.నారాయణచౌదరి, లిక్కర్ సుధాకర్‌నాయుడు ప్రోద్బలంతో కుంటిమద్ది అక్కులప్ప తన గ్యాంగ్‌తో వచ్చి కిడ్నాప్ చేసినట్లు అప్పట్లోనే వెంకటరాముడు అనంతపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తుతెలియని చోటుకు తీసుకెళ్లి తనను తీవ్రంగా కొట్టారని, వారు కోరుకున్నట్లుగా భూమి రాసిస్తానని చెప్పిన తర్వాత అదేరోజు సాయంత్రం ప్రాణాలతో వదిలారని ఆ ఫిర్యాదులో తెలిపారు.

వజ్రాల దొంగ అరెస్ట్

- వైఎస్సార్ జిల్లా ఎస్పీ వివరాలు వెల్లడి


యెల్లో సఫైర్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ అన్బురాజన్

కడప అర్బన్: కడపలో వజ్రాలను దొంగిలించిన గోవాకు చెందిన అంతర్ రాష్ట్ర దొంగ ఇస్మాయిల్ షాహిద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఘటనపై సోమవారం కడపలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో వైఎస్సార్ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వివరాలు వెల్లడించారు. కడప నగరంలోని అల్మాస్‌పేటకు చెందిన ఖాదర్‌బాషా వజ్రాల వ్యాపారి. గోవాకు చెందిన ఇస్మాయిల్ షాహిద్, కర్ణాటకకు చెందిన ఇనాముల్లా, శ్యామ్ శేషబాయ్ వజ్రాలను అమ్మిపెడతామంటూ అతడిని సంప్రదించారు. ఈ నేపథ్యంలో కడపలోని ఓ లాడ్జిలో 2020 జనవరి, 6న వారిని కలిశాడు. అయితే అతడిని లాడ్జిలో బంధించిన పై ముగ్గురు ఒక యెల్లో సఫైర్ వజ్రంతో పాటు 8 చిన్న వజ్రాలను దోచుకుని వెళ్లారు. ఈ క్రమంలో జనవరి 10న ఇనాముల్లా, శ్యామ్ శేషబాయ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు ఐదు వజ్రాలను రికవరీ చేశారు. దర్యాప్తు కొనసాగించిన పోలీసులు తాజాగా ఇస్మాయిల్ షాహిద్‌ను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ. 53 లక్షల విలువైన యెల్లో సఫైర్‌తో పాటు, మరో మూడు చిన్న వజ్రాలను రికవరీ చేశారు.

బీసీ కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తాం

- టీడీపీ నేత నారా లోకేశ్

కదిరి అర్బన్: తాము అధికారంలోకి వస్తే రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ స్థాయిలో బీసీ కమ్యూనిటీ భవనాలను నిర్మిస్తామని టీడీపీ నేత నారా లోకేశ్ చెప్పారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర సోమవారం శ్రీసత్యసాయి జిల్లా మొటుకుపల్లి నుంచి ప్రారంభమైంది. తొలుత ఆర్డీటీ కేంద్రంలో చదువుకుంటున్న దివ్యాంగ విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. అనంతరం కదిరి పట్టణంలో బీసీ వర్గాలతో, ముస్లింలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే బీసీ ఉప కులాలకు సంబంధించి నియోజకవర్గానికి ఒక కమ్యూనిటీ భవనం నిర్మిస్తామని చెప్పారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన పథకాలను తాము అధికారంలోకి వచ్చాక కూడా కొనసాగిం చామన్నారు. కానీ సీఎం జగన్ తమ పథకాలను కొనసాగించడం లేదని లోకేశ్ ఆరోపించారు. అనంతరం ఆయన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. పాదయాత్రలో టీడీపీ నాయకులు పరిటాల శ్రీరామ్, కందికుంట వెంకట ప్రసాద్, అత్తార్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ముస్లిం సమాజం సుభిక్షం

- ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా


సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ పాలనలో ముస్లిం సమాజం సుభిక్షంగా ఉందని, ముస్లింల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా చెప్పారు. విజయవాడలోని షజహూర్ ముసాఫిర్ ఖానాలో రాష్ట్ర ప్రభుత్వ ఖాజీల సమావేశం సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న అంజాద్ బాషా మాట్లాడుతూ మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ముస్లింలకు ఏ సమస్య వచ్చినా తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వం ముస్లింలను పూర్తిగా విస్మరించిందన్నారు. సీఎం వైఎస్ జగన్ మాత్రం ముస్లింలను తన గుండెకు హత్తుకుని పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఖాజీల పదవీకాలాన్ని పదేళ్లకు పెంచుతున్నామని తెలిపారు. కాలానికి అనుగుణంగా ఖాజీలు కూడా మారాల్సి ఉందని, పెళ్లిళ్ల సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇక నుంచి ఖాజీల సంతకంతోనే గ్రామ, వార్డు సచివాలయాల్లో ముస్లింల వివాహ నమోదు ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఖాజీల సంఘం అధ్యక్షుడు హజరత్ షఫీ అహమ్మద్ ఖాదరీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మైనారిటీ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్, ఏపీ వక్ఫ్‌బోర్డ్ ప్రత్యేక అధికారి షెరీన్‌బేగం, వక్ఫ్‌బోర్డ్ సీఈవో అబ్దుల్ ఖాదిర్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి ఏడాది బీడీఎస్ ఫలితాలు విడుదల

లబ్బీపేట(విజయవాడ తూర్పు): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన మొదటి ఏడాది బీడీఎస్ ఫలితాలు సోమవారం విడుదల చేసింది. ఈ ఫలితాలపై రీ టోటలింగ్ కోరే విద్యార్థులు ప్రతి సబ్జెక్ట్‌కు రూ.2 వేలు చెల్లించి ఈ నెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సిటీ పరీక్షల కంట్రోలర్ డాక్టర్ సిహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడవచ్చునని పేర్కొన్నారు.

9మంది ఎర్ర స్మగ్లర్ల అరెస్టు

కుప్పం(చిత్తూరు జిల్లా)/తిరుపతి అలిపిరి: కుప్పం, పోరుమామిళ్ల పరిధిలో జరిగిన దాడుల్లో సూమారు రూ. 50 లక్షల విలువైన ఎర్రచందనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని 9మంది స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. కుప్పం సరిహద్దు నడుమూరు గ్రామం వద్ద ఎర్రచందనం దుంగలను ఒక కారు నుంచి మరో కారులోకి మారుస్తుండగా సమాచారం అందుకున్న పోలీస్ యంత్రాంగం దాడులు నిర్వహించింది. రూ.40 లక్షల విలువ చేసే 400 కేజీల ఎర్రచందనం దుంగలు, నాలుగు కార్లు స్వాధీనం చేసుకుని లక్ష్మణ్, పవన్‌కుమార్, సయ్యాద్ మౌలా, కృష్ణను అరెస్ట్ చేశారు. అలాగే వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్ల అటవీ రేంజ్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు చేసిన దాడుల్లో సుమారు రూ. 10 లక్షల విలువైన 23 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడంతో పాటు, ఐదుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారినుంచి కారు, మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోరుమామిళ్ల అటవీ రేంజ్‌లోని కొమ్మినేని రాస్తా వద్ద కొంతమంది కారులో దుంగలను లోడ్‌చేస్తూ కనిపించారు. పోరుమామిళ్లకు చెందిన పాలగిరి నాగార్జున (32), పెద్దేటి నాగరాజు (35), గుజ్జుల వెంకటేశ్వర్లు (42), చినమల వెంకటయ్య (62), పులివెందులకు చెందిన నీరెడ్డుల ప్రకాష్ (20)లను అరెస్ట్ చేశారు. వారినుంచి 23 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు.


కుప్పం పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగులు, అదుపులో ఉన్న నిందితులు


సరదాగా...

రైల్వేస్టేషన్లో బూతు వీడియో!

పట్నా: అది బిహార్ రాజధాని పట్నా రైల్వే స్టేషన్. పదో నంబర్ ప్లాట్‌ఫాం. ఉదయం 9.30 గంటలు. ప్రయాణికులతో కిటకిటలాడుతున్న వేళ టీవీ సెట్లలో వాణిజ్య ప్రకటనల స్థానంలో ఉన్నట్టుండి మూడు నిమిషాల పాటు బూతు వీడియో ప్రసారమైంది! మార్చి 19న ఈ ఘటన జరిగింది. ప్రయాణికులు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రసారం ఆగలేదు. చివరికి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది కలగజేసుకోవడంతో ప్రకటనల కాంట్రాక్ట్ సంస్థ నాలుక్కరుచుకుని వీడియో క్లిప్ ప్రసారాన్ని ఆపేసింది. సదరు సంస్థ కాంట్రాక్టును రైల్వే శాఖ రద్దు చేసింది. నిషేధిత జాబితాలో చేర్చి కేసులు పెట్టడమే గాక భారీ జరిమానా విధించింది.

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు... 80 మందితో ఆప్ జాబితా

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న 80 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాను ఆమ్ ఆద్మీ పార్టీ సోమవారం విడుదల చేసింది. మేలో జరగనున్న ఎన్నికల్లో మొత్తం 224 స్థానాల్లోనూ పోటీ చేస్తామని ఆప్ రాష్ట్ర చీఫ్ పృథ్వీ రెడ్డి చెప్పారు. మొదటి జాబితాలోని అందరూ ఉన్నత విద్యావంతులే. వీరిలో 13 మంది లాయర్లు, ముగ్గురు డాక్టర్లు, నలుగురు ఐటీ నిపుణులు ఉన్నారు. అభ్యర్థుల్లో సగం కంటే ఎక్కువ మంది 45 ఏళ్లలోపు వారేనని, వీరందరినీ సర్వే ద్వారా ఎంపిక చేసినట్లు పృథ్వీ రెడ్డి వెల్లడించారు. మొదటి జాబితాలో సుప్రీం కోర్టు లాయర్ బ్రిజేశ్ కాలప్ప, బృహత్ బెంగళూరు మహానగర పాలికె(బీబీఎంపీ)మాజీ అధికారి కె.మత్తయి, బీటీ నాగన్న, మోహన్ దాసరి, శంతల దామ్లే, అజయ్ గౌడ తదితరులున్నారని పృథ్వీ రెడ్డి చెప్పారు.



ధనూరాశి నక్షత్ర మండలంలోని దక్షిణ ప్రాంతంలో భాగమైన మెసియర్55 ఇలా ధగధగలాడుతోంది. భూమికి 20వేల కాంతి సంవత్సరాల దూరంలోని ఈ ప్రాంతంలో ఒకేచోట 1,00,000 నక్షత్రాలు పోగుబడ్డాయి. హబుల్ టెలిస్కోప్ తీసిన ఈ ఫొటోను ఇటీవల నాసా విడుదలచేసింది.

వేడి అలలు... జీవజాలానికి ఉరితాళ్లు!



- భూతాపం వల్ల వేడెక్కుతున్న సముద్రాల అడుగు భాగం
- మెరైన్ హీట్‌వేవ్స్‌తో సముద్ర జీవావరణ వ్యవస్థకు ముప్పు
- సముద్రాల ఉష్ణోగ్రత వందేళ్లలో సగటున 1.5 డిగ్రీల పెరుగుదల
- పరిస్థితి ఇలాగే కొనసాగితే పగడపు దీవులన్నీ అంతం

నానాటికీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, భూతాపం (గ్లోబల్ వార్మింగ్) వల్ల భూఉపరితలం క్రమంగా వేడెక్కుతోంది. భూమిపై విలువైన జీవావరణ వ్యవస్థ దెబ్బతింటోంది. పర్యావరణ విధ్వంసం చోటుచేసుకుంటోంది. ఈ పరిణామం కేవలం భూమి ఉపరితలంపైనే కాదు, సముద్రాల అంతర్భాగాల్లోనూ సంభవిస్తున్నట్లు అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో ఉన్న నేషనల్ ఓషియానిక్, అట్మాస్పియరిక్ అడ్మినిస్ట్రేషన్(ఎన్ఓఏఏ) నిర్వహించిన తాజా అధ్యయనంలో వెల్లడయ్యింది. అధిక ఉష్ణోగ్రతల వల్ల సముద్రాల అడుగు భాగం సైతం వేడెక్కుతోందని, అక్కడున్న జీవజాలం ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటోందని తేలింది. ఫలితంగా సముద్ర జీవావరణ వ్యవస్థ తీవ్రంగా ప్రభావితమవుతున్నట్లు పరిశోధకులు చెప్పారు. భూతాపంతో సముద్రాల్లో వేడి అలల తీవ్రత పెరుగుతోంది. ఇవన్నీ ప్రమాద ఘంటికలే'' అని హెచ్చరించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఏమిటీ భూతాపం?

శిలాజ ఇంధనాల వినియోగం, కర్బన ఉద్గారాల వల్ల వాతావరణ మార్పులు, తద్వారా భూ ఉపరితలంపై ఉష్ణోగ్రతలు పెరగడమే భూతాపం. భూగోళంపై జనాభా వేగంగా పెరుగుతుండడంతో అదే స్థాయిలో శిలాజ ఇంధనాల వినియోగం సైతం పెరుగుతోంది. బొగ్గు, చమురు, గ్యాస్ వంటివి మండించడం వల్ల భూమి వేడెక్కుతుంది. దీంతోపాటు అడవుల నరికివేత, పారిశ్రామిక విప్లవం, అగ్నిపర్వతాల పేలుళ్లు, నీరు వేగంగా ఆవిరి కావడం, అడవుల్లో కార్చిచ్చు వంటివి కూడా భూతాపానికి కారణాలే. వాస్తవానికి సూర్య కాంతి వల్ల సంభవించే వేడి వాతావరణంలోకి తిరిగి వెనక్కి వెళ్తుంది. శిలాజ ఇంధనాల వాడకం వల్ల ఉత్పన్నమయ్యే విష వాయువులు వేడి వెనక్కి వెళ్లకుండా అడ్డుకుంటాయి. దీంతో భూమిపై ఉష్ణోగ్రత పెరిగిపోతుంది. ఈ ప్రభావం సముద్రాలపైనా పడుతుంది.

అధ్యయనంలో ఏం తేలిందంటే...

మెరైన్ హీట్‌వేవ్స్‌గా పిలిచే సముద్రాల అంతర్భాగాల్లోని వేడి అలల తీవ్రత, వ్యవధి అధికంగా ఉంది. సముద్రాల లోపలి ఉష్ణోగ్రతలు వేర్వేరు ప్రాంతాల్లో 0.5 డిగ్రీల సెల్సియస్ నుంచి 3 డిగ్రీల సెల్సియస్ దాకా పెరిగాయి.

సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదలకు భూతాపం కారణమని సైంటిస్టులు నిర్ధారించారు.

హీట్‌వేవ్స్ ప్రభావం ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాదు. ప్రపంచవ్యాప్తంగా అన్ని సముద్రాల్లో ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.

సముద్రాల ఉపరితలంలో హీట్‌వేవ్స్‌పై గత పదేళ్లుగా పరిశోధనలు కొనసాగిస్తున్నామని, అంతర్భాగంలోని వేడి అలలు, అక్కడి పరిణామాలు, జీవజాలం ప్రభావితం అవుతున్న తీరు గురించి తెలుసుకోవడం ఇదే మొదటిసారి అని ఎన్ఓఏఏ రీసెర్చ్ సైంటిస్టు దిల్లాన్ అమామా చెప్పారు.



హీట్‌వేవ్స్ వల్ల మరణించిన సముద్ర పక్షులు

సముద్రాల్లో ఉండే ప్లాంక్టన్ అనే సూక్ష్మజీవుల నుంచి భారీ పరిమాణంలోని వేల్స్ దాకా అన్ని రకాల జీవులు హీట్‌వేవ్స్ వల్ల ప్రభావితమవుతున్నాయి.

ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సముద్ర జీవుల వలసలు ఆగిపోతున్నాయి. వాటిలో పునరుత్పాదక శక్తి దెబ్బతింటోంది. వివిధ జీవుల మధ్య అనుసంధానం తెగిపోతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే మొత్తం సముద్ర జీవావరణ వ్యవస్థ ప్రమాదంలో పడుతున్నట్లే లెక్క.

భూతాపం వల్ల నీరు ఇలాగే వేడెక్కడం కొనసాగితే ఈ శతాబ్దం ఆఖరు నాటికి సముద్రాల్లోని పగడపు దీవులన్నీ అంతరించిపోతాయని ఐక్య రాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం వెల్లడించింది.

సముద్రాల ఉష్ణోగ్రత 1.5 డిగ్రీలు పెరిగితే 70–90 శాతం, 2 డిగ్రీలు పెరిగితే పూర్తిగా పగడపు దీవులు మాయమవుతాయని యునెస్కో పేర్కొంది.

సముద్రాలే రక్షణ ఛత్రం

భూతాపం వల్ల ఉత్పన్నమయ్యే ఉష్ణోగ్రతలో 90% మిగులు వేడిని సముద్రాలే శోషించుకుంటాయి. భూమిని చల్లబరుస్తాయి. సముద్రాలే లేకుంటే భూమి అగ్నిగుండం అయ్యేది. సాగరాల ఉష్ణోగ్రత గత శతాబ్ద కాలంలో సగటున 1.5 డిగ్రీల సెల్సియస్ పెరిగింది. మెరైన్ హీట్‌వేవ్స్ గత పదేళ్లలో 50% పెరిగాయి. భూతాపం పెరుగుదలను అడ్డుకోకపోతే సముద్రాలు సలసల కాగిపోవడం ఖాయం. ఫలితంగా భూమి అగ్నిగోళంగా మారుతుంది మానవులతో సహా జీవుల మనుగడ ప్రశ్నార్థకమే అవుతుంది.

నిరుద్యోగులకు రూ.3,000

కర్ణాటకలో రాహుల్‌గాంధీ ఎన్నికల హామీ

బసవకల్యాణ: కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే డిగ్రీ చదివిన వారికి నెలకు రూ.3,000, డిప్లొమా చేసిన వారికి రూ.1,500 నిరుద్యోగ భృతి ఇస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారు. ''యువతకు ఐదేళ్లలో 10 లక్షల ఉద్యోగాలిస్తాం. 2.5 లక్షల ప్రభుత్వోద్యోగాల ఖాళీలను భర్తీచేస్తాం' అని హామీ ఇచ్చారు. సోమవారం బెళగావిలో 'యువక్రాంతి' బహిరంగ సభ ఆయన ప్రసంగించారు. కర్ణాటకలో పాలక బీజేపీని కాంగ్రెస్ నేతలు ఐక్యమత్యంతో కలిసి ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. ''బసవరాజ్ బొమ్మై ప్రభుత్వం 40 శాతం కమిషన్లు మరిగింది. దేశంలో అత్యంత అవినీతిమయ సర్కార్'' అని ఆరోపించారు. ''దేశం ఒకరిద్దరి సొత్తు కాదు. అదానీలది అస్సలు కాదు. కానీ బీజేపీ స్నేహితులైన కొద్దిమందికే సర్వం దక్కుతున్నాయి. ఇది అవినీతికి దారితీస్తుంది'' అని రాహుల్ ఆరోపించారు. గృహాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళ ఇంటిపెద్దగా ఉన్న కుటుంబానికి నెలకు రూ.2,000 ఆర్థికసాయం, దారిద్ర్య రేఖ దిగువన ఉన్న కుటుంబాల్లో ప్రతీ సభ్యుడికి నెలకు 10 కేజీల ఉచిత బియ్యం ఇస్తామని ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ ఇప్పటికే మూడు హామీలు ప్రకటించింది. సోమవారం నాలుగో హామీ ఇచ్చింది.



సోమవారం ఢిల్లీలోని బుద్ధజయంతి పార్కులో పానీపూరీని ఆస్వాదిస్తున్న మోదీ, కిషిదా

జపాన్‌తో బంధం బలోపేతం

కిషిదా, మోదీ చర్చలు

న్యూఢిల్లీ: భారత–జపాన్ అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తృతం చేసేందుకు ఇరు దేశాల ప్రధానులు ప్రతినబూనారు. ఈ మేరకు రెండు దేశాల అగ్రనేతలు ప్రధాని మోదీ, జపాన్ ప్రధాని ఫ్యుమియో కిషిదాలు సోమవారం ఢిల్లీలో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. 27 గంటల భారత పర్యటనలో భాగంగా కిషిదా ఢిల్లీకొచ్చిన విషయం తెల్సిందే. రెండు దేశాల ఉమ్మడి ప్రయోజనాలతోపాటు ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, సుస్థిర, స్వేచ్ఛాయుత వాతావరణం పరిఢవిల్లేలా చూసేందుకే ద్వైపాక్షిక చర్చలు సాగించినట్లు ఇరు దేశాధినేతలు ప్రకటించారు. ఇండో–పసిఫిక్ ప్రాంతాన్ని తన ఆధిపత్య నీడలోకి తెచ్చేందుకు సాహసిస్తున్న చైనాకు చెక్ పెట్టేందుకు, ఉక్రెయిన్ యుద్ధంతో ఉద్రిక్తతలు నెలకొన్న అంతర్జాతీయ సమాజంలో శాంతి స్థాపనకు తమ వంతు కృషిచేసేందుకు జపాన్, భారత్‌లు ముందుకొచ్చినట్లు నేతలు తెలిపారు. ' జీ20 సదస్సుకు భారత్, జీ7 కూటమికి జపాన్ అధ్యక్షత వహిస్తున్న ఈ తరుణం ప్రపంచ శ్రేయస్సు కోసం చేసే కృషికి చక్కని అవకాశం. జీ20 అధ్యక్షతన భారత ప్రాధాన్యాలను కిషిదాకు వివరించా. భారత్–జపాన్ ప్రత్యేక వ్యూహాత్మక, అంతర్జాతీయ భాగస్వామ్యం అనేది ప్రజాస్వామ్య సూత్రాలు, ప్రపంచ చట్టాలను గౌరవిస్తూ ఏర్పడిందే. ఇండో–పసిఫిక్ ప్రాంతానికి ఇదెంతో ముఖ్యం. రక్షణ, డిజిటల్ సాంకేతికత, వాణిజ్యం, పెట్టుబడులు, ఆరోగ్యం, సెమీ కండక్టర్ల సరఫరా గొలుసు, సంక్లిష్ట సాంకేతికత తదితర రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాల బలపేతంపై మేం సమీక్ష చేశాం' అని తర్వాత పత్రికా ప్రకటనలో ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ' భారత్‌తో ఆర్థిక తోడ్పాటు గణనీయంగా పెరుగుతోంది. ఇది భవిష్యత్ వృద్ధికేకాదు జపాన్ ఆర్థిక అవకాశాలకు ఎంతగానో ఊతమిస్తుంది. స్వేచ్ఛాయుత ఇండో –పసిఫిక్ విధానాన్ని నేడు భారత గడ్డపై మోదీ సమక్షంలో ఆవిష్కరించా. మేలో జరిగే జీ7 సదస్సుకు మోదీని సాదరంగా ఆహ్వానించా' అని ఫ్యుమియో కిషిదా చెప్పారు.

పలు ఒప్పందాలపై సంతకాలు


ఇరు దేశాలపై ఉక్రెయిన్ యుద్ధ విపరిణామాల ప్రభావం, ఇండో–పసిఫిక్ పరిస్థితి, సైనిక హార్డ్‌వేర్‌ను ఉమ్మడి అభివృద్ధి చేయడం వంటి కీలకాంశాలూ చర్చకొచ్చాయి. ముంబై–అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కోసం జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ నుంచి నాలుగో విడత 300 బిలియన్ యెన్‌ల(రూ.18,800 కోట్ల) రుణానికి సంబంధించిన ఒప్పందంపై ఇరుదేశాలు సంతకాలు చేశాయి.

మోదీ, కిషిదా వన విహారం చేశారు. రాష్ట్రపతి భవన్ వెనక ఉన్న సెంట్రల్ రిడ్జ్ రిజర్వ్‌ఫారెస్ట్ పరిధిలోని బుద్ధ జయంతి పార్క్‌లో ఇరు నేతలు కొద్దిసేపు కలియతిరిగారు. గౌతమ బుద్ధుని 2,500వ జయంతిని పురస్కరించుకుని దాన్నాళ్ల క్రితం ఈ పార్క్‌ను అభివృద్ధిచేశారు. పార్క్‌లోని బుద్ధుని ప్రతిమకు నేతలు నివాళులర్పించారు. బోధి వృక్షం మొక్కను కిషిదాకు మోదీ బహూకరించారు. పార్క్‌లో ప్రత్యేకంగా

పానీపూరీ ఆస్వాదిస్తూ.. బెంచ్‌పై కబుర్లు చెప్పకుంటూ..

ఏర్పాటుచేసిన స్టాల్‌లో భారతీయ చిరుతిండిని కిషిదా రుచిచూశారు. నేతలిద్దరూ పానీపూరీ (గోల్‌గప్పా), ఫ్రైడ్ ఇడ్లీ ఆరగించారు. వేయించిన మామిడికాయల గుజ్జు రసాన్ని తాగారు. తర్వాత బెంచ్‌పై కబుర్లు చెప్పుకుంటూ చాయ్ తాగారు. ఈ పార్క్‌ను 1964 అక్టోబర్‌లో నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ప్రారంభించారు.

ఏమిటీ సీల్డ్‌కవర్ సంస్కృతి?



కేంద్రం తీరుపై సుప్రీం అసహనం

- సీల్డ్ కవర్ నోట్ తిరస్కరణ
- ఓఆర్‌ఓపీ బకాయిలు ఫిబ్రవరిలోగా పూర్తిగా చెల్లించాలని ఆదేశం

న్యూఢిల్లీ: మాజీ సైనికోద్యోగుల వన్ ర్యాంక్, వన్ పెన్షన్ (ఓఆర్‌ఓపీ) తాలూకు రూ.28,000 కోట్ల బకాయిలను వచ్చే ఫిబ్రవరికల్లా చెల్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ విషయమై గతేడాది తామిచ్చిన ఉత్తర్వులకు కట్టుబడి ఉండాల్సిందేనని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు పి.ఎస్.నరసింహ, జె.బి.పార్డీవాలా ధర్మాసనం స్పష్టం చేసింది. ఓఆర్‌ఓపీ బకాయిలపై భారీ మాజీ సైనికోద్యోగుల ఉద్యమం (ఐఈఎస్ఎం) పిటిషన్‌పై సోమవారం ధర్మాసనం విచారణ జరిపింది. బకాయిల చెల్లింపునకు కాలావధిని ఖరారు చేసింది. దీనిపై కేంద్రం సీల్డ్ కవర్లో సమర్పించిన నోట్‌ను స్వీకరించేందుకు నిరాకరించింది. ఈ సంస్కృతి సముచిత న్యాయ ప్రక్రియకు విరుద్ధమని సీజేఐ అభిప్రాయపడ్డారు. దానికి తెర పడాలన్నారు. ''వ్యక్తిగతంగా కూడా సీల్డ్ కవర్లకు నేను వ్యతిరేకిని. కోర్టులో పారదర్శకత చాలా ముఖ్యం. అంతిమంగా ఉత్తర్వులను అమలు చేయాల్సిందే. అందులో రహస్యమేముంటుంది?'' అని ప్రశ్నించారు.

'సహజీవనం' పిల్ కొట్టివేత

సహజీవన బంధాన్ని 'గుర్తించి' కేంద్రం తగు మార్గదర్శకాలను రూపొందించాలంటూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ''ఇదో తెలివితక్కువ వ్యాజ్యం. వాటిని రిజిస్టర్ చేసి కేంద్రం మాత్రం ఏం చేస్తుంది?'' అంటూ పిటిషనర్‌కు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తలంటారు. బాల్య వివాహాల చట్టం, రజస్వల అయిన బాలికకు పెళ్లిని అనుమతిస్తున్న ముస్లిం చట్టాల మధ్య ఘర్షణ తలెత్తితే ఏం చేయాలన్న అంశాన్ని విచారణకు స్వీకరిస్తున్నట్టు సుప్రీంకోర్టు పేర్కొంది.

రష్యాలో జిన్‌పింగ్

మూడు రోజుల అధికారిక పర్యటన • పుతిన్‌తో చర్చలు



మాస్కో: చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు రష్యాలో ఘనస్వాగతం లభించింది. మూడు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం ఆయన సోమవారం రష్యా రాజధాని మాస్కోకు చేరుకున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆయనకు సాదర స్వాగతం పలికారు. అవధులు లేని తమ స్నేహాన్ని మరింత పెంపొందించుకోవడానికి ఇదొక గొప్ప అవకాశంగా భావిస్తున్నట్లు ఇరువురు నేతలు ప్రకటించారు. రష్యాపై దండయాత్రకు దిగిన రష్యాను ఒంటరిని చేసేందుకు పశ్చిమ దేశాలు తీవ్రంగా ప్రయత్నిస్తుండడం, యుద్ధ నేరాల ఆరోపణల కింద పుతిన్‌కు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు అరెస్ట్ వారెంటు జారీ చేసిన చేసిన నేపథ్యంలో జిన్‌పింగ్ రష్యా పర్యటన ప్రారంభించడం విశేష ప్రాధాన్యం సంతరించుకుంది.

శాంతి చర్చల కోసం పుతిన్‌పై ఒత్తిడి!

ప్రపంచంలో రెండు బలమైన దేశాల అధినేతలు జిన్‌పింగ్, పుతిన్ సోమవారం చర్చలు ప్రారంభించారు. ప్రధానంగా ఉక్రెయిన్–రష్యా యుద్ధం, అంతర్జాతీయ పరిణామాలపై చర్చించుకున్నట్లు తెలుస్తోంది. జిన్‌పింగ్, పుతిన్ మధ్య ముఖాముఖి చర్చల తర్వాత ఇరుదేశాల నడుమ ప్రతినిధుల స్థాయి చర్చలు ప్రారంభమవుతాయని రష్యా ప్రభుత్వ అధికారి యురీ ఉషాకోవ్ చెప్పారు. ఇద్దరు నాయకుల చర్చలు మంగళవారం కూడా కొనసాగుతాయని రష్యా మీడియా వెల్లడించింది. జిన్‌పింగ్ చైనా అధ్యక్షుడిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత రష్యాలో పర్యటిస్తుండడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. వరుసగా మూడోసారి చైనా అధ్యక్షుడిగా, సైనికాధిపతిగా ఎన్నికైన తర్వాత జిన్‌పింగ్ తొలి విదేశీ పర్యటన కూడా ఇదే. ఉక్రెయిన్–రష్యా మధ్య శాంతి నెలకొనాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు జిన్‌పింగ్ చెప్పారు. ఉక్రెయిన్ సంక్షోభానికి తెరదించడమే లక్ష్యంగా శాంతి చర్చల కోసం పుతిన్‌పై ఆయన ఒత్తిడి తెచ్చే అవకాశం ఉన్నట్లు పరిశీలకులు అంచనా వేస్తున్నారు. బద్ధశత్రువులైన ఇరాన్, సౌదీ అరేబియా ఇటీవలే చేతులు కలిపాయి. దీని వెనుక చైనా దౌత్యం ఉంది. గత పదేళ్లుగా చైనా అధ్యక్షుడిగా పదవిలో కొనసాగుతూ ఇటీవలే మూడోసారి ఎన్నికైన జిన్‌పింగ్ రష్యాతో సన్నిహిత సంబంధాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధం విషయంలో రష్యా వైఖరిని ప్రపంచంలో చాలా దేశాలు తప్పుపట్టినప్పటికీ జిన్‌పింగ్ మాత్రం పరోక్షంగా మద్దతు ప్రకటించారు. అమెరికా వ్యతిరేకతే చైనా, రష్యా దేశాలను ఒక్కటి చేస్తోంది.

శాంతి ప్రణాళికతో వచ్చా: జిన్‌పింగ్

చైనా, రష్యా కలిసికట్టుగా ముందుకెళ్తున్నాయని, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకుంటున్నాయని జిన్‌పింగ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. థర్డ్ పార్టీని తాము లక్ష్యంగా చేసుకోవడం లేదన్నారు. రెండు పెద్ద దేశాల సంబంధాల విషయంలో ఒక కొత్త మోడల్‌ను అభివృద్ధి చేస్తున్నామని ఉద్ఘాటించారు. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన ఇంటర్నేషనల్ సిస్టమ్, ఇంటర్నేషనల్ లా పరిరక్షణ కోసం రష్యాతో కలిసి పని చేస్తూనే ఉంటామని జిన్‌పింగ్ తేల్చిచెప్పారు. ఉక్రెయిన్–రష్యా మధ్య యుద్ధానికి ముగింపు పలికేలా శాంతి ప్రణాళికతో రష్యాకు వచ్చానన్నారు. ఉక్రెయిన్‌లో సంక్షోభాన్ని పరిష్కరించే విషయంలో చైనా చేసిన ప్రతిపాదనలను నిశితంగా పరిశీలిస్తున్నామని పుతిన్ తెలిపారు. దీనిపై జిన్‌పింగ్‌తో చర్చిస్తానని పేర్కొన్నారు. పలు అంతర్జాతీయ వ్యవహారాలు, సంక్షోభాల విషయంలో చైనా నిష్పాక్షిక, సమతూక వైఖరి అవలంబిస్తోందని పుతిన్ ప్రశంసించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో జిన్‌పింగ్ మాట్లాడే అవకాశమున్నట్లు సమాచారం. తన శాంతి ప్రణాళికను జెలెన్‌స్కీతో ఆయన పంచుకోనున్నట్లు తెలుస్తోంది.

అమృత్‌పాల్‌కు ఐఎస్ఐ లింకులు!

కోట్లాదిగా విదేశీ నిధులు

కొనసాగుతున్న వేట • మామ లొంగుబాటు

చండీగఢ్: ఖలిస్తానీ వేర్పాటువాది, 'వారిస్ పంజాబ్ దే' సంస్థ చీఫ్ అమృత్‌పాల్‌సింగ్ గురించి విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రైవేట్ సైన్యాన్ని తయారు చేసుకునేందుకు అతడు విదేశాల నుంచి భారీగా నిధులు సేకరించినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఇటీవల అరెస్టైన అతని ప్రధాన అనుచరుడు దల్జీత్ సింగ్ బ్యాంకు ఖాతాలకు గత రెండేళ్లలో విదేశాల నుంచి రూ.35 కోట్లు జమ అయినట్టు తేలింది. పలు మోసపూరిత ఆర్థిక వ్యవహారాల్లోనూ అతను కీలకంగా వ్యవహరించాడు. అంతేగాక వారిస్ దే సంస్థకు అనుబంధంగా ఆనంద్‌పూర్ ఖల్సా ఫోర్స్ (ఏకేఎఫ్) ఏర్పాటుకు దల్జీత్ ప్రయత్నిస్తున్నట్లు తేలింది. మరోవైపు అమృత్‌పాల్ దుబాయ్‌లో ట్రక్ డ్రైవర్‌గా ఉండగా అతనికి ఐఎస్ఐ శిక్షణ ఇచ్చిందని పోలీసులంటున్నారు. ''భారత్‌లో విద్రోహ కార్యకలాపాలు చేపట్టేలా బ్రెయిన్ వాష్ చేసింది. అతనికి పలువురు డ్రగ్స్ పెడ్లర్ల మద్దతుంది. అమృత్‌పాల్ వాడే మెర్సిడెజ్ కారు రావెల్ సింగ్ అనే డ్రగ్ పెడ్లర్‌దే. రాష్ట్రవ్యాప్తంగా డీ అడిక్షన్ సెంటర్లు పెట్టి, అక్కడికొచ్చే వారిని తన దారిలోకి తెచ్చుకుంటున్నాడు. ఆ సెంటర్లలో ఆయుధాలు నిల్వ చేస్తున్నాడు. ఐఎస్ఐ సాయంతో మతం ముసుగులో పంజాబ్‌ను ప్రత్యేక దేశం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు'' అని చెబుతున్నారు. ఈ కోణాల్లో దర్యాప్తు సాగుతోంది. అమృత్‌పాల్ కోసం వేట కొనసాగుతోంది. అతడు కెనడాకు పారిపోయే అవకాశాలున్నట్టు భావిస్తున్నారు. అతని మామ హర్జిత్ సింగ్ సహా ఐదుగురు ఆదివారం అర్ధరాత్రి లొంగిపోయారు. వారిపై కఠినమైన జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద కేసులు పెట్టారు.

భారత కాన్సులేట్‌పై దాడి

వాషింగ్టన్/న్యూఢిల్లీ: అమెరికాలో శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ కార్యాలయంపై ఖలిస్తానీ అనుకూలవాదులు ఆదివారం దాడికి తెగబడ్డారు. ఆవరణలో ఖలిస్తానీ జెండాలు ఏర్పాటు చేశారు. మరోవైపు బ్రిటన్‌లో లండన్‌లోని భారత హైకమిషన్ కార్యాలయంపై త్రివర్ణ పతాకాన్ని ఖలిస్తానీవాదులు తొలగించిన ఘటనపై కేంద్రం తీవ్ర నిరసన తెలిపింది.

నడ్డా రిమోట్ ఎక్కడుంది: ఖర్గే

బెల్గావీ (కర్నాటక): ప్రధాని నరేంద్ర మోదీ తనపై చేసిన రిమోట్ కంట్రోల్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోమవారం మండిపడ్డారు. ''నా రిమోట్ వేరెవరి దగ్గరో ఉందని మోదీ అంటున్నారు. సరే, ఒప్పుకుంటా. అయితే బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా రిమోట్ కంట్రోల్ ఎవరి దగ్గరుందో కూడా ఆయనే చెబితే బాగుంటుంది'' అంటూ ఎద్దేవా చేశారు. ''బీజేపీ దమ్మూ ధైర్యం లేని పార్టీ. మీ లోపాల గురించి మాట్లాడాలంటే చాలా ఉన్నాయి. మాపైకి దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పితే బెదురుతామనుకుంటే అది మీ భ్రమ'' అన్నారు.

పార్లమెంటులో అదే సీను

దిగిరాని అధికార, విపక్షాలు • రాహుల్, అదానీలపై చర్చకు పట్టు • ఉభయ సభలు మళ్లీ వాయిదా



న్యూఢిల్లీ: అదే గందరగోళం. అవే సీన్లు. అటు అధికార పక్షం, ఇటు విపక్షాలు ఎవరి పట్టు మీద వారు బెట్టుగా నిలిచారు. దాంతో పార్లమెంటులో వారం రోజులుగా కన్పిస్తున్న దృశ్యాలే రిపీటయ్యాయి. ఇరు పక్షాల డిమాండ్లు, హోరాహోరీ నినాదాలు, గందరగోళం మధ్య కార్యకలాపాలేవీ జరపకుండానే ఉభయ సభలూ మంగళవారానికి వాయిదా పడ్డాయి. అలా మార్చి 13న మొదలైన మలివిడత బడ్జెట్ సమావేశాల్లో వరుసగా ఆరో రోజూ పూర్తిగా వృథా అయింది. సోమవారం ఉదయం లోక్‌సభ సమావేశం కాగానే భారత ప్రజాస్వామ్యంపై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ బ్రిటన్‌లో చేసిన వ్యాఖ్యలను అధికార బీజేపీ సభ్యులు మరోసారి లేవనెత్తారు. ఆయన క్షమాపణలకు డిమాండ్ చేశారు. ప్రతిగా అదానీ గ్రూప్ అవకతవకల అంశాన్ని కాంగ్రెస్ సహా విపక్ష సభ్యులు తెరపైకి తెచ్చారు. తాము డిమాండ్ చేస్తున్న మేరకు దానిపై సంయుక్త పార్లమెంటరీ సంఘంతో విచారణ జరిపించి తీరాల్సిందేనంటూ కుండబద్దలు కొట్టారు. ఇరు పక్షాలూ పెద్ద పెట్టున నినాదాలు మొదలుపెట్టాయి. ఉభయ పక్షాలూ తన చాంబర్‌కు వస్తే చర్చించుకుని పరిష్కారానికి వద్దామని స్పీకర్ ఓం బిర్లా పదేపదే సూచించినా లాభం లేకపోయింది. దాంతో సభను మధ్యాహ్నం రెండింటి దాకా వాయిదా వేశారు. తిరిగి సమావేశమయ్యాక కొన్ని బిల్లులను ప్రవేశపెట్టగానే ఇరువైపుల నుంచి తిరిగి నినాదాలు, గందరగోళం మొదలయ్యాయి. దాంతో సభను స్పీకర్ మంగళవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలోనూ...

అటు రాజ్యసభలోనూ దాదాపుగా ఇదే దృశ్యాలు కన్పించాయి. సభ ప్రారంభమవుతూనే ఇరు పక్షాలూ నినాదాలకు దిగాయి. వాటి మధ్యే చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ మాట్లాడారు. అదానీ వ్యవహారంపై జేపీసీ వేయడంలో ప్రభుత్వ వైఫల్యంపై చర్చించాలంటూ 267(9) నిబంధన కింద కాంగ్రెస్ సభ్యులు నోటీసు అందజేసినట్టు పేర్కొన్నారు. దాని ప్రకారం ముందుగా నిర్ణయించిన కార్యకలాపాలను పక్కన పెట్టి నోటీసు అంశాన్ని చర్చకు చేపట్టాల్సి ఉంటుంది. అదానీ వ్యవహారంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఉన్నత స్థాయి విచారణకు సీపీఐ, సీపీఎం సభ్యులు డిమాండ్ చేశారు. నినాదాల హోరు, గందరగోళం అంతకంతకూ పెరిగిపోవడంతో సభ మధ్యాహ్నం రెండింటిదాకా, అనంతరమూ అదే పరిస్థితి కొనసాగడంతో మంగళవారానికి వాయిదా పడింది.

కేసులకు బెదరను

వయనాడ్ (కేరళ): పోలీసు కేసులు, రాజకీయ దాడులతో తనను భయపెట్టలేరని రాహుల్‌గాంధీ అన్నారు. ''సత్యంపై నాకు విశ్వాసముంది. ఎప్పుడూ దానికే కట్టుబడి ఉన్నా. నాపై ఎంతగా దాడి చేసినా పట్టించుకోను. దాంతో, నేనెందుకు భయపడటం లేదా అన్నదే వారికిప్పుడు పెద్ద సమస్యగా మారింది'' అని బీజేపీపై చెణుకులు విసిరారు.

నా వ్యాఖ్యలపై లోక్‌సభలో మాట్లాడతా • స్పీకర్‌కు రాహుల్ లేఖ

''భారత ప్రజాస్వామ్యం గురించి బ్రిటన్లో నేను చేసిన వ్యాఖ్యలపై లోక్‌సభలో స్పష్టత ఇస్తా. నేను మాట్లాడేందుకు అనుమతించండి'' అంటూ స్పీకర్ ఓం బిర్లాకు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ లేఖ రాశారు. దీనిపై ఆయన ఇప్పటిదాకా బహిరంగంగా స్పందించలేదు. మంగళవారం మాట్లాడేందుకు రాహుల్‌కు అవకాశమివ్వాలని కోరినట్టు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. ''మేమేం మాట్లాడబోయినా మైకులు కట్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని లండన్‌లో చెప్పినందుకు లేనిపోని ఆరోపణలు గుప్పిస్తున్నారు'' అని మండిపడ్డారు. రాహుల్ నివాసానికి పోలీసులు వెళ్లడాన్ని తప్పుబట్టారు. పార్లమెంట్‌లో తాము లేవనెత్తుతున్న అదానీ, చైనా చొరబాటు వంటి కీలకాంశాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే బీజేపీ ఇలా చేస్తోందన్నారు.

పూలతోటలో పడవ ప్రయాణం



పసుపురంగు రాప్‌సీడ్ పుష్పాలతో కనువిందు చేస్తున్న జైంజా ప్రాంతాన్ని పడవల్లో తిరుగుతూ పరవశించిపోతున్న పర్యాటకులు. చైనాలోని జియాంగ్సు ప్రావిన్స్‌లోని జింగ్‌హువా కియాన్డులో సోమవారం తీసిందీ ఫొటో.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం : 21 : మార్చి : 2023

బుల్లెట్ బండిలో నాగరాజు



శివమొగ్గ: నిలిపి ఉంచిన బైక్‌లో నాగుపాము కనిపించిన ఘటన శివమొగ్గ నగరంలోని జైలు సర్కిల్ వద్ద ఉన్న దుర్గిగుడి రోడ్డులో సోమవారం చోటు చేసుకుంది. హోటల్ ముందు ఓ వ్యక్తి బుల్లెట్ బైక్‌ను నిలిపి ఉంచాడు. ఆ బైక్ పెట్రోల్ హెడ్‌లైట్ సందులో నాగుపాము ఒక్కసారిగా బుసలు కొడుతూ కనిపించడంతో అందరూ భయాందోళన చెందారు. స్నేక్ కిరణ్‌కు తెలపడంతో ఆయన అక్కడికి చేరుకుని పామును జాగ్రత్తగా పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

లొకేషన్ కొట్టు.. డ్రగ్స్ పట్టు

- బెంగళూరులో దందా కొత్తపుంతలు
- మత్తు పదార్థాల రవాణాలో నైజీరియన్ల భాగస్వామ్యం
- ఐటీబీటీ ఉద్యోగులు, కాలేజీ విద్యార్థులే టార్గెట్





బనశంకరి: సిలికాన్ సిటీగా పేరుగాంచిన బెంగళూరు నగరం డ్రగ్స్ హబ్‌గా మారుతోంది. డ్రగ్స్ పెడ్లర్లు ఆధునిక సాంకేతికతను వినియోగించి మత్తు పదార్థాలను అవసరమైన ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఈ దందాలో నైజీరియన్ల పాత్ర ఎక్కువ. పర్యాటకం, ఉద్యోగాలు, బిజినెస్ పేరుతో బెంగళూరుకు చేరుకున్న నైజీరియన్లు డ్రగ్స్ దందాలో భాగస్వాములు అవుతున్నారు. ఐటీబీటీ కంపెనీలు, కాలేజీ విద్యార్థులను టార్గెట్‌గా చేసుకుని డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. మొబైల్‌లో లోకేషన్ పంపిస్తే చాలు మాదకద్రవ్యాలు క్షణాల్లో అందుబాటులోకి వచ్చేలా డ్రగ్స్‌పెడ్లర్లు వ్యవస్థ ఏర్పాటు చేశారు. కాడుగోడి పోలీస్‌స్టేషన్ పరిధిలో వైట్‌ఫీల్డ్‌రోడ్డు ఖాజిసొన్నేనహళ్లి చుట్టుపక్కల ప్రాంతాలు డ్రగ్స్ పెడ్లర్లకు స్థావరాలుగా ఉన్నాయి. వీకెండ్‌లో డ్రగ్స్ బానిసలు ఆయా ప్రాంతాలకు చేరుకొని మత్తులో జోగుతుంటారు.

అగ్గిపెట్టెల వినియోగం

ఖాజిసొన్నేనహళ్లి ప్రాంతంలో కొన్ని ఎంపికచేసిన స్థలాల్లో అగ్గిపెట్టెల్లో డ్రగ్స్ పెట్టి అక్కడ నుంచి వినియోగదారులకు లోకేషన్ షేర్ చేస్తారు. కస్టమర్లు లోకేషన్‌కు వెళ్లి డ్రగ్స్ తీసుకెళ్తారు. రాత్రి సమయాల్లో ఈ ప్రాంతంలో టార్చ్‌లైట్ వెలుగుల్లో సంచారం సాగిస్తుంటారు. కారు, బైకుల్లో వచ్చి డ్రగ్స్ తీసుకొని అక్కడే సేవిస్తున్నట్లు స్థానికులు అంటున్నారు. డ్రగ్స్ దందాకు ఖాజిసొన్నేనహళ్లి హాట్‌స్పాట్ కాగా, వీకెండ్‌లో ఈ చుట్టుపక్కల దాబాలు, మద్యం దుకాణాలు రద్దీగా ఉంటాయి. హొసకోటే, మహదేవపుర శివారు ప్రాంతం కావడం, పోలీసుల రౌండ్స్ అంతగా ఉండటకపోవడంతో డ్రగ్స్ పెడ్లర్లు ఈ ప్రాంతాన్ని షెల్టర్‌గా ఏర్పాటు చేసుకున్నారు.

అపార్టుమెంట్లలో నివాసం

మహదేవపుర, హొసకోటె సరిహద్దులో కొన్ని అపార్టుమెంట్లలో డ్రగ్స్‌పెడ్లర్లు మకాం వేశారు. అధిక అద్దె ఆశతో యజమానులు నైజీరియన్లకు ఫ్లాట్స్ అద్దెకు ఇచ్చారు. వీరి గురించి అపార్టుమెంట్లలో ఉన్న ఇతరులకు ఎలాంటి సమాచారం ఉండదు.

మత్తులో నైజీరియన్ల గొడవ

ఖాజీ సొన్నేనహళ్లి ప్రాంతాల్లో నైజీరియన్లు బీభత్సం సృష్టిస్తున్నారు. దీంతో ఇళ్లలోనుంచి బయటికి రావాలంటే స్థానికులు హడలిపోతున్నారు. డ్రగ్స్ మత్తులో నైజీరియన్లు మారణాయుధాలు చేత పట్టుకుని వీధుల్లో నృత్యం చేయడం, దారిలో వెళ్లేవారిని అడ్డుకోవడం చేస్తున్నారు. ప్రశ్నిస్తే దాడికి దిగుతున్నారు. గత ఆదివారం ఖాజీసొన్నేనహళ్లి వద్ద కొందరు నైజీరియన్లు టార్చ్ పట్టుకుని సంచరిస్తుండగా స్థానికులు ప్రశ్నించారు. కోపోద్రిక్తులైన నైజీరియన్లు దాడికి ప్రయత్నించారు. అంతేగాకుండా ప్రశ్నించిన వారిని వెంటాడారు. ముగ్గురు నైజీరియన్ల బైక్‌పై ఖాజీసొన్నేనహళ్లి వరకు వచ్చి అదుపు తప్పి కిందపడ్డారు. వారిలో ఇద్దరిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

న్యూస్‌రీల్

ఆర్టీసీ కొత్త బ్యాటరీ బస్సులు



బనశంకరి: కేఎస్ఆర్‌టీసీకి ఆధునిక ఎలక్ట్రిక్ ఈవి పవర్ ప్లస్ బస్సులు సమకూరాయి. సోమవారం విధానసౌధ ముందు సీఎం బసవరాజ బొమ్మై 25 బస్సులను ప్రారంభించారు. దశలవారీగా మరో 25 బస్సులను ప్రారంభిస్తామని చెప్పారు. ఈ బస్సులు బెంగళూరు నుంచి–మైసూరు, మడికెరి, విరాజపేటే, దావణగెరె, శివమొగ్గ, చిక్కమగళూరుకు సంచరిస్తాయి. ఒక్కసారి చార్జింగ్‌తో 300 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలవు. పూర్తి చార్జింగ్‌కు 3–4 గంటలు చాలు. ఒక్కో బస్సులో 45 సీట్లు ఉంటాయి. పై నగరాల్లో బస్సుల కోసం చార్జింగ్ సెంటర్లను ప్రారంభిస్తారు.

గుండెపోటుతో ఏఎస్ఐ మృతి

బొమ్మనహళ్లి: గుండెపోటుతో జిగణి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ శ్రీనివాస్ మృతి చెందారు. బెంగళూరు దక్షిణ నియోజకవర్గం పరిధి జిగణి పోలీస్ స్టేషన్‌లో సహాయక ఎస్ఐ శ్రీనివాస్ ఆదివారం రాత్రి విధుల్లో భాగంగా బన్నేరుఘట్ట రోడ్డులో బైక్‌పై వెళ్తుండగా గుండెపోటుతో కింద పడి పోయాడు. వెంటనే సహచరులు సమీపంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మరో రెండు నెలలలో రిటైర్ కావాల్సి ఉంది. ఆయన మరణంతో కుటుంబ సభ్యులు, సన్నిహితులు కన్నీరు మున్నీరయ్యారు.

కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

- హిందూసంఘాల శుద్ధి కార్యక్రమం



శివమొగ్గ: శివమొగ్గ నగరంలో కలెక్టరేట్ ముందు ఇటీవల ముస్లిం యువకులు నిరసన తెలిపి అజాన్ చేసిన స్థలంలో హిందూ సంఘాల కార్యకర్తలు నిరసన తెలిపారు. హిందూజాగరణ వేదిక కార్యకర్తలు గోవు మూత్రం చల్లి శుద్ధి చేసినట్లు ప్రకటించారు. సోమవారం జరిగిన ఈ సంఘటనతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎమ్మెల్యే ఈశ్వరప్ప కించపరిచేలా మాట్లాడారంటూ ఈ నెల 17వ తేదీన ముస్లింలు జిల్లాధికారి కార్యాలయం మెట్ల వద్దకు చేరుకుని అక్కడ ధర్నా చేశారు. అక్కడే అజాన్ కూడా నిర్వహించారు. ఈ నేపథ్యంలో శుద్ధి చేపట్టాలని వందలాది హిందూ సంఘాలవారు గోవుల మూత్రాన్ని సీసాల్లో తీసుకొచ్చి శుభ్రం చేస్తున్న సమయంలో పోలీసులు అడ్డుకున్నారు. ఇరువర్గాలకు వాగ్వాదం మొదలైంది. మరోవైపు మరి కొందరు శుద్ధి పూర్తి చేశారు.

ఆటోడ్రైవర్ల సమ్మె విఫలం

శివాజీనగర: నగరంలో బైక్ ట్యాక్సీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మెజిస్టిక్ రైల్వేస్టేషన్ నుంచి ముఖ్యమంత్రి ఇంటికి వెళ్లేందుకు యత్నించిన ఆటో డ్రైవర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. బైక్ ట్యాక్సీల వల్ల తమకు బాడుగలు దొరకడం లేదని వారు ఆరోపించారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా కార్పొరేట్ కంపెనీలకు మద్దతుగా నిలిచింది. ఆటో డ్రైవర్ల జీవితం కష్టకరంగా మారిందని వాపోయారు. నినాదాలు చేస్తూ వెళ్లబోగా పోలీసులు అడ్డుకున్నారు. కాగా సమ్మెకు ఆటో డ్రైవర్ల నుంచి స్పందన లభించలేదు. కొంతమంది మాత్రమే ఆటోలను నిలిపిసే ఆందోళనలో పాల్గొన్నారు. సమ్మెకు మద్దతు ఇవ్వకుండా నడుపుతున్న ఆటోడ్రైవర్లను నాయండహళ్ళి సిగ్నల్ వద్ద ఇతర డ్రైవర్లు పూలమాల వేసి హేళన చేశారు.

బీదర్‌లో అకాల వర్షాలు



నీట మునిగిన పంట

యశవంతపుర: బీదర్ జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలు రైతులకు కన్నీరు మిగిల్చింది. పెద్దఎత్తున పంటలు నీటమునిగాయి. చేతికందివచ్చిన పంటలు నేలవాలాయి. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. శనివారం రాత్రి కురిసిన వడగళ్ల వానతో తెల్లజొన్న, కూరగాయలతో పాటు ఇతర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మామిడి కాయలు రాలిపోయాయి. గాలివానకు చెట్లు విరిగిపడ్డాయి. ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. బీన్స్, టమాట, పూలతోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బీదర్, భాల్కి, హుమనాబాద్, ఔరాద్, బసవకల్యాణ, హులసూరు, బెటగుప్ప, కమలనగర ప్రాంతాలలో ఒక గంట పాటు కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది.

సేవ ముసుగులో విరాళాలు

- పీఎఫ్ఐపై పోలీసుల చార్జ్‌షీట్

యశవంతపుర: దేశ భద్రతకు విఘాతం కలిగించే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) కార్యకర్తల అరెస్ట్ కేసుల్లో బెంగళూరు కేజీహళ్లి పోలీసులు కోర్టుకు చార్జ్‌షీట్ సమర్పించారు. 2022 సెప్టెంబర్‌లో 19 మందిపై కేసు నమోదు చేసి 15 మందిపై చార్జ్‌షీట్‌ను దాఖలు చేసి కోర్టుకు సమర్పించారు. సేవా కార్యక్రమాల ముసుగులో విరాళాలు వసూలు చేస్తున్నట్లు చార్జ్‌షీట్‌లో పొందుపరిచారు. 9 మందిపై యూఏపీఏ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆరు మందిపై సెక్షన్ 153ఎ ప్రకారం కేసు నమోదు చేసినట్లు వివరించారు. దక్షిణ కన్నడ జిల్లా మిత్తూరు ఫ్రీడం చారిటబుల్ ట్రస్ట్ పేరుతో విదేశాల నుంచి నిధుల సమీకరణ చేసినట్లు కోర్టుకు తెలిపారు.

మైసూరులో రౌడీ ముఠాల ఘర్షణ

- ఒక రౌడీ మృత్యువాత

మైసూరు: పర్యాటక నగరిలో రౌడీల వీధి పోరాటం జరిగింది. రెండు గుంపుల మధ్య జరిగిన గొడవలో ఒక రౌడీషీటర్ హతమైన ఘటన మైసూరు నగరంలోని చామరాజ జోడి రోడ్డులో ఉన్న డాక్టర్. రాజ్‌కుమార్ విగ్రహం వద్ద జరిగింది. కేఆర్ మొహల్లాలోని కాకరవాడి ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ శ్రీగంధ (26) హతుడు. అదే ప్రాంతంలోని రవి తో శ్రీగంధకు గొడవలు ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి 12.15 గంటల సమయంలో ఇరు వర్గాలూ గొడవపడ్డారు. రవి అనుచరులు శ్రీగంధాన్ని కత్తులు కఠార్లతో దాడి చేసి ప్రాణాలు తీశారు. తీవ్రంగా గాయపడిన అతన్ని అనుచరులు ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే చనిపోయాడని వైద్యులు తెలిపారు. ఈ కేసులో రవి తండ్రి రమేష్ తో పాటు శ్రీగంధం అనుచరులు అయిన ముజీల్, హరీష్‌ను కృష్ణరాజ పోలీసులు అరెస్టు చేశారు. రౌడీల ఘర్షణలతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మళ్లీ ఎప్పుడు దాడులు జరుగుతాయోనని గుబులు ఏర్పడింది.

కబేళాలను పూర్తిగా మూసివేయాలి



వధశాలల మూసివేత కోసం తుమకూరులో జరిగిన రైతుల ర్యాలీ, అడ్డుకున్న పోలీసులు

- తుమకూరులో రైతుల భారీ ర్యాలీ, ధర్నా

తుమకూరు: బీజేపీ ప్రభుత్వం గోవధ నిషేధ చట్టాన్ని తీసుకువచ్చినా ప్రయోజనం శూన్యమని, బొమ్మై ప్రభుత్వం పూర్తిగా గోవుల రక్షణకు బదులు కబేళాలను పూర్తిగా మూసివేయాలని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడిహళ్లి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో నగరంలో ధర్నా నిర్వహించారు. అధికారులు గో సంరక్షణ పేరుతో రైతుల వద్ద గోవులను స్వాధీనం చేసుకుని, వాటిని అధిక ధరలకు మళ్లీ కబేళాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. రైతుల వద్ద గోవులను స్వాధీనం చేసుకుని కబేళాలకు తరలిస్తూ రైతులపైనే కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. పోలీసుల ఆగడాలను అడ్డుకోవాలని వేలాది మంది రైతులు సోమవారం నగరంలోని టౌన్‌హాల్ వద్ద నుంచి జిల్లా అధికారి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పోలీసులు పెద్ద ఎత్తున కలెక్టరేట్ చేరుకుని రైతులను నిలువరించారు.



నినాదాలు చేస్తున్న రైతు నేతలు



బెళగావిలో రాహుల్



సోమవారం బెళగావిలో జరిగిన కాంగ్రెస్ యువశక్తి సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ, పాల్గొన్న మహిళలు

25 నుంచి బెంగళూరు హబ్బ

- అలరించే సాంస్కృతిక ప్రదర్శనలు

బనశంకరి: కర్ణాటక పరంపర ను సమస్త కన్నడనాడుకు పరిచయం చేసే ఉద్దేశంతో ఈ నెల 25, 26 తేదీల్లో నమ్మ బెంగళూరు హబ్బను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని రెవెన్యూశాఖామంత్రి ఆర్.అశోక్ తెలిపారు. సోమవారం విధానసౌధలో ఎమ్మెల్యేలు సతీశ్‌రెడ్డి, ఎం.కృష్ణప్ప తో కలిసి మంత్రి మాట్లాడారు. 25 తేదీ సాయంత్రం 6 గంటలకు విధానసౌధ ముందుభాగంలో బెంగళూరు హబ్బను సీఎం బొమ్మై ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం అనన్యభట్, నవీన్ సజ్జు, జనార్దన్ బందాలతో సంగీత కచేరీ జరుగుతుంది.సాయంత్రం 6 గంటల వరకు కబ్బన్ పార్కు ఆవరణలో వివిధచోట్ల వేడుకలు జరుగుతాయన్నారు. 26వ తేదీన హబ్బ ముగింపు ఉత్సవంలో కేంద్ర హోంశాఖామంత్రి అమిత్‌షా పాల్గొంటారు. విధానసౌధ ఆవరణలో కెంపేగౌడ విగ్రహం, బసవేశ్వర విగ్రహం ప్రారంభిస్తారని తెలిపారు. బాలభవన్‌లో 24 నుంచి 26 వరకు బాలల చలనచిత్రోత్సవాలు జరుగుతాయని, రానున్న రోజుల్లో దసరా ఉత్సవాల తరహాలో బెంగళూరు హబ్బ నిర్వహించాలని తీర్మానించామన్నారు.

సిద్దు పోటీకి గందరగోళం ఎందుకు: యడ్డి

శివాజీనగర: ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకుడు సిద్దరామయ్య ఏ నియోజకవర్గం నుంచైనా పోటీ చేయని, అయితే అనవసరంగా ప్రజల్లో నియోజకవర్గ విషయంలో వివాదం సృష్టించటం సరికాదని బీజేపీ మాజీ సీఎం బీ.ఎస్.యడియూరప్ప అన్నారు. సోమవారం నగరంలో విలేకరులతో మాట్లాడుతూ ఎక్కడైనా ఒకచోట పోటీ చేయవచ్చు. అయితే ఏదైనా నియోజకవర్గం ఫైనల్ చేసి చెప్పాలి. అలాకాకుండా ప్రజల్లో గందరగోళం సృష్టించటం సరికాదని ధ్వజమెత్తారు.

ఊరిగౌడ- నంజేగౌడపై వివాదం వద్దు: స్వామీజీ

శివాజీనగర: ఊరి గౌడ, నంజేగౌడ కల్పిత పాత్రల గురించి ఏ ఒక్కరు మాట్లాడరాదని ఆదిచుంచనగిరి పీఠాధ్యక్షుడు డాక్టర్ నిర్మలానందనాథ స్వామి విన్నవించారు. సోమవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఏ సముదాయపు భావాలకు బాధ కలిగించే పనులను చేయరాదన్నారు. ప్రస్తుతం నెలకొన్న వివాదం అంతం కావాలని తెలిపారు. ఈ విషయాన్ని అందరూ విడిచిపెట్టాలని కోరారు. మైసూరు పులి టిప్పు సుల్తాన్‌ను హత్య చేసింది బ్రిటీష్‌వారు కాదు, ఊరిగౌడ, నంజేగౌడలే అని బీజేపీ నాయకులు ప్రకటనలు చేయడం తెలిసిందే. ఈ తరుణంలో స్వామీజీ మాట్లాడుతూ మంత్రులు ఆర్.అశోక్, అశ్వత్థనారాయణ, గోపాలయ్య, కేంద్ర మంత్రి శోభా కరంద్లాజె, సీటీ రవి అందరూ కూడా వాస్తవ స్థితిని అర్థం చేసుకొంటారనే విశ్వాసముంది. వారికి చరిత్ర తెలుసని భావిస్తున్నట్లు చెప్పారు.

ఆధార్ కార్డుల్లో అక్రమాలు

బనశంకరి: ఆధార్ కార్డులో పుట్టినతేదీని అక్రమంగా మార్చి వృద్ధాప్య పింఛన్ల మంజూరుకు సహకరిస్తున్న చతుర్ అనే వ్యక్తిని సీసీబీ పోలీసులు అరెస్ట్‌చేశారు. తన కంప్యూటర్‌లో ఆధార్ కార్డును డౌన్‌లోడ్ చేసుకుని, ఫోటోషాప్ ఎడిటింగ్ ద్వారా అందులో పుట్టిన తేదీని కావలసినట్లు మార్చేవాడు. ప్రజలు వాటి ద్వారా అర్హత లేకున్నా వృద్ధాప్య పెన్షన్‌కు, ఇతర అవ్యవహారాలకు ఉపయోగిస్తున్నట్లు తెలిసి పోలీసులు సోమవారం మూడుప్రాంతాల్లో దాడులు చేశారు. రాజాజీనగర పరిధిలో చతుర్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి ల్యాప్‌టాప్, 6 కంప్యూటర్ హార్డ్ డిస్కులు, 4 మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు పరారయ్యాడు.

భర్తకు ఐదేళ్ల కఠినశిక్ష

- భార్య, ఇద్దరు పిల్లల ఆత్మహత్య కేసులో తీర్పు

శివమొగ్గ: భార్య, పిల్లలు కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న కేసులో ఆమె భర్తకు కోర్టు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 25 వేల జరిమానా విధించింది. వివరాలు...భద్రావతి నెహ్రూనగర్‌కు చెందిన వెంకటేశ్ అలియాస్ బుడ్డ (38)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే అతని వేధింపులు భరించలేక భార్య 2020 మే 27న తన ఇద్దరు పిల్లలతో కలిసి కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు విచారణ చేసి కోర్టుకు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. జడ్జి ఆర్‌వై శశిధర్ ఈ మేరకు దోషికి ఐదేళ్ల కఠినశిక్షతో పాటు రూ. 25 వేల జరిమానా విధిస్తున్నట్లు తీర్పు చెప్పారు.

పట్టుదలే అతని చూపు



సూపర్ కంప్యూటర్ సిద్దు

- గణితంలో సిద్దు లౌటి మేటి ప్రతిభ
- సూపర్ కంప్యూటర్‌గా పేరు
- సివిల్స్ వేటలో అంధ విద్యార్థి



ఓ కార్యక్రమంలో సిద్దు లౌటి



సివిల్స్ విజేతగా నిలవాలని సిద్దు ఆకాంక్ష

శివాజీనగర: పుట్టుకతోనే అంధత్వం, ఆపై నిరుపేద కుటుంబం. ఈ అడ్డంకులను, అవమానాలను తట్టుకుని జీవితంలో ఒక దశకు చేరుకున్నాడు. విద్యను వెలుగుగా చేసుకొని మరింత ఉన్నత లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నంలో ముందుకు సాగుతున్నాడు. ఆయనే సిద్దు ఎస్. లౌటి. గణితంలో ప్రతిభ సాధించి సూపర్ కంప్యూటర్‌గా ఆయన పేరు గడించాడు.

కుగ్రామం నుంచి ప్రస్థానం

బెళగావి జిల్లా అథణి తాలూకా కక్కమరి అనే చిన్న గ్రామంలో బడుగు కుటుంబంలో రెండో సంతానంగా జన్మించాడు. పుట్టుకతోనే అంధునిగా జన్మించడంతో ఏది వెలుగు, ఏది చీకటి, మానవ, పశుపక్ష్యాదులు ఎలా ఉంటాయో కూడా ఊహించుకోలేడు. సిద్దుకు ఐదేళ్ల వయసులో తల్లిదండ్రులు ప్రభుత్వ హాస్టల్‌లో విడిచిపెట్టారు. ఎవరు అతన్ని పట్టించుకొనేవారు కాదు. చాలా బలహీనంగా ఉండేవాడు. 1వ తరగతి చదవుతున్న సమయంలో అందరూ గేలి చేసేవారు. అదే పాఠశాలలో ఓ 7వ తరగతి విద్యార్థి 100 వరకు గుణింతాలు చెప్పేవాడు, ఉపాధ్యాయులు, అధికారులు అతనిని చాలా గౌరవించేవారు. తాను కూడా ఇలా ఎందుకు కారాదని 2వ తరగతి చదవుతున్నప్పుడే 56 లక్షల వరకు గుణింతాలను నేర్చుకొన్నాడు. దీంతో పాఠశాలలో సిబ్బంది సిద్దు ప్రతిభను గుర్తించారు. ఆయా సంఘ సంస్థలు చేసే కార్యక్రమాల్లో ప్రతిభను ప్రదర్శింపజేశారు. ఇందుకు ప్రతిభా పురస్కారం, నగదు బహుమతి లభించేది. కానీ సిద్దును ఆ ప్రదర్శనకు తీసుకువచ్చేవారు ఆ నగదు, బహుమానాలను కొట్టేసేవారు.

ప్రస్తుతం ఎల్ఎల్‌బీ పూర్తి

బెళగావిలో ఎస్ఎస్ఎల్‌సీలో 80 శాతం మార్కులతో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. 10వ తరగతి వరకు కన్నడ పాఠశాలల్లోనే విద్యను అభ్యాసించాను. ఆ తరువాత ఇంగ్లిషు నేర్చుకోవాలని బెంగళూరుకు చేరుకొన్నాడు. మూడు రోజుల పాటు భోజనం లేకుండా ఫుట్‌పాత్‌పైనే ఉండిపోయాడు. జేబులో ఒక్క రూపాయి మాత్రం ఉంది. చివరకు ఎలాగో ఓ స్కూల్లో సీటు వచ్చింది. ప్రథమ శ్రేణి మార్కులతో పీయూసీలో ఉత్తీర్ణులయ్యాడు. తరువాత బెంగళూరులో ఓ కాలేజీవారు ఉచితంగా ఎల్ఎల్‌బీ సీటు ఇచ్చారు. ఐఏఎస్ అధికారి కావాలనే లక్ష్యంతో చదువుతూ న్యాయ విద్యను పూర్తిచేశాడు. ఐఏఎస్ అధికారిని తప్పకుండా అవుతానని సిద్దు ఆత్మవిశ్వాసంతో చెప్పాడు.

సివిల్స్‌కు సహాయం చేయండి

35 ఏళ్ల సిద్దు తదుపరి లక్ష్యం ఒకటి ఉంది.. అదే సివిల్స్ పరీక్షలు రాసి ఐఏఎస్‌కు ఎంపిక కావడం. ఇందుకు విస్తృతంగా చదవాల్సి ఉంటుంది. సిద్దుకు ఆడియో బుక్స్ అవసరం. ఇంకా కొన్ని డివైస్‌లు కావాల్సి ఉన్నాయి. వాటిని అమెరికా నుంచి తెప్పించాల్సి ఉంది. అంత ఆర్థిక శక్తి తనకు లేదని, దాతలు, ప్రభుత్వం సహాయం చేసి ఆదుకోవాలని ఆయన కోరారు.

లెక్కల్లో అపార నైపుణ్యం

- సిద్దు ప్రస్తుతం 99 కోట్ల వరకు గుణింతాలు తడబడకుండా చెప్పగలడు. సిద్దుకున్న గణిత జ్ఞానం అమోఘమైనది. ఎవరైనా పుట్టిన తేదీ చెబితే ఆ రోజు వారమేమిటి అనేది టక్కున చెబుతాడు. ఫలానా సంవత్సరం, నెలలో తేదీని చెబితే వారం చెప్పేస్తాడు.
- ఒకటీ రెండూ కాదు ఏకంగా 45 వేల మొబైల్‌ఫోన్ నంబర్లను మనసులో గుర్తుపెట్టుకున్నట్లు తెలిపాడు. సాధారణ మానవులు 20 మొబైల్ నంబర్లను గుర్తుపెట్టుకుంటే చాలా గొప్ప.
- ఇదే కాకుండా పుట్టినతేదీ, పేరు చెబితే జ్యోతిష్యం చెబుతారు. మానసిక కౌన్సెలింగ్‌లో నైపుణ్యం ఉంది. పలు టీవీ షోలలో పాల్గొనడంతో పాటు ఎద్దేళు మంజునాథ అనే కన్నడ సినిమాలోనూ నటించాడు. ఆయన ప్రతిభను మెచ్చి అనేక సంస్థలు అవార్డులతో సత్కరించాయి.

క్లుప్తంగా

సీఏ సైట్ల అక్రమ విక్రయం తగదు



వినతిపత్రం సమర్పిస్తున్న శరణప్ప

రాయచూరు రూరల్: నగరంలో సీఏ సైట్లను కొందరు అక్రమంగా విక్రయించడం సరికాదని జైకన్నడ రక్షణ వేదిక జిల్లాధ్యక్షుడు శరణప్ప అన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నగరసభ, ఆర్డీఏ కలిసి పార్కులు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించిన స్థలాలను నగరసభ స్వాధీనం చేసుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

నీటి తొట్టెలతో పక్షుల దాహార్తి దూరం



చెట్టుపై నీటి తొట్టెను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరాల్లో పక్షుల దాహార్తి నివారణకు ప్రాధాన్యత ఇవ్వాలని పచ్చని చెట్ల బళగ సంచాలకుడు కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని క్రిష్ణగిరి హిల్స్ కాలనీలో చుట్టు పక్కల చెట్లు, కొండలు, గుట్టల్లో వేసవిలో దాహార్తి తీర్చడానికి నీటి తొట్టెలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సమితి నేతలు నూతన్‌రాజ్, రామమూర్తిలున్నారు.

మౌలిక సౌకర్యాల కోసం వినతి

బళ్లారి అర్బన్: మురికివాడల వాసులకు కనీస సౌకర్యాలు కల్పించాలని సోమవారం జిల్లాధికారికి మురికివాడల వాసుల సమితి సభ్యులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా స్లం ఏరియాలోని పేదలందరికీ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. సంఘం పదాధికారులు సోమశేఖర్, రమేష్, శేఖర్‌బాబు, మారేష్, తాయణ్ణ పాల్గొన్నారు.

ఆటోస్టాండ్ ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బసవరాజ్

గంగావతి: మరళిలో తుంగభద్ర ఆటోస్టాండ్‌ను కనకగిరి ఎమ్మెల్యే బసవరాజ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ ఉపాధి కోసం ఆటోను నమ్ముకొన్న ఆటో డ్రైవర్లకు సరైన స్టాండ్‌ను ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. ఆటో డ్రైవర్లు, యజమానులంతా ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరారు. బాణసంచాను పేల్చి ఎమ్మెల్యేపై పూలవర్షం కురిపించారు.

టెన్త్ పరీక్షలు సజావుగా నిర్వహించండి



మాట్లాడుతున్న జిల్లాధికారి వెంకటేష్, చిత్రంలో ఇతర అధికారులు

హొసపేటె: ఈ నెల 31 నుంచి జరుగనున్న 10వ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లాధికారి వెంకటేష్ సూచించారు. సోమవారం తన కార్యాలయంలో టెన్త్ పరీక్షల నిర్వహణపై అధికారులకు ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. టెన్త్ పరీక్షలను ఈ నెల 31న నుంచి ఏప్రిల్ 15 వరకు సజావుగా నిర్వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 327 ఉన్నత పాఠశాలలకు చెందిన 21,934 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. పరీక్ష హాల్లో విద్యార్థులకు అన్ని మౌలిక సౌకర్యాలను కల్పించాలన్నారు. పరీక్షల్లో ఎలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా డీడీపీఐ కొట్రేష్, ఏడీసీ అనురాధ, హనుమక్క, సిద్ధరామేశ్వర పాల్గొన్నారు.

చెత్త లారీ బీభత్సం



సోమవారం మధ్యాహ్నం బెంగళూరు రేస్ కోర్సు రోడ్‌లో కరెంటు స్తంభాన్ని పాలికె చెత్త లారీ ఢీకొన్న దృశ్యం. స్తంభం కూలిపోగా, మరమ్మతుల కోసం కొన్ని గంటల పాటు ట్రాఫిక్‌ను నిలిపివేశారు. ఈ ఘటనలో ఎవరికీ ఏమీ కాలేదు. చెత్త లారీ వల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

పేదలకు భూహక్కు పట్టాలివ్వరూ

రాయచూరు రూరల్ : తాలూకాలోని పేదలకు భూహక్కు పట్టాలివ్వాలని అఖిల భారత కిసాన్ సమితి డిమాండ్ చేసింది. సోమవారం టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో చేపట్టిన ఆందోళననుద్దేశించి జిల్లాధ్యక్షుడు ముదుకప్ప నాయక్ మాట్లాడారు. పోరంబోకు, చౌడు, ఇనాం, సర్కారీ మిగులు భూములను సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు కేటాయించాలని కోరారు.

సిద్దు హయాంలో రూ.2,500 కోట్ల స్కాం

- చవక భూమినిచ్చి విలువైన భూమి లూటీ
- బీజేపీ నేత ఎన్‌ఆర్ రమేశ్ ఆరోపణ



ఆధారాలను వివరిస్తున్న ఎన్‌ఆర్. రమేశ్

బనశంకరి: సీఎల్పీ నేత సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రూ.2,500 కోట్ల భారీ టీడీఆర్ కుంభకోణం చోటుచేసుకుందని బెంగళూరు దక్షిణ విభాగ బీజేపీ అధ్యక్షుడు ఎన్ఆర్. రమేశ్ ఆరోపించారు. సోమవారం బీబీఎంపీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన 9,630 పేజీలకు పైగా ఆధారాలను విడుదల చేసి మాట్లాడారు. టీడీఆర్ మాఫియా దొర గా పేరుఘడించిన ప్రవీణ్ పి. షా భాగస్వామిగా ఉన్న వెంకటేశ్వరడెవలపర్స్ అనే సంస్థ, విక్రమ్ ఓస్వాల్ అనే మరో సంస్థ, బాలాజీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ అనే సంస్థకు చెందిన సీటీ తిమ్మయ్య, సీటీ మరిరాజు, అధికారులు కలిసి ఈ కుంభకోణానికి పాల్పడ్డారని, వీరికి సిద్ధరామయ్య సహకరించారని ఆరోపించారు.

చవకగా 40 ఎకరాలను తీసుకుని

2011– 12లో రామనగర జిల్లా మాగడి నియోజకవర్గంలో కోడియాలకరేనహళ్లి అనే గ్రామంలో 40.49 ఎకరాల భూమిని అక్కడ రైతులనుంచి చాలా తక్కువ ధరకు తీసుకున్నారని చెప్పారు. అక్కడ పాలికె చెత్త సంస్కరణ కేంద్రం ప్రారంభించారు. దీనిని బెంగళూరు -మైసూరు మూలభూత సౌకర్యాల మార్గ యోజనా ప్రాధికార ద్వారా పాలికెకు అప్పగించి, అందుకు బదులుగా టీడీఆర్ అందించాలని షరతు విధించారు. అలా నగరంలో రూ.2,644 కోట్లు కు పైగా విలువచేసే విలువైన భూమిని పొందారని చెప్పారు.

మీ రుణం తీర్చుకోడానికే మళ్లీ పోటీ

- రాష్ట్ర రవాణా శాఖా మంత్రి బీ.శ్రీరాములు



మాట్లాడుతున్న మంత్రి శ్రీరాములు

సాక్షి,బళ్లారి: తనకు జన్మనిచ్చిన జోళదరాశి తిమ్మప్ప, వన్నూరమ్మల కుమారుడుగా తాను పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు ఇక్కడ నుంచి పోటీ చేయాలని పార్టీ ఆదేశించడం ఎంతో సంతోషంగా ఉందని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి బీ.శ్రీరాములు పేర్కొన్నారు. ఆయన సోమవారం సంగనకల్లు ఫాంహౌస్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. దేవుడి రూపంలో పార్టీ పెద్దలు తనను మళ్లీ గ్రామీణ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని సూచించడం పూర్వ జన్మసుకృతమన్నారు.

ఇతర చోట్ల నుంచీ పోటీకి ఆహ్వానం

తనకు ఇతర జిల్లాల నుంచీ కూడా పోటీ చేయాలని పార్టీ నేతలు ఆహ్వానిస్తున్నారన్నారు. అయితే గ్రామీణ నుంచి పోటీ చేయాలని తనకూ ఆశగా ఉందన్నారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శ్రీరాములు సమక్షంలో బీజేపీలో చేరారు. మాజీ ఎంపీలు సన్నపకీరప్ప, శాంత, పార్టీ నాయకులు రామలింగప్ప, గురులింగనగౌడ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దళితుల శ్రేయస్సు

- దళితుల ద్రోహి కాంగ్రెస్సే
- ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి, చిత్రంలో పార్టీ నాయకులు తదితరులు

సాక్షి,బళ్లారి: ప్రధాని మోదీ దళితుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశ పెడుతున్నారని, బీజేపీతోనే దళితులకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం వాల్మీకి భవన్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ ఎస్సీ మోర్చా సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలను కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా వాడుకుంటుందన్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత వారి సంక్షేమం గురించి ఏమాత్రం పట్టించుకోదన్నారు. రాజ్యాంగ నిర్మాత, అపర మేధావి డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్‌ను ఎన్నికల్లో ఓడించింది కాంగ్రెస్ పార్టీనేనన్నారు. అంబేడ్కర్‌ను లోక్‌సభకు వెళ్లకుండా అప్పట్లో కాంగ్రెస్ కుట్ర చేసిందని ఆరోపించారు. తమ సంక్షేమం కోసం పాటుపడుతున్న బీజేపీకి దళితులు మద్దతివ్వాలని కోరారు. ఎమ్మెల్సీ వై.ఎం.సతీష్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో అంబేడ్కర్‌పై ఎంతో గౌరవం ఉందన్నారు. పార్టీ ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వీరయ్య మాట్లాడుతూ ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉండాలని అంబేడ్కర్ చేసిన ప్రతిపాదనను అప్పట్లో కాంగ్రెస్ వ్యతిరేకించిందన్నారు. అంబేడ్కర్‌ను, దళితులను అణగదొక్కిన పార్టీ కాంగ్రెస్సేనన్నారు. ఎమ్మెల్యే సోమలింగప్ప, పార్టీ జిల్లాధ్యక్షుడు మురహరగౌడ, ఉపాధ్యక్షుడు వీరశేఖరరెడ్డి, కార్పొరేటర్లు మోత్కూరు శ్రీనివాసరెడ్డి, కల్పన వెంకట్రామిరెడ్డి, జీ.హనుమంతు, పార్టీ ప్రముఖులు రామచంద్రయ్య, రామాంజిని, వై.తిమ్మారెడ్డి, దళిత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

140 స్థానాల్లో బీజేపీ గెలుపు తథ్యం



సుబుదేంద్ర తీర్థుల నుంచి జ్ఞాపిక అందుకుంటున్న విజయేంద్ర

రాయచూరు రూరల్: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ 140 స్థానాల్లో గెలుపు ఖాయమని, మళ్లీ అధికారం చేపడతామని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు విజయేంద్ర వెల్లడించారు. ఆయన సోమవారం మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని సుబుదేంద్ర తీర్థుల నుంచి సన్మానం, జ్ఞాపికను అందుకున్నారు. అనంతరం నగరంలో ఏర్పాటు చేసిన బీజేపీ యువ మోర్చా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్‌లో సీఎం పదవికి గట్టి పోటీ ఉందన్నారు. కాంగ్రెస్ మునుగుతున్న నావలాంటిదన్నారు. కేంద్రం అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజలకు విజయ సంకల్ప యాత్రల ద్వారా ప్రచారం చేశామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, మాజీ ఎమ్మెల్యేలు బసవన గౌడ, గంగాధర నాయక్, పాపారెడ్డి, తిప్పరాజ్, మాజీ ఎమ్మెల్సీ ఎన్.శంకరప్ప, జిల్లాధ్యక్షుడు రమానంద యాదవ్, నగరసభ అధ్యక్షురాలు లలిత, ఆర్డీఏ అధ్యక్షుడు తిమ్మప్పలున్నారు.

శివాజీనగరకు ఉత్సవశోభ



విద్యుత్ దీపాలతో చాందిని చౌక్ వెలుగులు



ఉత్సవాల సందడి



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, స్థానిక ప్రజలు

శివాజీనగర: బెంగళూరు నగర కేంద్ర బిందువుగా ఉన్న శివాజీనగర చాందినిచౌక్‌లో శనివారం రాత్రి పొద్దుపోయే వరకు అంగరంగ వైభవంగా శివాజీ నగర పండుగ జరిగింది. సుమారు 200 సంవత్సరాల చరిత్ర కలిగిన చాందిని చౌక్ శిథిలావస్థకు చేరుకోగా, 100 సంవత్సరాల రసెల్ మార్కెట్, 200 సంవత్సరాల సెయింట్ మేరీస్ బసిలికా చర్చి, 250 సంవత్సరాల కిందటి బావి తదితర ప్రాంతాలను బీబీఎంపీ, స్మార్ట్ సిటీ, ఎమ్మెల్యే నిధులతో పూర్తిగా కొత్తగా తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే రిజ్వాన్ హర్షద్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. చాందిని చౌక్ చుట్టుపక్కలంతా రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. కళాకారుల నృత్య గాన ప్రదర్శనలు ఆకట్టుకొన్నాయి. ఫుడ్ స్టాల్స్‌లో ప్రజలు ఇష్టమైన వంటకాలను రుచి చూశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏళ్ల తరబడిగా చాందిని చౌక్ నిర్లక్ష్యానికి గురైంది, ఇక్కడి ప్రజలు, వ్యాపారులు సమస్యను తన దృష్టికి తీసుకురాగా ఇక్కడి రూపురేఖలను మార్చేందుకు చర్యలు తీసుకొన్నానని తెలిపారు.

పార్టీ విజయానికి శ్రమించండి



ఆదేశపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

కంప్లి: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రతి కార్యకర్త శ్రమించాలని, పార్టీ ప్రణాళికను ఓటర్ల ఇంటింటికీ చేర్చాలని వెనుకబడిన వర్గాల విభాగం జిల్లా అధ్యక్షులు కే.మల్లికార్జున తెలిపారు. పట్టణంలోని బీసీ సెల్ కార్యాలయంలో హరపనహళ్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షునిగా శివరాజ్‌ను, బెటగేరి బ్లాక్ అధ్యక్షునిగా పరశురామప్పను ఎంపిక చేసి వెలువరించిన ఆదేశపత్రాలను అందించి ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీని సాధించి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. నూతన బ్లాక్ అధ్యక్షులు పార్టీ విజయానికి శాయశక్తులా శ్రమించాలన్నారు. కేపీసీసీ బీసీ సెల్ కార్యదర్శి బసవరాజ్, జిల్లా కార్యదర్శి హడపద ఈరణ్ణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం కేసులో ఐదుగురు సస్పెండ్

శివాజీనగర: ఎన్నికలాధికారులు స్వాధీనం చేసుకొన్న మద్యం బాక్సులు అదృశ్యమైన కేసులో ఐదుగురు ఎక్సైజ్, పోలీసు శాఖ అధికారులను సస్పెండ్ చేశారు. బెళగావి జిల్లాలో ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ దేవల్ సాబా సిండోగి, సదాశివ కోర్తి, పోలీస్ అధికారి పుష్పా గదగి ఉన్నారు. ఈ నెల 7న బెళగావి జిల్లా ఖానాపుర తాలూకాలోని మోడకొప్ప గ్రామం వద్ద గోవా నుంచి అక్రమంగా తీసుకొచ్చిన రూ. 47 లక్షల విలువ చేసే 753 మద్యం బాక్సులను ఎన్నికల స్క్వాడ్, పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకున్నారు. మరుసటి రోజునే ఇందులో 301 బాక్సులు అదృశ్యమయ్యాయి. ఇందులో పై అధికారుల పాత్ర ఉందని తెలిసి వేటు వేశారు.

ఎల్లెల్సీకి ఏప్రిల్ 15 వరకు నీరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి: నీటిపారుదల శాఖాధికారులను ఒప్పించి తుంగభద్ర ఎల్లెల్సీకి ఏప్రిల్ 15 వరకు నీరు అందించనున్నట్లు ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. సోమవారం బళ్లాపుర వద్ద 2022–23వ సంవత్సరానికి రూ.11 కోట్ల ఖర్చుతో జీజీఎం బహుగ్రామ తాగునీటి పథకం పనులకు భూమిపూజ చేసి ఆయన మాట్లాడారు. రైతుల శ్రేయస్సు కోసం ఎల్లెల్సీకి ఏప్రిల్ 5కు బదులుగా 15 వరకు నీరు పారుతుందన్నారు. హళేనెల్లుడితో పాటు ఆరు గ్రామాలకు లబ్ధి కలిగేలా బహుగ్రామ శాశ్వత తాగునీటి పథకాన్ని రూపొందించామన్నారు. హళే నెల్లుడి, హొసనెల్లుడి, కొట్టాల, శంకర్‌సింగ్ క్యాంప్, మహబూబ్ నగర్, శాంతినగర ప్రజలకు రక్షిత మంచినీరు అందిస్తామన్నారు. ఈసందర్భంగా జీపీ అధ్యక్షులు ఎల్.శ్రీనివాస్, పీడీఓ బసప్ప, ప్రముఖులు జీ.మౌనేష్, మస్తాన్, మలకణ్ణ, కే.ఉమేష్, నెల్లుడి ఫక్కీరప్ప, లింగప్ప, నాగప్ప, కాంట్రాక్టర్ శ్రీనివాస నిఖిల్, నెల్లుడి గ్రామస్తుడు మల్లికార్జున పాల్గొన్నారు.

వహ్నికులకు సంబంధం లేదు

శివాజీనగర: వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ రాష్ట్ర తిగళల అభివృద్ధి మండలిని స్థాపించి, అందులో వహ్నికుల క్షత్రియ, ధర్మరాజ కాపు, బళ్లి, అగ్నికుల క్షత్రియులతో కూడిన అన్ని ఉప కులాలను చేర్చడం సరికాదని, తిగళ కులానికి- కరగను మోసే వహ్నికుల క్షత్రియులకు ఎలాంటి సంబంధం లేదని, ప్రభుత్వ వైఖరిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర వహ్నికుల క్షత్రియ సంఘం రాష్ట్రాధ్యక్షుడు వర్తూరు రవి అన్నారు. సోమవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ వహ్నికుల క్షత్రియులకు- తిగళ కులానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. దీనిపై బీసీ కమిషన్‌లో విచారణలో జరుగుతోందని, తీర్పు వచ్చే వరకు మండలి ఏర్పాటును రద్దు చేయాలని, లేదంటే నిరసనలకు దిగుతామని చెప్పారు.

బైక్ ప్రమాదంలో టోల్ ఉద్యోగి మృతి



మృతుడు ప్రజ్వల్

పావగడ: పట్టణ పరిధిలో బుడ్డారెడ్డిహళ్లి గ్రామం సమీపంలో ప్రధాన రహదారి టోల్‌గేట్ సూపర్‌వైజర్, మంగళూరు వాసి ప్రజ్వల్ (26) రోడ్డు ప్రమాదంలో ఆదివారం రాత్రి మృతి చెందాడు. పావగడ నుంచి బుడ్డారెడ్డి హళ్లికి బైక్ మీద వస్తూ కెంచగానహళ్లి గేట్ వద్ద అదుపు తప్పి కిందకు పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సోమవారం మృతుని తల్లిదండ్రులకు భౌతిక కాయాన్ని అప్పగించారు. ఎంతో దూరం నుంచి ఉద్యోగానికి వచ్చి చనిపోయావా అని తల్లిదండ్రులు విలపించారు.

చెత్త వాహనచోదకుల ధర్నా



ధర్నా చేస్తున్న వాహనచోదకులు

హొసపేటె: నగరంలోని చెత్తాచెదారాన్ని నిత్యం తరలిస్తున్న వాహన చోదకులకు అన్ని విధాలుగా ప్రభుత్వ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆ వాహన చోదకుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నగరసభ కార్యాలయం ముందు నిరవధిక ధర్నాను చేపట్టారు. సంఘం నేత గోపాల మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతి కింద విధులు నిర్వహిస్తున్న వాహనచోదకులను వెంటనే పర్మినెంట్ చేయాలని, కాంట్రాక్టర్ నుంచి కాకుండా నేరుగా ప్రభుత్వమే వేతనాలను అందించాలన్నారు. ఈ సందర్భంగా గంగాధర, రమేష్, పెన్నయ్య, హొన్నూరుస్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టులో తనిఖీలు షురూ



కారును తనిఖీ చేస్తున్న అధికారులు

కంప్లి: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున కంప్లి కోట వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తహసీల్దార్ గౌసియాబేగం సోమవారం సాయంత్రం పరిశీలించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ బృందాలు వారి బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నారన్నారు. ఓటర్లకు ఎరవేసే వారిపై నిర్దాక్షిణ్యంగా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఒకవేళ ప్రజలకు ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే తమకు తెలిపి సహకరించాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులైనా ఆర్ఓ, ఎంసీసీ గ్రామీణ నోడల్ అధికారి, పట్టణ అధికారులు లేదా వీఏలకు చేయవచ్చన్నారు.

24న అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ



మాట్లాడుతున్న కేపీ ఉమాపతి

హొసపేటె: స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఈ నెల 24న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని మంత్రి ఆనంద్‌సింగ్ ప్రారంభిస్తారని సంఘం అధ్యక్షులు కేపీ ఉమాపతి తెలిపారు. సోమవారం ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ సర్కిల్‌లో ఇంతకు ముందు ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించి ప్రస్తుతం కోటి రూపాయల ఖర్చుతో 12.5 అడుగుల ఎత్తుగల నూతన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సంఘం నేతలు వీరాస్వామి, వెంకటేష్, లక్ష్మణ, వెంకప్ప, జగన్నాథ్, విజయకుమార్, రామకృష్ణ, శేషు, మారెప్ప పాల్గొన్నారు.

నాన్న కోసం తప్పకుంటా

మైసూరు: మా నాన్న సిద్దరామయ్య ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది ఇంకా ఖరారు కాలేదని, వరుణ నుంచి పోటీ చేస్తే తాను తప్పుకుంటానని తనయుడు, వరుణ ఎమ్మెల్యే యతీంద్ర చెప్పారు. సోమవారం ఆయన మైసూరులో మీడియాతో మాట్లాడారు. సిద్దరామయ్య కోలారు నుంచి పోటీ చేయడానికి సిద్ధమయ్యారు, కానీ ఇంకా తీర్మానం కాలేదని అన్నారు.

జీపీ కార్యాలయం ప్రారంభం



రాయచూరు రూరల్: గ్రామీణాభివృద్ధికి ప్రజలు సహకరించాలని గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ పేర్కొన్నారు. ఆయన సోమవారం గుంజళ్లిలో గ్రామ పంచాయతీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దడానికి పాటుపడుతామన్నారు.

రోడ్డు వేయించాలని ధర్నా

గంగావతి: కెసరహట్టి నుంచి హణవాళ వరకు రోడ్డును వేయించని పక్షంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయకుండా బహిష్కరిస్తామని గ్రామస్తులు ధర్నా చేశారు. ఈసందర్భంగా గ్రామస్తుడు బసవరాజ్ మాట్లాడుతూ ఈ రోడ్డుకు రూ.3.5 కోట్లు మంజూరై ఏళ్లు గడుస్తున్నా రోడ్డుపై మొరం మాత్రమే చల్లడంతో తాలూకా కేంద్రానికి రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే, అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టినా ఫలితం లేనందున ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. శరణప్ప ఎలెగార్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ యాజమాన్యంపై చర్యలేవీ?

రాయచూరు రూరల్ : నగరంలోని తిమ్మాపూరుపేట వద్దగల సూగూరేశ్వర విద్యానికేతన్ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర లెజెండ్ టిప్పుసుల్తాన్ సంఘం డిమాండ్ చేసింది. సోమవారం టిప్పుసుల్తాన్ ఉద్యాన వనంలో చేపట్టిన ఆందోళనను ద్దేశించి అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడారు. ఆ పాఠశాలకు ఇచ్చిన లైసెన్సును రద్దు చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

కోలారు వార్తలు...

వినియోగదారులు హక్కుల గురించి తెలుసుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు : వినియోగదారులు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని సీనియర్ సివిల్ న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవల ప్రాధికార సభ్యుడు సునీల్ ఎస్. హొసమని తెలిపారు. సోమవారం మంగసంద్రలోని బెంగళూరు ఉత్తర వర్సిటీలో నిర్వహించిన విశ్వ వినియోగదారుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. వినియోగదారుల జాగృతి కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు వస్తువులను కొనుగోలు చేసే ముందు నాణ్యత, ప్యాకేజ్ లోపలి వివరాలను తెలుసుకోవాలన్నారు. తాము ఖరీదు చేసిన వస్తువులో నాణ్యత లేకుంటే వినియోగదారులు కోర్టుకు వెళ్లవచ్చన్నారు. సాధ్యమైనంత వరకు డిజిటల్ వ్యవహారాలు చేయడం మంచిదన్నారు. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ మాత్రమే కాకుండా చిన్న చిన్న దుకాణాల్లో కూడా డిజిటల్ వ్యవహారం చేయడమే మేలన్నారు. వస్తువును ఖరీదు చేసేటప్పుడు ఎంఆర్‌పీ, పరిమాణం, తేదీ అన్నింటిని పరిశీలించాలన్నారు. ఈ సందర్భంగా ఆహార, పౌర సరఫరాలు, గ్రాహక వ్యవహారాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శృతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను తీర్చాలని ధర్నా

కంప్లి: భూ వసతి సమస్యలను కాలమితిలోగా పరిష్కరించాలని ఒత్తిడి చేస్తూ భూ వసతి హక్కు వంచితుల పోరాట రాష్ట్ర కార్యదర్శి మండలి సభ్యులు కరియప్ప గుడిమని ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నాకు బైఠాయించారు. ఈ సందర్భంగా కరియప్ప మాట్లాడుతూ ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములను కొన్నేళ్లుగా సాగు చేసుకుంటూ నమూనా 50, 53, 57లో సమర్పించిన అర్జీలను త్వరితగతిన భూమి మంజూరు అనుమతిని అందించాలన్నారు. 94సీ, 94 సీసీ అర్జీలను పరిగణించకుండా నివాస ముంటున్న స్థలాలకు వెంటనే హక్కు పత్రాలు అందించాలన్నారు. ఎమ్మెల్యే అధ్యక్షతన బగర్ హుకుం సమితి సమావేశం జరిపి మంజూరు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. సమితి సభ్యులు వసంతరాజ్ కహళె, పదాధికారులు నీలప్ప పెయింటర్, శరణప్ప బొమ్మ, ధనుంజయ, పార్వతమ్మ, మాళమ్మ, లక్ష్మి, నాగమ్మ, నెల్లుడి మహేష్ పాల్గొన్నారు.

సిద్దరామయ్యకే మా మద్దతు



సమావేశంలో చర్చిస్తున్న ఒక్కలిగులు

కోలారు : వచ్చే ఎన్నికల్లో కోలారు నుంచే పోటీ చేసేలా సిద్దరామయ్యపై ఒత్తిడి తీసుకు రావాలని తాలూకా ఒక్కలిగ సముదాయం, కురుబ సంఘం వేర్వేరుగా తీర్మానించాయి. సోమవారం ఆరాధ్య హోటల్‌లో సమావేశమైన ఒక్కలిగ సముదాయ ప్రముఖులు ఈ మేరకు తీర్మానం చేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఇరు సముదాయాల ప్రముఖులు బెంగళూరులోని ఆయన నివాసానికి పెద్ద సంఖ్యలో ఒక్కలిగ, కురుబ సముదాయ ప్రజలు వెళ్లి సిద్దరామయ్యను ఒప్పించాలని నిర్ణయించారు. కేపీసీసీ సభ్యుడు నందిని ప్రవీణ్‌కుమార్, దయానంద్, కౌన్సిలర్ మురళీగౌడ, డీసీసీ ప్రధాన కార్యదర్శి మైలాండహళ్లి మురళి పాల్గొన్నారు.

కోలారు నుంచే సిద్దూ పోటీ చేయాలి

సిద్దరామయ్య కోలారు నుంచే పోటీ చేసేలా ఆయనపై ఒత్తిడి తేవాలని కురుబ సంఘం నాయకులు తీర్మానించారు. సోమవారం నగరంలోని కనక మందిరంలో నిర్వహించిన కురుబ సంఘం సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో మాజీ నగరసభ సభ్యుడు సి సోమశేఖర్, వి ప్రకాష్, మోహన్‌బాబు, శివకుమార్ పాల్గొన్నారు.

మార్కెట్‌లో కొనుగోళ్ల జోరు



వ్యాపారాలతో వారపు సంత రద్దీగా ఉన్న దృశ్యం

మాలూరు: చిక్కతిరుపతిలో సోమవారం జరిగే వారపు సంతలో ఉగాది పండుగ సందర్భంగా కోళ్లు, గొర్రెలు, మేకల వ్యాపారాలు జోరుగా సాగాయి. పండుగ మరుసటి రోజు నిర్వహించే పాడ్యమి కోసం కోళ్లు, గొర్రెలు, మేకలను కొనడానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. సంతకు సుమారు 6 వేలకు పైగా గొర్రెలు వచ్చాయి. తాలూకా నుంచే కాకుండా ఆనేకల్, దేవనహళ్లి, తుమకూరు, బంగారుపేట, తమిళనాడులోని హోసూరు, బాగలూరు, బేరికె, సేలం, కృష్ణగిరి, ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా మదనపల్లి, చిత్తూరు, వి.కోట తదితర ప్రాంతాల నుంచి కూడా వ్యాపారులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఖరీదు చేసిన వాటిని వాహనాల్లో తీసుకెళ్లారు.

పోక్సో నిందితుడికి 20 ఏళ్ల జైలు

కోలారు : నాయకరహళ్లికి చెందిన ముబారక్ బాషా అనే నిందితుడికి పోక్సో కోర్టు న్యాయమూర్తి బి పి దేవమాని 20 ఏళ్ల జైలు, రూ.20 వేల జరిమానా విధించారు. ముబారక్ బాషా అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు గురి చేసినట్లు కోలారు మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తనిఖీ నిర్వహించిన మహిళా పోలీస్ స్టేషన్ సీఐ బైరా నిందితుడిపై కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్షను విధిస్తూ తీర్పును వెలువరించారు.

పాల విక్రయం, ఉత్పత్తిలో కోచిముల్ సమతౌల్యం

కేజీఎఫ్ : పాల విక్రయం, ఉత్పత్తిలో కోచిముల్ సమతౌల్యాన్ని కాపాడుకుని రైతుల, వినియోగదారుల శ్రేయస్సును కాపాడుతోందని కోముల్ డైరెక్టర్ జయసింహ కృష్ణప్ప తెలిపారు. సోమవారం నగరంలోని కోర్టు ప్రాంగణంలో నూతనంగా నందిని పార్లర్‌ను ప్రారంభించి మాట్లాడారు. రుచి, నాణ్యతకు మారుపేరైన నందిని ఉత్పత్తులను ఒకసారి వాడిన వారు ఇతర ఉత్పత్తులను వినియోగించడానికి ఇష్టపడరన్నారు. పాల ఉత్పత్తిని పెంచే ఉద్దేశంతో రాష్ట్రంలోనే కోముల్ నుంచి అత్యధికంగా ప్రతి లీటర్ పాలకు రైతుకు రూ.35.35 ధరను చెల్లించి రైతుల నుంచి పాలను కొనుగోలు చేస్తోందన్నారు. ఇతర డైరీల కంటే కోలారు డైరీ రైతులకు అధిక ధరకు రైతుల నుంచి పాలను కొనుగోలు చేస్తోందన్నారు. కోముల్ మేనేజర్ కె ఎన్ గోపాలమూర్తి, సివిల్ న్యాయమూర్తి మహేష్ పాటిల్, తాలూకా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎస్ ఎన్ రాజగోపాలగౌడ పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యం అవసరం

కేజీఎఫ్ : సామర్థ్యానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ వృత్తిని ఎంచుకుని, కష్టపడి యశస్సును సాధించాలని ఐఏఎస్–ఎస్‌వైఎస్ ఉపాధ్యక్షుడు దేవిసింగ్ తెలిపారు. సోమవారం టి తిమ్మయ్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత మార్కెట్ కోరే వృత్తి, కౌశల్యాలను విద్యార్థులు పెంపొందించుకోవాలన్నారు. కళాశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. కళాశాల అధ్యక్షుడు టి.వెంకటవర్ధన్, కళాశాల ఉపన్యాసకులు, వైస్ ప్రిన్సిపాల్ శైజి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయుడి సస్పెండ్



ఉపాధ్యాయుడు రామకృష్ణగౌడ

మైసూరు: ఓ విద్యార్థి పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని అధికారులు సస్పెండ్ చేశారు. మైసూరు జిల్లా హుణసూరు తాలూకా బీజగనహళ్లి గ్రామ పాఠశాల ఉపాధ్యాయుడు రామకృష్ణగౌడను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 7న పాఠశాలలో ఓ కుక్క మూత్ర విసర్జన చేసింది. ఉపాధ్యాయుడు రామకృష్ణగౌడ ఓ ఎస్సీ విద్యార్థిని పిలిపించి బెదిరించి శుభ్రం చేయించాడు. విషయం తెలుసుకున్న దళిత నాయకులు విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన అనంతరం ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు.

భార్యను నరికి చంపిన భర్త

మైసూరు: భార్యను భర్త వేట కొడవలితో దారుణంగా నరికి హత్య చేసిన సంఘటన చామరాజనగర తాలూకాలోని కొత్తలవాడి గ్రామంలో జరిగింది. హతురాలు రత్నమ్మ (30). రత్నమ్మ, భర్త మహేష్‌లు తరచూ గొడవపడేవారు. ఆదివారం రాత్రి కూడా గలాటాపడ్డారు. ఆగ్రహంతో మహేష్ ఇంటిలో ఉన్న వేటకొడవలితో భార్యను ఇష్టానుసారం నరకడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. ఈ దంపతులకు కుమార్తె (13), కుమారుడు (9) ఉన్నారు. చామరాజనగర గ్రామీణ పోలీసులు వచ్చి పరిశీలించి నిందితున్ని అరెస్టు చేశారు.

మద్యం మత్తులో చెరువులో దూకి..



రాజఘట్ట చెరువు వద్ద గుమిగూడిన జనం

దొడ్డబళ్లాపురం: మద్యం మత్తులో ఒక యువకుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దొడ్డ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బెంగళూరు బ్యాటరాయనపురకు చెందిన మునిరాజు (26) మృతి చెందిన యువకుడు. ఉగాది పండుగ నిమిత్తం రాజఘట్టలోని అక్క ఇంటికి వచ్చిన మునిరాజు స్నేహితులతో కలిసి రాజఘట్ట చెరువు వద్దకు వెళ్లి తన మొబైల్ గట్టుమీద పెట్టి చెరువులో దూకాడు. స్నేహితులు కాపాడే ప్రయత్నంలో తాడు నీటిలో విసిరినా మద్యం మత్తులో మునిరాజు తాడుపట్టుకుని పైకిరాలేక చెరువులో మునిగి మృతి చెందాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపకదళం సిబ్బంది మతదేహాన్ని వెలికితీసారు. దొడ్డ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఘనంగా అణ్ణమ్మ దేవి ఉత్సవం



కృష్ణరాజపురం: హోసకోటె పట్టణంలో స్వయం యువకుల సంఘం ఆధ్వర్యంలో నగర గ్రామదేవత శ్రీ అణ్ణమ్మ దేవి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇక్కడి గణగల్లు రోడ్డులో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ పాల్గొని అణ్ణమ్మ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో స్థానిక నాయకులు బీవీ బైరెగౌడ, హెచ్‌ఎం సుబ్బరాజు, లక్ష్మణ్ గౌడ, సోలార్ మంజు, మహేష్, కిరణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్వామీజీ ఆశీర్వాదంతో పరీక్షలకు వెళ్లండి



తుమకూరు: ఎస్‌ఎస్‌ఎల్‌సీ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ధైర్యంగా పరీక్షలు రాయాలని, సిద్దగంగ మఠం స్వామీజీల ఆశీర్వాదం తీసుకుని ముందుకు వెళ్లాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సురేశ్‌కుమార్ అన్నారు. సోమవారం తుమకూరు నగరంలోని సిద్దగంగ మఠంలో ఎస్‌ఎస్‌ఎల్‌సీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులను కలిసి వారిలో ధైర్యం నింపి మాట్లాడారు. క్షణం కూడా వృథా చేసుకోకుండా చదువుకోవాలన్నారు.

చామరాజపేటలో భాస్కర్‌రావు పోటీ ?

శివాజీనగర: రాజకీయాల్లోకి వచ్చిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భాస్కర్‌రావు తొలిసారి శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. పోలీస్ శాఖలో విశేష సేవలందించిన ఆయన బీజేపీలో ఉన్నారు. చామరాజపేట నియోజకవర్గంలో పోటీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. అత్యంత సన్నిహిత వర్గాల ప్రకారం జయనగర, బసవనగుడి, చామరాజపేట నియోజవర్గాల వైపు మొగ్గు చూపుతున్నారు.

ముగ్గురి నుంచి రూ. 50 లక్షలు స్వాహా

- సైబర్ నేరగాళ్ల ఉచ్చులో అమాయకులు
- వాట్సప్‌లకు లింక్‌లు పంపి నగదు వసూలు



హోసూరు: సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు, మొబైల్‌కు వచ్చే ప్రకటనలు, లింక్‌లకు స్పందించవద్దు. మోసపోతారు అని ప్రచారం జరుగుతున్నా కొందరు పట్టించుకోవడం లేదు. ఊరూపేరూ లేని నంబర్ల నుంచి వచ్చే లింక్‌లను నమ్మి కష్టార్జితాన్ని కోల్పోయారు. పార్ట్ టైం ఉద్యోగం పేరుతో జిల్లాలో ముగ్గురి వద్ద రూ. 50 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్ల కోసం క్రైం బ్రాంచ్ పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

రూ. 20.35 లక్షలు గోవింద

హోసూరు పట్టణంలోని ఈఎస్‌ఐ రింగ్‌రోడ్డు ప్రాంతానికి చెందిన రామ్‌కుమార్ (49) గత కొద్ది రోజుల క్రితం వాట్సప్ నంబర్‌కు వచ్చిన మెసేజ్‌ను చూసి సంప్రదించాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చునని సూచించడంతో వారి మాటలు నమ్మిన రామ్‌కుమార్ వాట్సప్ ద్వారా అందజేసిన లింక్ ద్వారా రూ. 20.35 లక్షలు వేర్వేరు బ్యాంకు ఖాతాలకు పంపించాడు. అనంతరం వాట్సప్ నంబర్‌ను సంప్రదించగా స్విచాఫ్ రావడంతో మోసపోయినట్లు తెలుసుకున్న రామ్‌కుమార్ క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

లాభాల పేరుతో రూ. 20.85 లక్షలు

హోసూరు న్యూ ఏఎస్‌టిసి హడ్కో ప్రాంతానికి చెందిన అయ్యప్ప (45) ఇతని సెల్‌ఫోన్ నంబర్‌కు వచ్చిన లింక్‌ను చూడగా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చునని ఉంది. నిజమేననుకున్న అతడు రూ. 20.85 లక్షలు డిపాజిట్ చేశాడు. ఆపై స్పందన లేకపోవడంతో లబోదిబోమని క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మహిళ ఖాతాలో రూ.8.55 లక్షలు మాయం

హోసూరు పారిశ్రామికవాడ మూకొండపల్లి ప్రాంతానికి చెందిన మహాలక్ష్మి (30) పార్ట్ టైం ఉద్యోగంతో రోజూ రూ. 5 వేలు సంపాధించవచ్చునని వచ్చిన లింక్‌లో తన వివరాలను నమోదు చేశారు. వెంటనే ఆమె బ్యాంకు ఖాతాలోని రూ. 8.55 లక్షలు ఒక్కసారిగా ఖాళీ అయ్యాయి. బాధితురాలు క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేసుకొని దుండగుల కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

మినీ లాల్‌బాగ్ ప్రారంభం



బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి పరిధి మంగమ్మపాళ్య వార్డు హోసపాళ్యలో 14 ఎకరాల్లో నిర్మించిన మినీ లాల్‌బాగ్‌ను సోమవారం బొమ్మనహళ్లి ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి, పాలికె జాయింట్ కమిషనర్ కృష్ణమూర్తి ప్రారంభించారు. సామసంద్రపాళ్య చెరువు పక్కన హోసపాళ్యలో ఉన్న అటవీ స్థలంలో అధికారులు భూమిని స్వాధీనం చేసుకుని లాల్‌బాగ్ తరహాలో నిర్మాణం చేపట్టారు. ఇక్కడ వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, యోగా, చిన్నారులకు ఆట స్థలం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆనందరెడ్డి, మాల శ్రీనివాసరెడ్డి, చంద్రారెడ్డి, ఎం.వి.శ్రీనివాస్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ కోసం సీఎం ఇంటి ముట్టడి



నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

శివాజీనగర: రాష్ట్రంలో జనసంఖ్యకు అనుగుణంగా ఎస్సీల రిజర్వేషన్ వర్గీకరణ చేయాలని ఏ.జే.సదాశివ కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను అమలుపరచాలని మాదిగ దండోరా, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేశారు. సోమవారం ఆర్.టీ.నగరలో ఉన్న సీఎం బొమ్మై ఇంటి వద్దకు చేరుకుని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ రాష్ట్రాధ్యక్షుడు బీ.నరసప్ప, సీనియర్ ఉపాధ్యక్షుడు ఎం.సీ.శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సమస్య తీరేదెప్పుడు? న్యాయ అన్యాయాల గురించి పాలకులకు తెలియదా? అని నిలదీశారు. రాష్ట్రంలో ఎస్సీల స్థితిగతులపై సర్వేచేసి 2012లో సదాశివ కమిషన్ తన నివేదికను సమర్పించారు. అయితే ప్రభుత్వాలు ఎందుకు అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయని మండిపడ్డారు. పోలీసులు తక్షణమే బీఎంటీసీ బస్సులను రప్పించి వారిని అరెస్టు చేసి దూరంగా తరలించారు.

కన్నడ భాష, సంస్కృతి ఎంతో గొప్పది



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

చిక్కబళ్లాపురం: కన్నడ భాష, సంస్కృతి, మన రచనలు ఎంతో గొప్పవని ఖాదీ, గ్రామోద్యోగ మండలి అధ్యక్షుడు కెవి నాగరాజు అన్నారు. ఆదివారం నగరంలోని అంబేడ్కర్ భవనంలో 8వ తాలూకా కన్నడ సాహిత్య సమ్మేళన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జ్ఞానపీఠ పురస్కారాలను ఎక్కువగా అందుకున్నది కన్నడిగులేనని అన్నారు. జిల్లా కసాప అధ్యక్షుడు కోడిరంగప్ప మాట్లాడుతూ... సత్యం, న్యాయం, సమానతకు పేరు గాంచినది కన్నడ సాహిత్యం అన్నారు. మహానుభావులు రచించిన కవిత్వాలను అభ్యసించడం ద్వారా కన్నడ భాషను గౌరవించుకుందాం అన్నారు. కార్యక్రమంలో సమ్మేళనాధ్యక్షులు సరసమ్మ, తాలూకా కసాప అధ్యక్షుడు యలువహళ్లి సాణ్ణేగౌడ టీపీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు కెఆర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

యశవంతపుర: పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించిన యువకుడు మృతి చెందిన ఘటన దక్షిణ కన్నడ జిల్లా ఉళ్లాల కోణాజె పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ఆదివారం సాయంత్రం విట్ల కన్యాన నివాసి బాబు శెట్టిగార్ కుమారుడు హరీశ్ (33) ఆత్మహత్య చేసుకున్నాడు. పదేళ్ల నుంచి ముడిపు ఇన్ఫోసిస్ సంస్థలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఇతనికి ఇటీవల సిద్ధకట్టె సంగబెట్టకు చెందిన యువతితో వివాహం జరిగింది. ఈనెల 12న హరీశ్ ఇంటికి వచ్చాడు. ఆదివారం పెట్రోల్ పోసుకుని నిప్పటించుకోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. అతని ఆత్మహత్యకు కారణాలు తెలియడం లేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కళంకం లేకుండా జీవించాలి



దైవజనుడు వేదనాయకంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నిర్వాహకులు

శివాజీనగర: సర్వమానవాళి పాప పరిహార నిమిత్తం సిలువపై రక్తం చిందించిన ఏసుక్రీస్తుపై విశ్వాసముంచిన బిడ్డలు తన వ్యక్తిగత జీవితంలో కళంకం లేకుండగా, నిజమైన క్రైస్తవులుగా జీవించాలని అంతర్జాతీయ సువార్తీకుడు డాక్టర్ ఎం.వేదనాయకం పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి బెంగళూరు గ్లోరీ టు జీసస్ మినిస్ట్రీస్ వారు ప్రేజర్‌టౌన్ జీసస్ కాల్స్ ప్రేయర్ టవర్‌లో నిర్వహించిన సువార్త కూడికలో పాల్గొని దైవ వర్తమానాన్ని వినిపించారు. పరిశుద్ధ బైబిల్ గ్రంథం చదివిన క్రైస్తవులు మాదరికరమైన జీవితాన్ని గడపాలి. దేవుడి చిత్తానుసారంగా తమ జీవితాలు ఉండాలి, సంఘంలో తమ పాత్ర ఏమిటనేది పరీక్షించుకోవాలని అన్నారు. ప్రతి కుటుంబంలో భయం, భక్తి, వినయం విధేయతతో తమ జీవితాలను గడపాలని హితబోధ చేశారు. కార్యక్రమంలో వివిధ తెలుగు చర్చీల సీనియర్ పాస్టర్లు ఇమ్మానియేల్, వసంతకుమార్, జీవరత్నం, డేవిడ్, దానియేల్ మంచాల, హరిబాబుతో పాటుగా బెంగళూరు గ్లోరీ టు మినిస్ట్రీస్ నిర్వాహకులు ప్రసన్నకుమార్, రమేశ్ కొండ, యోనోశ్, కాల్వదాస్ తదితరులు పాల్గొన్నారు. ఆ తరువాత కూడికకు వచ్చిన వారి కోసం దైవజనుడు ఎం.వేదనాయకం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నేటి నుంచి తుమకూరులో విజయ సంకల్ప యాత్ర



మాట్లాడుతున్న బీజేపీ నేతలు

తుమకూరు: రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలకు సమయం సమీపిస్తుండటంతో పార్టీలు జోరుగా ప్రచారం సాగిస్తున్నాయి. బీజేపీ విజయ సంకల్ప యాత్ర పేరుతో దూసుకుపోతోంది. నేటి నుంచి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో విజయసంకల్ప యాత్ర నిర్వహిస్తున్నామని తుమకూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు హెచ్‌ఎస్ రవిశంకర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తుమకూరు జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పరిధిలో మాజీ సీఎం యడియూరప్ప ఆధ్వర్యంలో విజయసంకల్ప యాత్ర ప్రారంభిస్తారని, ఉదయం 11 గంటలకు తురువెకెరెలో యాత్ర ప్రారంభమై అక్కడే బహిరంగ సభ ఉంటుందని, మంత్రి అశోక్, బీజేపీ జాతీయ కార్యదర్శి సీటీ రవి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం

శివాజీనగర: చరిత్రను తిప్పికొట్టేందుకు సిద్ధమైన బీజేపీకి వ్యతిరేకంగా కన్నడ సంఘాలు, సాహితీవేత్తలు అందరూ ఐక్యతతో పోరాటం చేపట్టాలని కేపీసీసీ అధ్యక్షుడు డీ.కే.శివకుమార్ తెలిపారు. సోమవారం బెళగావి నగరంలో విలేకరులతో మాట్లాడిన ఆయన, టిప్పు సుల్తాన్ గతించి రెండు శతాబ్దాలు గడచినా బీజేపీ చరిత్రను వక్రీకరించడానికి కుట్ర చేస్తోందని, ఉరిగౌడ, నంజేగౌడ పేరుతో కుల సంఘర్షణ సృష్టించేందుకు ప్రయత్నించటం ఖండనీయమన్నారు.ఐక్యతతో మార్పులు సాధ్యమన్న ఆయన, ఈ దిశలో కాంగ్రెస్ బెళగావి నుంచి యువక్రాంతి సమావేశం ఏర్పాటు చేసిందని తెలిపారు.

విదేశాలలో ఉద్యోగమంటూ మోసం

- ఒకరి అరెస్ట్



పోలీసులు అరెస్ట్ చేసిన నిందితుడు

యశవంతపుర: విదేశాలలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి మోసం చేసిన ఢిల్లీకి చెందిన వ్యక్తిని కారవార పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని సయ్యద్ జునైద్‌గా గుర్తించారు. కారవార తాలూకాకు చెందిన కరుణాకర తోళరకు షిప్‌యార్డ్‌లో ఉద్యోగమని ప్రకటనను సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. అతడి మొబైల్ నంబర్‌కు సంప్రదించగా ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూ చేశాడు. మొదట కరుణాకర్‌కు షిప్‌లో సీమెన్‌గాను అనంతరం పదోన్నతి ఇస్తున్నట్లు నమ్మించి మోసం చేశాడు. పలు విడతలుగా రూ.75 లక్షలు జమ చేసుకున్నాడు. బాధితుడు కరుణాకర సీఈఎన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

కశ్మీర్ యువకుడి అరెస్ట్

ఒకే ఆధార్‌కార్డ్‌కు తన ఫొటోను అంటించుకొని మొబైల్ సిమ్‌కార్డులను తీసుకొంటున్న శ్రీనగరకు చెందిన యూసుఫ్ కోజ్వాల్(38)ను అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి నకిలీ ఆధార్‌కార్డ్, సిమ్‌లను స్వాధీనం చేసుకున్నారు. రైల్లో వెళ్లతుండగా మొబైల్ పోగొట్టుకున్న నిందితుడు శిరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాఖలను పరిశీలించగా నకిలీ ఆధార్‌కార్డ్‌తో సిమ్‌లను కొనుగోలు చేసినట్లు బయట పడటంతో పోలీసులు అరెస్ట్ చేశారు.

హోసూరు వార్తలు..

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీ తదితరులు

కెలమంగలం: కెలమంగలం సమితి ఆనేగొళ్ల పంచాయతీలో రూ. 48.98 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు జిల్లా ఎంపీ సెల్లకుమార్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు కావడంతో సోమవారం ఎంపీ సెల్లకుమార్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తేన్‌కో అన్వర్, పంచాయతీ అధ్యక్షులు సంగీత వెంకటరామన్, మారిముత్తు, శ్రీధర్, కౌన్సిలర్ ప్రభాజయరామన్, అబ్దుల్ రహమాన్, శ్రీనివాస్, మాదేశ్, అశోక్ పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీప్రాంతంలో మృతదేహం

క్రిష్ణగిరి: హోసూరు సమీపంలోని శ్యానమావు అటవీ ప్రాంతంలో నిప్పంటించిన స్థితిలో వ్యక్తి మృతదేహాన్ని ఉద్దనపల్లి పోలీసులు స్వాధీనపరుచుకొన్నారు. శ్యానమావు అటవీ ప్రాంతంలో కాలిన స్థితిలో వ్యక్తి శవం ఉన్నట్లు స్థానిక ప్రజలు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు చేరుకొని శవాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతునికి సుమారు 30 ఏళ్ల వయసు ఉంటుందని, ఎవరైనా హత్య చేసి నిప్పంటించి వెళ్లారా, లేక ఆత్మహత్య చేసుకొన్నాడా అన్న విషయంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

తెలుగు రచయితకు అవార్డు

హోసూరు: తెలుగు సాహితీ సేవకు గుర్తింపుగా కర్ణాటక రచయితల సంఘంచే ఉగాది పురస్కారాన్ని హోసూరుకు చెందిన తెలుగు రచయితల సంఘ ప్రతినిధి డాక్టర్ వసంత్ అందుకున్నారు. బెంగళూరులో జరిగిన వేడుకలో వసంత్‌కు జాతీయ పురస్కారాన్ని అందజేశారు. హోసూరుకు చేరుకొన్న ఆయనను క్రిష్ణగిరి రచయితలు అభినందించారు.

సేంద్రియ సాగుపై అవగాహన



పొలంలో రైతులు

హోసూరు: సేంద్రియ వ్యవసాయంపై రైతుల్లో చైతన్యం కల్పించేందుకు హోసూరు ప్రాంతానికి చెందిన 50 మంది రైతులను తేని జిల్లాలో పర్యటించారు. హోసూరు వ్యవసాయ విస్తరణ శాఖ ఆత్మపథక మేనేజర్ సుగుణ, మీనా ఆధ్వర్యంలో పొలాలను పరిశీలించారు. సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేస్తున్న రైతు బాలసుబ్రమణ్యం పొలంలో మట్టి సారవంతాన్ని పెంచడం, చీడపీడల నివారణ, జీవామృతం, పంచగవ్యం తయారీ విధానం, వ్యర్థాలతో ఎరువులు తయారు చేసుకోవడం తదితరాల గురించి రైతులకు అవగాహన కల్పించారు.

ప్లాస్టిక్‌ను నిషేధించండి



రైతు బజారులో వ్యాపారులు, రైతులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న మేయర్

హోసూరు: పర్యావరణంపై దుష్ప్రభావం చూపే ప్లాస్టిక్‌ను నిషేధించాలని హోసూరు మేయర్ సత్య అన్నారు. సోమవారం ఉదయం పసుపు సంచుల పంపిణీ కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ... పలు చోట్ల పసుపు సంచుల పంపిణీ కార్యక్రమాన్ని కార్పొరేషన్ యంత్రాంగం చేపట్టిందని, పసుపు సంచుల వినియోగంపై ప్రజలకు వివరించారు. మొదటగా హోసూరు బస్టాండులో ప్రజలకు పసువు సంచులను పంపిణీ చేశారు. అనంతరం రామనాయకుని చెరువు సమీపంలోని పార్కు వద్ద, రైతు బజారు వద్ద ప్రజలకు సంచులను అందజేశారు. ఈ సందర్భంగా రైతు బజారులోని వ్యాపారులు, రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కామరాజ్ కాలనీలో పసుపు సంచులు పథకంపై చైతన్యం కలిగించే విధంగా విద్యార్థులచే చిత్రలేఖనాలు గీయించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ ఆనందయ్య, కమిషనర్ స్నేహ, పారిశుద్ధ కమిటీ అధ్యక్షులు ఎస్.ఎస్.మాదేశ్వరన్, చెన్నీరప్ప, వార్డు కౌన్సిర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

కెలమంగలం: డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని గుమ్మళాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరుతూ సరస్వతీ పూజ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు, పీటీఏ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ధర్మస్థలంలో ప్రమాణం చేస్తావా ?

యశవంతపుర: ఇటీవల తనతో ఫోన్‌లో మాట్లాడింది నిజం కాదనే విషయంపై ఎమ్మెల్యే శివలింగేగౌడ ధర్మస్థల మంజునాథ స్వామి సన్నిధిలో ప్రమాణం చేయాలని మాజీ మంత్రి రేవణ్ణ సవాల్ విసిరారు. హాసన జిల్లా వ్యాప్తంగా హెచ్‌డీ రేవణ్ణ, అరసీకెరె ఎమ్మెల్యే కెఎం శివలింగేగౌడ మాట్లాడిన ఆడియో సంభాషణపై రేవణ్ణ సోమవారం హాసనలో విలేకర్లతో మాట్లాడారు. ఓ యువకుడు రికార్డ్ చేసిన విషయం తనకు తెలియదన్నారు. లింగాయత్‌లు, ఒక్కలిగ, కురుబ సముదాయం తనకు ఓటు వేయరనే విషయాన్ని శివలింగేగౌడ మాట్లాడినట్లు ఆడియోలో ఉంది.

జరగాల్సిన పనులు చూడండి :

రాష్ట్రంలో జరగాల్సిన పనులు ఎక్కువగా ఉన్నాయి. వీటిని వదలి ఆ గౌడ ఏమి చేశాడు. ఈ గౌడ ఏమి చేశాడనే విషయం ఇప్పుడు అవసరంలేదని పరిశ్రమలశాఖ మంత్రి మురుగేశ్ నిరాణి తెలిపారు. ఆదివారం ఆయన కారవార జిల్లా అంకోలాలో జరిగిన విజయ సంకల్పయాత్రలో పాల్గొని మాట్లాడారు. దేశం అనేక సవాళ్లను ఎదుర్కొంటుంటే ఉరిగౌడ, నంజేగౌడ సినిమా అవసరం లేదన్నారు. అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు.

లారీ బోల్తా.. ఉద్యోగి మృతి

క్రిష్ణగిరి: సూళగిరి సమీపంలో లారీ బోల్తా పడి ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకొంది. సూళగిరి సమీపంలోని మొరసుపట్టి గ్రామానికి చెందిన ప్రకాశ్ (24) ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం ఏనుసోణ-మొరసుపట్టి మార్గంలో ఓ లారీలో ఎక్కాడు. ఆ లారీ కొంతదూరం వెళ్లిన తరువాత అదుపుతప్పి బోల్తాపడింది. తీవ్రంగా గాయపడిన ప్రకాశ్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రాజకీయాల్లోకి మళ్లీ రమ్య

శివాజీనగర: శాసనసభ ఎన్నికల సమీపిస్తుండగా నటి రమ్య రాష్ట్ర రాజకీయాల్లోకి మళ్లీ ప్రవేశం చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై ఏఐసీసీ సభలో చర్చ జరిగి, మూడు నియోజకవర్గాల్లో ఏదైనా ఒకటిలో పోటీ చేయించాలనే కాంగ్రెస్ ప్లాన్ చేసినట్లు ఉన్నత వర్గాల ద్వారా తెలిసింది. రెవెన్యూ శాఖ మంత్రి ఆర్.అశోక్‌పై పద్మనాభనగర నియోజకవర్గం నుంచి పోటీ చేయించే విషయంపై తీవ్ర చర్చ జరిగింది.

పద్మనాభనగర తొలి ప్రాధాన్యత కాగా, మండ్య రెండో ప్రాధాన్యతగా ఉంది. చన్నపట్టణ మూడో ప్రాధాన్యత. ఒకవేళ చన్నపట్టణలో పోటీకి దిగినట్లయితే మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామితో నేరుగా పోటీ చేయాల్సి ఉంటుంది. ఎన్నికల కమిటీ సభలో రామ్యా రాష్ట్ర రాజకీయాల్లోకి మళ్లీ ప్రవేశించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని కొందరు నాయకులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఆప్ ప్రణాళిక అభియాన్

చింతామణి: వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఏమి కావాలన్న ప్రణాళిక కార్యక్రమాన్ని రాష్ట్రమంతటా ప్రారంభించగా చింతామణి శాసనసభ ఆ పార్టీ అభ్యర్థి నీలపల్లి బైరారెడ్డి సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ వెంకటేశ్, నాయకులు దీపక్ రావ్, శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో డాక్టర్లను నియమించండి



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

చింతామణి: తాలూకాలోని కైవార ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లను, సిబ్బందిని నియమించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో తాలూకా ఆరోగ్యాధికారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. కైవార గ్రామపంచాయతీ పరిధిలో అనేక గ్రామాలు వున్నాయని, రాత్రి వేళల్లో వృద్ధులకు, గర్భిణులకు అనారోగ్య సమస్య తలెత్తితే ఇక్కడ డాక్టర్లు, సిబ్బంది కొరత ఉందని, తక్షణమే సిబ్బంది నియమించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో తాలూకా అధ్యక్షుడు కదిరేగౌడ, భీమన్న, శ్రీరామరెడ్డి, బైరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గడినాడ కన్నడోత్సవం



ఊరేగింపు దృశ్యం

చింతామణి: ఉగాది పురస్కరించుకొని కర్ణాటక రక్షణా వేదిక స్వాభిమాన ఆధ్వర్యంలో జిల్లా గడినాడ కన్నడోత్సవ కార్యక్రమాన్ని సోమవారం చింతామణి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణేగౌడ, జిల్లా అధ్యక్షుడు అగ్రహార మోహన్ పట్టణంలోని ప్రముఖ వీధుల్లో ఊరేగింపుగా వెళ్లారు, ఈ సందర్భంగా వివిధ జానపద కళా బృందాలు ఆకట్టుకున్నాయి.

దర్గా హుండీ లెక్కింపు



లెక్కించిన నగదు

చింతామణి: తాలూకాలోని మురగమల్ల గ్రామంలోని అమ్మాజాన్ బావాజాన్ దర్గా హుండీని సోమవారం లెక్కించారు. రూ. 30 లక్షలు నగదు రూపంలో వచ్చింది. నగదును జిల్లా వక్ఫ్ సలహా సమితి అధ్యక్షుడు ముజమిల్‌పాషా బ్యాంకు అధికారులకు అప్పగించారు. లెక్కింపు కార్యక్రమంలో దర్గా కార్యదర్శి ఆరీఫ్‌ఖాన్, అన్సర్‌ఖాన్, అన్వర్‌ఖాన్, కెనరా బ్యాంక్ మేనేజర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

23న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

సాక్షి, అమరావతి: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 23వ తేదీన అసెంబ్లీలో పోలింగ్ ఉంటుందని శాసన సభలో స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం ప్రకటించారు. కమిటీ హాల్ నంబర్–1లో పోలింగ్ ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ఉగాది పండుగ సందర్భంగా మంగళ, బుధవారాలు అసెంబ్లీకి సెలవు అని, సభ తిరిగి గురువారం సమావేశం అవుతుందని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై మాక్ పోలింగ్

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలకు సోమవారం అసెంబ్లీలోని మీటింగ్ హాల్‌లో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలనే దానిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. పార్టీ ముఖ్యులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మొత్తం ఏడు స్థానాలకు వైఎస్సార్‌సీపీ తరఫున ఏడుగురు అభ్యర్థులుపోటీ చేస్తున్నారు.

సమగ్ర సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

- శాసనమండలిలో స్వల్పకాలిక చర్చలో రెవెన్యూ మంత్రి ధర్మాన
- రెవెన్యూ శాఖకు చెందిన మూడు బిల్లులకు ఆమోదం



సాక్షి, అమరావతి: సమగ్ర రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. డబుల్ ఎంట్రీ, దొంగ రిజిస్ట్రేషన్‌లు ఆగిపోతాయన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న 'సమగ్ర భూ సర్వే'పై శాసనమండలిలో సోమవారం స్వల్పకాలిక చర్చ జరిగింది. సభ్యులు ప్రస్తావించిన పలు అంశాలపై మంత్రి ధర్మాన బదులిస్తూ.. సర్వే పూర్తయ్యాక ఖచ్చితమైన వివరాలతో డిజిటలైజేషన్ చేస్తామన్నారు. దీనివల్ల అక్రమాలకు చెక్ పెట్టడంతోపాటు అనేక సమస్యలను పరిష్కరించవచ్చని తెలిపారు. ప్రజలు, రైతుల ఆస్తులు కాపాడటానికి వ్యయప్రయాసలకోర్చి చేస్తున్న ఈ సర్వేకు వారు సహకరించాలని కోరారు. స్వల్పకాలిక చర్చకు ముందు '2023–ఆంధ్రప్రదేశ్ చుక్కల భూములు(పునఃపరిష్కార రిజిస్టర్ ఆధునికీకరణ)', '2023–ఆంధ్రప్రదేశ్ భూమి హక్కులు–పట్టాదారు పాసు పుస్తకాలు', '2023–ఆంధ్రప్రదేశ్(ఆంధ్ర ప్రాంత) ఇనాముల (రద్దు, రైత్వారీలోకి మార్పిడి)' మూడు సవరణ బిల్లులను మండలిలో ఆమోదించారు. సభ్యులు అడిగిన ప్రశ్నకు వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బదులిస్తూ గత ప్రభుత్వ హయాంలో దుర్వినియోగమైన 'రెయిన్ గన్స్' ఎక్కడున్నాయో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రశ్నోత్తరాల మధ్యలోనే వెళ్లిపోయిన టీడీపీ ఎమ్మెల్సీలు

- ముందుగా వాయిదా తీర్మానంపై చర్చకు పట్టు
- చైర్మన్ పోడియం వద్ద ఆందోళన
- ప్రశ్నోత్తరాలు జరుగుతుండగా మూకుమ్మడిగా సభ వెలుపలకు

సాక్షి, అమరావతి : శాసన మండలి నుంచి తెలుగుదేశం పార్టీ సభ్యులు హఠాత్తుగా బయటకు వెళ్లిపోయారు. వారి చర్య అందరినీ విస్మయానికి గురిచేసింది. సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వారి చర్యను మండలిలోని ఇతర సభ్యులు తప్పుపట్టారు. సభ ప్రారంభం కాగానే జీవో నంబర్ 1పై చర్చను కోరుతూ టీడీపీ సభ్యులు వాయిదా తీర్మానం ఇచ్చారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ప్రజాస్వామ్య హక్కుల అంశంపై చర్చ కోరుతూ మరో వాయిదా తీర్మానం ఇచ్చారు. ఈ రెండింటినీ తిరస్కరిస్తున్నట్టు చైర్మన్ మోషేన్‌రాజు ప్రకటించారు. ఆ వెంటనే టీడీపీ సభ్యులు చైర్మన్ పోడియం వద్దకొచ్చి జీవో నంబర్ 1పై సభలో చర్చ జరపాలంటూ నినాదాలు చేశారు. ఇది మంచి పద్ధతి కాదని టీడీపీ సభ్యులను చైర్మన్ పదే పదే వారించారు. రోజూ ఏవో కాగితాలు పట్టుకొచ్చి గొడవ చేయడం మంచిది కాదని సూచించారు. అదే సమయంలో మంత్రి బొత్స సత్యనారాయణ జోక్యం చేసుకొని జీవో నంబర్ 1పై వీళ్లు న్యాయస్థానాలకు వెళ్లారని, చట్టాలకు లోబడే ఆ జీవో తీసుకొచ్చామని వివరించారు. మరోవైపు పీడీఎఫ్ ఎమ్మెల్సీలు లేవనెత్తిన అంగన్‌వాడీల అంశంపై వేరొక ఫారంలో నోటీసు ఇస్తే దానిపై చైర్మన్ సూచన మేరకు చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. దీంతో అప్పటివరకు నిల్చొని ఉన్న పీడీఎఫ్ సభ్యులు వెళ్లి తమ సీట్లలో కూర్చున్నారు. ఆ తర్వాత చైర్మన్ యథావిధిగా ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని కొనసాగించారు. అయినప్పటికీ పోడియం వద్దే ఉన్న టీడీపీ సభ్యులు కొద్దిసేపటి తర్వాత వారి చేతుల్లోని కాగితాలు చించి పైకి విసిరివేస్తూ, అందరూ ఒకేసారి సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. దీనిపై మంత్రి అంబటి మాట్లాడుతూ వారు తెచ్చుకున్న కాగితాలను వారే చించేసి వెళ్లడం సంతోషించదగ్గ పరిణామమని వ్యాఖ్యానించారు.

స్పీకర్‌పై టీడీపీ వికృత చేష్టలు.. దాడి

అసెంబ్లీకి బ్లాక్ డే



స్పీకర్ పోడియం ఎదుట వైఎస్సార్‌సీపీ సభ్యులను నెట్టివేస్తున్న టీడీపీ సభ్యులు

సాక్షి, అమరావతి : ఈసారి అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నుంచి సభను అడ్డుకోవడమే లక్ష్యంగా నిత్యం రచ్చరచ్చ చేస్తున్న టీడీపీ సభ్యుల దుశ్చర్య సోమవారం పరాకాష్టకు చేరుకుంది. ఏకంగా సభాపతి తమ్మినేని సీతారాంపై దాడికి తెగబడ్డారు. సభా సంప్రదాయాలను తుంగలో తొక్కుతూ చరిత్రలో ఎన్నడూలేని విధంగా టీడీపీ ఎమ్మెల్యేలు తమ వికృత చేష్టలను బయటపెట్టారు. సభాపతిపై దాడిని అడ్డుకునేందుకు వచ్చిన మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలపైనా దాడిచేశారు. చివరకు మార్షల్స్‌ను కూడా పిడిగుద్దులు గుద్దుతూ భౌతిక దాడులకు పాల్పడ్డారు. శాసనసభ చరిత్రలో మాయని మచ్చగా మిగిలిన ఈ ఘటనపై స్పీకర్ తమ్మినేని తీవ్ర మనస్తాపంతో సభ నుంచి తన చాంబర్లోకి వెళ్లిపోయారు. ఆ తర్వాత కూడా వారు నినాదాలు చేస్తూ నానా రచ్చచేశారు.

సభ ప్రారంభం కాగానే గలాటా..

సభ సోమవారం ఉదయం ప్రారంభం కాగానే జీఓ–1 రద్దు మీద తామిచ్చిన వాయిదా తీర్మానంపై చర్చకు టీడీపీ సభ్యులు పట్టుబట్టారు. ముందుగా వాయిదా తీర్మానం చదివి వినిపించాలని టీడీపీ ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు డిమాండ్ చేయగా.. 'వాయిదా తీర్మానం ఎప్పుడు చర్చకు అనుమతించాలో నాకు తెలుసు.. ముందు మీరు కూర్చోండి' అంటూ స్పీకర్ కోరారు. ప్రశ్నోత్తరాల తర్వాత వాయిదా తీర్మానంపై నిర్ణయం తీసుకుంటానని చెబుతూ స్పీకర్ క్వశ్చన్ అవర్‌ను ప్రారంభించారు. ఈ సమయంలో మంత్రి కారుమూరు నాగేశ్వరరావు ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ప్రశ్నకు సమాధానం చెబుతుండగానే అచ్చెన్నాయుడు స్పీకర్ వైపు వేలు చూపిస్తూ ముందు తామిచ్చిన వాయిదా తీర్మానాన్ని సభలో చదివి వినిపించాలంటూ బిగ్గరగా కేకలు వేశారు. దీనిపై స్పీకర్ అసహనం వ్యక్తంచేస్తూ 'చైర్‌ను మీరు డిక్టేట్ చేస్తున్నారా?' అనడంతో టీడీపీ సభ్యులంతా ప్లకార్డులతో వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేయడం మొదలుపెట్టారు.

చర్చలో పాల్గొనాలని ఎంత చెప్పినా...

'సభ ప్రారంభమై పట్టుమని పది నిమిషాలు కూడా కాకుండానే మీరు ఇలా ప్రవర్తించడం సరికాదు.. దయచేసి పద్ధతి మార్చుకోండి..' అని స్పీకర్‌తో సహా మంత్రులు హితవు పలికినా టీడీపీ సభ్యులు వినిపించుకోకుండా వెల్ నుంచి పోడియంపైకి ఎక్కి స్పీకర్ చైర్‌కు ఇరువైపులా చేరి పెద్దఎత్తున నినాదాలు చేయడం మొదలుపెట్టారు. మరోవైపు.. స్పీకర్ టేబుల్‌పై ఉన్న పుస్తకాలు, పత్రాలు చించివేస్తూ ఆయన ముఖంపైకి విసరడం ప్రారంభించారు. కిందనున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శాసనసభ సిబ్బంది వద్ద ఉన్న ప్రొసీడింగ్స్ కాపీలను పోడియంపైనున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు అందించగానే అతను వాటిని చించి స్పీకర్‌పై విసరడం మొదలుపెట్టారు. ఓ వైపు కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే మరోవైపు స్పీకర్ చైర్‌ను చేతులతో కొడుతూ కాగితాలు చించి విసిరారు. ఈ సమయంలో స్పీకర్ ఏమాత్రం సంయమనం కోల్పోకుండా 'దయచేసి పోడియం దిగి మీ మీ స్థానాల్లో వెళ్లి కూర్చోండి. ప్రశ్నోత్తరాల్లో పాల్గొనండి'.. అంటూ పదేపదే విజ్ఞప్తి చేసినా టీడీపీ సభ్యులు ఆయన్ను పట్టించుకోకుండా గొడవ చేస్తూనే ఉన్నారు.

ఎస్సీ ఎమ్మెల్యేలపై దాడి..

అదే సమయంలో.. తమ హక్కులు కాపాడాలంటూ వెల్ బయటి నుంచి విన్నవిస్తున్న చింతలపూడి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా సభాపతిపై జరుగుతున్న దాడిని గమనించి పోడియం పైకెళ్లి టీడీపీ ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామిని అడ్డుకోవడంతో ఆయనను టీడీపీ సభ్యులు తోసేసారు. స్పీకర్‌తోపాటు సహచర ఎమ్మెల్యే ఎలీజాపై టీడీపీ సభ్యులు భౌతిక దాడి చేస్తుండడంతో సంతనూతలపాడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పోడియంపైకి వచ్చి వారిని అడ్డుకోబోయారు. ఆయనపైనా దాడికి పాల్పడుతూ పక్కకు తోసేయడంతో సుధాకర్‌బాబు పోడియం హ్యాండ్ రెయిలింగ్‌పై పడిపోయారు. దీంతో సుధాకర్‌బాబు ఎడమ మోచేతికి గాయమైంది. పట్టుతప్పితే ఆయనకు పెద్ద ప్రమాదమే జరిగేది. అయినా, టీడీపీ సభ్యుల అరాచకం ఆగలేదు. సుధాకర్‌బాబుతో పాటు ఎలీజాపై దాడిచేస్తూనే ఉన్నారు. వారి నుంచి తమ సభ్యులను కాపాడుకునేందుకు సభలో ఉన్న మంత్రులు, ఇతర ఎమ్మెల్యేలు వెల్ నుంచి పైకి వెళ్లబోతుండగా వారిని తోసుకుంటూ టీడీపీ సభ్యులు కిందకు వచ్చేశారు. ఈ దశలో సభలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

సస్పెన్షన్ అయ్యాక.. మార్షల్స్‌పై పిడిగుద్దులు

అర్ధగంట అనంతరం సభ తిరిగి ప్రారంభమైన తర్వాత టీడీపీ సభ్యులను ఒకరోజు సస్పెన్షన్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. సస్పెండ్ చేసినందున దయచేసి సభ నుంచి వెళ్లిపోవాలని ఆదేశించినా, వారు అక్కడే బైఠాయించబోయారు. బయటకు పంపేందుకు ప్రయత్నిస్తున్న మార్షల్స్‌పైనా పిడిగుద్దులతో దాడికి దిగారు. చివరికి డోలాను బలవంతంగా ఎత్తుకుని బయటకు తీసుకెళ్లగా, ఆయన వెంట మిగిలిన టీడీపీ సభ్యులు కవ్విస్తూ బయటకెళ్లారు.

డిప్యూటీ సీఎంపై 'డోలా' అనుచిత వ్యాఖ్యలు

తనపై జరిగిన దాడితో పాటు సభలో టీడీపీ సభ్యుల దుశ్చర్యకు మనస్తాపం చెందిన స్పీకర్ సీతారాం సభ నుంచి తన చాంబర్‌లోకి వెళ్లిపోయారు. ఇంతలో మార్షల్స్ టీడీపీ సభ్యులను బలవంతంగా వారి స్థానాల దగ్గరకు తీసుకెళ్లారు. రోజూ రచ్చచేయడం టీడీపీ సభ్యులకు అలవాటుగా మారిందని, ఈరోజు ఏకంగా సభాపతిపైనే దాడులకు తెగబడ్డారంటూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అనడంతో.. 'నువ్వేక డిప్యూటీ సీఎం అంట్రా.. పనికిమాలిన నా కొడకా'.. అంటూ డోలా బాలవీరాంజనేయస్వామి పరుష పదజాలంతో నానా దుర్భాషలాడడంతో మిగిలిన సభ్యులు ఆయన్ని వారించారు. అక్కడ నుంచి స్పీకర్, సీఎం, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను టీడీపీ సభ్యులు రెచ్చగొట్టేలా నినాదాలు చేస్తూనే ఉన్నారు.

అటెండర్‌ను తోసేసి స్పీకర్‌పైకి దూసుకొచ్చి..

ఈ సమయంలో టీడీపీ సభ్యుల తీరుకు నిరసనగా మంత్రులు, ఎమ్మెల్యేలు సభలో మాట్లాడుతుండగా, స్పీకర్ అటెండర్‌ను పక్కకు తోసేసిన టీడీపీ ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామి స్పీకర్‌కు అడ్డంగా నిలబడి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఓ వైపు వీరాంజనేయస్వామి, మరోవైపు వెలగపూడి రామకృష్ణబాబు తదితరులు చైర్‌పై స్పీకర్ చేతులు కూడా పెట్టుకోనీయకుండా ఇబ్బంది కల్గిస్తూ స్పీకర్ ముఖానికి ప్లకార్డులు అడ్డంపెట్టారు. అచ్చెన్నాయుడు, బుచ్చయ్యచౌదరి, చినరాజప్ప కూడా ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఇంతలో టీడీపీ ఎమ్మెల్యే బాలవీరాంజనేయస్వామి స్పీకర్ ముఖంపై ప్లకార్డును అడ్డంగా పెట్టడంతో పాటు ఆయనపై చేయిచేసుకున్నారు. ప్లకార్డు స్పీకర్ కంటికి తగలడంతో ఆయన దాన్ని పక్కకు తోసివేయడంతో అది కిందపడింది. దీంతో డోలా బాలవీరాంజనేయస్వామితో పాటు టీడీపీ సభ్యులు స్పీకర్ చైర్ చుట్టూ మూగి ఆయనపై దాడికి తెగబడ్డారు.

స్పీకర్‌పై దాడి వెనుక కర్త, కర్మ, క్రియ చంద్రబాబే

ఆయన లేని సభ సర్వనాశనం కావాలన్నది బాబు ఆలోచన

- అసెంబ్లీ, రాష్ట్రం ప్రశాంతంగా ఉండకూడదని అరాచకాలు
- తొలి నుంచి బాబు నైజం అదే
- ఎస్సీ ఎమ్మెల్యేను ముందుంచి దాడి చేయించారు
- కులాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు
- స్పీకర్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంటే చంద్రబాబుకు చిన్నచూపు
- శాసన సభలో మంత్రులు, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేల ధ్వజం

సాక్షి, అమరావతి: శాసన సభలో సోమవారం స్పీకర్ తమ్మినేని సీతారాంపై తెలుగుదేశం పార్టీ సభ్యులు డోలా బాలవీరాంజనేయస్వామి, ఆ పార్టీకి చెందిన ఇతర ఎమ్మెల్యేలు దాడి చేయడం అత్యంత హేయమైన, దిగజారుడు చర్య అని మంత్రులు, అధికార వైఎస్సార్సీపీ సభ్యులు తీవ్రంగా ఖండించారు. సోమవారం అసెంబ్లీలో టీడీపీ సభ్యుల తీరు, స్పీకర్‌పై దాడి ఘటనపై సభలో మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడారు. ఎస్సీ వర్గానికి చెందిన ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామిని ముందుంచి చంద్రబాబునాయుడే ఈ దాడి చేయించారని చెప్పారు. స్పీకర్‌పై దాడికి కర్త, కర్మ, క్రియ మొత్తం చంద్రబాబేనని ధ్వజమెత్తారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చంద్రబాబే ముందస్తు ప్రణాళికతో దాడులు చేయిస్తున్నారు



అసెంబ్లీలో జరిగిన సంఘటన బాధాకరం. టీడీపీ వైఖరి మొదటి నుంచి ఇదే మాదిరిగా ఉంది. సస్పెండ్ అయి బయటకు వెళ్లాలని స్పీకర్ పోడియంపైకి ఎక్కి నిరసనలు చేయడం, వారి పచ్చ పత్రికల్లో వార్తలు వచ్చేలా వ్యవహరించడమే పనిగా పెట్టుకున్నారు. గతంలో రెడ్‌లైన్ దాటితే ఆటోమెటిగ్గా సస్పెన్షన్ రూలు పెట్టారు. అది అమలు కావడం లేదు. ఇప్పుడు స్పీకర్ పోడియం పైకి ఎక్కినా మీరు సంయమనంతో ఉన్నారు. మీరు సస్పెండ్ చేయకుండా ఉండటంతో కొంత ఆలస్యం అవ్వడం వల్ల వారు దాన్ని జీర్ణించుకోలేక మీపై దాడికి దిగడం దారుణం. ఎస్సీ ఎమ్మెల్యేకు తర్ఫీదు ఇచ్చి చంద్రబాబు వెనుక నుంచి ఇదంతా నడిపిస్తున్నారు. ఆయన లేని సభ సర్వనాశనం కావాలని ఇలా చేస్తున్నారు. స్పీకర్‌ను గుద్దడం, ముఖంపై చేయిపెట్టడం దారుణం. బాబుకు స్పీకర్‌పై కక్ష ఉన్నట్లు ఉంది. స్పీకర్‌గా సీతారాం ఎన్నికైనప్పుడు సీట్లో కూర్చోబెట్టడానికి కూడా ఇష్టపడలేదు. ఓ బీసీ స్పీకర్‌గా ఉండడం ఆయనకు ఇష్టం లేదు. టీడీపీ వారికి సభలో ఉండటం ఇష్టం లేకపోతే వాకౌట్ చేసి వెళ్లిపోవాలి.

– అంబటి రాంబాబు, జలవనరుల శాఖ మంత్రి

చంద్రబాబే సభలో రభస చేయిస్తున్నారు



జీవో నంబర్ 1 ఎందుకు తేవాల్సి వచ్చిందో ప్రజలందరికీ తెలుసు. చంద్రబాబు కారణంగా అమాయక ప్రజలు చనిపోతుండడంతో రోడ్లపై మీటింగులు వద్దని జీవో తెచ్చారు. దానిపై రాద్ధాంతం ఏమిటి? చంద్రబాబు తన సభ్యులను రెచ్చగొట్టి సభలో రభస సృష్టిస్తున్నారు.

– కొట్టు సత్యనారాయణ, దేవదాయ శాఖ మంత్రి

రెడ్‌లైన్ దాటి వచ్చే వారిని వెంటనే సస్పెండ్ చేయాలి



బీసీ, ఎస్సీ, ఎస్టీల పట్ల ప్రతిపక్ష పార్టీకి ఎప్పుడూ చిన్న చూపే. స్పీకర్ సహనాన్ని అలుసుగా తీసుకొని ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. మార్షల్స్‌ను కూడా కొడుతున్నారు. ఎస్సీ ఎమ్మెల్యే బాలవీరాంజనేయస్వామిని ముందుంచి ఇదంతా చేస్తున్నారు. రెడ్‌లైన్ దాటి వచ్చే వారిని సస్పెండ్ చేయాల్సిందే.

– చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, సమాచార శాఖ మంత్రి

బాబు డైరెక్షన్‌లో టీడీపీ సభ్యుల దుర్మార్గం



బాబు డైరెక్షన్లో టీడీపీ సభ్యులు దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారు. ప్రశ్నోత్తరాలను అడ్డుకుంటున్నారు. సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న ప్రజల ఆశల్ని నీరుగారుస్తున్నారు.

– అంజాద్ బాషా, ఉపముఖ్యమంత్రి

దాడి చేసిన వారిని టెన్యూర్ మొత్తం సస్పెండ్ చేయాలి



బాలవీరాంజనేయస్వామి డాక్టర్ అయ్యుండి కూడా హుందాతనం లేకుండా ప్రవర్తిస్తున్నారు. బయట కూడా ఆయన తీరు ఇలానే ఉంటోంది. ఆయన్ని ఉపయోగించుకుని టీడీపీ కులాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తోంది. స్పీకర్ గతంలో మాదిరి సింహంలా ఉండాలి. దాడి చేసిన వారిని టెన్యూర్ మొత్తం సస్పెండ్ చేయాలి. జీవో 1 రద్దుకు డిమాండ్ చేస్తున్నారు. ఆ జీవో మీరు ప్రజల ప్రాణాలు బలిగొనడం వల్లే వచ్చింది. అన్ని పార్టీలకూ వర్తిస్తుంది.

– ఆదిమూలపు సురేష్, పురపాలక శాఖ మంత్రి

బీసీ నేత స్పీకర్‌గా ఉండడాన్ని చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారు



బీసీ నేతను స్పీకర్‌గా చేస్తే చంద్రబాబు తట్టుకోలేక బాలవీరాంజనేయస్వామి చేత ఉద్దేశపూర్వకంగా ఇదంతా చేయిస్తున్నారు. కులాల మధ్య చిచ్చుపెట్టాలని ఎస్సీ ఎమ్మెల్యే చేత బీసీ స్పీకర్‌పై చంద్రబాబు దాడి చేయించారు. అటెండర్‌ను కూడా పక్కకు తోసేసి బాలవీరాంజనేయస్వామి స్పీకర్‌పై దాడికి దిగడం దారుణం. గతంలో ఏ తప్పూ లేకున్నా ఎమ్మెల్యేగా ఉన్న రోజాను ఏడాదిపాటు సస్పెండ్ చేశారు. ఇప్పుడు అంతకన్నా కఠినంగా శిక్షించాలి.

– సీదిరి అప్పలరాజు, మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి

స్పీకర్‌పై దాడి అత్యంత హేయం



స్పీకర్ పోడియం పైకి అసలు ఎవరూ ఎక్కకూడదు. కానీ టీడీపీ సభ్యులు మూడువైపుల నుంచి చుట్టుముట్టి దాడిచేశారు. స్పీకర్ కంటికి తగిలేలా ప్లకార్డులు ప్రదర్శించడం, చేతులతో ఆయనపై దాడిచేసేలా వ్యవహరించడం అత్యంత హేయం. ఇలాంటి వారిని శాశ్వతంగా బహిష్కరించాలి. డిప్యూటీ సీఎంను తీవ్రంగా దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి.

– పినిపె విశ్వరూప్, రవాణా శాఖ మంత్రి

అసెంబ్లీలో టీడీపీ దిగజారి వ్యవహరిస్తోంది



టీడీపీ గూండాయిజంతో అసెంబ్లీలో దిగజారి వ్యవహరిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు దూరం కావడంతో చంద్రబాబు చివరకు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. నెల్లూరు, గుంటూరు జిల్లాల్లోనే కాకుండా అంతకు ముందు రాజమండ్రిలో చంద్రబాబు ప్రచారపిచ్చికి అమాయకులు బలయ్యారు. టీడీపీ సభ్యులను శాశ్వతంగా సస్పెండ్ చేయాలి.

– విడదల రజిని, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి

గెలుపు భ్రమల్లో టీడీపీ అరాచకాలు



చంద్రబాబు ముందస్తు కుట్రలో భాగంగానే ఇదంతా చేయిస్తున్నారు. రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలు గెలవగానే ఏదో జరిగిపోతోందని భ్రమలో ఉన్నారు. మేము మొత్తంగా 11 ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకున్నాం. 2007లో టీడీపీ రెండు ఎమ్మెల్సీ స్థానాలను గెలిచినా.. ఆ తర్వాత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది వైఎస్సారే. ప్రజల ప్రాణాలకు రక్షణ కోసం తెచ్చిన జీవో 1పై గందరగోళం సృష్టిస్తూ బీసీ స్పీకర్, దళిత ఎమ్మెల్యేపై దాడి చేయడం దారుణం.

– ఉషశ్రీ చరణ్, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి

2024లో టీడీపీ చీటి చిరిగిపోవడం ఖాయం



చంద్రబాబు జీవితమంతా కుతంత్రాలు, వెన్నుపోట్లే. ఈ సభ ప్రశాంతంగా జరగడం ఇష్టంలేక దిగజారుడు రాజకీయం చేస్తున్నారు. పబ్లిసిటీ పిచ్చితో సందుల్లో సభలు పెట్టి 11 మందిని పొట్టన పెట్టుకున్న చంద్రబాబుకు ఇంకా బుద్ధిరాలేదు. సభలో చంద్రబాబు సామాజికవర్గం సభ్యులు ఉండగా ఎందుకు బాలవీరాంజనేయస్వామిని ముందు పెట్టి సభను పక్కదారి పట్టిస్తున్నారు? స్పీకర్‌పై పేపర్లు చింపి విసురుతున్న టీడీపీ చీటీలు 2024లో ప్రజలు చించేయడం ఖాయం.

– ఆర్కే రోజా, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి

మా హక్కులు కాపాడాలని కోరడానికి వెళ్తే టీడీపీ నాపై దాడి చేసింది



మా హక్కులు కూడా కాపాడాలని నేను సీట్లో నుంచి కోరినా స్పీకర్‌కు వినిపించకపోవడంతో కింది నుంచి ఆయన్ను కోరడానికి వెళ్లాను. ఆ సమయంలో స్పీకర్‌పై టీడీపీ సభ్యులు దాడికి దిగుతుండడం, బాల వీరాంజనేయస్వామి చేయి స్పీకర్‌పై పడడం చూసి పోడియంపైకి ఎక్కాను. బాల వీరాంజనేయస్వామిని నేను పక్కకు లాగబోతే నాపై దాడి చేశారు. నన్ను కాపాడటానికి వచ్చిన సుధాకర్‌బాబు పైనా దాడి చేశారు. బాలవీరాంజనేయస్వామిని ఈ టెన్యూర్ అంతా సస్పెండ్ చేయాలి.

– ఎలీజా, చింతలపూడి ఎమ్మెల్యే

ఎలీజాపై దాడిని అడ్డుకోబోతే నాపై దాడి చేశారు



అసెంబ్లీ చరిత్రలో ఇది బ్లాక్‌డే. డిప్యూటీ సీఎంను పట్టుకొని ఏంరా నాకొడకా.. అని టీడీపీ సభ్యులు తిట్టారు. ఏకంగా స్పీకర్‌పై దాడికి దిగారు. మా హక్కులు కాపాడాలని కోరడానికి వెళ్లిన ఎలీజా దీన్ని చూసి అడ్డుకోబోతే ఆయనపై దాడిచేశారు. ఆ సమయంలో నేను పైకి వెళ్లి ఆపబోతే నాపైనా దాడి చేశారు. బయటకు వెళ్లి మేమే దాడిచేశామని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు.

– సుధాకర్‌బాబు, సంతనూతలపాడు ఎమ్మెల్యే

రోజా సభను అడ్డుకోవడమే టీడీపీ పని

చంద్రబాబుకు అల్లరి లేకపోతే నిద్రపట్టదు. అసెంబ్లీ ప్రారంభమైన తొలి రోజు నుంచీ సభను అడ్డుకోవడమే టీడీపీ సభ్యుల పని. ఈ ఏడు రోజుల్లో వారు ఒక్క గంటసేపు కూడా చర్చలో పాల్గొనలేదు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా చంద్రబాబు, టీడీపీ సభ్యులు అసెంబ్లీని అవమానపరిచేలా వ్యవహరించేవారు. చివరకు స్పీకర్ బయటకు రాకుండా ఆయన చాంబర్ వద్ద, అసెంబ్లీ లోపల బైఠాయించేవారు. ఇప్పుడు ఏకంగా స్పీకర్‌పై దాడికి దిగుతున్నారు. సుధాకర్‌బాబుపై దాడి చేసి తోసేశారు. ఆయన పైనుంచి కింద పడి ఉంటే తలకు గాయాలై ఉండేది. బాలవీరాంజనేయస్వామి తీరుతో ఎస్సీ సామాజిక వర్గానికే చెడ్డ పేరు వస్తోంది. అందుకే స్పీకర్‌పై ఆయన దాడి చేయకుండా అడ్డుకొనేందుకు సుధాకర్‌బాబు వెళ్లారు. ఆయనపైనా దాడిచేశారు.

– ఎమ్మెల్యేలు ప్రసాదరాజు, ఆర్థర్, సామినేని ఉదయభాను, అలజంగి జోగారావు, వరప్రసాద్, తిప్పేస్వామి, కంబాల జోగులు, మల్లాది విష్ణు, కొండేటి చిట్టిబాబు, కాపు రామచంద్రారెడ్డి

టీడీపీ 'సామాజిక' చిచ్చు

సభా విలువలు.. సభాపతి స్థానంపై ఆ పార్టీకి గౌరవం లేదు

- వేళ్లు చూపిస్తూ.. సభ కనిపించకుండా ముఖానికి ప్లకార్డులు అడ్డుపెడతారా?
- ప్లకార్డు అడ్డు తొలగిస్తే స్పీకర్ కొట్టేశారంటూ గోల చేస్తారా?
- సభలో సభ్యులందరికీ సమాన హక్కులుంటాయి
- ప్రశ్నోత్తరాల తర్వాతే వాయిదా తీర్మానం ఇవ్వాలని టీడీపీ సభ్యులకు తెలీదా?
- ప్రొసీడింగ్స్ చదవకుండా సభలో గందరగోళం చేయడానికే వస్తున్నారు
- ఇలా చేయమని వారికి ఎవరు చెబుతున్నారు?
- ఇన్నాళ్లు వారి ప్రవర్తన, అసభ్య కామెంట్లను మౌనంగా భరించా.. సహించా
- టీడీపీ సభ్యుల అనుచిత ప్రవర్తనపై స్పీకర్ తమ్మినేని సీతారాం ఆవేదన
- సభ్యులు వెల్‌లోకి వచ్చినా.. నినాదాలు చేసినా సస్పెండ్ అయ్యేలా రూలింగ్



సాక్షి, అమరావతి : సామాజికవర్గాల మధ్య చిచ్చు పెట్టేలా టీడీపీ సభ్యులు సభలో ప్రవర్తిస్తున్నారని శాసనసభ సభాపతి తమ్మినేని సీతారాం విమర్శించారు. వాయిదా తీర్మానానికి ఆర్డర్‌లో రావాలని చెప్పినా వినిపించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గౌరవం ఇవ్వలేని ప్రతిపక్షం ఉన్న సభలో సభాపతిగా ఉండటం బాధగా ఉందన్నారు. తన విధులను త్రికరణశుద్ధిగా నిర్వర్తించాలనే ఆలోచనతో సభను నడిపిస్తున్నట్లు చెప్పారు. తనకు పార్టీలపైనా, ఏ ఒక్క సభ్యుడిపైనా ప్రత్యేక అభిమానం లేదన్నారు. కానీ, టీడీపీ సభ్యుల అనుచిత ప్రవర్తనను ఇన్నాళ్లూ మౌనంగా సహించానన్నారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సోమవారం అసెంబ్లీలో చోటుచేసుకున్న ఘటనలపై స్పీకర్ స్పందిస్తూ..

'సభాపతి స్థానానికి కొన్ని పద్ధతులుంటాయి. వాటిని పట్టించుకోకుండా టీడీపీ సభ్యులు పోడియంపైకి వచ్చి నినాదాలు చేస్తారు. చైర్‌ను చుట్టుముట్టి గుద్దుతారు. నా ముఖంపై వేళ్లు చూపిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్నారు. డోలా బాలవీరాంజనేయస్వామి ప్రవర్తించిన తీరు హేయంగా ఉంది. అచ్చెన్నాయుడు అయితే ఎత్తుగా ఉండటంతో కింద నుంచే సభ కనిపించకుండా నా ముఖానికి ఎదురుగా ప్లకార్డు అడ్డుపెడతారు. రామకృష్ణబాబు స్టీరియో కామెంట్లు చేస్తారు. అయినా మౌనంగానే భరించాను.. సహించాను. ఎమ్మెల్యే ఏలిజా (వైఎస్సార్‌సీపీ) వచ్చి మా హక్కులు రక్షించాలని కోరుతుంటే.. టీడీపీ సభ్యుడు నా ముఖానికి అడ్డుగా పెట్టిన ప్లకార్డును పక్కకు జరిపాను. అది కింద పడిపోయింది. అంతే.. వెంటనే స్పీకర్ కొట్టేశారంటూ గోలచేశారు. ఇలా చేయమని మీకు ఎవరు చెప్పి పంపిస్తున్నారు? ఇది మంచి సంస్కారం కాదు'.. అని టీడీపీ సభ్యులకు తమ్మినేని హితవు పలికారు.

విలువైన సభా సమయం వృథా..

ఇక సభలో సభ్యులందరికీ సమాన హక్కులు ఉంటాయని స్పీకర్ స్పష్టంచేశారు. ఇది తెలుసుకోకుండా టీడీపీ సభ్యులు సభా సమయాన్ని, ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు మైక్ ఇస్తుంటే సభను తప్పుదారి పట్టిస్తున్నారని.. సభ జరుగుతున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని.. కచ్చితంగా సమయం వచ్చినప్పుడు నిర్ణయం తీసుకుంటారన్నారు.

ఆర్డర్ ప్రకారమే సభను నడిపిస్తాం

నిజానికి.. సభలో వాయిదా తీర్మానం అనేది ప్రశ్నోత్తరాల తర్వాత వస్తుందని స్పీకర్ చెప్పారు. గత ప్రభుత్వంలో 5–3–2016న అప్పటి సభలోనూ ఇదే చెప్పారన్నారు. 'టీడీపీ వాళ్లు చెప్పింది వాళ్లకే గుర్తులేకపోవడం దురదృష్టకరం. ప్రొసీడింగ్ చదవకుండా సభలో గందరగోళం సృష్టించి, అగౌరవపరచడం దారుణం. ప్రశ్నోత్తరాలు జరుగుతుంటే.. అచ్చెన్నాయుడు వాయిదా తీర్మానమిచ్చి 'మీరు ఇప్పుడే చదవాలి' అంటారు. ఇదా సీనియారిటీ? సుప్రీంకోర్టు జడ్జిగా పనిచేసి తొలిసారిగా గవర్నరుగా వచ్చిన వ్యక్తి ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన రోజు నుంచి ఇప్పటివరకు విపక్ష సభ్యుల ప్రవర్తన, అసభ్య పదజాలాన్ని అందరూ చూస్తున్నారు. జాతీయ మీడియా సైతం అటెన్షన్ చేసేలా గవర్నర్ రాకను కూడా తప్పుపట్టారు. గవర్నర్ రావడం కూడా టెబుల్ అజెండానా? దీనిని బీఏసీలో పెట్టాలనడం ఏమిటి? ఇది గవర్నర్ ఆఫీసు, అసెంబ్లీ సెక్రటేరియట్ మధ్య ఉండాల్సింది. కనీసం అది తెలుసుకోకుండా టీడీపీ సభ్యులు మాట్లాడటం శోచనీయం. ఏ శాసనసభలోనూ ఎవరూ టీడీపీ సభ్యుల్లా ప్రవర్తించి ఉండరు'.. అని స్పీకర్ అన్నారు.

అది బీసీలకు ఇచ్చిన గౌరవం

'సీఎం జగన్ నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ.. నా మైనార్టీలు అని ధైర్యంగా చెప్పుకోగలిగిన గొప్ప నాయకుడు. నన్ను సభాపతిగా చేశారంటే.. సీఎం బలహీనవర్గాలకు ఇచ్చిన గౌరవం అది. ఇప్పుడు టీడీపీ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవడానికి పెద్ద సమయం పట్టదు. కానీ, వాళ్లు కూడా సభకు రావాలి. ప్రజా సమస్యలపై చర్చించాలి. ఇదే నా అభిమతం'.. అని స్పీకర్ అన్నారు.

ఎర్రగీత దాటితే ఆటోమేటిగ్గా సస్పెన్షన్

'అసెంబ్లీ గౌరవాన్ని పెంచేలా ఎందరో మహానుభావులు స్పీకర్‌గా సేవలందించారు. వ్యక్తి ఎవరన్నది ముఖ్యం కాదు. సభాపతి స్థానంలో ఎవరున్నా గౌరవించాలి. సభ్యులు నిరసన వ్యక్తంచేయడంలో అభ్యంతరంలేదు. కానీ, టీడీపీ సభ్యులకు సభాపతి స్థానం, సభా విలువలపై గౌరం లేదు. టీడీపీ సభ్యుల తీరు గర్హనీయం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. అందుకే సభ్యులు కారణం లేకుండా సభలో నినాదాలు చేయడం, చైర్ వద్దకు రావడం, వెల్‌లో బైఠాయించడం చేస్తే ఆటోమేటిగ్గా సస్పెండ్ అయ్యేలా రూలింగ్ ఇస్తున్నాం' అని స్పీకర్ ప్రకటించారు.

ప్రివిలేజ్ కమిటీకి దాడి ఘటన

- దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్న మంత్రి సురేష్
- ప్రివిలేజ్ కమిటీకి పంపేందుకు నోటీసులు ఇవ్వాలన్న స్పీకర్

అసెంబ్లీలో సోమవారం సభాపతి తమ్మినేని సీతారాంపై దాడి.. బాధ్యులపై చర్యలకు సంబంధించి సభాహక్కుల కమిటీకి అప్పగించి నిర్ణయం తీసుకోనున్నారు. సభలో స్పీకర్‌పై దాడిచేసిన టీడీపీ ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ టర్మ్ మొత్తం సస్పెండ్ చేయాలని మంత్రి ఆదిమూలపు సురేష్ సభలో స్పీకర్‌ను కోరారు. అరాచకాలకు దిగే వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే సభను ఇకపై సజావుగా నడపడం కష్టమని, కనుక ఆయనపై చర్యలు తీసుకోవాలని మంత్రి డిమాండ్ చేశారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ.. సభాహక్కుల కమిటీ (ప్రివిలేజ్ కమిటీ)కి ఈ అంశాన్ని నివేదించి విచారించాక నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు నోటీసులు అందించాలని మంత్రి సురేష్‌కు సూచించారు.



వరల్డ్ పప్పెట్రీ డే

ఆమె ఊహల్లో కథ అల్లుకుపోతే అవి బొమ్మలై మన ముందు కదలాడతాయి. చూసే పిల్లల మొహాల్లో ఆశ్చర్యానందాలను పెద్దల మెదళ్లలో ఆలోచనలను కొత్తగా వికసింపజేస్తాయి. ముప్పైఏళ్లుగా పప్పెట్రీతో స్నేహం చేస్తూ 'మా బొమ్మల టీచర్' అని అందరూ ఆప్యాయంగా పిలుచుకునే పేరు **నోరి రత్నమాల.** హైదరాబాద్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కాలనీలో ఉంటున్న ఈ విశ్రాంత టీచరమ్మను కలిస్తే ఎన్నో అందమైన కథల మాలను మన ముందుంచుతారు.

బొమ్మలకు జీవం పోసే టీచరమ్మ

'విష్ణుశర్మ అడవి గుండా ప్రయాణిస్తుంటాడు. దారిలో బావిలోనుంచి మమ్మల్ని కాపాడండీ.. అని కేకలు విని అక్కడకు వెళ్లి లోపలకు చూస్తాడు. అందులో ఒక పులి, కోతి, పాముతో పాటు మనిషి ఉంటాడు. వారందరినీ కాపాడే సమయంలో 'మనిషిని మాత్రం కాపాడవద్దు' అని చెబుతాయి మిగతా జంతువులు...' అంటూ మనిషిలో ఉండే స్వార్థం ప్రాణాపాయం ఎలా కలిగిస్తుందో చెబుతూనే నేటి సాయంత్రం హైదరాబాద్‌లో ప్రదర్శించబోతున్న కథనాన్ని, అందుకోసం చేసుకున్న ఏర్పాట్ల గురించి చెబుతూనే తనలో ఈ కళ పట్ల ఆసక్తి కలగడానికి దారి తీసిన పరిస్థితులను గుర్తు చేసుకున్నారు ఈ టీచరమ్మ.

''హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఫైన్ ఆర్ట్స్ టీచర్‌గా వర్క్ చేశాను. పిల్లలకు ఆసక్తి గొలిపేలా సృజనాత్మకతను పరిచయం చేసే ఆ సబ్జెక్ట్ నాకెంతగానో రచ్చింది, ఎప్పటికప్పుడు నన్ను నేను కొత్తగా సిద్ధం చేసుకోవడం ఎలా అని ఆలోచించినప్పుడు చిన్నప్పుడు నేను నేర్చుకున్న పప్పెట్రీ గురించి గుర్తొచ్చింది, నా చిన్నతనంలో మా నాయనమ్మ నన్ను తోలుబొమ్మలాటకు తీసుకెళ్లేది. అందులో రామాయణ భారత కథలను తెల్లవార్లూ ప్రదర్శించేవారు. బాల్యంలో నా మనసులో నాటుకుపోయిన ఆ కళ ఆ తర్వాత నాకు విద్యార్థులకు పరిచయం చేయడానికి తోడ్పడింది.



● ప్రదర్శనలో...



స్కూల్ నుంచి మొదలు

సంప్రదాయ తోలుబొమ్మల తయారీ అంటే అంత సులువు కాదు. అందుకని కాగితం, క్లాత్, ఇతర వేస్ట్ మెటీరియల్‌ను ఉపయోగించి పప్పెట్రీ బొమ్మలు తయారుచేసేదాన్ని. వాటిద్వారా పిల్లలకు పంచతంత్ర వంటి ఎన్నో కథలు చెప్పేదాన్ని. పిల్లలు కూడా ఈ బొమ్మల ద్వారా తమ ఆసక్తులను కనబరిచేవారు. అక్కడ నుంచి ఇతర టీచర్లకు శిక్షణ, రాష్ట్రవ్యాప్తంగా స్కూళ్లలో ప్రదర్శనలు ఇస్తూ వచ్చాను. దూరదర్శన్‌లోనూ బాలల వికాసానికి పప్పెట్రీతో కార్యక్రమాలు చేశాం. సాంస్కృతిక కార్యక్రమాల్లో సామాజిక అవగాహన కలిగించే అంశాలెన్నో కథలుగా రూపొందించి, ప్రదర్శించాను.

కదిలించే కథనాలు..

స్వాతంత్ర్యానికి ముందు మనకున్న అవగాహన కార్యక్రమాలలో ప్రధానమైనది తోలుబొమ్మలాటనే. ఇది దేశవ్యాప్త కళ. బొమ్మలను తెరముందు కదిలిస్తూ, దీపం వెలుతురు సాయంతో ప్రదర్శన ఉండేది. సంప్రదాయ బొమ్మల తయారీ ఇప్పుడు కొంచెం కష్టమే. ఇక ప్రదర్శన ఖర్చు కూడా ఎక్కువే అవుతుంది. అలాగని నేర్చుకున్న కళను మన దగ్గరే ఉంచలేం. పదిమందికి తెలిసినప్పుడే ఆ కళ బతుకుతుంది. సామాజిక అవగాహనకు నా భాగస్వామ్యమూ ఉండాలి. ఇందులో భాగంగా ప్రభుత్వ ప్రాజెక్టులు వచ్చాయి. సంగీత నాటక అకాడమీ నుంచి ఇన్నేళ్లలో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చాను. విదేశాలలోనూ పప్పెట్రీ ప్రదర్శన చేయడం, అభినందనలు, అవార్డులు, మరచిపోలేని సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

టీమ్ వర్క్ విజయం

బొమ్మల తయారీ, బొమ్మలు కదల్చడానికి, మంచి కథనానికి, పాటలకు, నేపథ్య సంగీతానికి.. ఇలా ఇదంతా టీమ్ వర్క్‌తో కూడుకున్నది. ఇందుకోసం మావారితోపాటు పిల్లలనూ ఆ తర్వాత వారి పిల్లలనూ ఈ పనిలో భాగస్థులను చేశాను. దీనివల్ల వారి లోపల ఉన్న వారికే తెలియని కళ బయటకు వచ్చింది. ఇప్పుడు అమెరికాలో ఉన్న మా పిల్లలు కూడా కథనానికి తగ్గ వాయిస్ డబ్బింగ్‌ను క్లిప్పింగ్స్ ద్వారా నాకు పంపిస్తుంటారు. ఇందులో నా కుటుంబ సభ్యులే కాదు స్నేహితులు, కొందరు స్వచ్ఛందంగానూ మేం చేసే పనిలో భాగమవుతుంటారు. ఈ కళ బతికుంది అనడానికి ఇంతకుమించి నిదర్శనాన్ని చూపలేం.

డిజిటల్ మీడియాలోనూ..

కరోనా సమయంలో నోరి ఆర్ట్ అండ్ పప్పెట్రీ పేరుతో యూ ట్యూబ్‌లో ఛానెల్ స్టార్ట్ చేశాను. పిల్లల కోసం పప్పెట్రీ ద్వారా కొన్ని వందల కథలను పరిచయం చేశాను. అవన్నీ ఒక్కదాన్నే చేశాను. పెద్దవాళ్లూ ఆస్వాదించారు. ఎంతో మంది అభినందనలు తెలియజేశారు.

ఏ దేశానికి లేనన్ని సంప్రదాయ కళలు మన దగ్గర ఉన్నాయి. వాటికి పునరుజ్జీవం కలగాలంటే ప్రభుత్వాలు, సంస్థలు, ఆసక్తి కలవారు ముందుకు రావాలి. పిల్లల్లో ఈ కళలను బతికిస్తే చాలు– ముందు తరాలకు అవి వారసత్వంగా ప్రయాణిస్తాయి. ఏ దేశంలో ఉన్నా మన ప్రత్యేకతను ఈ కళలే చాటుతాయి. అందుకే ప్రాచీన కళలకు ప్రోత్సాహమిద్దాం'' అని వివరించారు ఈ పప్పెట్రీ హార్టిస్ట్.

– నిర్మలారెడ్డి

రెండు ప్రపంచాల మధ్య...




రెండు ప్రపంచాల మధ్య సంచరించే షెల్మకు... మొదటి ప్రపంచంలో కనిపించే సాంకేతిక అద్భుతాలు అంటే ఎంత ఇష్టమో రెండో ప్రపంచంలో కనిపించే కాల్పనిక కథలు అంతే ఇష్టం. సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ **షెల్మ సహాయం** రాసిన పుస్తకం 'ది ల్యాండ్ ఆఫ్ అటరాక్సియా: జెనిసిస్' గత నెల గోల్డెన్ బుక్ అవార్డ్(ఉరుగ్వే) గెలుచుకుంది. తాజాగా గ్లోబల్ పబ్లిషింగ్ హౌజ్, ఎక్స్‌సెల్లర్ ఎక్సలెన్స్ ఇంటర్నేషనల్ అవార్డ్ (ఇండియా)కు ఎంపికైంది...

చెన్నైలో...

చిన్న వయసులోనే కలం పట్టింది షెల్మ. ప్రైమరీ స్కూల్లో గాంధీజీపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. షెల్మ ఈ పోటీలో పాల్గొంది. అయితే తనకు ఆ మహాత్ముడి గురించి పెద్దగా తెలియదు

'రకరకాల ఆయుధాలు ఉపయోగించి, బ్రిటిష్ వారితో వీరోచితంగా పోరాడారు' అని రాసింది.

ఇది గుర్తొచ్చినప్పుడల్లా ఇప్పటికీ ఇబ్బందిగా ఉండడం మాట ఎలా ఉన్నా... ఆ వ్యాసరచనే తన తొలి రచన!



అయితే ఆ తరువాత కాలంలో ఎన్నో పుస్తకాలు చదవడం వల్ల ఎన్నో విషయాలు తెలుసుకోవడంతోపాటు రచనలు చేయడంపై ఆసక్తి పెరిగింది.

'నేను భవిష్యత్‌లో రచయిత్రిని కావాలనుకుంటున్నాను' అని షెల్మ అన్నప్పుడు చాలామంది ముఖం మీదే నవ్వారు.

'ఇంజినీర్ కావాలనేది నా కల' అన్నప్పుడు కూడా ఇలాంటి పరిస్థితే. ఇలాంటి సమయాల్లో బాబీ ఆంటీ తనకు ఎంతో శక్తి ఇచ్చేది. షెల్మ దృష్టిలో తాను పవర్‌ఫుల్ ఉమెన్.

'వారు నీ గురించి ఏం అనుకుంటున్నారనేది ముఖ్యం కాదు. నీకు నీ మీద ఎంత నమ్మకం ఉందనేది ముఖ్యం' అని చెప్పేది.

ఆంటీ ఇచ్చిన ఆత్మవిశ్వాస బలంతో చిన్న చిన్న రచనలు చేసి ఇంట్లో వినిపించేది. తండ్రి మెర్సిలిన్‌బాబు, తల్లి మేరీ శాంతి, చెల్లెళ్ల స్నేహ, రీతూలు ప్రోత్సాహకంగా మాట్లాడేవారు.

'నాకు డిప్రెషన్‌గా అనిపించినప్పుడు పేపర్, పెన్ను అందుకొని ఏదో ఒకటి రాస్తుంటాను. అప్పుడు ఎంతో ఉత్సాహంగా ఉంటుంది' అంటున్న షెల్మ 'ఎస్ఎస్ మెర్సె' కలం పేరుతో 'ది ల్యాండ్ ఆఫ్ ఆటరాక్సియా: జెనిసిస్' అనే తొలి ఫాంటసీ థ్రిల్లింగ్ నవల రాసింది. దీనికి విమర్శకుల నుంచి మంచి ప్రశంసలు లభించాయి.

వీడియోగేమ్స్ ఇష్టపడే యువతరాన్ని కూడా ఈ నవల ఆకట్టుకుంది.

తాను ఎనిమిదవ తరగతిలో ఉన్నప్పుడు ఈ నవలకు బీజం పడింది. అయితే అక్షరాల్లో కాకుండా తన మనసులోనే రాసుకుంటూ వస్తోంది. ఎడిట్ చేసుకుంటూ వస్తుంది. తాను చిన్నప్పుడు విన్న ఎన్నో జానపదకథలు, చదివిన పుస్తకాలు ఈ పుస్తకం రాయడానికి స్ఫూర్తిని ఇచ్చాయి.

తప్పిపోయిన తమ ఫ్రెండ్ సినస్‌ను వెదుక్కుంటూ కెప్టెన్ మెగెలాన్ అతని బృందం చేసిన ప్రయాణమే ఈ నవల. కెప్టెన్ బృందం చివరికి ఒక మాంత్రిక ప్రపంచంలోకి వెళుతుంది. అక్కడ వారికి ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి అనేది నవల సారాంశం.

'ద ల్యాండ్ ఆఫ్ అటరాక్సియా' ఇచ్చిన ఉత్సాహంతో షెల్మ సహాయం మరిన్ని రచనలు చేయాలనుకుంటోంది.

ఇంటిప్స్

- కంప్యూటర్ కీ బోర్డ్, మౌస్ వంటి వాటిపై పడిన మరకలను నెయిల్ పాలిష్ రిమూవర్‌తో తొలగించవచ్చు.
- పాత్రలపై ఉన్న స్టిక్కర్స్ సులభంగా ఊడాలంటే, ఆ స్టిక్కర్‌కి కొవ్వొత్తి వేడి చూపితే సరిపోతుంది.
- గాజు గ్లాసులను శుభ్రం చేసే నీటిలో కొంచెం బట్టలకు ఉపయోగించే బ్లూ కలిపితే గ్లాసులు తళతళ మెరుస్తాయి.





కిచెన్ టిప్స్

- బొద్దింకలు పోవాలంటే... ఉల్లిపాయను చిన్న ముక్కలుగా తరిగి అందులో బేకింగ్ సోడా కలిపి వంటగది మూలల్లో, సింక్‌లో చల్లాలి.
- బోరిక్ యాసిడ్‌ని ఒక ప్లేట్‌లో కానీ గట్టి పేపర్ మీద కానీ చల్లాలి. ఆ ప్లేట్లో కమలాపండు తొక్కలు లేదా ఉల్లిపాయ ముక్కలు వేసి ఒకచోట పెట్టాలి.
- నిమ్మరసం బొద్దింకలను దూరంగా ఉంచుతుంది. ఒక మగ్గు నీటిలో నిమ్మరసం కలిపి వంటగది ఫ్లోర్ తుడిస్తే బొద్దింకలు పారిపోతాయి.



● బెంగళూరు ఐఐహెచ్ఆర్‌లో టెర్రస్ కిచెన్ గార్డెన్

- అర్బన్ హార్టీకల్చర్ సాగు పూర్తి ప్యాకేజీని ప్రమాణీకరించిన బెంగళూరులోని ఐఐహెచ్ఆర్
- గ్రోబాగ్స్‌లో ఇంటి పైకప్పులపై సేంద్రియ కూరగాయలు, ఔషధ మొక్కల శాస్త్రీయ సాగుకు మార్గం సుగమం
- ప్రత్యేకమైన కొబ్బరి పొట్టు ఎరువు, రెండు రకాల ద్రావణాలకు రూపకల్పన
- సాయిల్‌లెస్ గార్డెనింగ్‌పై ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ శిక్షణ

అర్బన్ సాగు సాంకేతికత సిద్ధం!

నగర/ పట్టణ వాసులు తమ ఇళ్లపైనే సేంద్రియ కూరగాయలు పండించుకుంటూ, చెట్ల నుంచి కోసి తాజాగా వండుకు తింటూ శారీరక యావత్ కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్న వారెందరో ఉన్నారు. అయితే, సేంద్రియ ఇంటిపంటల సాగులో నగర వాసులకు ఎదురయ్యే సమస్యలపై ప్రభుత్వ రంగంలో పరిశోధనలు పెద్దగా జరగలేదనే చెప్పాలి. ఈ కొరత తీర్చేందుకు బెంగళూరులోని భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ (ఐఐహెచ్ఆర్) మొట్టమొదటిసారి ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించింది. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి(ఐసిఎఆర్) అనుబంధ సంస్థ ఇది. ఇళ్ల పరిసరాల్లో గచ్చుపై, ఇళ్ల పైకప్పులపై గ్రోబాగ్స్‌లో కూరగాయల సేంద్రియ శాస్త్రీయ సాగు పద్ధతులను ప్రమాణీకరించింది. మట్టి లేకుండా సులువుగా సాగు చేసే పద్ధతులను ఖరారు చేసింది.

ఐఐహెచ్ఆర్ శాస్త్రవేత్తలు అనేక సంవత్సరాలు పరిశోధన చేసి టెక్నాలజీని ప్రామాణీకరించారు. కచ్చితమైన మోతాదుల్లో ఎన్నాళ్లకోసారి పోషకాలను అందించాలన్న విషయాలను ప్రామాణీకరించారు. దీంతో శాస్త్రీయంగా కూరగాయలతో పాటు ఔషధ మొక్కలను సైతం గ్రోబాగ్స్‌లో సేంద్రియంగా ఎక్కడైనా సాగు చేయడానికి మార్గం సుగమం అయ్యింది.

ప్రత్యేక ఉత్పాదకాలు

అర్బన్ హార్టీకల్చర్ వ్యాప్తి కోసం ఐఐహెచ్ఆర్ ప్రత్యేక సాంకేతికతలను అభివృద్ధి చేసింది. శుద్ధి చేసి, జీవన ఎరువులతో ప్రత్యేకమైన కొబ్బరి పొట్టు ఎరువును ఐఐహెచ్ఆర్ తయారు చేసింది. దీని పేరే 'అర్క ఫెర్మెంటెడ్ కోకోపిట్'(ఎ.ఎఫ్.సి.). అంతేకాకుండా, గ్రోబాగ్స్‌లో కూరగాయ పంటల సాగుకు అవసరమైన పోషకాలను అందించే 'అర్క సస్య పోషక్ రస్ (ఎ.ఎస్.పి.ఆర్.)' ఎ,బి పేరిట రెండు రకాల ద్రావణాలను రూపొందించింది. ఈ 3 సాంకేతికతలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. ఐఐహెచ్ఆర్ నుంచి ఈ టెక్నాలజీను కొనుగోలు చేసిన కంపెనీలు వీటిని ఉత్పత్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నాయి.



● గ్రోబాగ్స్‌లో టొమాటో మొక్కలు

పోషకాల యాజమాన్యం

టమోటా, మిరప, క్యాబేజీ, దోస, చెట్టు చిక్కుడు, ఆకు కూరలు వంటి కూరగాయలను మట్టి రహిత సాగు పద్ధతిని ఐఐహెచ్ఆర్ ప్రమాణీకరించింది. అర్క ఫెర్మెంటెడ్ కోకోపిట్ లేదా మట్టికి సమపాళ్లలో సేంద్రియ ఎరువులు (పశువుల ఎరువు/వంటింటి వ్యర్థాలతో చేసిన కంపోస్టు/సిటీ కంపోస్టు), వర్మీ కంపోస్టులను 1:1:1 నిష్పత్తిలో కలిపి గ్రోబాగ్స్‌లో నింపుకొని మొక్కలు నాటుకోవాలి లేదా విత్తనాలు వేసుకోవాలి. ఆ తర్వాత నెలకోసారి మొక్కకు 100 గ్రాముల చొప్పున వంటింటి వ్యర్థాల కంపోస్టు లేదా వర్మీకంపోస్టు వేసుకుంటే పోషక లోపం రాదు.

మట్టికి బదులు అర్క ఫెర్మెంటెడ్ కోకోపిట్‌కు సేంద్రియ ఎరువులు కలిపి సాగు చేసుకుంటే.. 'అర్క సస్య పోషక్ రస్' ఎ,బి ద్రావణాలను క్రమం తప్పకుండా వాడితే పోషక లోపాలు లేకుండా మంచి దిగుబడులు సాధించవచ్చని ఐఐహెచ్ఆర్ చెబుతోంది. ఈ ద్రావణాల్లో వివిధ కూరగాయ పంటల సాగుకు అవసరమైన స్థూల, సూక్ష్మపోషకాలన్నీ సమతుల్యంగా ఉన్నాయి.

10 రోజుల నుంచి ద్రావణాలు

కూరగాయ మొక్కలు నాటిన లేదా విత్తనాలు వేసిన తర్వాత 10వ రోజు నుంచి వారానికి 2 సార్లు అర్క సస్య పోషక్ రస్ ద్రావణాలను నిర్దేశించిన మోతాదులో కలిపిన నీటిని ప్రతి కుండీ/గ్రోబాగ్‌కు 200 ఎం.ఎల్. పోయాలి. 30 రోజుల తర్వాత నుంచి వారానికి మూడు సార్లు ఇవ్వాలి. అర్క సస్య పోషక్ రస్ ఎ, బి రకాల ద్రావణాల మోతాదు పంటను బట్టి మారుతుంది. టొమాటో, మిరప, బెండ, క్యాబేజీ, కాలీఫ్లవర్, దోస, బెండ, సొర, పొట్ల, ముల్లంగి, బ్రోకలీ, నోల్ ఖోల్, పాటీ పాన్, గుమ్మడి, పుచ్చ, కస్తూరి పుచ్చ పంటలకు లీటరు నీటికి ఎ,బి ద్రావణాలను 5 ఎం.ఎల్. చొప్పున కలపాలి.

ఫ్రెంచ్ బీన్, బఠానీలు, డోలిచోస్, అలసంద పంటలకు లీటరు నీటికి ఎ,బి ద్రావణాలను 4 ఎం.ఎల్. చొప్పున కలపాలి. పాలకూర, బచ్చలికూర, బోక్ చోయ్, సెలెరీ వంటి దేశ విదేశీ రకాల ఆకుకూర పంటలకు లీటరు నీటికి ఎ,బి ద్రావణాలను 3.5 ఎం.ఎల్. చొప్పున కలపాలి. నీటి నాణ్యతా ప్రమాణాలను కూడా ఐఐహెచ్ఆర్ ప్రమాణీకరించింది. ఉదజని సూచిక 6–7 ఉండాలి. విద్యుత్ వాహకత స్థాయి 0.75 – 1.5 డి.ఎస్./ఎం. మధ్యలో ఉండాలి.

చీడపీడల యాజమాన్యం

కుండీలు, గ్రోబాగ్స్‌లో ఉపయోగించే మట్టి లేదా కోకోపీట్‌లకు ట్రైకోడెర్మా లేదా సూడోమోనాస్‌లను కలిపితే చీడపీడల బెడద తగ్గుతుంది. పురుగులను సమర్థవంతంగా నియంత్రించడానికి వేపనూనె 2 మి.లీ /లీటర్ నీటికి లేదా వేప సబ్బు 7–10 గ్రా. లీటరు నీటికి కలిపి చల్లాలి. ఐఐహెచ్ఆర్ రూపొందించిన వేప, కానుగ సబ్బులను 10 గ్రా. లీటరు నీటికి కలిపి చల్లితే రసం పీల్చే పురుగులు నియంత్రణలో ఉంటాయి. ఆవు మూత్రాన్ని 1: 20 నిష్పత్తిలో నీటిలో కలిపి చల్లితే కీటకాలు నియంత్రణలో ఉంటాయి. పంట పెరుగుదలకూ ఉపయోగపడుతుంది. పులిసిన మజ్జిగ తెల్లదోమ, నల్లదోమ, పచ్చదోమల నుంచి పంటను రక్షించుకోవచ్చు.

నగరాల్లో సాగుకు ఇదే ఉత్తమం

నగర ప్రజల్లో పోషకాహార భద్రతను కల్పించడానికి మట్టి రహిత లేదా కోకోపానిక్స్ సాంకేతికత ఉపయోగపడుతుంది. నగరాలు, నగర పరిసర ప్రాంతాల్లో కూరగాయల సాగుకు తగిన భూమి అందుబాటులో లేకపోవటం లేదా కలుషిత/నిస్సారమైన నేలలు మాత్రమే అందుబాటులో ఉన్న చోట్ల మట్టి లేని సాగు ఉపయోగకరం. రూఫ్‌టాప్/టెర్రస్‌లపై కూరగాయల సాగును పెంపొందించడానికి ఇది అత్యంత అనుకూలమైనది. నగరవాసుల్లో ఇది చాలా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా నగరాలు, మహానగరాల పరిసర ప్రాంతాల్లో మట్టి రహిత వ్యవసాయం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. భవిష్యత్తులో ఇదే ప్రధాన సాగు విధానంగా మారుతుంది. ఇప్పటికే చాలా మంది పెంపకందారులు తమ రోజువారీ కూరగాయల కోసం ఈ సాంకేతికతను అనుసరించడం ప్రారంభించారు. అధిక దిగుబడులతో పాటు దిగుబడుల నాణ్యత విషయంలో ఈ సాంకేతికత మెరుగైన ఫలితాలనిస్తోంది. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నాం.



– డాక్టర్ డి. కలైవనన్
(99866 37407), సీనియర్ శాస్త్రవేత్త, ఐఐహెచ్ఆర్, బెంగళూరు.
kalainith2003@gmail.com

సాగుబడి

ఉత్తరాభాద్ర కార్తె: మార్చి 18 నుంచి

సగం నీటితోనే వరి సాగు!

వ్యవసాయంలో భూగర్భ జలాల వాడకం అంతకంతకూ పెరుగుతోంది. ఐరాస ప్రపంచ నీటి అభివృద్ధి నివేదిక (2022) ప్రకారం.. మన దేశం ప్రతి సంవత్సరం 251 క్యూబిక్ కి.మీ.ల నీటిని బోర్ల ద్వారా వెలికితీస్తోంది. ప్రపంచవ్యాప్తంగా బోర్ల ద్వారా తోడుతున్న భూగర్భ నీటిలో నాలుగింట ఒక వంతు కంటే ఇది ఎక్కువే. ఇందులో 90 శాతం నీరు వ్యవసాయానికి వినియోగిస్తున్నాం. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవాలంటే ఈ పరిస్థితి మారాలి. భూగర్భ నీటి వినియోగం తగ్గాలంటే సాగు భూమిలో నీటిని పట్టి ఉంచే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి. వ్యవసాయాన్ని ప్రకృతికి అనుగుణంగా మార్చుకుంటేనే ఇది సాధ్యమని ఐరాసకు చెందిన ఆహార–వ్యవసాయ సంస్థ చెబుతోంది.



● ప్రకృతి సేద్యంలో పెరిగిన వరి దుబ్బును చూపుతున్న ఏపీ రైతు సాధికార సంస్థ ఉపాధ్యక్షులు విజయకుమార్

ఈ దిశగా ఆంధ్రప్రదేశ్ వడివడిగా అడుగులు వేస్తోంది. ప్రకృతి వ్యవసాయం అత్యధిక విస్తీర్ణంలో జరుగుతున్న ఏపీలో బోరు నీటి వాడకం కూడా తగ్గుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. ఏపీలోని అన్ని జిల్లాల్లో రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడుతున్న పొలాల్లో కన్నా ప్రకృతి సేద్యం చేస్తున్న భూముల్లో బోరు నీటి వినియోగం ఎంత మేరకు తగ్గుతోంది? ఆసక్తికరమైన ఈ అంశంపై ఏపీ రైతు సాధికార సంస్థ(ఆర్.వై.ఎస్.ఎస్.) ఆధ్వర్యంలో 2020 నుంచి అంతర్గతంగా అధ్యయనం చేస్తోంది. వరిలో 2020–21 రబీలో రసాయనిక సేద్యం (ర.సే.)లో ఎకరానికి 6,200 కిలోలీటర్ల (కిలోలీటర్=1,000 లీటర్లు) బోరు నీటిని ఉపయోగించగా ప్రకృతి సేద్యం(ప్ర.సే.)లో 3,294 కిలోలీటర్ల నీటిని వాడితే సరిపోయింది. ఇది 47% తక్కువ. 2022–23 ఖరీఫ్ నాటికి వరి పొలాల్లో ప్రకృతి సేద్యంలో నీటి ఆదా 51%కి పెరిగింది. మొక్కజొన్నలో 2021–22 రబీలో ఎకరానికి ర.సే.లో 3,349 కిలోలీటర్ల నీరు ఖర్చవ్వగా, ప్ర.సే.లో 2,152 కిలోలీటర్లకు తగ్గింది. ఇది 36% తక్కువ. వేరుశనగ సాగులో ఎకరానికి 2021–22 రబీలో ఎకరానికి ర.సే.లో 3,505 కిలోలీటర్ల నీరు వాడగా, ప్ర.సే.లో 2,652 కిలోలీటర్లకు తగ్గింది. ఇది 24% తక్కువ. ఇదే పంటలో 2022–23 ఖరీఫ్‌లో ఎకరానికి ర.సే.లో 792 కిలోలీటర్ల బోరు నీరు ఖర్చవగా, ప్ర.సే.లో 582 కిలోలీటర్లకు తగ్గింది. ఇది 26% తగ్గుదల.

మిర్చిలో 2021–22 రబీలో ఎకరానికి ర.సే.లో 2,015 కిలోలీటర్లు ఖర్చవ్వగా, ప్ర.సే.లో 1,193 కిలోలీటర్లకు తగ్గింది. ఈ తగ్గుదల 41%. పత్తిలో 2022–23 ఖరీఫ్‌లో ఎకరానికి ర.సే.లో 897 కిలోలీటర్ల సాగు నీరు ఖర్చవ్వగా, ప్ర.సే.లో 596 కిలోలీటర్లకు తగ్గింది. ఇది 34% తగ్గుదల. టొమాటోలో 2020–21 రబీలో ఎకరానికి ర.సే.లో 1,805 కిలోలీటర్ల నీరు ఖర్చవ్వగా, ప్ర.సే.లో 1,393 కిలోలీటర్లకు తగ్గింది.అదేవిధంగా మినుములో 2021–22 రబీలో ఎకరానికి ర.సే.లో 399 కిలోలీటర్ల నీరు పెట్టగా, ప్ర.సే.లో 356 కిలోలీటర్లకు తగ్గింది. ఇది 11% తగ్గుదల. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో నేల గుల్లబారి ఉండటం, వాన నీరు అధికంగా ఇంకటం, వానపాముల సంఖ్య పెరగటం, భూసారంతోపాటు నీటి నిల్వ సామర్థ్యం పెరగడం వల్ల బోరు నీరు వాడకం గణనీయంగా తగ్గింది. వచ్చే ఖరీఫ్ నుంచి 'వాలంతరి' మరింత లోతైన అధ్యయనం చేపట్టనుంది.

రేపు సేంద్రియ సాగు, విలువ జోడింపుపై శిక్షణ

సేంద్రియ సాగు, మిశ్రమాలు, కషాయాల తయారీ, వివిధ ఆహార పంటలకు విలువ జోడింపుపై ఈ నెల 22 (బుధవారం ఉ.10–4 గం. వరకు)న రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం అమీర్‌పేట గ్రామంలో రైతులకు నాబార్డు సహకారంతో రైతునేస్తం ఫౌండేషన్ ఉచిత శిక్షణ ఇవ్వనుంది. ప్రముఖ రైతు సుకవాసి హరిబాబు తన తోటలో శిక్షణ ఇస్తారు. మధ్యాహ్న భోజనం సహా ప్రవేశం ఉచితం. వివరాలకు.. 70939 73999

26, 27 తేదీల్లో డా. ఖాదర్ సభలు

సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యంపై స్వతంత్ర శాస్త్రవేత్త, పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన డా. ఖాదర్ వలి ఈ నెల 26, 27 తేదీల్లో జరిగే అవగాహన సదస్సుల్లో ప్రసంగిస్తారని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై. వేంకటేశ్వరరావు తెలిపారు. కృష్ణా జిల్లా ఆత్కూరు (గన్నవరం)లోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో 26 (ఆదివారం)న ఉ. 10 గం. నుంచి.. అవనిగడ్డలోని గాంధీక్షేత్రం 26న సా. 4 గం. నుంచి.. 27(సోమవారం)న సా. 5 గం, నుంచి విశాఖపట్నం మద్దెలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో డా. ఖాదర్ అవగాహన సదస్సులు జరుగుతాయి. ప్రవేశం ఉచితం. వివరాలకు.. 94905 59999

ఐదు దొంతర్ల తోట నమునాపై 26న అప్పాజీపల్లిలో శిక్షణ

నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట్ మండలం అప్పాజీపల్లిలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఈ నెల 26 (ఆదివారం) ఉ: 9 గం. నుంచి సా. 5 గం. వరకు సేవ్ సంస్థ వ్యవస్థాపకులు విజయ్ రామ్ గోఆధారిత ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ ఇస్తారు. దేశీ ఆవు, దేశీ విత్తనాల ప్రాముఖ్యత, వాననీటి సంరక్షణ, మాగాణి/మెట్ట భూముల్లోని పండ్లు, కూరగాయల కోసం 5 దొంతర్ల తోట నమునా తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. ప్రవేశం ఉచితం. మధ్యాహ్న భోజన సదుపాయం ఉంది. పేరు నమోదు కోసం.. 97055 60879, 040–27654337.

ఏప్రిల్ 10 నుంచి శ్రీగంధం సాగుపై శిక్షణ

శ్రీగంధం మొక్కల నర్సరీ పెంపకం, శ్రీగంధం తోటల సాగులో మెలకువలు, చేవ నాణ్యతను గుర్తించటం, తైలం వెలికితీత, మార్కెటింగ్, ఆదాయ వ్యయాలు తదితర అంశాలపై బెంగళూరులోని కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐ.డబ్ల్యు.ఎస్.టి.) రైతులు, నర్సరీల యజమానులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ ఇవ్వనుంది. ఏప్రిల్ 10 నుంచి 14 వరకు బెంగళూరులోని ఐ.డబ్ల్యు.ఎస్.టి.లో సంచాలకులు డా. ఆర్.సుందరరాజ్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తారు. ఫీజు వసతి అవసరం లేని వారికి రూ. 11,800, వసతితో పాటు రూ. 17,700 ఉంటుంది. కోర్సు ఆంగ్లంలో ఉంటుంది. తెలుగు తదితర భాషల్లోనూ విడమరిచి చెబుతారు. మరిన్ని వివరాలను తెలుగులో తెలుసుకోదలచినవారు ఫోన్ చేయాల్సిన నంబరు 080–22190166.



జెహాన్ దారువాలాకు మూడో స్థానం

ఫార్ములా–2 రేసింగ్ చాంపియన్‌షిప్‌లో భాగంగా సౌదీ అరేబియా రేసులో భారత డ్రైవర్ జెహాన్ దారువాలా మూడో స్థానంలో నిలిచాడు. జెడ్డాలో జరిగిన ఈ రేసులో నెదర్లాండ్స్‌కు చెందిన ఎంపీ మోటార్‌స్పోర్ట్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న జెహాన్ నిర్ణీత 28 ల్యాప్‌లను 50 నిమిషాల 53.133 సెకన్లలో పూర్తి చేసి మూడో స్థానాన్ని పొందాడు. వెస్టీ (ప్రెమా రేసింగ్) తొలి స్థానంలో, దూహన్ (విర్టోసీ రేసింగ్) రెండో స్థానంలో నిలిచారు. సీజన్‌లో రెండు రేసులు పూర్తయ్యాక జెహాన్ 24 పాయింట్లతో ఐదో స్థానంలో ఉన్నాడు.

సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి విజేత పెరెజ్

ఫార్ములావన్ సీజన్‌లోని రెండో రేసు సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రిలో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ సెర్జియో పెరెజ్ విజేతగా నిలిచాడు. పెరెజ్ నిర్ణీత 50 ల్యాప్‌లను అందరికంటే వేగంగా 1 గంట 21 నిమిషాల 14.894 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. రెడ్‌బుల్ జట్టుకే చెందిన వెర్‌స్టాపెన్ రెండో స్థానంలో, ఆస్టిన్ మార్టిన్ జట్టు డ్రైవర్ అలోన్సో మూడో స్థానంలో నిలిచారు.



ప్లేఆఫ్‌కు యూపీ వారియర్స్

- గ్రేస్ హారిస్ మెరుపులు
- గుజరాత్, బెంగళూరు నిష్క్రమణ


'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్రేస్ హారిస్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో చివరిదైన మూడో ప్లేఆఫ్ బెర్త్ కూడా ఖరారైంది. ఇప్పటికే ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేఆఫ్ దశకు అర్హత పొందగా... ఈ రెండు జట్ల సరసన యూపీ వారియర్స్ చేరింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో యూపీ వారియర్స్ మూడు వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది. యూపీ గెలుపుతో గుజరాత్ జెయింట్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్లు ప్లేఆఫ్ రేసు నుంచి నిష్క్రమించాయి.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 178 పరుగులు సాధించింది. హేమలత (33 బంతుల్లో 57; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), యాష్లే గార్డ్‌నర్ (39 బంతుల్లో 60; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడి అర్ధ సెంచరీలు చేశారు. యూపీ బౌలర్లలో రాజేశ్వరి గైక్వాడ్, పార్శ్వి చోప్రా రెండు వికెట్ల చొప్పున తీశారు. అనంతరం యూపీ వారియర్స్ 19.5 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 181 పరుగులు సాధించి విజయం సాధించింది. 39 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడిన యూపీ వారియర్స్‌ను తాలియా (38 బంతుల్లో 57; 11 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్రేస్ హారిస్ (41 బంతుల్లో 72; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఆదుకున్నారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 78 పరుగులు జోడించారు. తాలియా అవుటయ్యాక గ్రేస్ హారిస్ యూపీని విజయం దిశగా నడిపించింది. ఏడు బంతులు మిగిలి ఉండగా హారిస్ పెవిలియన్ చేరగా... సోఫీ ఎకిల్‌స్టోన్ (13 బంతుల్లో 19 నాటౌట్; 2 ఫోర్లు) యూపీ విజయాన్ని ఖాయం చేసింది.

ముంబై ఇండియన్స్‌కు ఢిల్లీ షాక్


అలైస్ క్యాప్సీ, మెగ్ లానింగ్

సోమవారం రాత్రి జరిగిన రెండో మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తొమ్మిది వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్ జట్టుకు షాక్ ఇచ్చింది. ఈ టోర్నీలో ఆడిన తొలి ఐదు మ్యాచ్‌ల్లో గెలిచి అందరికంటే ముందుగా ప్లేఆఫ్ బెర్త్ ఖరారు చేసుకున్న ముంబై ఆ తర్వాత ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోవడం గమనార్హం. ముందుగా ముంబై జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లకు 109 పరుగులు చేసింది. పూజ వస్త్రకర్ (19 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్), హర్మన్‌ప్రీత్ కౌర్ (26 బంతుల్లో 23; 3 ఫోర్లు), ఇసీ వాంగ్ (24 బంతుల్లో 23; 1 సిక్స్), అమన్‌జ్యోత్ కౌర్ (16 బంతుల్లో 19; 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. ఢిల్లీ బౌలర్లు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మరిజాన్ కప్ (2/13), శిఖా పాండే (2/21), జెస్ జొనాసెన్ (2/25) ముంబైని కట్టడి చేశారు. అనంతరం ఢిల్లీ దూకుడుగా ఆడి 9 ఓవర్లలో వికెట్ నష్టపోయి 110 పరుగులు చేసి గెలిచింది. షఫాలీ వర్మ (15 బంతుల్లో 33; 6 ఫోర్లు, 1 సిక్స్) అవుటవ్వగా.. మెగ్ లానింగ్ (22 బంతుల్లో 32 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), అలైస్ క్యాప్సీ (17 బంతుల్లో 38 నాటౌట్; 1 ఫోర్, 5 సిక్స్‌లు) ఢిల్లీ విజయాన్ని ఖాయం చేశారు.

డబ్ల్యూపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	పా	నె.ర.
ఢిల్లీ	7	5	2	10	1.978
ముంబై	7	5	2	10	1.725
యూపీ	7	4	3	8	–0.063
బెంగళూరు	7	2	5	4	–1.044
గుజరాత్	8	2	6	4	–2.220

నోట్: మ్యా–మ్యాచ్‌లు, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, నె.ర–నెట్ రన్‌రేట్

'ఫైనల్ బెర్త్' రేసులో ముంబై, ఢిల్లీ

ప్రస్తుతం ఢిల్లీ, ముంబై 10 పాయింట్లతో సమంగా ఉన్నా... మెరుగైన రన్‌రేట్ ఆధారంగా ఢిల్లీ టాప్ ర్యాంక్‌లో, ముంబై రెండో ర్యాంక్‌లో నిలిచాయి. నేడు జరిగే చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో బెంగళూరుతో ముంబై (మధ్యాహ్నం గం. 3:30 నుంచి)... యూపీతో ఢిల్లీ (రాత్రి గం. 7:30 నుంచి) ఆడతాయి. ముంబై, ఢిల్లీ జట్లలో భారీ తేడాతో నెగ్గిన జట్టు 'టాప్' ర్యాంక్‌తో నేరుగా ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. మూడో స్థానంలో నిలిచిన యూపీ వారియర్స్‌తో రెండో స్థానంలో నిలిచిన జట్టు ఫైనల్ బెర్త్ కోసం ఎలిమినేటర్ మ్యాచ్ ఆడుతుంది.

క్వార్టర్ ఫైనల్లో సాక్షి, లవ్లీనా



సాక్షి


లవ్లీనా

న్యూఢిల్లీ: ప్రపంచ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో సోమవారం భారత బాక్సర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. సాక్షి చౌధరీ (52 కేజీలు), లవ్లీనా బొర్గొహైన్ (75 కేజీలు) క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లగా... ప్రీతి (54 కేజీలు) పోరాటం ప్రిక్వార్టర్ ఫైనల్లో ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సాక్షి 5–0తో జజీరా ఉరక్‌బయేవా (కజకిస్తాన్)పై, లవ్లీనా 5–0తో వనెసా ఒరిట్జ్ (మెక్సికో)పై ఏకపక్ష విజయాలు నమోదు చేశారు. ప్రీతి 3–4తో జిట్‌పోంగ్ జుటామస్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది. మరో బౌట్‌లో విజయం సాధిస్తే సాక్షి, లవ్లీనాకు కనీసం కాంస్య పతకాలు ఖాయమవుతాయి. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సుమయె కొసిమోవా (తజికిస్తాన్)తో నీతూ (48 కేజీలు), తుర్హాన్ ఎలిఫ్ నూర్ (తుర్కియే)తో మనీషా (57 కేజీలు), కిటో మాయ్ (జపాన్)తో శశి చోప్రా (63 కేజీలు), ఫాతిమా హెరెరా అల్వారెజ్ (మెక్సికో)తో నిఖత్ జరీన్ (50 కేజీలు), నవ్‌బాఖోర్ ఖమిదోవా (ఉజ్బెకిస్తాన్)తో మంజు బంబోరియా (66 కేజీలు), మిజ్‌గోనా సమదోవా (తజికిస్తాన్)తో జాస్మిన్ (60 కేజీలు) తలపడతారు.

నలుగురు భారత సంతతి ఆటగాళ్లు!

మేజర్ లీగ్ క్రికెట్ డ్రాఫ్ట్‌లో చోటు


సాయితేజ రెడ్డి


అఖిలేశ్ రెడ్డి

హ్యూస్టన్: అమెరికాలో క్రికెట్ అభివృద్ధిలో భాగంగా తొలిసారి నిర్వహించబోతున్న మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ)–2023లో మొదటి రోజు ఆటగాళ్ల ఎంపిక పూర్తయింది. మొత్తం ఆరు జట్లు ఇందులో పాల్గొంటుండగా నాలుగు టీమ్‌లు ఐపీఎల్ యాజమాన్యాలకు (ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై) చెందినవే ఉన్నాయి. ఐపీఎల్ తరహాలో వేలం ద్వారా కాకుండా నేరుగా డ్రాఫ్ట్ ద్వారా ఆటగాళ్లను ఆయా ఫ్రాంచైజీలు ఎంచుకుంటున్నాయి. ఇందులో నిబంధనల ప్రకారం 'స్థానిక ఆటగాళ్లు'గా గుర్తింపు ఉన్న 54 మంది అమెరికా క్రికెటర్లను ఆయా జట్లలోకి తీసుకున్నారు. వీరిలో 15 మంది అమెరికా జాతీయ జట్టుకు జూనియర్ లేదా సీనియర్ స్థాయిలో ప్రాతినిధ్యం వహించారు. అయితే ఈ 54 మందిలో ఏడుగురు మాత్రమే అమెరికాలో పుట్టినవారు కావడం విశేషం. ఇందులో నలుగురు క్రికెటర్లు అఖిలేశ్ రెడ్డి బొడుగం, సాయిదీప్ గణేశ్, సంజయ్ కృష్ణమూర్తి, సాయితేజ రెడ్డి ముక్కామల భారత సంతతికి చెందినవారు. వీరిలో సాయితేజ ముక్కామల ఈ ఏడాది యూఎస్ సీనియర్ టీమ్ తరఫున కూడా ఆడాడు. అతనితో పాటు సాయిదీప్, సంజయ్‌లు అండర్–23 కేటగిరీలో ఎంపికయ్యారు. లాస్ ఏంజెలిస్ నైట్‌రైడర్స్, ముంబై ఇండియన్స్ న్యూయార్క్, సీటల్ ఆర్కాస్ (ఢిల్లీ క్యాపిటల్స్, సత్య నాదెళ్ల సహభాగస్వామ్యం), సూపర్ కింగ్స్ టెక్సస్, శాన్‌ఫ్రాన్సిస్కో యూనికార్న్స్, వాషింగ్టన్ ఫ్రీడమ్ పేర్లతో ఈ ఆరు జట్లు ఉన్నాయి. ఈ ఆరు టీమ్‌లు మార్క్యూ ఓవర్‌సీస్ ఆటగాళ్లుగా ఆరోన్ ఫించ్, నోర్జే, హసరంగ, డి కాక్, స్టొయినిస్, మిచెల్ మార్ష్‌లను ఎంచుకున్నాయి.


విన్నర్స్ ట్రోఫీతో అల్‌కరాజ్

'నంబర్‌వన్' అల్‌కరాజ్

- ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టైటిల్ సొంతం
- మళ్లీ 'టాప్' ర్యాంక్‌లోకి స్పెయిన్ స్టార్

కాలిఫోర్నియా: అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న స్పెయిన్ యువ స్టార్ కార్లోస్ అల్‌కరాజ్ ప్రపంచ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. ఇండియన్ వెల్స్ ఓపెన్ ఏటీపీ మాస్టర్స్–1000 టోర్నీలో 19 ఏళ్ల అల్‌కరాజ్ తొలిసారి విజేతగా అవతరించాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ అల్‌కరాజ్ 6–3, 6–2తో ప్రపంచ ఐదో ర్యాంకర్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా)పై గెలుపొందాడు. అల్‌కరాజ్‌కు 12,62,220 డాలర్ల (రూ. 10 కోట్ల 42 లక్షలు) ప్రైజ్‌మనీ, రన్నరప్ మెద్వెదెవ్‌కు 6,62,360 డాలర్ల (రూ. 5 కోట్ల 46 లక్షలు) ప్రైజ్‌మనీ లభించాయి.

మయామి ఓపెన్‌లోనూ టైటిల్ సాధిస్తేనే...

ఇండియన్ వెల్స్ టోర్నీకి ముందు రెండో ర్యాంక్‌లో ఉన్న అల్‌కరాజ్ తాజా విజయంతో 7,420 పాయింట్లతో మరోసారి నంబర్‌వన్ ర్యాంక్‌ను కైవసం చేసుకున్నాడు. ఈ టోర్నీకి ముందు సెర్బియా స్టార్ జొకోవిచ్ టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు. కోవిడ్ టీకా వేసుకోని విదేశీయులకు అమెరికాలో ప్రవేశం లేకపోవడంతో జొకోవిచ్ ఈ టోర్నీకి దూరం కావాల్సి వచ్చింది. 7,160 పాయింట్లతో జొకోవిచ్ రెండో ర్యాంక్‌కు పడిపోయాడు. సోమవారం మొదలైన మయామి ఓపెన్ టోర్నీలోనూ అల్‌కరాజ్ విజేతగా నిలిస్తేనే నంబర్‌వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకుంటాడు. లేదంటే ఏప్రిల్ 3న విడుదల చేసే ర్యాంకింగ్స్‌లో జొకోవిచ్ మళ్లీ టాప్ ర్యాంక్‌ను దక్కించుకుంటాడు. మరోవైపు స్పెయిన్ దిగ్గజం రాఫెల్ నాదల్ 18 ఏళ్ల తర్వాత తొలిసారి టాప్–10 ర్యాంకింగ్స్‌లో చోటు కోల్పోయి 13వ ర్యాంక్‌లో నిలిచాడు.

రిబాకినా తొలిసారి...

ఇండియన్ వెల్స్ ఓపెన్ మహిళల టోర్నీలో కజకిస్తాన్ క్రీడాకారిణి ఎలీనా రిబాకినా తొలిసారి విజేతగా నిలిచింది. ఫైనల్లో రిబాకినా 7–6 (13/11), 6–4తో రెండో ర్యాంకర్, ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్ సబలెంకా (బెలారస్)పై గెలిచింది. తాజా ప్రదర్శనతో రిబాకినా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ ఏడో ర్యాంక్‌కు చేరుకుంది. విజేత రిబాకినాకు 12,62,220 డాలర్ల (రూ. 10 కోట్ల 42 లక్షలు) ప్రైజ్‌మనీ, రన్నరప్ సబలెంకాకు 6,62,360 డాలర్ల (రూ. 5 కోట్ల 46 లక్షలు) ప్రైజ్‌మనీ లభించాయి.


విన్నర్స్ ట్రోఫీతో రిబాకినా

కివీస్ క్లీన్‌స్వీప్



వెల్లింగ్టన్: శ్రీలంకతో జరిగిన రెండో టెస్టులో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 58 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను 2–0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఫాలోఆన్ ఎదుర్కొని రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన శ్రీలంక నాలుగోరోజు 142 ఓవర్లలో 358 పరుగులకు ఆలౌటైంది. ధనంజయ డిసిల్వా (98; 12 ఫోర్లు, 1 సిక్స్), కరుణరత్నే (51; 4 ఫోర్లు), కుశాల్ మెండిస్ (50; 8 ఫోర్లు), చండీమల్ (62; 8 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. న్యూజిలాండ్ బౌలర్లలో కెప్టెన్ టిమ్ సౌతీ (3/51), టిక్నర్ (3/84) రాణించారు. హెన్రీ నికోల్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు... కేన్ విలియమ్సన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు లభించాయి.

సినిమా


మహేశ్‌బాబు


ప్రభాస్


అల్లు అర్జున్

కేరాఫ్ ఫారెస్ట్

కథ ఎక్కడికి ఆహ్వానిస్తే అక్కడికి వెళ్లాలి. కొందరు హీరోలను అడవి ఆహ్వానించింది. కేరాఫ్ ఫారెస్ట్ అంటూ ఆ హీరోలు అడవి బాట పడుతున్నారు. అడవి నేపథ్యంలో ఆ హీరోలు చేస్తున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.

ఆఫ్రికన్ అడవుల్లో...

మహేశ్‌బాబుతో ఓ భారీ యాక్షన్ అడ్వెంచరస్ మూవీ ప్లాన్ చేశారు రాజమౌళి. ఈ సినిమా కథ ప్రధానంగా అడవిలో జరుగుతుంది. అయితే అది దేశీ అడవి కాదు... ఆఫ్రికన్ ఫారెస్ట్. చిత్ర కథారచయిత విజయేంద్రప్రసాద్ కొన్ని నెలల క్రితం ఇది అడవి నేపథ్యంలో సాగే సినిమా అని పేర్కొన్న విషయం గుర్తుండే ఉంటుంది. తాజాగా కీరవాణి కూడా ఆ విషయాన్ని స్పష్టం చేశారు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రానికి అద్భుతమైన కథ కుదిరిందని కీరవాణి పేర్కొన్నారు. రాజమౌళి గత చిత్రం 'ఆర్‌ఆర్‌ఆర్'కి సంగీతదర్శకుడిగా వ్యవహరించి, 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో కీరవాణి ఆస్కార్ అందుకున్న విషయం తెలిసిందే. మహేశ్–రాజమౌళిల తాజా చిత్రానికి కూడా కీరవాణియే స్వరకర్త. కాగా ఈ చిత్రంలో మహేశ్‌బాబుని సరికొత్త లుక్‌లో చూపించనున్నారు రాజమౌళి. 'పాన్ వరల్డ్' మూవీగా ఈ ప్రాజెక్ట్ ఉంటుందని, విదేశీ నిర్మాతలు కూడా భాగస్వాములు అవుతారని టాక్. ఈ చిత్రం షూటింగ్ ఆరంభం కావాల్సి ఉంది.

అడవి రాముడు

రాముడుగా ప్రభాస్, సీతగా కృతీ సనన్, లక్ష్మణుడిగా సన్నీ సింగ్ నటించిన చిత్రం 'ఆది పురుష్'. ఓం రౌత్ దర్శకత్వంలో రూపొందిన ఈ త్రీడీ పాన్ ఇండియా మూవీ జూన్ 16న విడుదల కానుంది. రాముడి జీవితంలోని ఒక అధ్యాయాన్ని తీసుకుని, ఈ చిత్రాన్ని తెరకెక్కించారు ఓం రౌత్. రాముడిలోని కరుణ, వీరత్వం రెండు రసాలను చూపించనున్నారు. ఈ క్యారెక్టర్ కోసం ప్రభాస్ ఫిజిక్‌ని 'వి' షేప్‌కి మార్చుకోమని ఓం రౌత్ కోరగా, పాత్రకు తగ్గట్టు మారారు. అలాగే హిందీలో డబ్బింగ్ చెప్పడానికి ఆ భాష మీద పట్టు సాధించారు ప్రభాస్. ఏడువేల ఏళ్ల క్రితం నాటి కథను మోడ్రన్ టెక్నాలజీతో చూపించనున్నారు ఓం రౌత్. ఇందుకోసం భారీ ఎత్తున విజువల్ ఎఫెక్ట్స్ ఉపయోగించారు. ఇక ఈ కథలో కొంత భాగం అడవిలో ఉంటుందని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. రాముడు జీవితంలో అడవికి వెళ్లడం కీలకమే కదా.

మారేడుమిల్లిలో పుష్పరాజ్

'పుష్ప అంటే ఫ్లవర్ అనుకుంటివా.. ఫైరు' అంటూ పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్ అద్భుతంగా ఒదిగిపోయిన తీరుని 'పుష్ప' తొలి భాగం 'పుష్ప: ది రైజ్'లో చూశాం. సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఘనవిజయం సాధించింది. ఇప్పుడు రెండో భాగం 'పుష్ప: ది రూల్' రెడీ అవుతోంది. తొలి భాగంలో మారేడుమిల్లి ఫారెస్ట్ కీలకం. మలి భాగంలోనూ అడవి బ్యాక్‌డ్రాప్ ఉంటుంది. తొలి భాగంలో కథానాయికగా నటించిన రష్మికా మందన్నా, పోలీస్ పాత్ర చేసిన ఫాహద్ ఫాజిల్, నెగటివ్ రోల్ చేసిన సునీల్ ఇంకా అనసూయ వంటి ఆర్టిస్టులు మలి భాగంలోనూ ఉంటారు. వచ్చే ఏడాది ఈ చిత్రం రిలీజ్ కానుంది.


నితిన్

నితిన్ కూడా మారేడుమిల్లిలోనే...

లవర్‌బాయ్ క్యారెక్టర్స్‌ని నితిన్ చాలానే చేశారు. కొంచెం మాస్ టచ్ ఉన్న పాత్రలూ చేశారు. అయితే అవుట్ అండ్ అవుట్ మాస్ క్యారెక్టర్‌లో ఇప్పటివరకూ కనిపించలేదు. ప్రస్తుతం వక్కంతం వంశీ దర్శకత్వంలో చేస్తున్న సినిమాలో అలాంటి పాత్ర చేస్తున్నారు నితిన్. గడ్డం, మీసాలతో ఫుల్ మాస్‌గా కనిపించనున్నారీ హీరో. ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్‌ని మారేడుమిల్లి ఫారెస్ట్‌లో ఆరంభించారు. ఈ చిత్రకథ ప్రధానంగా అడవి చుట్టూ తిరుగుతుంది. ఈ చిత్రం ఈ ఏడాదే విడుదలవుతుంది.

అడవి చుట్టూ తిరిగే చిత్రాలు మరికొన్ని ఉన్నాయి.

ఆగనందే..


కార్తీ, త్రిష

'ఆగనందే ఆగనందే.. మోవి నవ్వుతోందే.. మోవి నవ్వే.. మోవి నవ్వే.. మోము నవ్వుతోందే.. మోము నవ్వే.. మోము నవ్వే.. మాను నవ్వుతోందే' అని పాడుతున్నారు యువరాణి కుందై. ప్రియుడు వల్లవరాయన్ వందియ దేవన్ కోసమే ఈ పాట. విక్రమ్, 'జయం' రవి, కార్తీ, ఐశ్వర్యా రాయ్, త్రిష తదితర భారీ తారాగణంతో మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన 'పొన్నియిన్ సెల్వన్ 2'లోని పాట ఇది. చోళ సామ్రాజ్యం నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో కుందవైగా త్రిష, వందియ దేవన్‌గా కార్తీ నటించారు. ఈ ఇద్దరి మధ్య సాగే 'ఆగనందే ఆగనందే మోవి నవ్వుతోందే..' పాట పూర్తి లిరికల్ వీడియోను సోమవారం విడుదల చేశారు. ఏఆర్ రెహమాన్ స్వరపరచిన ఈ పాటకు అనంత్ శ్రీరామ్ సాహిత్యం అందించగా శక్తి శ్రీ గోపాలన్ పాడారు. 'పొన్నియిన్ సెల్వన్'కి సీక్వెల్‌గా రూపొందిన రెండో భాగం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఏప్రిల్ 28న విడుదల కానుంది.

ఫస్ట్ టైమ్ ఎక్కువగా డ్యాన్స్ చేశా!

- నివేదా పేతురాజ్



''ఒక హీరో నిర్మాతగా చేయడం వేరు. కానీ, హీరోగా నటిస్తూనే దర్శకత్వం చేయడం గ్రేట్. 'దాస్ కా ధమ్కీ'కి హీరో, నిర్మాత, డైరెక్టర్.. ఇలా మూడు బాధ్యతలని విశ్వక్ చక్కగా నిర్వర్తించారు. నేను పని చేసిన దర్శకుల్లో త్రివిక్రమ్ శ్రీనివాస్‌గారి తర్వాత అంత ఎనర్జీ ఉన్న దర్శకుడిని విశ్వక్‌లో చూశాను'' అని హీరోయిన్ నివేదా పేతురాజ్ అన్నారు. విశ్వక్ సేన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించడంతో పాటు నిర్మించిన చిత్రం 'దాస్ కా ధమ్కీ'. ఈ సినిమా రేపు (బుధవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా నివేదా పేతురాజ్ మాట్లాడుతూ– ''విశ్వక్‌తో 'పాగల్' మూవీ చేశాను. ఆ తర్వాత 'దాస్ కా ధమ్కీ' కథ యూనిక్‌గా అనిపించడంతో ఓకే చెప్పాను. మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. నా కెరీర్‌లో తొలిసారి ఈ చిత్రంలో గ్లామరస్ రోల్‌తో పాటు ఎక్కువగా డ్యాన్స్ చేశాను. విశ్వక్‌లో అద్భుతమైన ఐడియాలు ఉన్నాయి. అయితే తానే నటుడిగా నటిస్తూ డైరెక్షన్ చేయడం కాకుండా వేరే హీరోలని డైరెక్ట్ చేస్తే బావుంటుందని నా అభిప్రాయం. తన కెరీర్‌లో 'దాస్ కా ధమ్కీ' ఒక మైలురాయిగా నిలుస్తుంది. నేను కేవలం సినిమాలపైనే ఆధారపడటం లేదు. చెన్నైలో రెస్టారెంట్, ఫ్లవర్ షాప్ వ్యాపారాలు చేస్తున్నాను. దర్శకత్వం చేయాలని ఉంది కానీ, అందుకు ఇంకా టైమ్ పడుతుంది. నిర్మాతల కష్టాలు కళ్లారా చూసిన నాకు సినిమా నిర్మించే ఆలోచన లేదు. ప్రస్తుతం సుస్మితగారు నిర్మిస్తున్న ఓ సినిమా, హిందీలో టీ సిరీస్ వారి సినిమా చేస్తున్నాను'' అన్నారు.

అన్ని రకాల పాత్రలు చేయాలనుంది

- దక్షా నగార్కర్



''నా ప్రతి సినిమాలో ఎప్పుడూ కొత్తగా చేయాలని ప్రయత్నిస్తాను. నా గత చిత్రాలు 'హోరాహోరీ, హుషారు, జాంబిరెడ్డి' కూడా వేటికవే ప్రత్యేకమైన జోనర్. 'రావణాసుర' కూడా చాలా వైవిధ్యమైన సినిమా. ఇందులో నా పాత్ర చూసి ప్రేక్షకులు సర్‌ప్రైజ్ అవుతారు'' అని హీరోయిన్ దక్షా నగార్కర్ అన్నారు. రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'రావణాసుర'. అభిషేక్ నామా, రవితేజ నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ చిత్రంలో ఓ హీరోయిన్‌గా నటించిన దక్షా నగార్కర్ మాట్లాడుతూ– ''రావణాసుర' కోసం అభిషేక్‌గారు నన్ను సంప్రదించారు. ఆ తర్వాత సుధీర్ వర్మగారు నా పాత్ర, లుక్ గురించి చెప్పగానే ఎగ్జయిటింగ్‌గా అనిపించింది. ఈ మూవీలో నలుగురు హీరోయిన్లు ఉన్నప్పటికీ నా పాత్రకి ఎంత న్యాయం చేయగలను అనే దానిపైనే దృష్టి పెట్టాను. నటనకి ఆస్కారం ఉన్న పాత్ర చేశాను. ఒక నటిగా అన్ని రకాల పాత్రలు చేయాలని, అందరి హీరోలతో కలిసి నటించాలని ఉంది. కొత్తగా రెండు సినిమాలు ఒప్పుకున్నాను'' అన్నారు.

క్రైమ్ థ్రిల్లర్


కార్తీక్ రాజు, ఐరా

కార్తీక్ రాజు హీరోగా, సిమ్రాన్ చౌదరి, ఐరా హీరోయిన్లుగా మహేష్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'అథర్వ'. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో సుభాష్ నూతలపాటి నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ని హీరో ఆకాష్ పూరి, క్లూస్ టీమ్ హెడ్ వెంకన్న, నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి, 'స్పై' డైరెక్టర్, ఎడిటర్ గ్యారీ, డైరెక్టర్స్ సుశాంత్ రెడ్డి, కనక మామిడి రిలీజ్ చేశారు. చిత్రనిర్మాత సుభాష్ మాట్లాడుతూ– ''మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ జరుపుకుంటోంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ చేస్తాం'' అన్నారు. ''క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రమిది'' అన్నారు మహేష్ రెడ్డి. ''ఇంత మంచి సినిమా చేసే చాన్స్ ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు కార్తీక్ రాజు, ఐరా. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ చరణ్ పాకాల, కెమెరా: చరణ్ మాధవనేని, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: విజయ, ఝాన్సీ.

ఏదో కలవరం


విజయ్, సిమ్రాన్

విజయ్ ధరణ్ దాట్ల హీరోగా, సిమ్రాన్ గుప్తా, అనన్య నాగళ్ల హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'అన్వేషి'. వీజే ఖన్నా దర్శకత్వంలో టి. గణపతి రెడ్డి నిర్మించారు. చేతన్ భరద్వాజ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ఏదో ఏదో కలవరం..' అనే పాటను మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ సిసిరోలియో రిలీజ్ చేశారు. చైతన్య వర్మ సాహిత్యం అందించిన ఈ పాటని అనురాగ్ కులకర్ణి, దీప్తి ప్రశాంతి ఆలపించారు. వీజే ఖన్నా మాట్లాడుతూ– ''అడవి నేపథ్యంలో సాగే సినిమా 'అన్వేషి'' అన్నారు. ''మే రెండో వారంలో చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అన్నారు గణపతి రెడ్డి. ఈ చిత్రానికి సహనిర్మాతలు: హరీష్ రాజు, శివన్ కుమార్, వెంకట రాంబాబు, జాన్ బోయలపల్లి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: దుర్గేష్ .ఎ, కెమెరా: కేకే రావు.

పుంగనూరు కళాశాలలో..


ప్రణవ్, షగ్నశ్రీ

ప్రణవ్ సింగంపల్లి, షగ్నశ్రీ వేణున్ జంటగా శ్రీనాథ్ పులకురం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల'. కొవ్వూరి అరుణ సమర్పణలో భువన్ రెడ్డి కొవ్వూరి నిర్మించారు. ఈ చిత్రం గ్లింప్స్‌ను తెలంగాణ మంత్రి మల్లారెడ్డి ఆన్ లైన్‌లో విడుదల చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో నటుడు సాగర్ ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. శ్రీనాథ్ పులకురం మాట్లాడుతూ– ''పుంగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నేపథ్యంలో తెరకెక్కిన ప్రేమకథ ఇది'' అన్నారు. ''అందర్నీ కదిలించే కథతో ఈ చిత్రాన్ని నిర్మించాం'' అన్నారు భువన్ రెడ్డి. ఈ చిత్రానికి సంగీతం: కార్తీక్ రోడ్రిగ్యెజ్, నేపథ్య సంగీతం: కమరన్, కెమెరా: నిఖిల్ సురేంద్రన్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
361	112
57,629	16,988

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	11,662	▲	32
డోజోన్స్	32,223	▲	361
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,404	▲	68
డాక్స్	14,933	▲	165
షాంఘై	3,235	▽	16
నికాయ్	26,946	▽	388

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (24 క్యారెట్)	58,520
బంగారం (22 క్యారెట్)	55,730
వెండి (కేజీ)	74,000

ఫ్లాగ్‌స్టార్ చేతికి సిగ్నేచర్ బ్యాంక్

డీల్ విలువ రూ. 22,300 కోట్లు



న్యూయార్క్: గత వారం మూతపడిన సిగ్నేచర్ బ్యాంకు మెజారిటీ ఆస్తుల కొనుగోలుకి న్యూయార్క్ కమ్యూనిటీ బ్యాంక్ అంగీకరించింది. డీల్ విలువ 2.7 బిలియన్ డాలర్లు (రూ. 22,300 కోట్లు)గా ఫెడరల్ డిపాజిట్ ఇన్సూరెన్స్ కార్ప్ (ఎఫ్‌డీఐసీ) వెల్లడించింది. ఒప్పందంలో భాగంగా అనుబంధ సంస్థలలో ఒకటైన ఫ్లాగ్‌స్టార్ బ్యాంక్ ద్వారా సిగ్నేచర్ బ్యాంకుకు చెందిన 38.4 బిలియన్ డాలర్ల ఆస్తులను న్యూయార్క్ కమ్యూనిటీ కొనుగోలు చేయనుంది. ఇవి సిగ్నేచర్ ఆస్తులలో ముప్పావు వంతుకాగా.. సోమవారం (20) నుంచి సిగ్నేచర్‌కు చెందిన 40 బ్రాంచీలు ఫ్లాగ్‌స్టార్ నిర్వహణలోకి వస్తాయి. సిగ్నేచర్‌కు చెందిన 60 బిలియన్ డాలర్ల రుణాలు రిసీవర్‌షిప్ (కస్టోడియన్) కింద ఉన్నట్లు ఎఫ్‌డీఐసీ పేర్కొంది.

అమెజాన్‌లో మరో 9,000 మంది తొలగింపు



న్యూయార్క్: అమెజాన్ మరింత మంది ఉద్యోగులను తొలగించే ప్రణాళికతో ఉంది. ఈ ఏడాది జనవరిలో 18,000 మందిని ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాల్లోంచి తొలగించింది. ఇప్పుడు మరో 9,000 మందిని వచ్చే కొన్ని వారాల్లో సాగనంపేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ విషయాన్ని సంస్థ సీఈవో ఆండీ జస్సీ ఉద్యోగులకు పంపించిన మెమోలో పేర్కొన్నారు. సంస్థ చరిత్రలో ఈ స్థాయిలో ఉద్యోగుల తొలగింపు ఇప్పుడే కనిపిస్తోంది. కంపెనీ వార్షిక ప్రణాళిక ప్రక్రియ రెండో దశ ఈ నెలలోనే ముగిసిందని చెబుతూ, దీని ఫలితమే మరింత మంది ఉద్యోగుల తొలగింపు అని జస్సీ స్పష్టం చేశారు.

2 నెలల్లో 6 ఐపీవోలకు చెక్

- ముసాయిదా పత్రాలు వెనక్కి పంపుతున్న సెబీ
- జాబితాలో ఓయో, గో డిజిట్, పేమేట్, లావా..
- లిస్టయ్యాక పేటీఎమ్, జొమాటో, నైకా భారీ నష్టాల ప్రభావం



న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ ద్వారా నిధుల సమీకరణకు వస్తున్న కంపెనీలపై క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ కఠినంగా వ్యవహరిస్తోంది. డిజిటల్ చెల్లింపుల దిగ్గజం పేటీఎమ్ ఐపీవో తదుపరి తలెత్తిన సవాళ్లరీత్యా అన్‌లిస్టెడ్ కంపెనీలు అందిస్తున్న సమాచారంపై మరింత ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. వెరసి గత రెండు నెలల్లో ఆరు కంపెనీల ముసాయిదా ప్రాస్పెక్టస్‌లను తిప్పి పంపింది. ఓయో బ్రాండుతో ఆతిథ్య రంగ సేవలందిస్తున్న ఒరావెల్ స్టేస్ ఈ జాబితాలో చోటు చేసుకోవడం గమనార్హం! మరింత లోతైన సమాచారంతో తిరిగి తాజా ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేయమంటూ సెబీ ఆయా కంపెనీలను ఆదేశిస్తోంది.

జాబితాలో..: ఓయోతోపాటు.. సెబీ ప్రాస్పెక్టస్‌లను వెనక్కి పంపిన జాబితాలో ఫెయిర్‌ఫాక్స్(కెనడా) గ్రూప్‌నకు పెట్టుబడులున్న గో డిజిట్ ఇన్సూరెన్స్ లిమిటెడ్, బీ2బీ పేమెంట్స్, సర్వీసుల సంస్థ పేమేట్ ఇండియా, మొబైల్ తయారీ దేశీ కంపెనీ లావా ఇంటర్నేషనల్, ఫైనాన్షియల్ సేవల సంస్థ ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఇండియా, సమీకృత సర్వీసుల సంస్థ బీవీజీ ఇండియా ఉన్నాయి. 2021 సెప్టెంబర్–2022 మే నెల మధ్యలో ఈ 6 కంపెనీలు సెబీకి దరఖాస్తు చేశాయి. ఈ ఏడాది జనవరి–మార్చి10 మధ్య సెబీ వీటి ప్రాస్పెక్టస్‌లను తిప్పి పంపింది. ఈ కంపెనీలు ఉమ్మడిగా రూ. 12,500 కోట్ల సమీకరణకు ప్రణాళికలు వేశాయి.

2021లో నష్టాల ఎఫెక్ట్...

2021లో కొన్ని బడా కంపెనీల పబ్లిక్ ఇష్యూల ద్వారా ఇన్వెస్టర్లు భారీగా నష్టపోవడంతో సెబీ ఇటీవల కఠినంగా వ్యవహరిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. ప్రైమ్‌డేటాబేస్ గణాంకాల ప్రకారం 2022లో సగటున సెబీ ఐపీవోలకు 115 రోజుల్లోగా అనుమతిని ఇచ్చింది. కొత్తతరం డిజిటల్ కంపెనీలు పేటీఎమ్, జొమాటో, నైకా ఇష్యూలలో ఇన్వెస్టర్లు భారీగా నష్టపోవడంతో సెబీ ఐపీవోకు అనుమతించడంలో కఠినంగా వ్యవహరిస్తున్నట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ నిపుణులు వీకే విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఇన్వెస్టర్ల పరిరక్షణరీత్యా ఇది ఆహ్వానించదగ్గ పరిణామమని వ్యాఖ్యానించారు. అయితే పబ్లిక్ ఇష్యూలలో ఇన్వెస్ట్ చేసేటపుడు ఇన్వెస్టర్లు ప్రధానంగా అధిక ధరను ఆశిస్తున్న కంపెనీలకు దూరంగా ఉండాలని సూచించారు.

పేటీఎమ్ షాక్

పేటీఎమ్ బ్రాండుతో డిజిటల్ చెల్లింపుల సేవలు అందిస్తున్న వన్97 కమ్యూనికేషన్స్ 16 నెలల క్రితం పబ్లిక్ ఇష్యూకి వచ్చింది. పీఎస్‌యూ దిగ్గజం కోల్ ఇండియా తదుపరి అత్యధికంగా రూ. 18,300 కోట్లు సమీకరించి 2021 నవంబర్‌లో లిస్టయ్యింది. తదుపరి ఇష్యూ ధరలో 72 శాతాన్ని కోల్పోయింది. కాగా.. సెబీ ఇటీవలి చర్యలు నిబంధనల అమలులో మర్చంట్ బ్యాంకర్లకు హెచ్చరికలుగా భావించవచ్చని మూలా వ్యవస్థాపక సీఈవో ప్రకార్ పాండే అభిప్రాయపడ్డారు. మార్కెట్ల హెచ్చుతగ్గులు, ఇన్వెస్టర్ల బలహీన సెంటిమెంటు నేపథ్యంలో ఈ ఏడాది ఇప్పటివరకూ 9 కంపెనీలు సెబీకి ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేశాయి. ఈ ఏడాది ప్రారంభం నుంచీ డివ్‌జీ టార్క్‌ట్రాన్స్‌ఫర్ సిస్టమ్స్, గ్లోబల్ సర్ఫేసెస్ మాత్రమే పబ్లిక్ ఇష్యూలను చేపట్టాయి. తద్వారా రూ. 730 కోట్లు సమీకరించాయి. రూ. 66 కోట్లు సమకూర్చుకునేందుకు ఉదయ్‌శివ్‌కుమార్ వచ్చే వారం ఐపీవోకు రానుంది.

2022లో ఓకే...

గతేడాది(2022) మొత్తం 38 కంపెనీలు ఐపీవోకు వచ్చాయి. తద్వారా రూ. 59,000 కోట్లు సమీకరించాయి. అయితే 2021లో రికార్డ్‌స్థాయిలో 63 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలు చేపట్టాయి. రూ. 1.2 లక్షల కోట్లు సమకూర్చుకున్నాయి. ఇక గతేడాది బీమా రంగ పీఎస్‌యూ ఎల్‌ఐసీ రూ. 20,557 కోట్లు సమీకరించడం ద్వారా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యింది. వెరసి 2022 ఐపీవో నిధుల్లో 35 శాతం వాటాను ఆక్రమించింది. ఈ ఇష్యూని మినహాయిస్తే ప్రైమరీ మార్కెట్ నీరసించినట్లేనని విశ్లేషకులు పేర్కొన్నారు. ఆర్థిక మాంద్య భయాలు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు ప్రభావం చూపినట్లు తెలియజేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరం(2023-24) ద్వితీయార్ధంలో ప్రైమరీ మార్కెట్ పుంజుకోవచ్చని అంచనా వేస్తున్నారు. ధరలతోపాటు పెరుగుతున్న వడ్డీ రేట్లు, ఆర్థిక మందగమనం, షేర్ల అధిక విలువలు తదితర అంశాలు మార్కెట్లలో దిద్దుబాట్లకు కారణంకానున్నట్లు విశ్లేషించారు.

మహీంద్రా చెంతకు మిత్రా ఆగ్రో



న్యూఢిల్లీ: స్ప్రేయర్ల తయారీ కంపెనీ మిత్రా ఆగ్రో ఎక్విప్‌మెంట్స్‌లో వాటాను 100 శాతానికి పెంచుకున్నట్లు మహీంద్రా అండ్ మహీంద్రా సోమవారం ప్రకటించింది. ఇప్పటి వరకు మహీంద్రాకు ఈ కంపెనీలో 47.33 శాతం వాటా ఉంది. ఓమ్నివోర్ పూర్తి వాటాను మహీంద్రా చేజిక్కించుకుంది. తాజా వాటాలను ఎంతకు దక్కించుకున్నదీ కంపెనీ వెల్లడించలేదు. వ్యవసాయ యంత్రాలు, పనిముట్ల వ్యాపారంలో అయిదేళ్లలో 10 రెట్లు వృద్ధి చెందాలన్నది మహీంద్రా లక్ష్యం. వాటా కొనుగోలు సంస్థ వృద్ధికి దోహదం చేయడంతోపాటు పెరుగుతున్న ఉద్యాన పంటల రంగంలో విస్తరణకు ఆస్కారం ఉందని మహీంద్రా అండ్ మహీంద్రా ఫామ్ ఎక్విప్‌మెంట్ విభాగం ప్రెసిడెంట్ హేమంత్ సిక్కా తెలిపారు. పండ్ల తోటల్లో వాడే స్ప్రేయర్ల తయారీలో ఉన్న మిత్రా ఆగ్రో 2012లో ప్రారంభం అయింది. 200 పైచిలుకు ఉద్యోగులు ఉన్నారు. 2017-18తో పోలిస్తే గత ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీ మూడింతల ఆదాయాన్ని ఆర్జించింది. ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. నూతన ఉత్పత్తుల తయారీతోపాటు భారత్ సహా విదేశీ మార్కెట్లలో విస్తరణకు యోచిస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-3-2023	
విశాఖ	450-00
చిత్తూరు	473-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	438-00
విజయవాడ	438-00
రిటైల్ ధర (డజను)	66.00
20-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425-00
వరంగల్	427-00
రిటైల్ ధర	4.95

భారత్‌లో సిస్కో భారీ విస్తరణ

- చెన్నైలో డేటా సెంటర్ ఏర్పాటు
- ముంబై కేంద్రం అప్‌గ్రేడ్



న్యూఢిల్లీ: డిజిటల్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీ దిగ్గజం సిస్కో.. భారత్‌లో కార్యకలాపాలను భారీగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా చెన్నైలో కొత్త డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. ముంబైలోని సెంటర్‌ను అప్‌గ్రేడ్ చేస్తోంది. అలాగే హైబ్రిడ్, మల్టీ–క్లౌడ్ విభాగాల భద్రతకు సంబంధించి రిస్కు ఆధారిత కొత్త సొల్యూషన్స్‌ను ఆవిష్కరిస్తున్నట్లు సిస్కో వెల్లడించింది. ప్రస్తుతం తమ టాప్ 10 మార్కెట్లలో ఒకటిగా ఉన్న భారత్..2025 నాటి కల్లా టాప్ 5లోకి చేరగలదని సిస్కో ఇండియా ప్రెసిడెంట్ డైసీ చిట్టిలపిల్లి తెలిపారు. వివిధ విభాగాల్లో డిజిటలీకరణ వేగవంతం అవుతుండటం, 5జీ సర్వీసులు వేగంగా వినియోగంలోకి వస్తుండటం, చిన్న.. మధ్య తరహా సంస్థల్లో టెక్నాలజీ వినియోగం పెరుగుతుండటం తదితర అంశాలు ఇందుకు దోహదపడగలవని ఆమె వివరించారు. ఏపీజేసీ (ఆసియా పసిఫిక్, జపాన్, చైనా) ప్రాంతంలో భారత్ ఇప్పటికే తమకు టాప్ మార్కెట్లలో ఒకటిగా ఉందని డైసీ చెప్పారు.

టెలికం, ఐటీకి కొత్త నిబంధనలు మంచిదే..

టెలికం, ఐటీ రంగాలకు సంబంధించి కేంద్రం కొత్త నిబంధనలను రూపొందిస్తుండటంపై స్పందిస్తూ.. కనెక్టివిటీ పెరిగే కొద్దీ ఇలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం అవసరమేనని డైసీ పేర్కొన్నారు. ఇలాంటివి పరిశ్రమకు కూడా శ్రేయస్కరమేనని చెప్పారు.

సూచీలకు బ్యాంకింగ్ భయాలు

- 17వేల దిగువకు నిఫ్టీ
- సెన్సెక్స్ నష్టం 361 పాయింట్లు
- ఫైనాన్స్, ఐటీ షేర్లలో అమ్మకాలు



ముంబై: అమెరికా, యూరప్‌ల్లో నెలకొన్న బ్యాంకింగ్ సంక్షోభ భయాలతో స్టాక్ సూచీలు సోమవారం నష్టాలను చవిచూశాయి. ఫెడ్ రిజర్వ్ తో పాటు మరిన్ని కేంద్ర బ్యాంకులు రంగంలో దిగి పరిస్థితులు చక్కదిద్దే ప్రయత్నాలు చేపట్టినప్పటికీ.., సంక్షోభం ఆర్థిక మాంద్యానికి దారి తీయొచ్చనే ఆందోళనలు పెరిగాయి. అలాగే ఫెడ్ రిజర్వ్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లు సైతం వడ్డీరేట్లు పెంచొచ్చనే అంచనాలు, దేశీయ మార్కెట్లో ఆగని విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఎఫ్‌ఎంసీజీ, మీడియా మినహా అన్ని రంగాల షేర్ల అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో సెన్సెక్స్ 361 పాయింట్లు నష్టపోయి 57,629 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 112 పాయింట్లు పతనమై 17 వేల దిగువున 16,988 వద్ద నిలిచింది. ఫైనాన్సియల్, ఐటీ, క్యాపిటల్ గూడ్స్ షేర్లు నెలకొన్న అమ్మకాల ఒత్తిడితో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు ఒకశాతానికి పైగా నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2546 కోట్ల షేర్లను విక్రయించగా..., సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2877 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ మూడు పైసలు బలహీనపడి 82.56 వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లు 3-1% చొప్పున నష్టపోయాయి. ఆరంభ నష్టాలు భర్తీ చేసుకున్న యూరప్ సూచీలు ఒకశాతం పుంజుకున్నాయి. అమెరికా స్టాక్ సూచీలు మిశ్రమంగా కదలాడుతున్నాయి. సెన్సెక్స్ 361 పాయింట్లు క్షీణించడంతో సోమవారం ఒక్కరోజే ఇన్వెస్టర్లకు రూ.2 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం విలువ రూ.255.52 లక్షల కోట్లకు దిగివచ్చింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- నష్టాల మార్కెట్లోనూ కొచ్చిన్ షిప్‌యార్డ్ షేరు రాణించింది. బీఎస్‌ఈలో నాలుగు శాతం లాభపడి రూ.460 వద్ద ముగిసింది.
- రిలయన్స్ షేరు పతనం 8వ రోజూ కొనసాగింది. ఇంట్రాడేలో 2% పడి ఏడాది కనిష్టాన్ని తాకింది. చివరికి 1% నష్టంతో రూ.2,202 వద్ద నిలిచింది.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

హైదరాబాద్ జిల్లాలో 114 పోస్టులు

హైదరాబాద్‌లోని జాయింట్ డైరెక్టర్(మెడికల్), ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ ఒప్పంద ప్రాతిపదికన ఈఎస్ఐ హాస్పిటళ్లు/ఈఎస్ఐ డిస్పెన్సరీలు/ఈఎస్ఐ డయాగ్నస్టిక్ సెంటర్‌లలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 114
» **పోస్టుల వివరాలు:** సివిల్ అసిస్టెంట్ సర్జన్-59, డెంటల్ అసిస్టెంట్ సర్జన్-01, ల్యాబ్ టెక్నీషియన్-11, ఫార్మసిస్ట్-43.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎంబీబీఎస్, బీడీఎస్, ల్యాబొరేటరీ టెక్నీషియన్ సర్టిఫికేట్, డీఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వేతనం:** నెలకు సీఏఎస్, డీఏఎస్ పోస్టులకు రూ.58,850, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్ పోస్టులకు రూ.31,040 చెల్లిస్తారు.
» **వయసు:** 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతతో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా జాయింట్ డైరెక్టర్(మెడికల్), ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్, హైదరాబాద్, ఐదో అంతస్తు, హాస్టల్ బిల్డింగ్, ఈఎస్ఐ హాస్పిటల్ సనత్ నగర్, నాచారం, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 28.03.2023.
» **వెబ్‌సైట్:** www.hyderabad.telangana.gov.in

ఐఐఎం ఇండోర్‌లో ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్

మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఇండోర్ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(ఐపీఎం)-2023లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** అభ్యర్థి 2021, 2022లో పన్నెండో తరగతి/హెచ్ఎస్‌సీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. లేదా 2023లో సంబంధిత పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
» **వయసు:** 01.08.2003 లేదా ఆ తర్వాత జన్మించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఆప్టిట్యూడ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.04.2023.
» **వెబ్‌సైట్:** www.iimidr.ac.in

ఐఐఎం బోధ్‌గయలో పీహెచ్‌డీలో ప్రవేశాలు

బోధ్‌గయ (బిహార్)లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్.. 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి మేనేజ్‌మెంట్ విభాగంలో పీహెచ్‌డీలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **పీహెచ్‌డీ స్పెషలైజేషన్:** మార్కెటింగ్, ఎకనామిక్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, స్ట్రాటజీ అండ్ ఎంట్రపెన్యూర్‌షిప్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సిస్టమ్స్ అండ్ అనలిటిక్స్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ అండ్ క్వాంటిటేటివ్ టెక్నిక్స్, హ్యూమానిటీస్ అండ్ లిబరల్ ఆర్ట్స్(బిజినెస్ కమ్యూనికేషన్), ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్.
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు వ్యాలిడ్ క్యాట్/జీఆర్ఈ/జీమ్యాట్/గేట్/జేఆర్ఎఫ్(యూజీసీ/సీఎస్ఐఆర్) స్కోరు సాధించి ఉండాలి.
» **వయసు:** 01.06.2023 నాటికి అభ్యర్థికి 40 ఏళ్లు మించకూడదు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.03.2023.
» **వెబ్‌సైట్:** www.iimbg.ac.in

నిట్ వరంగల్‌లో అడ్మినిస్ట్రేటివ్ సపోర్ట్ స్టాఫ్ పోస్టులు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ తాత్కాలిక ప్రాతిపదికన రీసెర్చ్ ప్రాజెక్ట్ కింద అడ్మినిస్ట్రేటివ్ సపోర్ట్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
» **అర్హత:** ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.5000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్:** rpadma@nitw.ac.in
» **దరఖాస్తులకు చివరితేది:** 30.03.2023.
» **వెబ్‌సైట్:** www.nitw.ac.in

నిట్ వరంగల్‌లో పార్ట్ టైం ప్రోగ్రామర్ పోస్టులు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వరంగల్ తాత్కాలిక ప్రాతిపదికన రీసెర్చ్ ప్రాజెక్ట్ కింద పార్ట్ టైం ప్రోగ్రామర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
» **అర్హత:** బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్(సీఎస్ఈ/ఐటీ/ఎస్ఈ/ఐఎస్) లేదా ఎంసీఏ/ఎంఎస్సీ(ఎంఎస్) ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.14,000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్:** rpadma@nitw.ac.in
» **దరఖాస్తులకు చివరితేది:** 30.03.2023.
» **వెబ్‌సైట్:** www.nitw.ac.in

బెస్ట్ ఇన్‌స్టిట్యూట్స్‌లో.. ఎంసీఏ

» నిట్ క్యాంపస్‌లలో ఎంసీఏకు నిమ్‌సెట్
» తొమ్మిది క్యాంపస్‌లలో ప్రవేశ అవకాశం
» నిమ్‌సెట్-2023 ఎంపిక ప్రక్రియ ప్రారంభం
» జూన్ 11న జాతీయ స్థాయిలో పరీక్ష

మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్.. సంక్షిప్తంగా ఎంసీఏ! ఐటీ రంగంలో ఉజ్వల కెరీర్‌కు మార్గం వేసే కోర్సు ఇది. ఇంజనీరింగ్ విద్యలో ప్రతిష్టాత్మక విద్యాసంస్థలుగా గుర్తింపు పొందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)లు ఎంసీఏ కోర్సును కూడా అందిస్తున్నాయి. వీటిల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష.. నిట్ ఎంసీఏ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(నిమ్‌సెట్)! తాజాగా నిమ్‌సెట్-2023 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. నిమ్‌సెట్ వివరాలు, ప్రవేశాలు కల్పించే నిట్ క్యాంపస్‌లు, ఎంట్రన్స్‌లో విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్..



నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)లు.. ఐఐటీల తర్వాత దేశంలో పేరున్న విద్యాసంస్థలు. ఈ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నత ప్రమాణాలతో ఇంజనీరింగ్ విద్యతోపాటు ఎంసీఏ కోర్సును అందిస్తున్నాయి. నిట్ ఎంసీఏ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (నిమ్‌సెట్)లో స్కోర్ ఆధారంగా ప్రవేశంకల్పిస్తున్నాయి.

9 క్యాంపస్‌లు.. 813 సీట్లు

తొమ్మిది నిట్ క్యాంపస్‌ల్లో మొత్తం 813 సీట్లు అందుబాటులో ఉన్నాయి. నిమ్‌సెట్ ద్వారా ప్రవేశం కల్పిస్తున్న నిట్ క్యాంపస్‌లు-సీట్ల వివరాలు: నిట్ అగర్తల-30 సీట్లు, ఎంఎన్ఎన్ఐటీ-అలహాబాద్-116, ఎంఏఎన్ఐటీ- భోపాల్-115, నిట్-జంషెడ్‌పూర్-115, నిట్-కురుక్షేత్ర-64, నిట్-కురుక్షేత్ర (సెల్ఫ్ ఫైనాన్స్)-32, నిట్-రాయ్‌పూర్-110, నిట్-సూరత్‌కల్-58, నిట్-తిరుచిరాపల్లి-115, నిట్-వరంగల్-58 సీట్లు.

అర్హత

- మ్యాథమెటిక్స్ లేదా స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా 60 శాతం మార్కులతో మూడేళ్ల బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. లేదా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 60 శాతం మార్కులతో బీఈ లేదా బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి.
- ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే. అయితే వీరు సెప్టెంబర్ 15 నాటికి సర్టిఫికెట్లు అందించాల్సి ఉంటుంది.

4 విభాగాలు-వేయి మార్కులు

- ఎన్ఐటీల్లో ఎంసీఏ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే నిమ్‌సెట్ మొత్తం నాలుగు విభాగాల్లో వేయి మార్కులకు జరుగుతుంది.
- మ్యాథమెటిక్స్ 50 ప్రశ్నలు-600 మార్కులు; అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ 40 ప్రశ్నలు-240 మార్కులు; కంప్యూటర్ అవేర్‌నెస్ 20 ప్రశ్నలు-120 మార్కులు; జనరల్ ఇంగ్లిష్ 10 ప్రశ్నలు-40 మార్కులకు ఇలా మొత్తం 120 ప్రశ్నలు-1000 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- మ్యాథమెటిక్స్ విభాగంలో ఒక్కో ప్రశ్నకు 12 మార్కులు, అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ విభాగం, కంప్యూటర్ అవేర్‌నెస్ విభాగాల్లో ఒక్కో ప్రశ్నకు ఆరు మార్కులు; జనరల్ ఇంగ్లిష్ విభాగంలో ఒక్కో ప్రశ్నలకు నాలుగు మార్కులు చొప్పున కేటాయించారు.
- అదే విధంగా నెగెటివ్ మార్కింగ్ కూడా ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 శాతం మార్కులకు నెగెటివ్ మార్కులుగా నిర్దేశించారు.
- పరీక్ష పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ విధానంలో జరుగుతుంది.

టాప్ స్కోర్ సాధించేలా

ఎన్ఐటీ క్యాంపస్‌లలో ఎంసీఏ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే నిమ్‌సెట్‌లో మంచి స్కోర్ సాధించడానికి ఆయా సిలబస్ టాపిక్స్‌పై ప్రణాళికాబద్ధంగా గట్టి పట్టు సాధించాలి.

మ్యాథమెటిక్స్

ఇందులో రాణించడానికి విద్యార్థులు తమ బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలోని మ్యాథమెటిక్స్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యంగా సెట్ థియరీ, ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్, ఆల్జీబ్రా, కోఆర్డినేట్ జామెట్రీ, కాలిక్యులస్, వెక్టార్స్, ట్రిగ్నోమెట్రీలపై పూర్తి పట్టు సాధించాలి. వీటిలో సంబంధిత అంశాల కాన్సెప్ట్‌లు, అప్లికేషన్స్‌పై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. సైంటిఫిక్ కంప్యూటర్ కాలిక్యులేటర్‌పై అవగాహన పెంచుకోవడం మేలు.

అనలిటికల్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్

నిమ్‌సెట్‌లో మరో కీలక విభాగం..అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్. ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు అడిగే ఈ విభాగంలో రాణించాలంటే..అభ్యర్థులు విశ్లేషణ నైపుణ్యాలను, తార్కికంగా ఆలోచించే దృక్పథాన్ని పెంచుకోవాలి. ఇందుకోసం ప్రామాణిక పుస్తకాల ద్వారా ప్రిపరేషన్ సాగిస్తూ ప్రాక్టీస్ చేయాలి. నిమ్‌సెట్ గత ప్రశ్నపత్రాల సాధన కూడా సానుకూల ఫలితానికి దోహదం చేస్తుంది.

కంప్యూటర్ అవేర్‌నెస్

కంప్యూటర్ బేసిక్ నైపుణ్యాలను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడిగే విభాగం ఇది. ఇందులో రాణించాలంటే.. కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్‌కు సంబంధించి బేసిక్స్‌పై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా డేటా రిప్రజెంటేషన్ అంశాలపైనా పట్టు సాధించాలి.

జనరల్ ఇంగ్లిష్

ఇంగ్లిష్‌లో మంచి మార్కులు పొందడానికి కాంప్రహెన్షన్, వొకాబ్యులరీ, బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్ అంశాలపై పట్టు సాధించాలి. ఇందుకోసం కాంపిటీటివ్ ఇంగ్లిష్ టెస్ట్ బుక్స్‌ను చదవడం ఉపకరిస్తుంది. వీటితోపాటు కాంప్రెహన్షన్ కోసం ఇంగ్లిష్ దినపత్రికలను చదవడం కూడా లాభిస్తుంది.

ప్రాక్టీస్ ప్రధానం

నిమ్‌సెట్‌లో విజయానికి ప్రాక్టీస్ ఎంతో ప్రధానమని గుర్తించాలి. ప్రతి రోజు తాము చదివిన అంశాలకు సంబంధించి ప్రశ్నార్థమైన అంశాలను గుర్తించి సెల్ఫ్ టెస్ట్‌లు రాసుకోవాలి. అదే విధంగా మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లు రాయడం కూడా ఎంతో మేలు చేస్తుంది. వీటివల్ల ఇంకా దృష్టి పెట్టాల్సిన అంశాల విషయంలో అవగాహన వచ్చి.. ప్రిపరేషన్‌పై మరింత స్పష్టత లభిస్తుంది.

ఉమ్మడి కౌన్సెలింగ్

తొమ్మిది ఎన్ఐటీలు ఆన్‌లైన్ విధానంలో ఉమ్మడి కౌన్సెలింగ్ ద్వారా సీట్ల కేటాయింపు ప్రక్రియ చేపడతాయి. అభ్యర్థులు నిమ్‌సెట్ ర్యాంకు ఆధారంగా వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ దరఖాస్తు పూర్తి చేయాలి. ప్రాధాన్యతా క్రమంలో తమకు ఆసక్తి ఉన్న ఇన్‌స్టిట్యూట్‌లను పేర్కొనాలి. ఆ తర్వాత అభ్యర్థులకు వచ్చిన ర్యాంకు, ఎంచుకున్న ఇన్‌స్టిట్యూట్‌లు, అందుబాటులో ఉన్న సీట్లు ఆధారంగా ఆన్‌లైన్‌లోనే సీట్ అలాట్‌మెంట్ చేస్తారు.

ఆ రెండు క్యాంపస్‌ల్లో ఎగ్జిట్ అవకాశం

నిట్‌లలో ఎంసీఏ కోర్సు వ్యవధిని మూడేళ్లుగా పేర్కొన్నారు. అయితే నిట్-వరంగల్, జంషెడ్‌పూర్ క్యాంపస్‌ల్లో మాత్రం ఎగ్జిట్ అవకాశం అందుబాటులో ఉంది. రెండేళ్ల వ్యవధి పూర్తి చేసుకున్నాక ఎగ్జిట్ ఆప్షన్ ఎంచుకున్న వారికి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్ సర్టిఫికెట్‌ను అందిస్తారు. అయితే అభ్యర్థులు తొలి రెండేళ్ల పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

కొలువులు ఖరారు

నిట్‌ల్లో ఎంసీఏ కోర్సు పూర్తి చేసుకుంటే.. భవిష్యత్తు అవకాశాలు ఉజ్వలంగా ఉంటాయనడంలో సందేహం లేదు. కోర్సు బోధనలో భాగంగా ఆయా నిట్‌లు అనుసరిస్తున్న ప్రమాణాలు, నాణ్యతే ఇందుకు కారణం. గత మూడేళ్ల గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే.. ఎన్ఐటీల్లో ఎంసీఏ పూర్తి చేసుకున్న వారిలో నూటికి తొంభై శాతం మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఖరారయ్యాయి. అదే విధంగా వేతనాలు కూడా సగటున రూ.ఆరు లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ఉంటున్నాయి.

నిమ్‌సెట్.. ముఖ్యాంశాలు

- నిమ్‌సెట్ స్కోర్ ఆధారంగా తొమ్మిది ఎన్ఐటీల్లో ఎంసీఏ కోర్సులో ప్రవేశం.
- అందుబాటులో 813 సీట్లు.
- బీఎస్సీ వంటి సంప్రదాయ డిగ్రీ విద్యార్థులకు ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్‌లో చేరే అవకాశం.
- ఎన్ఐటీ-వరంగల్, జంషెడ్‌పూర్ క్యాంపస్‌లలో రెండేళ్ల తర్వాత ఎగ్జిట్ అవకాశం.
- నిట్‌లలో ఎంసీఏ పూర్తి చేసిన వారికి ఆకర్షణీయ వేతనాలతో ఐటీ సంస్థల్లో క్యాంపస్ ఆఫర్స్.
- సగటున రూ. 8 లక్షల వార్షిక వేతనం లభిస్తున్న పరిస్థితి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** మార్చి 5 - ఏప్రిల్ 10, 2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** ఏప్రిల్ 13-ఏప్రిల్ 17, 2023
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం:** జూన్ 1 - జూన్ 11, 2023
- **నిమ్‌సెట్ పరీక్ష తేదీ:** జూన్ 11, 2023
- **ఫలితాల వెల్లడి:** జూన్ 26, 2023
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, విజయవాడ
- **వెబ్‌సైట్:** https://www.nimcet.in

రాష్ట్రంలో 14,219 టీచర్ పోస్టులు భర్తీ

- ఉపాధ్యాయ ఖాళీల భర్తీ కోసం డీఎస్సీపై ఆలోచన చేస్తున్నాం
- శాసన మండలిలో విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో 14,219 టీచర్ పోస్టులను భర్తీ చేసినట్టు విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. శాసన మండలిలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో సభ్యుల ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు సీఎం వైఎస్ జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. విద్యార్థులకు తగినంత మంది ఉపాధ్యాయులను కేటాయించడంలో దేశంలోనే రాష్ట్రం అగ్రభాగంలో ఉందన్నారు. ఉపాధ్యాయుల నియామకానికి 2019లో ప్రత్యేక డీఎస్సీ ద్వారా 521 పోస్టులు, 2008 డీఎస్సీలో ఎంపికైన 1,910 మందికి నియామకాలు, 2018 డీఎస్సీలో ఎంపికైన 7,254 మందికి 2021లో నియామకాలు పూర్తి చేసినట్టు వివరించారు. 507 బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి 2022లో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. 1998 డీఎస్సీలో ఎంపికైన 4,534 మంది నియామకానికి ఈ నెల 15న ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో ఇంకా 717 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉంటాయని, వాటి భర్తీకి డీఎస్సీపై ప్రభుత్వం ఆలోచన చేస్తోందని చెప్పారు. దీనిపై ఉపాధ్యాయ ఎమ్మెల్సీలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి వారి సూచనలను కూడా తీసుకుంటామన్నారు. పాఠశాలల్లో ప్రవేశాలను మెరుగుపర్చడానికి, నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా ప్రారంభించిన అమ్మ ఒడి పథకం ద్వారా మూడేళ్లుగా రూ.19,617.6 కోట్లను తల్లుల ఖాతాలకు జమ చేసినట్టు తెలిపారు.

పోలవరం కోసం 1.13 లక్షల ఎకరాల సేకరణ : మంత్రి అంబటి

పోలవరం సాగునీటి ప్రాజెక్టు కోసం ఇప్పటివరకు 1,13,119.07 ఎకరాల భూమి సేకరించినట్టు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. సోమవారం శాసన మండలిలో ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఒక ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. భూ సేకరణ కోసం ఇప్పటిదాక రూ. 13,077.15 కోట్లు మంజూరు చేశామని, అందులో రూ.5,455.41 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. దేవీపట్నం మండలం చినరమణయ్యపేట శివారు గుబ్బలంపాలెం, కొండమొదలు గ్రామాల్లో భూ సేకరణ నష్టపరిహారం చెల్లింపుల్లో అవకతవకలను గుర్తించామని, విచారణ అనంతరం రెండు కేసులు నమోదు చేశామని చెప్పారు. ప్రాజెక్టు పూర్తి చేసే అంశంలో అనుమానాలు అవసరం లేదని, రెండు దశల్లో పూర్తి చేస్తామని వివరించారు.

5,737 మంది మైనార్టీ యువతకు శిక్షణ, ఉపాధి: అంజాద్ బాషా

మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఫర్ మైనార్టీస్ ద్వారా నిరుద్యోగ మైనార్టీ యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి (మైనార్టీల సంక్షేమ శాఖ) అంజాద్‌బాషా చెప్పారు. ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్ పరీక్షలు, డీఎస్సీ, పోలీసు కానిస్టేబుల్, ఏపీ టెట్, ఐబీఎం సర్టిఫికేషన్, డ్రోన్ పైలట్ తదితర అంశాల్లో 5,737 మంది మైనార్టీ యువతకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

గిరిజన సంక్షేమానికి 2019 నుంచి రూ.16,917 కోట్లు: ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర

గిరిజన సంక్షేమానికి వివిధ పథకాల కింద 2019 నుంచి ఇప్పటి వరకు ఈ మూడేళ్ల తొమ్మిది నెలల్లో రూ.16,917.75 కోట్లు ఖర్చు చేసినట్టు ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర చెప్పారు. 2014–19 మధ్య ఐదేళ్ల పాటు టీడీపీ ప్రభుత్వం రూ.12,601.36 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని చెప్పారు.

ఎస్సీ సంక్షేమానికి 20 శాతం ఎక్కువ నిధులు: మంత్రి నాగార్జున

షెడ్యూల్డ్ కులాల సంక్షేమానికి గత తెలుగుదేశం ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఖర్చు పెట్టిన దానికన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ మూడేళ్ల తొమ్మిది నెలల్లో 20 శాతం అధికంగా ఖర్చు చేసినట్టు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున వివరించారు. 2014–19 మధ్య ఎస్సీల సంక్షేమానికి రూ.33,625 కోట్లు ఖర్చు చేస్తే, 2019 జూన్ నుంచి ఇప్పటి వరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ. 52,654.54 కోట్లు ఖర్చు చేసిందని వివరించారు.

కేంద్రం నిబంధనల మేరకే చెత్తపై యూజర్ చార్జీలు

మునిసిపల్ పద్దుపై అసెంబ్లీలో చర్చలో మంత్రి సురేష్ వెల్లడి

- తప్పుడు రిజిస్ట్రేషన్ల రద్దు అధికారం జిల్లా రిజిస్ట్రార్‌లదే
- ఈ మేరకు సవరణ చట్టాన్ని కేంద్రానికి పంపాలని నిర్ణయం
- పది బిల్లులకు అసెంబ్లీ ఆమోదం

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకే రాష్ట్ర ప్రభుత్వం చెత్తపై యూజర్ చార్జీలు వసూలు చేస్తోందని పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. శాసనసభలో సోమవారం పురపాలక శాఖ 2023–24 పద్దుపై మంత్రి సురేష్ మాట్లాడుతూ ఆస్తి పన్నుతో కలిపి చెత్తపై యూజర్ చార్జీ వసూలుకు ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా దేశంలోనే టాప్–10 నగరాల్లో తిరుపతి, విశాఖ, విజయవాడ నిలిచాయన్నారు. 2023–24 రాష్ట్ర వార్షిక బడ్జెట్‌కు సంబంధించి రూ.35,060 కోట్ల మేర 8 పద్దుల నిర్వహణకు శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అదేవిధంగా 2022–23 సవరించిన బడ్జెట్ అంచనాలకు సభ ఆమోదం తెలిపింది.

తప్పుడు రిజిస్ట్రేషన్‌ల రద్దు చట్టం సవరణ

తప్పుడు రిజిస్ట్రేషన్‌ల రద్దు అధికారం జిల్లా రిజిస్ట్రార్‌లకు అప్పగించేలా 1982 స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్‌ల శాఖ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. ఈ మేరకు సవరణ బిల్లుకు శాసనసభ సోమవారం ఆమోదం తెలిపింది. నకిలీ రిజిస్ట్రేషన్లు, నిషేధిత జాబితాలో ఉన్న భూముల రిజిస్ట్రేషన్‌లు జరిగినప్పుడు అవి తప్పని తేలితే వాటిని రద్దు చేసే అధికారం రిజిస్ట్రార్‌లకు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటిపై కోర్టులకు వెళ్లి రద్దు చేయమని కోరే పరిస్థితులు ఉంటున్నాయి. ఒకసారి రిజిస్ట్రేషన్ జరిగాక వాటిని రద్దు చేసే అధికారం రిజిస్ట్రేషన్ శాఖకు లేకపోవడంతో తప్పుడు రిజిస్ట్రేషన్లు చేయించుకునే వారికి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో తప్పని నిర్ధారణ అయిన రిజిస్ట్రేషన్‌లన్నింటిని రద్దు చేసే అధికారం జిల్లా రిజిస్ట్రార్‌లు, ముఖ్యమైన రిజిస్ట్రేషన్ అధికారులకు కల్పిస్తూ ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. అయితే, రిజిస్ట్రేషన్‌ల చట్టం కేంద్ర పరిధిలో ఉండటంతో దీనిని కేంద్రానికి పంపనున్నారు. ఈ బిల్లు సహా 10 బిల్లులకు సభ ఆమోదం లభించింది. గ్రంథాలయాలు, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పనిచేసే ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయసును 60 నుంచి 62కు పెంచే ఏపీ విద్య (సవరణ)–2023 బిల్లు, ఏపీ గ్రంథాలయాల (సవరణ) బిల్లు–2023ను ఆమోదించారు. పాల సేకరణలో జరుగుతున్న మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటు చేస్తున్న మిల్క్ అనలైజర్స్ మెషిన్లకు లైసెన్స్‌లు జారీ చేసే విధంగా ఏపీ పాల సేకరణ, సురక్షిత అమలు ప్రమాణాల బిల్లు–2023ను ఆమోదించారు. ఏపీ ధార్మిక, హిందూ మత సంస్థల ధర్మ ఆదాయాల సవరణ బిల్లు–2023, ఏపీ అల్పసంఖ్యాక కమిషన్ సవరణ బిల్లు–2023, ఏపీ ఆబ్కారీ సవరణ బిల్లు–2023, ఏపీ మద్య నిషేధ సవరణ బిల్లు 2023, ఏపీ న్యాయవాదుల సంక్షేమ నిధి సవరణ బిల్లు–2023, ఏపీలో అనుసూచిత కులాలు, తెగలు కాని బీసీల కోసం ఏపీ కమిషన్ సవరణ బిల్లులకు సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా సభలో పలువురు సభ్యులు మాట్లాడారు.

ప్రజలకు అందుబాటులోకి పాలన

ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పరిపాలనను ప్రజలకు పూర్తిగా అందుబాటులోకి తెచ్చింది. పట్టణాల్లోనూ పేదలకు ఇళ్లు నిర్మిస్తోంది. అమరావతి ప్రాంత రైతుల సంక్షేమానికి కృషి చేస్తోంది.
– సామినేని ఉదయభాను, ప్రభుత్వ విప్

పట్టణాల్లో మౌలిక వసతుల అభివృద్ధి

నగరాలు, పట్టణాల్లో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో మునిసిపాలిటీల రూపురేఖలు మారాయి. గత ప్రభుత్వ హయాంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండేది. ప్రస్తుతం ప్రణాళికాబద్ధంగా పారిశుద్ధ్య నిర్వహణ ఉంటోంది. – బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్యే

దేశంలో ఎక్కడా లేనివిధంగా...

దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను నెలకొల్పి సీఎం వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారు. ఈ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. 50 ఇళ్లకు ఒక వలంటీర్ ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల ఫలాలను చేరవేస్తున్నాం.
– పుప్పాల వాసుబాబు, ఎమ్మెల్యే

34 శాఖల సేవలు ఒకేచోట

ప్రభుత్వం సచివాలయాల ద్వారా 34 శాఖల సేవలను ఒకేచోట ప్రజలకు అందిస్తోంది. దీంతో ప్రజలకు వ్యయ, ప్రయాసలు తప్పుతున్నాయి.
– ఉమాశంకర్, ఎమ్మెల్యే

పర్యావరణ పరిరక్షణకు కృషి

జగనన్న పచ్చతోరణం కార్యక్రమం కింద చెట్ల పెంపకం చేపట్టి ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తోంది. అడవుల పరిరక్షణ, అటవీ విస్తీర్ణాన్ని పెంపొందించడానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. ఇండియన్ స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్టు 2021 ప్రకారం అటవీ విస్తీర్ణం 646.9 చ.కి.మి. పెరిగింది. 2023–24లో రూ.16 కోట్లతో 23 ప్రదేశాల్లో నగర వనాలు, టెంపుల్ ఎకో పార్కుల అభివృద్ధికి ప్రతిపాదనలు చేశాం. ఎర్ర చందనం పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా 86 బేస్ క్యాంపులు, 30 స్ట్రైకింగ్, 50 చెక్ పోస్టులు, 2 డాగ్ స్క్వాడ్‌లు, అటవీ సిబ్బందికి ఆయుధాలు అందించాం.
– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అటవీ, పర్యావరణం, ఇంధన శాఖ మంత్రి

99 శాతం హామీల అమలు

బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన 99 శాతం హామీలను ఇప్పటికే సీఎం వైఎస్ జగన్ నెరవేర్చారు. పారిశ్రామికంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పరచడానికి ఎనలేని కృషి చేశారు.
– మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఎమ్మెల్యే

ఏపీ ఇన్ పార్లమెంట్

ఆ మేరకే అప్పర్ భద్రకు జాతీయ హోదా

ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం

రాజ్యసభ

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా జలాల వివాద పరిష్కార ట్రిబ్యునల్–1 కేటాయింపులకు లోబడే కర్ణాటకలోని అప్పర్ భద్రకు జాతీయ హోదా కల్పించినట్టు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడు తెలిపారు. అప్పర్ భద్రవల్ల దిగువ ప్రాంతమైన రాయలసీమలో నీటి లభ్యతపై ప్రభావాన్ని అంచనా వేశారా అని వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి సోమవారం రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 'రాయలసీమతో పాటు కృష్ణా బేసిన్‌లోని వివిధ ప్రాంతాల్లో నీటి లభ్యత పరిశీలించిన తర్వాతే ట్రిబ్యునల్–1 అవార్డు ప్రకటించింది. దీన్ని 1976లో కేంద్రం నోటిఫై చేసింది. అప్పర్ భద్ర ప్రాజెక్ట్‌లో ప్రతిపాదించిన కృష్ణా జలాల వినియోగం కర్ణాటకకు ట్రిబ్యునల్–1 కేటాయింపుల పరిధిలోనే ఉంది. అందుకే సాగునీరు, వరద నియంత్రణ, బహుళార్థసాధక ప్రాజెక్ట్‌లపై ఏర్పాటైన అడ్వైజరీ కమిటీ అప్పర్ భద్ర ప్రాజెక్టును ఆమోదించింది. కేంద్ర జల సంఘం మార్గదర్శకాల ప్రకారం ట్రిబ్యునల్ అవార్డు ప్రకటించి.. దానికి అనుగుణంగా కేటాయించిన నదీ జలాల వినియోగం నిమిత్తం ప్రణాళికాబద్ధమైన ప్రాజెక్టు చేపట్టినపుడు ఆ నదీ పరీవాహక ప్రాంతంలోని ఇతర రాష్ట్రాల అభిప్రాయాలను కేంద్ర జల సంఘం కోరదు. అయితే అప్పర్ భద్ర ప్రాజెక్టుపై 2021 డిసెంబర్‌లో నిర్వహించిన హై పవర్డ్ స్టీరింగ్ కమిటీలో ఏపీ ప్రభుత్వం లేవనెత్తిన అభ్యంతరాలపై కేంద్ర జల సంఘం ఏపీ, కర్ణాటక అధికారులతో పునఃవిచారణ జరిపింది. అనంతరం 2022 ఫిబ్రవరిలో జరిగిన స్టీరింగ్ కమిటీ సమావేశంలో ట్రిబ్యునల్–1 అవార్డులో కర్ణాటకకు చేసిన నదీ జలాల కేటాయింపులకు లోబడే అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మిస్తోంది' అని మంత్రి వివరించారు.

వచ్చే ఏడాది నాటికి కాకినాడ–శ్రీకాకుళం గ్యాస్ పైపులైన్

ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన మరో ప్రశ్నకు పెట్రోలియం శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలి లిఖితపూర్వక సమాధానమిస్తూ.. కాకినాడ–విశాఖపట్నం–శ్రీకాకుళం గ్యాస్ పైప్‌లైన్ 2024 జూన్ నాటికి పూర్తవుతుందని తెలిపారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం 2022 జూన్ 30 నాటికి పూర్తి కావాల్సి ఉందన్నారు. కోవిడ్ ప్రభావం, వర్షాకాలం కారణంగా పనుల్లో ఎదురైన ఇబ్బందులు, నిధుల విడుదలలో జాప్యంతో ఆలస్యమైందన్నారు.

ఏపీలో 1,149 మందికి శిక్షణ

పట్టణ స్థానిక సంస్థల కెపాసిటీ బిల్డింగ్ నిమిత్తం అమృత్ పథకంలో భాగంగా 45 వేల మంది మునిసిపల్ అధికారులు/ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇస్తున్నట్టు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కౌశల్ కిషోర్ తెలిపారు. ఇందులో భాగంగా ఏపీలో 2,970 మందికి గానూ 1149 మందికి శిక్షణ ఇచ్చామని వైఎస్సార్‌సీపీ సభ్యుడు పరిమళ్ నత్వానీ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఏపీలో లిథియం నిల్వలు

ఏపీలోని వైఎస్సార్ జిల్లా తాతిరెడ్డిపల్లి బ్లాక్ పరిధిలో లిథియం ఖనిజాన్ని కనుగొన్నట్టు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ.. లిథియం ఖనిజాన్ని వెలికి తీసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీని చెల్లించాల్సి ఉంటుందన్నారు.

లోక్‌సభ

యునెస్కో వారసత్వ కట్టడాల

తాత్కాలిక జాబితాలో లేపాక్షి నంది

సాక్షి, న్యూఢిల్లీ: యునెస్కో వారసత్వ కట్టడాల తాత్కాలిక జాబితా–2022లో విజయనగర కాలం నాటి లేపాక్షి వీరభద్ర దేవాలయంలోని ఏకశిలా నందిని జోడించారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. మిక్స్‌డ్ కేటగిరీ విభాగంలో గండికోట కోట పరిసరాలు, పెన్నేరు రాక్ వ్యాలీలు కూడా చేర్చాలని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిందని ఎంపీ కోటగిరి శ్రీధర్ ప్రశ్నకు సోమవారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ప్రాంతీయ పండుగల పథకాల్లేవు

దేశవ్యాప్తంగా ప్రాంతీయ పండుగల మద్దతు కోసం పథకాలేవీ లేవని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు బెల్లాన చంద్రశేఖర్ అడిగిన అల్లూరి జిల్లాలోని మోదకొండమ్మ జాతరకు మద్దతు ఇచ్చే పథకాలు ఏమైనా ఉన్నాయా అన్న ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. బెల్లాన అడిగిన మరో ప్రశ్నకు సమాధానమిస్తూ.. నేషనల్ మిషన్ ఆన్ కల్చరల్ మ్యాపింగ్(ఎన్ఎంసీఎం) పథకంలో భాగంగా ఏపీలోని రెండు గ్రామాలు పైలట్ స్టడీ నిమిత్తం చేర్చినట్టు కిషన్‌రెడ్డి తెలిపారు.

16.54 కోట్ల వాహనాలకు బీమాలేదు

ఏపీ, మధ్యప్రదేశ్, లక్షద్వీప్‌లలో 30.48 కోట్లు వాహనాలకు గానూ 16.54 కోట్ల వాహనాలకు బీమా లేదని రహదారి రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రిత్వశాఖ అంచనా వేసిందని ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కరాడ్ తెలిపారు. అక్కడికక్కడే వాహన యజమానులకు థర్డ్‌పార్టీ బీమా చేసేలా అధికార యంత్రాంగాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తోందా అని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రశ్నించగా.. అలాంటి ప్రతిపాదన లేదన్నారు.

'ఏపీలో 2 వీఆర్‌డీఎల్‌లు ఏర్పాటు చేయాలి'

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో వైరల్ రీసెర్చ్, డయాగ్నోస్టిక్ ల్యాబొరేటరీలు ఏర్పాటు చేయాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ (డిపార్ట్‌మెంట్ రిలేటెడ్–రాజ్యసభ) స్థాయీసంఘం సూచించింది. భువనేశ్వర్ కలితా నేతృత్వంలోని కమిటీ నివేదికను సోమవారం లోక్‌సభ ముందుంచింది. ఈ కమిటీలో వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి సభ్యుడిగా ఉన్నారు.

రాష్ట్రంలో కొత్తగా 3 పాలిటెక్నిక్ కాలేజీలు

మంజూరు చేసిన సీఎం జగన్
రూ.100 కోట్లతో ఏర్పాటు.. ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: యువతకు మంచి భవిష్యత్‌ను అందించాలనే ఆలోచనలను ఆచరణలో పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రూ.100 కోట్లతో 3 పాలిటెక్నిక్ కాలేజీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి సౌరభ్ గౌర్ సోమవారం గెజిట్ విడుదల చేశారు. ఈ వివరాలను ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తెలిపారు. నంద్యాల జిల్లా బేతంచెర్ల, అనంతపురం జిల్లా గుంతకల్, వైఎస్సార్ జిల్లా మైదుకూరుల్లో పాలిటెక్నిక్ కాలేజీలను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ కాలేజీలు అందుబాటులోకి వస్తే మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, కెమికల్, మెటలర్జికల్ విభాగాల్లో డిప్లొమా కోర్సుల కోసం సుదూర ప్రాంతాలు వెళ్లాల్సిన అవసరం ఉండదని చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ యువతకు మరింత వెసులుబాటు ఉంటుందన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణ మరింత మెరుగుపడి విద్య పూర్తవగానే ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని తెలిపారు. మంజూరైన 3 పాలిటెక్నిక్ కాలేజీల్లో ఒకదాన్ని రూ.30 కోట్లతో తన నియోజకవర్గం డోన్ పరిధిలోని బేతంచెర్లలో ఏర్పాటు చేస్తుండటం పట్ల సీఎం వైఎస్ జగన్‌కు బుగ్గన రాజేంద్రనాథ్ కృతజ్ఞతలు తెలియజేశారు. 3 కాలేజీలను వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికే కేటాయించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు.

హార్టికల్చర్ ఆఫీసర్ పోస్టుల ఎంపిక జాబితా విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో హార్టికల్చర్ పోస్టులకు నిర్వహించిన పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఏపీపీఎస్సీ సోమవారం విడుదల చేసింది. ఈ జాబితాను కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొంది. వివరాలకోసం అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్ "https://psc.-ap.gov.in.' ను సందర్శించాలని సూచించింది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.